ఈనాడు

విజయవాడ 2-10-2024 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 53
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



వరద సాయంగా.. రాష్ట్ర విపత్తు నిధికి 1,036 కోట్లు

విడుదల చేసిన కేంద్రం

నివేదికల అధ్యయనం తర్వాత.. అదనపు సాయం

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విపత్తు స్పందన నిధి(ఎస్‌డీఆర్‌ఎఫ్)కి 2024-25 సంవత్సరానికి సంబంధించి కేంద్రం తన వాటాగా రూ.1,036 కోట్లు విడుదల చేసింది. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు వీలుగా ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అండగా నిలుస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంగళవారం 'ఎక్స్'లో (మిగతా 6లో)

రాజధాని అమరావతికి ₹15,000 కోట్లు

ప్రపంచ బ్యాంకు సుముఖత

- రుణం ఇచ్చేందుకు అంగీకరిస్తూ కేంద్రానికి లేఖ
- నవంబరు 15 నాటికి ప్రక్రియ కొలిక్కి
- ఆ వెంటనే అడ్వాన్స్‌గా సీఆర్‌డీఏకి రూ.3,750 కోట్లు



ఈనాడు – అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణం ఇక పరుగులు పెట్టనుంది. ప్రపంచబ్యాంకు నుంచి పెద్ద ఎత్తున రుణ సమీకరణకు రాష్ట్రప్రభుత్వం చేసిన కృషి ఫలించింది. కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉండడంతో మరో నెలన్నరలోనే ఆ ప్రక్రియ కొలిక్కి రాబోతోంది. రాజధానికి రూ. 15,000 కోట్ల రుణం ఇచ్చేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలుపుతూ ప్రపంచబ్యాంకు నుంచి కేంద్రానికి ఇటీవలే లేఖ అందింది. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) సంయుక్తంగా ఈ రుణం ఇస్తున్నాయి. మొత్తం రూ. 15 వేల కోట్లూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సీఆర్‌డీఏకి అందనున్నాయి. రాజధానిలో మౌలిక వసతుల అభివృద్ధి, భూసమీకరణలో భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించిన లేఅవుట్‌ల అభివృద్ధి, పరిపాలన నగరంలో శాసనసభ, హైకోర్టు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల టవర్ల నిర్మాణం వంటి పనులకు రూ. 49 వేల కోట్లు ఖర్చవుతుందని సీఆర్‌డీఏ తాజాగా అంచనా వేసింది. రూ. 15 వేల కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే వస్తుండడంతో దానికి అనుగుణంగా సీఆర్‌డీఏ నిర్మాణ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అడ్వాన్సుగా రూ.3,750 కోట్లు

ప్రపంచబ్యాంకు, ఏడీబీ రుణం మంజూరుకు సంప్రదింపులన్నీ వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రపంచబ్యాంకు బృందం మూడు నాలుగు దఫాలు రాజధానిలో పర్యటించింది. దిల్లీలో కేంద్ర ఆర్థికశాఖ, ప్రపంచబ్యాంకు, సీఆర్‌డీఏ అధికారులతో కీలక సమావేశం గురువారం జరగనుంది. నవంబరు 8న తుది సమావేశం ఉంటుంది. అదే నెల 15 నాటికి సంతకాల ప్రక్రియ ముగుస్తుంది. అది పూర్తయితే రూ. 15 వేల కోట్లు మంజూరైనట్టే..! ఆ వెంటనే మొత్తం రుణంలో 25% అంటే.. రూ. 3,750 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకోవచ్చు. నవంబరులో ఆ నిధులు వస్తే డిసెంబరు నుంచి పనులు మొదలుపెట్టాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. టెండర్లు పిలిచేందుకు అంతా సిద్ధం చేస్తోంది. (మిగతా 6లో)

ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర దాడి

ఏకబిగిన 180 క్షిపణుల ప్రయోగం

- టెల్‌అవీవ్, జెరూసలెంలను తాకిన క్షిపణులు
- ప్రతీకారం తప్పదన్న ఇజ్రాయెల్
- ..అలాచేస్తే మరింత విరుచుకుపడతాం: ఇరాన్
- దానికి తీవ్ర పరిణామాలుంటాయన్న అమెరికా
- యుద్ధం అంచున పశ్చిమాసియా
- టెల్‌అవీవ్‌లో ఇద్దరు సాయుధుల దాడి.. ఆరుగురి మృతి

6లో



ఇజ్రాయెల్‌లోని జెరూసలెం వైపు దూసుకొస్తున్న ఇరాన్ రాకెట్లు

'కల్తీ నెయ్యి'పై సిట్ దర్యాప్తు తాత్కాలిక నిలిపివేత

డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడి

ఈనాడు, తిరుపతి: కల్తీ నెయ్యి ఘటనపై సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేసినట్లు డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈనెల 3వ తేదీ వరకు దర్యాప్తు ఆపాలని సుప్రీంకోర్టు కౌన్సిల్ నుంచి తమకు సమాచారం అందిందని డీజీపీ పేర్కొన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల భద్రత ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించేందుకు తిరుమల వచ్చిన ఆయన మంగళవారం మీడియాతో (మిగతా 6లో)

లోపలి పేజీల్లో

కాలినడకన తిరుమల చేరుకున్న పవన్‌కల్యాణ్

నేడు శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ప్రాయశ్చిత్త దీక్ష విరమణ



అలిపిరి కాలినడక మార్గంలో కొండపైకి వెళ్తున్న పవన్‌కల్యాణ్

రహదారుల మధ్యలో ఏ మత నిర్మాణమూ ఉండొద్దు

ప్రజాప్రయోజనాలే సర్వోన్నతం

కట్టడాల కూల్చివేతపై దేశమంతటికీ మార్గదర్శకాలు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

పేదల ముఖాల్లో ఆనందమే లక్ష్యం

పింఛన్ల పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు



కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం పుచ్చకాయలమడ గ్రామంలో పింఛను అందించేందుకు.. తలారి గంగమ్మ ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబుకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్న కుటుంబసభ్యులు 6లో

తొలి రోజే 97.65 శాతం పింఛన్ల పంపిణీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పథకం కింద అక్టోబరు నెల సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ తొలి రోజు మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి 97.65 శాతం మేర పూర్తయింది. 64.38 లక్షల మందికి రూ. 2,721 కోట్లు అందించాల్సి ఉండగా నిర్దేశిత సమయానికి 62.90 లక్షల మందికి రూ.2,656 కోట్ల మేర పంపిణీ చేశారు. తెల్లవారుజాము 5 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను అందించారు. వివిధ కారణాలతో మంగళవారం పింఛను అందుకోలేని మిగతా వారికి బుధవారం పంపిణీ చేయనున్నారు.

110 రోజుల్లో పింఛన్ల కోసం రూ. 12,508 కోట్లు

సీఎం చంద్రబాబు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎన్డీయే అధికారంలోకి వచ్చిన 110 రోజుల్లో పింఛన్ల కోసం రూ. 12,508 కోట్లు పంపిణీ చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఒకటో తేదీనే సుమారు 98 శాతం మంది లబ్ధిదారులు ఇంటి వద్దే పింఛను అందుకోవడం సంతృప్తినిచ్చిందని మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'పేదలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో పింఛను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉద్యోగులు సమర్థంగా నిర్వర్తించారు. ఒక్కరోజులో రికార్డు స్థాయిలో పింఛన్లు పంపిణీ చేసిన సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఎఫ్ఎస్ఎల్‌కు పంపాలని ఆదేశించలేం

- ఈ వ్యవహారంపై లోతైన విచారణ అవసరం
- కుక్కల విద్యాసాగర్ అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు
- విచారణ ఈ నెల 16కు వాయిదా

ఈనాడు, అమరావతి: సినీనటి కాదంబరీ జెత్వానీ నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు (ఎఫ్ఎస్ఎల్) పంపేలా పోలీసులను ఆదేశించాలన్న కుక్కల విద్యాసాగర్ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరపాలని అభిప్రాయపడింది. పరికరాల్లోని డేటాను భద్రపరచాలని పోలీసులను ఆదేశిస్తూ ఇదే న్యాయస్థానం గతంలోనే ఉత్తర్వులిచ్చిందని గుర్తుచేసింది. తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

★ తన ఫిర్యాదు ఆధారంగా జెత్వానీపై ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదుచేసిన కేసులో ఆమె నుంచి సీజ్‌చేసిన మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తిరిగి ఇవ్వకుండా భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ కుక్కల విద్యాసాగర్ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ఉపకరణాలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపిన పోలీసులు.. వాటిని వెనక్కి తెప్పించి ఆమెకు ఇవ్వబోతున్నారని పేర్కొన్నారు. వాటిని తిరిగి ఎఫ్ఎస్ఎల్‌కు పంపేలా ఆదేశించాలని తాజాగా అనుబంధ పిటిషన్ వేశారు.

★ పోలీసుల తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఉపకరణాలను భద్రపరిచామన్నారు. అనుబంధ పిటిషన్ వేసి గత ఉత్తర్వులను సవరించాలని కోరడం సరికాదన్నారు. దీంతో విచారణను వాయిదా వేసిన న్యాయమూర్తి.. ఎఫ్ఎస్ఎల్‌కు పంపేందుకు ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పారు.

బెయిలుపై ముగిసిన పిటిషనర్ల వాదనలు

తనపై అక్రమకేసు బనాయించి అరెస్టు చేసి వేధించారంటూ సినీనటి కాదంబరీ జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు సెప్టెంబర్ 13న నమోదుచేసిన కేసులో ముందస్తు బెయిలు కోసం ఇద్దరు ఐపీఎస్ అధికారులు, ఏసీపీ, సీఐ, హైకోర్టు న్యాయవాది దాఖలుచేసిన వ్యాజ్యాలపై మంగళవారం హైకోర్టులో పిటిషనర్ల తరఫు వాదనలు ముగిశాయి. ప్రాసిక్యూషన్, జెత్వానీ తరఫు న్యాయవాదుల వాదనల కోసం విచారణ గురువారానికి వాయిదా పడింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. అంతకు ముందు జరిగిన విచారణలో ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ, సీఐ ఎం.సత్యనారాయణ, ఏసీపీ కె.హనుమంతరావు, హైకోర్టు న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్.శ్రీరామ్, ఓ.మనోహర్‌రెడ్డి, వినోద్‌కుమార్ దేశ్‌పాండే, న్యాయవాదులు కేఎల్ఎన్ స్వామి, దుష్యంత్‌రెడ్డి వాదించారు.

దర్యాప్తునకు సహకరించండి

ముందస్తు బెయిలు కోసం హైకోర్టు న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు దాఖలుచేసిన వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్.. దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్‌కు స్పష్టంచేశారు. ఆయనను అరెస్టు చేసే విషయంలో ఈ నెల 3 వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.



తప్పు ఒప్పుకోండి

మన తప్పులను మనం ఒప్పుకోవడమంటే మకిలిని వదిలించుకోవడమే! ఒప్పుకోలు అనేది చీపురు కట్ట లాంటిది. చీపురు ఎలాగైతే మట్టినీ, మకిలినంతా ఊడ్చేసి నేలను స్వచ్ఛంగా, మరింత ప్రకాశవంతంగా చేస్తుందో.. తప్పు ఒప్పుకోవడమూ అంతే! తప్పు ఒప్పుకొన్న తర్వాత నాకెప్పుడూ మరింత బలవంతుడనయ్యానన్న భావనే కలుగుతుంది.

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

2-10-2024 బుధవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; వర్ష రుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం
అమావాస్య: రా. 10-44 తదుపరి అశ్వయుజ శుక్లపక్ష పాడ్యమి
ఉత్తర: మ. 12-22 తదుపరి హస్త
వర్జ్యం: రా. 9-40 నుంచి 11-26 వరకు
అమృత ఘడియలు: ఉ. 6-12 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-27 నుంచి 12-14 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.54; సూర్యాస్తమయం: సా.5.48
మహాలయ అమావాస్య, గాంధీ జయంతి

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

ఈనాడు, అమరావతి: పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు బుధవారం నుంచి ఈ నెల 13 వరకు సెలవులు ఇస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో సెప్టెంబరు 2న బడులకు సెలవు ప్రకటించినందున బుధవారం పాఠశాలలు నిర్వహించాలని ఆ జిల్లా విద్యాధికారి ఆదేశాలు జారీ చేశారు. వీరికి 3 నుంచి సెలవులు ప్రారంభమవుతాయి.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.5	26.0
నెల్లూరు	37.2	26.8
కర్నూలు	37.2	25.4
కడప	37.0	27.0
ఒంగోలు	36.5	27.6
విశాఖపట్నం	36.4	27.2
అనంతపురం	36.3	25.5
తిరుపతి	36.1	25.7
విజయనగరం	35.0	28.0
గుంటూరు	35.0	27.0
నరసాపురం	34.8	27.0
విజయవాడ	34.4	26.4
హైదరాబాద్	34.4	23.7
తాడేపల్లిగూడెం	33.7	26.0
శ్రీకాకుళం	33.0	27.0

ఉచితంగా ఇంటర్ డూప్లికేట్ సర్టిఫికెట్లు

- వరదల్లో పోగొట్టుకున్న వారికి...

ఈనాడు, అమరావతి: వరదల కారణంగా ముంపు ప్రాంతాల్లో సర్టిఫికెట్లు పోగొట్టుకున్న వారికి డూప్లికేట్ సర్టిఫికెట్లను ఉచితంగా అందించాలని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. విజయవాడతో పాటు పలు ప్రాంతాల్లో వరదలకు ఇళ్లు నీట మునగడంతో చాలామంది సర్టిఫికెట్లు పాడైపోయాయి. ఇలాంటి వారికి ఎలాంటి రుసుములూ లేకుండా ఉచితంగా సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు బోర్డు ప్రకటించింది.

సాహిత్య అకాడెమీ కార్యదర్శికి 'ఫ్రెండ్స్ ఆఫ్ పబ్లిషింగ్' అవార్డు

ఈనాడు, దిల్లీ: భారత ప్రచురణకర్తల సమాఖ్య ఏటా అందించే 'ఫ్రెండ్స్ ఆఫ్ పబ్లిషింగ్' అవార్డును ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడెమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు అందుకున్నారు. పుస్తక ప్రచురణ రంగంలో విశేష కృషి చేసిన వారికి ఈ పురస్కారాన్ని ఇస్తారు. మంగళవారం దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి స్మృతీ ఇరానీ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హిమాకోహ్లి ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. ప్రచురణ సమాఖ్య అధ్యక్షుడు నవీన్ గుప్తా, కార్యదర్శి ప్రణవ్‌గుప్తా, విదేశాలకు చెందిన పలువురు పుస్తక ప్రచురణకర్తలు పాల్గొన్నారు.



స్మృతీ ఇరానీ, జస్టిస్ హిమాకోహ్లి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

అనకాపల్లికి ఇదో ఆభరణం!



చెన్నై-కోల్‌కతా నగరాలను కలిపే జాతీయ రహదారి నాలుగు వరుసలుగా ఉండేది. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు ఆరు వరుసలుగా ఇటీవల అభివృద్ధి చేశారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లా కేంద్రం అనకాపల్లిని ఆనుకుని ఇలా తీర్చిదిద్దారు. పాము మెలికల్లా కనిపించే ఈ డబుల్ ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ కూడలి రాష్ట్రంలో మొదటిది. నింగి నుంచి చూస్తే ఇలా అద్భుతంగా కనిపిస్తోంది. –ఈనాడు, అనకాపల్లి

'సమాచారం' ఇవ్వని సూపరింటెండెంట్లకు జరిమానా

దేవాదాయ కమిషనరేట్‌లో నలుగురికి విధింపు

ఈనాడు, అమరావతి: సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన దేవాదాయశాఖ కమిషనరేట్‌లోని నలుగురు పర్యవేక్షకులకు (సూపరింటెండెంట్లు) ఆర్టీఐ కమిషనర్ జరిమానా విధించారు. కృష్ణా జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మోపిదేవి ఆలయంలో వివిధ అంశాలకు సంబంధించి సమాచారం అడిగితే ఇవ్వలేదు. దీంతో సూపరింటెండెంట్లు కె.బాలాజీ, వీవీఎస్‌కే ప్రసాద్, ఎం.శ్రీనివాసరెడ్డిలకు తలో రూ. 500 చొప్పున జరిమానా విధించారు. ఆలయ భూముల సమాచారంపై దరఖాస్తుకు స్పందించనందుకు.. ఆ విభాగం చూసే సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డికి రూ. 1,000 జరిమానా వేశారు. ధార్మిక పరిషత్‌కు సంబంధించి సమాచారం ఇవ్వనందుకు సూపరింటెండెంట్ ఎం.రామాంజనేయులుకు రూ. 1,000 విధించారు. ఆలయాల ఈవోలకు సంబంధించి కడపకు చెందిన ఎ.రవిప్రకాష్‌రెడ్డి సమాచారం అడిగితే ఇవ్వకుండా జాప్యం చేసినందుకు ఆ సెక్షన్ సూపరింటెండెంట్‌కు రూ. 1,000 జరిమానా విధించారు.

కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పునఃప్రారంభం

- 5 నెలల్లో పూర్తి చేస్తాం
- హోంమంత్రి వంగలపూడి అనిత



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో అర్ధాంతరంగా నిలిపేసిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు రెండో దశలో దేహదారుఢ్య, శారీరక కొలతల (పీఎంటీ, పీఈటీ) పరీక్షలకు వారం రోజుల్లో దరఖాస్తుల స్వీకరణ మొదలు పెడతామని తెలిపారు. పూర్తి వివరాలను పోలీసు నియామక మండలి వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని పేర్కొన్నారు. పీఎంటీ, పీఈటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి మూడో దశలో తుది రాత పరీక్ష నిర్వహించి ప్రతిభావంతులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తామన్నారు. మొత్తం నియామక ప్రక్రియను అయిదు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు.

"రాష్ట్రంలో 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి 2022 నవంబరులో అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రాథమిక రాత పరీక్షలో 95,208 మంది అర్హత సాధించారు. ఆ తర్వాతి దశలో పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ చేపట్టలేదు. ఈ లోగా ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించని 100 మంది హోంగార్డులు హైకోర్టులో రిట్ పిటిషన్‌లు దాఖలు చేశారు. వారిని తదుపరి దశ పరీక్షలకు అనుమతించాలని న్యాయస్థానం ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో న్యాయ సలహా తీసుకుని ఎంపిక ప్రక్రియను ఆగిపోయిన చోట నుంచే మళ్లీ ప్రారంభిస్తున్నాం" అని అనిత వివరించారు.

ఇదీ సంగతి!



ఆయన జయంతి నేనెప్పుడూ మరచిపోనురా.. ముందే జాగ్రత్తపడతా!!


Reliance
SMART BAZAAR
దసరా రెడీ సేల్
2nd - 6th Oct
పండుగ కొనుగోలు పూర్తి చేసుకోవటానికి, స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
రుచికరమైన వంటకం చేసుకోండి
₹215
(₹43/kg)
ప్యారీస్ వైట్ లేబుల్ సల్ఫర్ ఫ్రీ చక్కెర 5 kg
గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg
₹1359
(₹52.26 /kg)
గుడ్ లైఫ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ / ప్రియ డబుల్ ఫిల్టర్డ్ వేరుశెనగ ఆయిల్ 1 L
₹117/ ₹156
₹365/ ₹459
గుడ్ లైఫ్ ఆల్మండ్ / జీడిపప్పు (W320) 500 g
పండుగలోని మాధుర్యం పెంచుకోండి
BUY ANY 1 GET ANY 1 FREE
BUY ANY 2 GET ANY 1 FREE
చాకొలెట్ హోమ్ ప్యాక్ (క్యాడ్బరీ పర్క్ / డైరీ మిల్క్ / జెమ్స్ / 5 స్టార్ / నెస్లే కిట్‌కాట్ / మంచ్) 115.5 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
చక్కి / ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ వీట్ ఆటా 5 kg
₹199/ ₹289
హెరిటేజ్ ఆగ్‌మార్క్ నెయ్యి గ్రేడ్ స్పెషల్ 1 L
₹565
₹189
అమూల్ కాజు కత్రి 200 g / 500 g
₹80
టాటా టీ చక్ర గోల్డ్ ప్రీమియం టీ 500 g
బిస్కెట్స్ 275 g మొదలుకుని / లోట్టే చాకో పై 336 g (12 Pcs) (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 3 GET ANY 1 FREE
స్ప్రైట్ / కోకో-కోలా / థమ్స్అప్ / మాజా 600 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
అందంగా పండుగ జరుపుకోండి
ప్రతీఒక్కరికి తగిన గిఫ్ట్
₹4999
బ్రాండెడ్ 3 పీసెస్ ట్రాలీ సెట్ (ఎంపిక శ్రేణి)
₹699
LA OPALA ఓపల్ వేర్ డిన్నర్ సెట్ 12 యూనిట్స్
BUY 1 GET 2 FREE
కాటన్ డబుల్ బెడ్ షీట్ (సెలెక్ట్ వేరియంట్స్)
స్పెషల్ ఫ్యాషన్ ఆఫర్లు
₹199 లో ఫ్యాషన్ ప్రారంభం
₹99
దీపావళి ఎల్ఈడీ లైట్ రేంజ్
BERGNER 3 పీసెస్ స్టెయిన్ లెస్ స్టీల్ ట్రిప్లీ కుక్‌వేర్ సెట్
₹1799
₹499
₹3000-₹4999
₹799
₹5000
₹149
₹1500-₹2999
పండుగ వేడుకలు చేసుకోండి
మెన్స్ అండ్ ఉమెన్స్ డియో 135 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 1 GET ANY 1 FREE
BUY 1 GET 1 FREE
బ్యూటీ ఎసెన్షియల్స్ 0.35 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
40%
డవ్ / పియర్స్ / ఫియామా జెల్ బార్ 125 g x 4 +1 / లక్స్ సోప్ 150 g x 3 మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
డవ్ / ప్యాంటీన్ / హెడ్ అండ్ షోల్డర్ / ట్రెసెమె షాంపూ 580 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
₹399
33%
సర్ఫ్ / రిన్ / టైడ్ డిటర్జెంట్ పౌడర్ 5 kg / ఏరియల్ / సర్ఫ్ మ్యాటిక్ లిక్విడ్ 3 L మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
10% INSTANT DISCOUNT# SBI card
#Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 Per Credit Card Trxn. Validity: 02 Oct - 06 Oct 2024. T&C Apply.
వద్ద కూడా లభ్యం
JioMart
fresh Signature
SMART SUPERSTORE
SMART BAZAAR
SMART SUPERSTORE
ఇప్పుడు తెరవబడింది

ఈనాడు

స్వచ్ఛ భారతం కోసం...

దేశానికి స్వాతంత్ర్యం కంటే పారిశుద్ధ్యం ప్రాణావసరమని ప్రబోధించి, వందేళ్ల క్రితమే పరిసరాల పరిశుభ్రతపై ప్రజాఉద్యమానికి పిలుపిచ్చారు గాంధీజీ. భారతావని శ్రేయస్సు శుభ్రతతో ముడిపడి ఉందని మహాత్ముడు తరచూ చెప్పేవారు. జనారోగ్యం బాగుండాలంటే ఇళ్లూవాకిళ్లతో పాటు ఊళ్లనూ శుభ్రంగా ఉంచుకోవాలని బాపూజీ బోధించేవారు. ఆయన హితవచనాలకు మన్ననదక్కని స్వతంత్ర భారతంలో 1981 నాటికి ఒకశాతం గ్రామీణ కుటుంబాలకే పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో ఉండేవి. వాటిని విస్తృతపరిచే లక్ష్యంతో 1986లో ప్రారంభమైన గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమం- 1999లో సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమంగా మారింది. ఆపై అదే 'నిర్మల్ భారత్ అభియాన్' అయ్యింది. పాతికేళ్లలో దాదాపు లక్ష కోట్ల రూపాయలు ఖర్చయ్యాక 2012 నాటికి పారిశుద్ధ్య వసతులున్న గ్రామీణ కుటుంబాల సంఖ్య 32.7 శాతానికి చేరింది. ఈ మందకొడి ప్రగతిని వేగవంతం చేసి, గాంధీజీ కలగన్న 'క్లీన్‌ఇండియా'ను అయిదేళ్లలో సాధించాలన్న సత్సంకల్పంతో 2014 అక్టోబరు రెండున 'స్వచ్ఛ భారత్'కు శ్రీకారం చుట్టారు ప్రధాని మోదీ. దశాబ్ద కాలంలో ఆ కార్యక్రమ సాఫల్య వైఫల్యాలను సింహావలోకనం చేసుకోవాల్సిన సందర్భమిది!

'స్వచ్ఛ భారత్' కింద దేశవ్యాప్తంగా 11 కోట్లకు పైగా వ్యక్తిగత మరుగుదొడ్లు, రెండు లక్షలకు పైగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు నిర్మితమయ్యాయన్న ప్రభుత్వ ప్రకటనలు వినసొంపుగా ఉన్నాయి. మరుగుదొడ్ల వినియోగం పెరగడం, పారిశుద్ధ్యం మెరుగుపడటం వల్ల దేశీయంగా ఏడాదికి 70వేల వరకు శిశు మరణాలు తప్పిపోతున్నాయని కొన్ని అధ్యయనాలు చాటుతున్నాయి. అయిదేళ్ల క్రితం ఇదే రోజున ప్రధాని మోదీ చేసిన ప్రకటన ప్రకారం- దేశవ్యాప్తంగా గ్రామాలన్నీ బహిరంగ మలవిసర్జన సమస్య నుంచి బయటపడ్డాయి. దరిమిలా ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై దృష్టిసారించి రాబోయే అయిదేళ్లలో గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికంటూ 2020 ఏప్రిల్‌లో 'స్వచ్ఛ భారత్-గ్రామీణ' రెండో దశకు నాంది పలికారు. అదంతా అలా ఉంచితే- ఆసేతుహిమాచలం ఇంకా అనేక ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జన సమస్య తీరలేదు. 'స్వచ్ఛ భారత్' కింద నిర్మితమైన మరుగుదొడ్ల నాణ్యతపై పార్లమెంటరీ స్థాయీసంఘం పెదవివిరిస్తే- గ్రామీణ భారతంలో టాయిలెట్ల వాడకం తగ్గుతోందని ప్రపంచ బ్యాంకు అధ్యయన పత్రం నిరుడు పేర్కొంది. వెరసి, 'స్వచ్ఛ భారత్' లక్ష్యాలు ఇంకా సంపూర్ణం కావాల్సి ఉంది!

పట్టణాల్లో గుట్టలుగుట్టలుగా పోగుపడుతున్న చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేయాలన్నది 'స్వచ్ఛభారత్- అర్బన్2.0' ఆశయాల్లో ఒకటి. 2021లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు పదిహేను వేల ఎకరాల్లో విస్తరించిన 2411 డంపింగ్ సైట్లను 2025-26 కల్లా శుభ్రం చేయాల్సి ఉంది. ఆయా ప్రదేశాల్లో 22.11 కోట్ల టన్నుల చెత్త పేరుకుపోయి ఉంటే ఇంతవరకు 9.06 కోట్ల టన్నుల వ్యర్థాలనే తొలగించారు. మొత్తమ్మీద ఈ మూడేళ్లలో 475 డంపింగ్ సైట్లనే శుభ్రపరచగలిగారు. దేశవ్యాప్తంగా పలు పట్టణాల్లో చెత్త సేకరణ, విభజన, పునశ్శుద్ధి సక్రమంగా జరగడం లేదు. మురుగునీళ్లు, విషపూరితమైన పారిశ్రామిక రసాయన వ్యర్థాలు నేరుగా నదులు, ఇతర జలవనరుల్లో కలుస్తున్నాయి. దానివల్ల ముమ్మరిస్తున్న వ్యాధులతో అనేక కుటుంబాలు ఆర్థిక అగచాట్లను ఎదుర్కొంటున్నాయి. అపరిశుభ్ర పరిసరాల కారణంగా చుట్టుముట్టే రోగాలు అనేకం తరచూ దండెత్తుతూనే ఉన్నాయి. పారిశుద్ధ్య వసతుల మెరుగుదలపై కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని అవి చాటిచెబుతున్నాయి!

సుడిగుండంలో సిద్ధరామయ్య

మైసూరు భూకుంభకోణం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పదవీ గండంలా పరిణమించింది. అంతకుముందు సిద్ధరామయ్యపై నేరాభియోగం నమోదుకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ అనుమతించగా, దాన్ని సీఎం హైకోర్టులో సవాలుచేసి కొంత సమయం పొందారు. ఇప్పుడు హైకోర్టు కూడా విచారణకు అనుమతి ఇవ్వడంతో సిద్ధరామయ్య రాజీనామా చేయక తప్పదని పరిశీలకులు భావిస్తున్నారు. తనపై వచ్చిన ఆరోపణలు నిజంకాదని తేలిన తరవాతే సిద్ధరామయ్య తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. సిద్ధరామయ్యపై నేరాభియోగం దాఖలుకు గవర్నర్ అనుమతించడంలో తప్పు పట్టాల్సిందేమీ లేదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న స్పష్టం చేశారు. ఆ మరునాడే ప్రత్యేక కోర్టు నుంచి సిద్ధరామయ్యకు మరో షాక్ తగిలింది. భూకుంభకోణం ఆరోపణపై లోకాయుక్త విచారణ జరిపి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. దాంతో మైసూరులోని లోకాయుక్త పోలీసులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామిలతోపాటు స్వామికి భూమిని విక్రయించిన దేవరాజు అనే వ్యక్తిపైనా సెప్టెంబరు 27న ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.



> కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య(76)పై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టేందుకు ఆ రాష్ట్ర హైకోర్టు అనుమతించింది. దాంతో ఆయన రాజీనామా చేయాలంటూ డిమాండ్లు మిన్నంటుతున్నాయి. దిల్లీలో కేజ్రీవాల్, ఝార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ ఉదంతాల నేపథ్యంలో సిద్ధరామయ్య ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తారన్నది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

శివకుమార్ పగ్గాలు చేపడతారా?

సిద్ధరామయ్యపై నమోదైన కేసు మైసూరు అభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) భూములకు సంబంధించినది. మైసూరు శివారు గ్రామంలో పార్వతికి 3.16 ఎకరాల భూమి ఉంది. దాన్ని ఆమెకు సోదరుడు మల్లికార్జున స్వామి బహుమతిగా ఇచ్చారని సిద్ధరామయ్య చెబుతుంటే, ఆ భూమిని తమ నుంచి అక్రమంగా కాజేశారని కొందరు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే, సదరు భూమిని ప్రభుత్వానికి అప్పగించి, దానికి బదులుగా మైసూరు అభివృద్ధి ప్రాధికార సంస్థ నుంచి అత్యంత విలువైన 14 ఇంటి స్థలాలను సిద్ధరామయ్య తన భార్యకు కేటాయింపజేసుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై నిశితంగా దర్యాప్తు చేయాల్సిందేనని హైకోర్టు పేర్కొంది. సీఎం సిద్ధరామయ్యకు ఈ వ్యవహారంతో ఎటువంటి ప్రమేయం లేదనే వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో కోర్టులు తనను నిర్దోషిగా ప్రకటించిన తరవాతే తిరిగి పదవి చేపడతానని చెప్పి ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేస్తే బాగుండేదని విశ్లేషకులు అంటున్నారు. సిద్ధరామయ్య పదవిలో ఉంటే, రాష్ట్ర పోలీసుల దర్యాప్తు సజావుగా సాగదని, దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించాలనే డిమాండ్ వినిపిస్తోంది. హైకోర్టు తీర్పు వెలువడిన ఒకరోజు తరవాత తమ అనుమతి లేకుండా రాష్ట్రంలో దర్యాప్తు చేపట్టడానికి సీబీఐని అనుమతించేది లేదని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రక్షించడానికే ఈ నిర్ణయం తీసుకున్నారంటూ విమర్శలు వస్తున్నాయి. ఒకవేళ కేసును సీబీఐకి అప్పగించాలని హైకోర్టు తీర్మానిస్తే మాత్రం, ఇక రాష్ట్ర ప్రభుత్వం చేయగలిగేదేమీ ఉండదు. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగి నగదు అక్రమ చలామణి నిరోధ చట్టం కింద సిద్ధరామయ్యపై కేసు పెట్టింది. కాబట్టి, సిద్ధరామయ్యను ప్రశ్నించడం కోసం సమన్లు పంపే అధికారం ఈడీకి ఉంటుంది. ఆ క్రమంలో ఆయన ఆస్తులను జప్తు చేసే అవకాశమూ ఉందంటున్నారు.

ఇక్కడ భాజపాకు చెందిన మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప కూడా అవినీతి ఆరోపణలపై రాజీనామా చేయాల్సి వచ్చిందని గమనించాలి. అప్పట్లో ఓ అవినీతి ఆరోపణకు సంబంధించి యడ్యూరప్పపై విచారణకు గవర్నర్ అనుమతించారు. దాన్ని ముఖ్యమంత్రి హోదాలో ఆయన సవాలు చేయగా, హైకోర్టు గవర్నర్ నిర్ణయాన్నే సమర్థించి విచారణ చేపట్టాల్సిందేనని తేల్చింది. దాంతో ఆయన రాజీనామా చేయకతప్పలేదు. అప్పట్లో సిద్ధరామయ్య ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడి హోదాలో యడ్యూరప్ప రాజీనామాకు డిమాండ్ చేసేవారు. ప్రస్తుతం సిద్ధరామయ్యను రాజీనామా చేయాలని ఒత్తిడి చేసే స్థితిలో కాంగ్రెస్ అధిష్ఠానం లేదు. అధిష్ఠానం మాటను సిద్ధరామయ్య ఖాతరు చేయకపోవచ్చు. అదీకాకుండా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్ణాటక ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ప్రియాంక్ కూడా భూ కుంభకోణం ఆరోపణల్లో ఇరుక్కుని ఉన్నారు. బెంగళూరు సమీపంలో అయిదు ఎకరాల భూమిని తమ కుటుంబ ట్రస్టు పేరిట కేటాయింపజేసుకున్నారని ఆయనపై ఆరోపణ వచ్చింది. ఇలాంటి పరిస్థితిలో సిద్ధరామయ్య రాజీనామాకు ఖర్గే ఎలా పట్టుపట్టగలరు? మరోవైపు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయారు. ఒకవేళ సిద్ధరామయ్య రాజీనామా చేసినా, ఆ పదవిని శివకుమార్ చేపట్టలేకపోవచ్చు. కాబట్టి కోర్టులు గట్టిగా ఒత్తిడి చేస్తే తప్ప సిద్ధరామయ్య పదవికి రాజీనామా చేయకపోవచ్చు.


ఆ ఇద్దరూ...

దిల్లీ మాజీ సీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఉదంతాన్ని ఇక్కడ గమనించాలి. ఇటీవల సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిలు మంజూరు చేస్తూ- ఆయన ముఖ్యమంత్రి కార్యాలయంలో అడుగు పెట్టడంపైన, ఫైళ్లపై సంతకం చేయడంపైనా కఠినమైన షరతులు విధించింది. అదే ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు బెయిలు ఇచ్చేటపుడు సుప్రీం ఇలాంటి షరతులేమీ పెట్టలేదు. సోరెన్ బెయిలుపై విడుదలైన వెంటనే సీఎం బాధ్యతలు చేపట్టారు. కేజ్రీవాల్ జైలులో ఉన్నంతకాలం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి ససేమిరా అన్నారు. కఠిన షరతులతో బెయిలు మీద విడుదలయ్యాక నైతిక కారణాలు చెబుతూ పదవికి రాజీనామా చేశారు. సోరెన్ అరెస్టయిన వెంటనే రాజీనామా చేసి, బేషరతుగా బెయిలు వచ్చిన తరవాతే మళ్లీ పదవీ బాధ్యతలు చేపట్టారు. మరి సిద్ధరామయ్య ఎలాంటి అడుగులు వేస్తారో వేచి చూడాల్సిందే!



వీరేంద్ర కపూర్
సామాజిక, రాజకీయ విశ్లేషకులు

బాపూజీ బాటలో...




ఆరోజు గాంధీజీ మనవడు కనూగాంధీ, ఆభాల పెళ్లి. వారంతా వార్ధాలోని సేవాగ్రామ్ ఆశ్రమంలో ఉన్నారు. అందమైన ఆభాని ఇంకా అందంగా అలంకరించాలనుకున్నారు సరోజినీ నాయుడు. ఆమెకు తనని నోరారా 'అత్తా' అని పిలిచే ఆభా అంటే చాలా ప్రేమ. వెళ్లి గాంధీజీని అనుమతి అడిగారు. 'నేను పేదవాడిని, అలంకరించడానికి నా దగ్గర నగలెక్కడివి' అన్నారు గాంధీజీ. 'నేను మిమ్మల్ని నగలు అడగలేదు. అలంకరించడానికి అనుమతి మాత్రమే అడిగాను. మీరు సరేనంటే ఆభాని పువ్వులతోనే అలంకరిస్తాను' అన్నారు సరోజిని. సరేనన్నారు గాంధీజీ. సరోజినీ నాయుడు సంతోషంతో ఆశ్రమంలోని బాలికలను పిలిచి పువ్వులు తెమ్మని చెప్పారు. అంతలోనే మరో బాలిక పరుగెత్తుకుంటూ వచ్చి, బాపూ మిమ్మల్ని రమ్మంటున్నారని సరోజినికి చెప్పింది. ఆమె బాపూ కుటీరానికి వెళ్లారు. 'నీకు ఆభాను పూలతో అలంకరించటానికి అనుమతిచ్చాను కానీ, కేవలం రాలిపడిన పూలతోనే సుమా. చెట్ల నుంచి కోయకూడదు' అన్నారు బాపూజీ. సరోజినీ నాయుడు మాత్రం ఏమనగలరు? రాలిన పూలన్నీ ఏరుకొచ్చి పెళ్లికూతుర్ని అలంకరించారు.

మరో సందర్భం... ఆభాగాంధీ ఒకరోజు ఆశ్రమంలో నడుస్తూ చేతికందిన చెట్టునుంచి ఆకును కోసుకుని వెళ్లిపోయింది. ఆభా అనాలోచితంగా చేసిన అత్యంత సాధారణమైన పని అది. అదే గాంధీజీ కంటపడింది. ఆమెను పిలిచారు. 'నువ్వే కాదు, చాలామందికి అలా దారిలో కన్పించిన చెట్టు నుంచి ఆకులో పువ్వులో తుంచేయడం అలవాటు. కానీ అది నా మనసుకు బాధ కలిగిస్తోంది. అలా చెట్టునుంచి వాటిని తుంచేయడం ఒకరకమైన హింసే కదా అన్పిస్తుంది నాకు. శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్ మొక్కలను ప్రాణముంటుందని చెప్పినప్పటినుంచి ఎవరినీ నేను పూలదండలు వేయనివ్వడం లేదు, నువ్వు చూసే ఉంటావనుకున్నా' అన్నారు గాంధీజీ.

ఆభా, కనూ గాంధీలు హిందీలో రాసిన పుస్తకం 'బాపూ కే సాథ్'లో పేర్కొన్న సంఘటనలివి. దీన్ని 'బాపూ సాన్నిధ్యం' పేరుతో కె.వి.రెడ్డి తెలుగులోకి అనువదించారు. "బాపూ- 'ఎందుకలా ఆకులు కోయడం' అని ఒక్క మాట నన్ను గట్టిగా అని ఊరుకోవచ్చు. ఇంకెప్పుడూ కోసేదాన్ని కాదు. కానీ ఆయన ఒక మంచి ఉపాధ్యాయుడు. ఏ విషయమైనా వివరంగా మనసుకు హత్తుకునేలా చెప్పేవారు. దాంతో ఆ పొరపాటు మరెప్పుడూ చేయం" అని రాసుకున్నారు ఆభా.

పై సంఘటనలు గాంధీజీ సున్నిత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఆయన మంచి అని నమ్మింది ఆచరించి చూపించారు. కానీ మనమో... ఆయన చెప్పింది ఆచరించడం మాని ఆయనకు గుడికట్టి పూజిస్తున్నాం. వీధి వీధినా విగ్రహాలు పెట్టి పూలమాలలతో అలంకరిస్తున్నాం. మన పనిని బాపూ హర్షిస్తారా? గాంధీజీ దేవుడు అనుకుంటే, ఆయన్ని అనుసరించలేం. కాదూ మనలాంటి మనిషేనని గుర్తుంచుకుంటే ఆయన భావాలను ఆచరణలో పెట్టే ప్రయత్నమైనా చేయగలుగుతాం! ఏమంటారు..?

– తిక్కవరపు సుకుమార్ రెడ్డి



> పేదరికాన్నీ నిరుద్యోగాన్నీ నిర్మూలించినప్పుడే దేశం బలంగా నిలబడగలుగుతుంది. అప్పుడు ప్రపంచమూ మనని గౌరవిస్తుంది. నిజానికి ఆ రెండే దేశానికి పెద్ద శత్రువులు. వాటిని పరిష్కరించకుండా కోట్లది రూపాయలను ఆయుధాల కోసం ఖర్చు పెట్టలేం.
>
> – లాల్ బహాదుర్ శాస్త్రి

శ్రీశక్తిరూపం బతుకమ్మ

'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సాగే ఎన్నో పాటల్లో బతుకమ్మ శ్రీశక్తి రూపంగా, స్త్రీల అభీష్టాలకు ప్రతిరూపంగా కన్పిస్తుంది. భాద్రపద బహుళ పంచమి నుంచి తొమ్మిది రోజులు, ఆపైన దేవీ నవరాత్రుల్లో కూడా తెలంగాణ ప్రాంతమంతా రెండు పండుగలను స్త్రీల, బాలికల, ప్రకృతి పండుగలుగా జరుపుకొంటుంది. మొదటిది బొడ్డెమ్మ... బాలికలు, యువతుల పండుగ. రెండోది బతుకమ్మ స్త్రీల ప్రత్యేకం. దేవీ నవరాత్రుల్లో పండితుల పూజలందుకునే శక్తిస్వరూపిణి- ప్రజల ముంగిట్లో తీరొక్కపూల గోపురమై బతుకమ్మ రూపంలో విరాజిల్లుతుంది. ప్రజల నమ్మకమేగాకుండా, బతుకమ్మ పేర్చే పద్ధతి, పూజావిధానం అత్యంత శోభాయమానంగా ఉండి, బతుకమ్మను శక్తిరూపంగా రుజువు చేస్తాయి.





శ్రీమహావిష్ణువు ధర్మ సంస్థాపనార్థం దశావతారాలు దాల్చినట్టుగా, పార్వతీదేవి దశావతారాలు ధరించి రాక్షసులను సంహరించి ప్రజలను రక్షించిందని పురాణాలు చెబుతున్నాయి. దుర్గాదేవిగా మహిషాసురుణ్ని వధించి, ఉగ్రరూపాన్ని దాల్చిన ఆమెను ప్రసన్నం చేసుకోవడానికి ప్రజలు జరుపుకొన్న పూజలే నేటి 'దేవీనవరాత్రులు'గా మారాయని అనుకోవచ్చు. మహిషాసురుణ్ని వధించి స్పృహ కోల్పోయిన దేవిని మేల్కొల్పి, సంతృప్తిపరచడానికి స్త్రీలందరూ ఆమెను 'బతుకమ్మ' అని పిలుస్తూ ఆటపాటలతో ప్రార్థించారట. దశమి రోజున దేవి స్పృహనుంచి తేరుకుంటుంది. దేవి పునర్జీవించిందని నాటినుంచి ఆమెను బతుకమ్మగా కొలుస్తున్నారని ఐతిహ్యం. అదేవిధంగా లలితా త్రిపురసుందరిని శ్రీచక్ర ప్రతిరూపంగా భావించి పండితులు కొలుస్తుండటం- ఆ శ్రీచక్రమే సామాన్యుల బతుకమ్మగా మారినట్లు కొన్ని రుజువులు కనిపిస్తాయి. శ్రీచక్రంలోని మేరు ప్రస్తారం బతుకమ్మ ఆకారాన్ని పోలివుంటుంది. మూలాధారం పృథ్వీస్థానం. బొడ్డెమ్మ కూడా అలాగే ఉంటుంది. పుట్టమన్నుతో మూలాధారాన్ని స్థాపించి షట్చక్రాలుగా పూలతో మెట్లు పేర్చుతారు. శ్రీచక్రంలోని అమృత వర్షం, పూర్ణచంద్రోదయాలకు ప్రతీకగా బొడ్డెమ్మపై కలశం, పసుపు కొమ్ములుంటాయి. పసుపు గౌరమ్మకు ప్రతీక. అంటే బొడ్డెమ్మ శివశక్తి సమాగమం అని భావించవచ్చు.

'శ్రీలక్ష్మీ నీ పూజలు గౌరమ్మ చిత్రమై తోచునమ్మా గౌరమ్మ..' అంటూ శ్రీలక్ష్మిని బతుకమ్మగా కొలువడం ఒక పాటలో చూస్తాం. సంతానహీనుడైన ధర్మాంగద మహారాజు భార్య సత్యవతితో కలిసి తపస్సు చేశాడు. సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మియే తమ బిడ్డగా పుట్టాలని కోరుకున్నాడు. 'సత్యవతి గర్భమున ఉయ్యాలో జన్మించె శ్రీలక్ష్మి ఉయ్యాలో' అనే పాట... 'బతుకమ్మ యను పేరు ఉయ్యాలో ప్రజలంత అందరూ ఉయ్యాలో...' అంటూ సాగుతుంది. తీరొక్క పూలతో పేర్చే బతుకమ్మ- ప్రకృతి ఆరాధనకు ప్రతీక. ఏ దేవుడినైనా కొలవడానికి అందరూ పూలను ఉపయోగిస్తే, ఆ పూలనే దేవతగా కొలిచే గొప్ప సంప్రదాయం బతుకమ్మ. బతుకమ్మ అందంగా రూపుదిద్దుకోవాలంటే, నిండైన పూలతో ప్రకృతి సమతుల్యంగా ఉండాలి. అందుకే ప్రకృతిని కాపాడే బాధ్యతను మనపై పెట్టిన బతుకమ్మకు వందనాలు.

– డాక్టర్ బండారు సుజాతశేఖర్



ఏదీ వృద్ధి?

దేశంలో సగానికి పైగా జనాభా నేటికీ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తోంది. అయినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల 'స్థూల జోడింపు విలువ (జీవీఏ)' ఏమంతగా ఉండటంలేదు. ఏదైనా రంగంలో వస్తుసేవలకు జోడించిన విలువను జీవీఏగా పేర్కొంటారు. ఆ లెక్కన మొత్తం స్థూల జోడింపు విలువ (టోటల్ ఎకానమీ జీవీఏ)లో వ్యవసాయ రంగం వాటా గడచిన దశాబ్దకాలంగా 20శాతాన్ని మించడం లేదు. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో దాని వాటా ఎంతంటే (శాతాల్లో)...

సంవత్సరం	జీవీఏలో వాటా
2017–18	18.3
2018–19	17.6
2019–20	18.3
2020–21	20.4
2021–22	18.9
2022–23	18.2

(ఆధారం: జాతీయ గణాంక కార్యాలయం)

భారత చెస్‌లో భావితారలు

భారత చదరంగం అంటే ఒకప్పుడు వినిపించే పేరు విశ్వనాథన్ ఆనంద్! దశాబ్దాల తరబడి ఆయనొక్కరే దేశ చెస్‌కు చుక్కానిలా నిలిచారు. అంతర్జాతీయ స్థాయిలో దిగ్గజ క్రీడాకారులను ఓడించే సత్తా ఉన్న ఆటగాడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన తరవాత కొందరు వచ్చినా నిలదొక్కుకోలేదు. ఇప్పుడా పరిస్థితి మారింది. ఆనంద్ స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటగల క్రీడాకారులు పది మందికిపైగా వెలుగులోకి వచ్చారు. ఆటలో స్థిరంగా చాకచక్యతను ప్రదర్శిస్తూ భవిష్యత్తుపై ఆశలు రేపుతున్నారు. తాజాగా చెస్ ఒలింపియాడ్‌లో వారు పురుషులు, మహిళల విభాగాల్లో స్వర్ణాలు గెలవడమే ఇందుకు నిదర్శనం.



> కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉండిపోయిన భారత చదరంగం ఉన్నట్టుండి ఉవ్వెత్తున ఎగసింది. ఈ 64 గళ్ల ఆటలో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటగల క్రీడాకారులు ఒకరిద్దరు కాదు... ఏకంగా డజను మంది వరకు ఇటీవల వెలుగులోకి వచ్చారు. ఇందుకు కారణమేంటన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది.

మెరిసిన తెలుగు తేజాలు

బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో భారత్ పసిడి పతకాలు గెలవడంలో తెలుగు తేజాలు అర్జున్ ఇరిగేశి, ద్రోణవల్లి హారిక, పెంటేల హరికృష్ణ కీలకమయ్యారు. ముఖ్యంగా అర్జున్ ఆధిపత్యం ప్రదర్శిస్తూ భారత్‌ను ముందుండి నడిపించాడు. కొన్నేళ్లుగా ఈ క్రీడలో వేగంగా ఎదిగిన ఈ తెలంగాణ కుర్రాడు రేటింగ్‌లో ప్రపంచంలోనే నాలుగో స్థానాన నిలవడం విశేషం. ఈ పోటీల్లో తనకంటే మెరుగైన రేటింగ్ ఉన్న గ్రాండ్ మాస్టర్లను సైతం అతడు ఓడించాడు. మరోవైపు తెలుగు మూలాలు ఉన్న తమిళ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ అంతర్జాతీయ చెస్‌లో ఓ సంచలనం. క్యాండిడేట్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన అతడు... డింగ్ లిరెన్‌తో ప్రపంచ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ కోసం తలపడేందుకు అర్హత సాధించాడు. చెస్ ఒలింపియాడ్‌లో భారత్ పసిడి నెగ్గడంలోనూ గుకేశ్‌ది కీలకపాత్రే. పిన్న వయసులోనే గ్రాండ్‌మాస్టర్లుగా ఎదిగిన అక్కాతమ్ముళ్లు వైశాలి, ప్రజ్ఞానంద భారత చెస్ స్థాయిని పెంచే దిశగా ముందుకెళ్తున్నారు. కొరకరాని కొయ్యగా మారిన ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను ప్రజ్ఞానంద అయిదుసార్లు ఓడించాడు. దేశంలో ఇంతమంది ప్రతిభావంతులైన చదరంగ క్రీడాకారులు తయారు కావడానికి కారణం- విశ్వనాథన్ ఆనంద్! ఒకప్పుడు ఆటగాడిగా భారత కీర్తిని పెంచిన ఆయన... ఇప్పుడు మార్గదర్శిగా యువతరాన్ని నడిపిస్తున్నారు. చెన్నైలో 'విషీ' స్థాపించిన చెస్ అకాడమీ గుకేశ్ సహా ఎంతోమంది భావితారలను వెలుగులోకి తెచ్చింది. ఆనంద్ దగ్గరుండి వీరి ఆట తీరును గమనిస్తూ లోపాలను సరిచేస్తూ పోటీలకు సిద్ధం చేస్తున్నారు. ఒలింపిక్స్‌లో లేకపోవడంతో ఒకప్పుడు చదరంగంపై చిన్నచూపు ఉండేది. క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటినా, పెద్దగా గుర్తింపు వచ్చేది కాదు. దాంతో గ్రాండ్‌మాస్టర్ స్థాయికి వెళ్లినా భవిష్యత్తు లేదనే నిరుత్సాహంతో ఆడటం మానేసిన వాళ్లూ ఉన్నారు. ఇప్పుడా పరిస్థితి మారింది. మునుపటితో పోలిస్తే ప్రభుత్వం చెస్ అకాడమీలకు మెరుగైన ప్రోత్సాహం అందిస్తోంది. ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తూ యువ క్రీడాకారులకు మద్దతుగా నిలుస్తోంది. 2022లో చెన్నై వేదికగా చెస్ ఒలింపియాడ్ నిర్వహించడం భారత క్రీడాకారుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఇలాంటి మరిన్ని టోర్నీలకు భారత్ వేదిక కావాల్సిన అవసరముంది. చెస్‌లో అంతర్జాతీయ పతకాలు గెలిచిన క్రీడాకారులకు ప్రస్తుతం ఉద్యోగాలు కూడా వస్తుండటంతో ఈ ఆటను కెరీర్‌గా ఎంచుకునే వారి సంఖ్య పెరుగుతోంది. 1999లో భారత్‌లో ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లే ఉండేవారు. ఇప్పుడా సంఖ్య 85కు చేరుకోవడం చెస్ ఎదుగుదలకు సంకేతం. గుకేశ్, ప్రజ్ఞానంద, వైశాలి, అర్జున్ లాంటి ఆటగాళ్లు పిన్న వయసులోనే గ్రాండ్‌మాస్టర్లుగా ఎదిగారు.

ఆర్థిక దన్ను దొరికితే...

విదేశాలకు వెళ్లి ఒక స్థాయి పోటీల్లో పాల్గొంటే తప్ప చెస్‌లో రేటింగ్ పెరగదు. ఆనంద్ ఇలాగే సంవత్సరాల తరబడి స్పెయిన్‌లో శిక్షణ తీసుకుని అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్ కాగలిగారు. చెస్ క్రీడాకారులు మనుగడ సాధించాలంటే ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు ప్రైవేటు సంస్థల స్పాన్సర్‌షిప్ చాలా అవసరం. విదేశాల్లో శిక్షణ తీసుకుని... టోర్నీలు ఆడి రావడమనేది చాలా ఖర్చుతో కూడుకున్న పని. కొంతమంది క్రీడాకారులు మాత్రమే ఇలా చేయగలుగుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో చాలామంది ప్రతిభావంతులు విదేశీ శిక్షణ తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. అలాంటి వారికి ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు వెన్నుదన్నుగా నిలవాలి. వారికి శిక్షణ ఇప్పించి ఆర్థికంగా తోడ్పాటు అందించాలి. హాకీని ఒడిశా ప్రభుత్వం దత్తత తీసుకుని ప్రోత్సహిస్తున్నట్లే ఏదైనా రాష్ట్రం చెస్‌కు అండగా నిలవాలి.

– దాస్యం వెంకట వంశీకృష్ణ

హాయ్! బుజ్జీ!! — గాంధీతాత మాట!

'మహాత్మా గాంధీ' గురించి తెలియని వాళ్లు.. వినని వాళ్లు మన దేశంలో ఉండరేమో! మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, బాపూజీ, గాంధీజీ, జాతిపిత.. ఇలా ఎన్ని పేర్లో ఆయనకి. అయినా 'గాంధీతాత' అని పిలిస్తేనే మన మనసుకు చాలా దగ్గరగా అనిపిస్తుంది కదా! మన గాంధీతాత జీవిత ప్రయాణం మనకు నేర్పే పాఠాలు ఎన్నో. ఎవరైనా కోపంగా చూసినా.. మనతో కాస్త గట్టిగా మాట్లాడినా.. ఏడ్చేస్తుంటాం. లేదంటే.. తిరిగి వాళ్లను తిట్టేస్తుంటాం. కానీ ఆ రెండూ మనల్ని మరింత బలహీనుల్ని చేస్తాయని మాత్రం తెలుసుకోం. ఇలాగే గాంధీజీకి కూడా చాలా అవమానాలు ఎదురయ్యాయి. ఒకసారి ఆయన రైలులో ప్రయాణిస్తుంటే.. నల్ల రంగు వ్యక్తంటూ మాటలతో అవమానించి.. అందులో నుంచి దింపేశారు. అయినా ఆయన కుంగిపోలేదు. ధైర్యంగా ఎదుర్కొన్నారు.



సత్యం, అహింసే.. ఆయన మార్గాలు. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా కూడా అస్సలు అబద్ధాలు చెప్పకూడదంటారు గాంధీజీ. మనం మాత్రం స్నేహితులతో ఆడుకోవడం, ఆహారం తినడం, హోంవర్క్, సెలవులు ఇలా.. చిన్నచిన్న విషయాలకే అబద్ధాలు చెప్పేస్తాం. కానీ అది మంచి పద్ధతి కాదు. చిన్నగా మొదలైన ఆ అలవాటు.. పెద్దయ్యాకా కొనసాగుతూనే ఉంటుంది. కాబట్టి నిజాలు మాత్రమే మాట్లాడాలి. ఎవరైనా మనల్ని చిన్న మాట అంటే చాలు అస్సలు ఊరుకోం. ఒకటికి రెండు మాటలు అనేస్తాం. స్నేహితులతో పుస్తకాలు, పరీక్షలు, బొమ్మల విషయంలో గొడవపడతాం. కొన్నిసార్లు కొట్టుకుంటాం కూడా. అది కూడా మంచి పద్ధతి కాదు. అలాంటి విషయాల్లో చాలా ఓపికగా వ్యవహరించాలి. పోట్లాడుకోవడం ఒకటే హింస కాదు.. అనవసరమైన, చెడు మాటలు మాట్లాడటం కూడా తప్పే. కాబట్టి సహనంతో ఉండాలి. ఇప్పటి నుంచి మనం కూడా మన గాంధీతాత మార్గంలో నడుద్దామా మరి!

– అవధూత హరిప్రియ

జత చేయండి

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల చిత్రాలు వేర్వేరు వరసల్లో ఉన్నాయి. సరైన వాటిని జత చేయండి.



జవాబు: 1-సి, 2-ఎ, 3-డి, 4-బి


భిన్నంగా చదువు.. ఉన్నతంగా కొలువు



- బహుశాస్త్ర నైపుణ్యాలకే పరిశ్రమల పెద్దపీట
- రెండు డిగ్రీలతో మెరుగైన ఉద్యోగావకాశాలు
- పీజీలో దగ్గరి సంబంధమున్న కోర్సుల బోధన
- ఏయూలో వచ్చే విద్యా ఏడాది నుంచి అమలు

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: పరిశ్రమల అవసరాలు మారుతున్నాయి. తమ సిబ్బందిలో వైవిధ్యమైన నైపుణ్యాలను ఆశిస్తున్నాయి. ఒక అంశంలో మాస్టర్ అయినప్పటికీ, దానికి దగ్గరి సంబంధమున్న ఇతర సబ్జెక్టులపై కూడా పట్టు కలిగి ఉండాలని నిర్దేశిస్తున్నాయి. తదనుగుణంగా మన విద్యార్థులను తీర్చిదిద్దేలా, ఉద్యోగ సాధనలో అర్హతలను పెంచుకునేలా పీజీ కోర్సుల్లో మార్పులకు శ్రీకారం చుడుతోంది విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు రెండు డిగ్రీలు అందించేలా బహుశాస్త్ర విషయ (మల్టీ డిసిప్లినరీ) విద్యను ప్రవేశపెడుతోంది. దేశవ్యాప్తంగా 2030 నాటికి అన్ని విద్యాసంస్థలు మల్టీ డిసిప్లినరీలుగా మారాలని జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020 స్పష్టం చేసింది. విద్యార్థులు యూజీ స్థాయిలో మల్టీ డిసిప్లినరీ కోర్సులు, విశ్వవిద్యాలయాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కోర్సులు చదవాలని నిర్దేశించింది. దీన్ని ఏయూ అందిపుచ్చుకుంది.

అదనంగా ఆరు సబ్జెక్టులు



ఏయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య శశిభూషణరావు

ఏయూ ఇన్‌ఛార్జి వీసీగా ఆచార్య శశిభూషణరావు నియమితులయ్యాక ఎన్ఈపీ-2020 అమలుపై దృష్టి సారించారు. ఆయన ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నప్పుడు దీనిపై ప్రణాళిక సిద్ధం చేయగా, తాజాగా అక్కడ మేజర్, మైనర్ డిగ్రీల విధానాన్ని ప్రారంభించారు. ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచీల విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) పాఠాలు బోధిస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత రెండు డిగ్రీలకూ ధ్రువపత్రాలు అందజేస్తారు. అలాగే, ఆర్ట్స్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. విద్యార్థులు రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు అదనంగా ఆరు సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. నిపుణుల కమిటీ సలహా మేరకు పాఠ్యప్రణాళిక (కరిక్యులమ్) తయారు చేయనున్నారు. దీనిపై వీసీ శశిభూషణరావు మాట్లాడుతూ 'రెండు డిగ్రీల విధానం అమలుచేస్తే పొరుగు రాష్ట్రాల నుంచి కూడా మన వర్సిటీల్లో ప్రవేశాలు పెరుగుతాయి. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. ఇంజినీరింగ్ కళాశాలలో రెండు డిగ్రీల విధానంపై రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఆర్ట్స్ కళాశాలలోనూ దీన్ని ప్రవేశపెట్టడంపై నిపుణుల కమిటీ సలహాలు తీసుకుంటున్నామ'ని తెలిపారు. ఈ విధానం అన్ని విద్యాసంస్థల్లోనూ అమలుచేస్తే విద్యార్థులకు ప్రయోజనకరమని పేర్కొన్నారు.

కోర్సుల మేళవింపు ఇలా..

పీజీలో ఎకనామిక్స్, జియాలజీ వంటి ఒక్క కోర్సు మాత్రమే చదివిన వారితో పోల్చితే, రెండు డిగ్రీలు గలవారికి ఉద్యోగవకాశాలు ఎక్కువ. ఫార్మా సంస్థలు ఫార్మసీతో పాటు గణాంక నైపుణ్యాలున్న వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇదే క్రమంలో ఎంఏ ఎకనామిక్స్ విద్యార్థులకు అప్లైడ్ ఎకనామిక్స్ సబ్జెక్టులను అదనంగా బోధిస్తారు. అప్లైడ్ ఎకనామిక్స్‌లో కోర్ సబ్జెక్టు ఏం చదవాలన్నది నిపుణులు నిర్ణయిస్తారు. ఉదాహరణకు వాతావరణ శాస్త్రం చదివితే సముద్ర అధ్యయన శాస్త్రం, భౌతికశాస్త్రం విద్యార్థులకు భూభౌతిక (జియాలజీ) లేదా అణుభౌతిక శాస్త్రాలు, ఎంకామ్ (అకౌంటింగ్, ఫైనాన్సింగ్ టెక్నిక్స్) విద్యార్థులకు ఎంబీఏ ఫైనాన్స్ బోధించనున్నారు. రెగ్యులర్ కోర్సుకు అనుబంధంగా లేదా దగ్గరగా ఉండే కోర్సులు నేర్పించనున్నారు.

రెండు డిగ్రీల కోర్సులో భాగంగా బోధించనున్న మరికొన్ని సబ్జెక్టులు..

ప్రాథమిక కోర్సు	అదనపు కోర్సు
ఎంఏలో..	
తెలుగు	సంస్కృతం
ఆంత్రపాలజీ	సోషియాలజీ
రాజనీతి శాస్త్రం	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్
చరిత్ర	ఆంత్రపాలజీ
ఎమ్మెస్సీలో..	
గణితం	అప్లైడ్ మ్యాథమెటిక్స్, డేటా సైన్స్
మెరైన్ బయాలజీ, ఫిషరీస్	కోస్టల్ ఆక్వాకల్చర్, మెరైన్ బయోటెక్నాలజీ



శ్రీవారి ఆలయ ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న తితిదే ఈవో జె.శ్యామలరావు దంపతులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి దంపతులు

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి చేపట్టారు. మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు, నైవేద్య సమర్పణ చేశాక సర్వ దర్శనానికి అనుమతించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో జె.శ్యామలరావు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి దంపతులు, జేఈవో గౌతమి, సీవీఎస్‌వో శ్రీధర్ పాల్గొన్నారు.

నిధులపై 'అథారిటీ'!

- పునరావాసానికే రూ.5,500 కోట్లు
- నిర్మాణ పనులకు రూ.1,700 కోట్లు
- నిధులు అవసరమన్న పోలవరం అధికారులు
- అంతెందుకని పోలవరం అథారిటీ ప్రశ్నలు
- చర్చల తర్వాత కేంద్ర జలశక్తికి ప్రతిపాదనలు



ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పునరావాసానికి రూ.5,500 కోట్లు, ప్రధాన డ్యాం, కాలువల్లో నిర్మాణ పనులకు రూ.1,700 కోట్ల వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో అవసరమని అంచనా వేశారు. నిర్మాణ షెడ్యూలు, బడ్జెట్ ప్రతిపాదనలు పోలవరం అథారిటీకి పంపగా.. అక్కడ వారు అనేక ప్రశ్నలు సంధిస్తున్నారు. ఈ నిధులు అవసరమని రాష్ట్ర అధికారులు పట్టుపడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు 2026 మార్చికే పూర్తిచేయాలని కేంద్రం షరతు విధించడంతో ఈ ఆర్థిక సంవత్సరంలోనే పనులు, పునరావాసం వేగం పెంచాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రూ.30,436.95 కోట్లతో తాజా డీపీఆర్‌ను ఆమోదించింది. దీనివల్ల ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తికి రూ.12,157 కోట్లు అందుబాటులోకి వచ్చాయి. తాజా డీపీఆర్ ఆమోదం తర్వాత ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం కృషితో పోలవరానికి అడ్వాన్స్‌గా నిధులిచ్చేందుకూ కేంద్రం ముందుకొచ్చింది. ఈ పరిస్థితుల్లోనే తాజా ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర జల్‌శక్తి శాఖకు పంపేందుకు పోలవరం అథారిటీకి అందించారు. అక్కడ పరిశీలిస్తున్న అధికారులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంత మొత్తం నిధులు ఎలా ఖర్చుచేస్తారని ప్రశ్నలు సంధిస్తున్నారు. అందుకు తగ్గ ప్రణాళికలు తమవద్ద ఉన్నాయని, పెండింగ్ నిధులు రూ.1,654 కోట్లు రావాల్సి ఉన్నాయని కూడా అధికారులు గుర్తు చేస్తున్నారు. పోలవరానికి నిధులు ఇవ్వాలంటే కేంద్రం బడ్జెట్‌లో ముందుగా వాటిని ప్రతిపాదించాలని, ఆ స్థాయిలో ఖర్చుచేయడం సాధ్యం కాకపోతే కేంద్ర బడ్జెట్ వృథా అవుతుందని పోలవరం అథారిటీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నవంబరు నుంచి జూన్ లోపు కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేయాలనుకుంటున్నామని, దీంతోపాటు ఇతర నిర్మాణ పనులు కొన్నింటిని ఈ సీజన్‌లోనే పూర్తిచేస్తామని అధికారులు ప్రతిపాదనలు పంపారు. 2024 నవంబరు నుంచి 2025 జూన్ వరకు చేపట్టే పనుల షెడ్యూలు, వాటికి అవసరమయ్యే నిధుల వివరాలు రూపొందించి, నివేదిక సమర్పించారు. పునరావాసం, భూసేకరణకు అత్యధిక నిధులు అవసరమవుతాయని పునరావాసం వ్యవహారాలు పర్యవేక్షించే అధికారులు చెబుతున్నారు.

తొలిదశ పునరావాసం

పోలవరం ప్రాజెక్టులో తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తుకు నీళ్లు నిలబెట్టాలనేది ప్రణాళిక. ఇందుకు మొత్తం తొలిదశలో 8 మండలాల్లో 172 ఆవాసాల్లో 38,060 మందికి పునరావాసం కల్పించాలి. ఇప్పటివరకు 12,797 మందినే తరలించారు. ఇంకా 25,263 మందిని తరలించాలి. ఇందుకు 16,440 ఎకరాల భూమి సేకరించాలి. దీనికి రూ.2,435 కోట్లు అవసరం. వీరందరికీ నిర్వాసిత ప్యాకేజీ నిధులిచ్చేందుకు రూ.2,043.59 కోట్లు కావాలి. పునరావాస కాలనీల నిర్మాణానికి రూ.3,314.21 కోట్లు అవసరం. ఇందులో 2025 జూన్‌లోపు ఎంతవరకు పనులు, ప్యాకేజీలు ఇవ్వగలరో ప్రణాళిక రూపొందించి రూ.5,500 కోట్ల వరకు అవసరమని ప్రతిపాదించారు.

కొత్త డయాఫ్రం వాల్, మట్టి సాంద్రత పెంపు

కొత్త డయాఫ్రం వాల్ పనులు నవంబరు నుంచి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఒప్పందాలు పూర్తయ్యాయి. ప్రధాన డ్యాం గ్యాప్-2లో పాత డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా కొత్త డయాఫ్రం వాల్ నిర్మిస్తారు. దాదాపు 64 వేల చదరపు మీటర్ల పని చేయాల్సి ఉంటుంది. 2025 జూన్‌కు పూర్తిచేయాలనేది ఉద్దేశం. నవంబరు నాటికి డిజైన్లు, ఇతర అంశాలపై కొలిక్కి వస్తారు. ప్రధాన డ్యాం మొదటి రెండు గ్యాప్‌లలో మట్టిసాంద్రత పెంచే పనులు ఇంకా చేయాలి. అక్కడ ఇసుకను నింపి వైబ్రో కాంపాక్షన్ ద్వారా అక్కడ మట్టి గట్టిదనం పెంచాలి. ఇందుకు షెడ్యూలు కూడా పోలవరం అథారిటీకి సమర్పించారు. అనుసంధాన పనుల్లో ఎడమ టన్నెల్ హెడ్ రెగ్యులేటర్, ఎడమ టన్నెల్ లైనింగ్, కుడి టన్నెళ్లలో మట్టి తవ్వకం, లైనింగ్ కూడా 2025 జూన్ నాటికి పూర్తిచేసేలా షెడ్యూలు రూపొందించారు. ఇంకా, తొలిదశలో ఆయకట్టుకు నీళ్లందించేలా కుడి, ఎడమ కాలువల్లో కూడా పనులు పూర్తిచేయాల్సి ఉంది.

ప్రాజెక్టు పరిశీలనకు పోలవరం అథారిటీ సీఈఓ

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈఓ అతుల్ జైన్ పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. అక్టోబరు 3న ఆయన ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తారు. అథారిటీ సీఈఓగా నియమితులైన తర్వాత ఆయన తొలిసారి ప్రాజెక్టు వద్దకు వస్తున్నారు.


3 నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 3నుంచి దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు మంగవారం తెలిపారు. ఈ నెల 12 వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. వేడుకల్లో ప్రతి రోజూ అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిస్తారన్నారు. 11న రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

ఒక్క రోజులోనే శ్రీవారి దర్శనం

- సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యం
- బ్రహ్మోత్సవాల సమయంలో వీఐపీ సిఫార్సు దర్శనాలు రద్దు
- 'ఈనాడు-ఈటీవీ'తో తితిదే ఈవో శ్యామలరావు



ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే- తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఒకే రోజు స్వామివారితో పాటు వాహన సేవల దర్శన భాగ్యం కల్పించేలా ఏర్పాట్లు చేశామని తితిదే ఈవో శ్యామలరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఆర్జిత సేవలతో పాటు వీఐపీ సిఫార్సులపై బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు వెల్లడించారు. స్వయంగా వచ్చే వీఐపీలకే దర్శన అవకాశం ఉంటుందని వివరించారు. గరుడ సేవ జరిగే 8వ తేదీన దాన్నీ రద్దు చేశామని తెలిపారు. దర్శనాలలో సామాన్యులకే ప్రాధాన్యమివ్వనున్నట్లు పునరుద్ఘాటించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆయన 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు.

తిరుపతిలో రోజుకు 24 వేల టోకెన్లు

'బ్రహ్మోత్సవాల రోజుల్లో ప్రత్యేక ప్రవేశ దర్శనాల కోసం 1.32 లక్షల టికెట్లను ఆన్‌లైన్‌లో ఇచ్చాం. ఈ వ్యవధిలో సర్వదర్శనానికి వచ్చే వారికి తిరుపతిలో రోజుకు 24 వేల టోకెన్లు ఇవ్వనున్నాం. దీని వల్ల రోజుకు సుమారు 80 వేలు, గరుడ సేవనాడు లక్ష మంది దర్శనానికి వీలుంటుంది. ఉదయం ఎనిమిదింటి నుంచి పది గంటల వరకు, సాయంత్రం ఏడింటి నుంచి రాత్రి తొమ్మిదింటి వరకు జరిగే వాహన సేవలను తిలకించేందుకు ఏర్పాట్లు చేశాం. గరుడ సేవ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11 వరకు జరుగుతుంది. ఈ వేడుకను రెండు లక్షల మంది ప్రత్యక్షంగా వీక్షించేలా గ్యాలరీలను, వారికి అన్న ప్రసాద వితరణ తదితర ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ రోజు కొండపైకి 3.5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. తిరుమలలో మొత్తంగా 6,200 గదులు అందుబాటులో ఉంటాయి. ఆన్‌లైన్ కోటా తగ్గించి కరెంటు బుకింగ్ ద్వారానే అందిస్తాం. వీఐపీల కోసం 1300 గదులున్నాయి. మొత్తంగా 40 వేల మందికి వసతి కల్పిస్తాం. తిరుపతిలోని విష్ణు నివాసం, శ్రీనివాసం, ఇతర వసతి గృహాలూ అందుబాటులో ఉంటాయి.

వివిధ ప్రాంతాల్లో అన్నప్రసాద కేంద్రాలు


తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలోనే కాకుండా కొండపై పలు ప్రాంతాల్లో అన్నప్రసాద కేంద్రాలు అందుబాటులో ఉంచుతాం. గరుడ సేవనాడు ఉదయం ఏడింటినుంచి రాత్రి ఒంటి గంట వరకు వెంగమాంబ అన్నదాన సత్రం అందుబాటులో ఉంటుంది. సాధారణ రోజుల్లో 3.5 లక్షల లడ్డూలను ఇస్తున్నాం. ఉత్సవాల నేపథ్యంలో మరో ఏడు లక్షల నిల్వలు అందుబాటులో ఉంచుతాం. ప్రసాదాల పంపిణీకి మరో 11 కౌంటర్లు ఏర్పాటుచేస్తున్నాం. భద్రత దృష్ట్యా 12 ఏళ్లలోపు పిల్లలకు గుర్తించేందుకు వారికి ట్యాగ్ వేస్తున్నాం. తిరుపతిలో ఐదు ప్రాంతాల్లో పార్కింగ్ కేంద్రాల వద్ద ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నాం. ఆర్టీసీ బస్సులు రోజూ 2వేల ట్రిప్పులు, గరుడసేవ నాడు 3వేల ట్రిప్పులు నడుస్తాయి. గరుడ సేవనాడు కనుమ దారుల్లో ద్విచక్రవాహనాల రాకపోకలను నిలిపేస్తాం. గతేడాది 12 రాష్ట్రాలనుంచి సాంస్కృతిక బృందాలు వస్తే ఈసారి 21 రాష్ట్రాలనుంచి 60 బృందాలు రానున్నాయి..' అని ఈవో తెలిపారు.

తెలంగాణ డీఎస్సీలో విశాఖ యువతి ప్రతిభ



మహాలక్ష్మి

విశాఖపట్నం(పీఎం పాలెం), న్యూస్‌టుడే: తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో విశాఖపట్నానికి చెందిన యువతి రెండు కేటగిరీల్లో మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటారు. నగర పరిధిలోని పీఎంపాలెం ప్రాంతానికి చెందిన రెడ్డి మహాలక్ష్మి 2022లో హిందీ లాంగ్వేజ్ పండిట్ కోర్సు, 2023లో ఎంఏ హిందీ పూర్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా మొదటిసారి తెలంగాణ డీఎస్సీకి దరఖాస్తు చేసి నాన్‌లోకల్ కోటాలో హైదరాబాద్ జిల్లాను ఎంచుకుని పరీక్ష రాశారు. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో లాంగ్వేజ్ పండిట్ హిందీలో(79.97), స్కూల్ అసిస్టెంట్ హిందీలో(71.47) మార్కులు సాధించి ఆ జిల్లా పరిధిలో ప్రథమ ర్యాంకు దక్కించుకున్నారు.



భయం పెద్ద జబ్బు!

భయమనేది మహమ్మారి జబ్బుల కంటే కూడా భయంకరమైన వ్యాధి! ఆ జబ్బులు కేవలం శరీరాన్నే హరిస్తాయేమోగానీ భయం మాత్రం మన ఆత్మను చంపేస్తుంది. అందుకే అది అత్యంత ప్రమాదకరం!

– మహాత్మా గాంధీ

రోజుకు రెండు సెషన్లలో టెట్

- ఈ నెల 3 నుంచి 21 వరకు నిర్వహణ
- హాల్‌టికెట్, గుర్తింపుకార్డు తప్పనిసరి



ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీకి ముందు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 4 లక్షలకుపైగా అభ్యర్థులు హాజరుకాబోతున్నారు. ఈ నెల 3 నుంచి 21 వరకు రోజుకు రెండు సెషన్లలో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. దివ్యాంగులకు అదనంగా 50 నిమిషాల సమయం కేటాయిస్తారు. 813 మంది దివ్యాంగులు సహాయకులను ఏర్పాటు చేసుకున్నారు. పరీక్షా సమయానికి గంటన్నర ముందుగానే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. అభ్యర్థులు ఎవరైనా ఒకటి కంటే ఎక్కువ హాల్‌టికెట్లు పొందితే ఏదో ఒక కేంద్రంలో మాత్రమే హాజరుకావాలి. హాల్‌టికెట్లలో ఏమైనా తప్పులు ఉంటే పరీక్షా కేంద్రంలోని డిపార్టుమెంట్ అధికారికి ఆధారాలు చూపించి, వాటిని సరిచేసుకునే సదుపాయం కల్పించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు.

- దరఖాస్తులు: 4,27,300
- ఇప్పటివరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 4,09,955
- పరీక్షా కేంద్రాలు: 108
- ఏపీలోని 22 జిల్లాల్లో కేంద్రాలు: 95
- హైదరాబాద్, ఖమ్మం, బెంగళూరు, చెన్నై, బరంపూర్, గంజాంల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలు: 13
- ఇతర రాష్ట్రాల్లో పరీక్ష రాసేవారు: 24,396

రజినీకాంత్‌కు సీఎం చంద్రబాబు ఫోన్‌లో పరామర్శ

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రముఖ సినీ నటుడు రజినీకాంత్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఫోన్ చేసి పరామర్శించారు. చెన్నై ఆసుపత్రిలో గుండె చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 'నా మిత్రుడు, సూపర్‌స్టార్ రజినీకాంత్ త్వరగా కోలుకోవాలి. ఆయన దీర్ఘాయుష్షుతో జీవించాలి' అని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

నాబార్డు కొత్త సీజీఎంగా ఉదయ్‌భాస్కర్



ఈనాడు, హైదరాబాద్: జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) తెలంగాణ ప్రాంత నూతన సీజీఎం (చీఫ్ జనరల్ మేనేజర్)గా బి.ఉదయ్‌భాస్కర్ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందినవారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో పీజీ చదివారు. 1993లో కర్ణాటకలోని నాబార్డు ప్రాంతీయ కార్యాలయంలో అధికారిగా విధుల్లో చేరి, 31 సంవత్సరాలుగా వివిధ రాష్ట్రాల్లో పనిచేశారు.

కేంద్ర జల సంఘం ఛైర్మన్‌గా రాజేశ్‌కుమార్ వర్మ

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్‌గా రాజేశ్‌కుమార్ వర్మకు కేంద్రం బాధ్యతలు అప్పగించింది. జలశక్తి మంత్రిత్వశాఖలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న ఆయన 3 నెలల పాటు ఈ బాధ్యతలను నిర్వహిస్తారు. సీడబ్ల్యూసీ ఛైర్మన్‌గా ఉన్న కుశ్వీందర్ సింగ్ వోరా పదవీ విరమణ చేయడంతో ఈ స్థానం ఖాళీ ఏర్పడింది.

పేదల ముఖాల్లో ఆనందమే లక్ష్యం

- జీతాలు, పింఛన్లు ఒకటో తేదీకే ఇస్తున్నాం
- మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 ఉద్యోగాలిస్తాం
- 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా చర్యలు
- దీపావళి నుంచి మహిళలకు 3 ఉచిత సిలిండర్లు
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడి
- జగన్ నిర్వాకంతో ఏటా రూ.లక్ష కోట్ల వడ్డీ కడుతున్నామని ఎద్దేవా



కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం పుచ్చకాయలమడ గ్రామంలో జరిగిన ప్రజావేదికలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీటీసీ సభ్యుడు చంద్ర, సర్పంచి హరిత, లబ్ధిదారులు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, తెదేపా నేత సాంబశివారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

ఈనాడు, కర్నూలు: పేదల ముఖాల్లో ఆనందం చూడడమే తన లక్ష్యమని.. అందుకోసం ఎన్ని సమస్యలు వచ్చినా ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. దీపావళి నుంచి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం పుచ్చకాయలమడలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన 'ప్రజావేదిక- పేదల సేవలో' మాట్లాడారు. "పింఛను రూ.4 వేలు చేస్తామన్న ఎన్నికల హామీని వంద రోజుల పాలనలోనే నెరవేర్చాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.4 వేలు పింఛను ఇస్తున్నాం" అని వివరించారు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 ఉద్యోగాలు ఇచ్చేలా ప్రకటన జారీచేశామని.. ఆయా నియామక ప్రక్రియను వేగంగా పూర్తిచేస్తామన్నారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఒకటో తేదీకే చెల్లిస్తున్నామని గుర్తుచేశారు. జగన్ నిర్వాకం కారణంగా రూ. 10 లక్షల కోట్ల అప్పు ఉందని, ఏటా రూ.లక్ష కోట్ల వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. అయినప్పటికీ తాను ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రకటించారు.

నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు

'వైకాపా పాలనలో కబ్జాలు, వాటాల కారణంగా పరిశ్రమలు రాకపోగా పారిశ్రామికవేత్తలు భయపడి వేరే రాష్ట్రాలకు పారిపోయారు. తెదేపా అధికారంలోకి వచ్చాక మళ్లీ పారిశ్రామికవేత్తలు వస్తున్నారు. ఐటీలో లులు గ్రూపుతోపాటు పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే దిశగా చర్యలు ప్రారంభించాం. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం. ఫలితంగా ఈ ఒక్క రంగంలోనే 7.50 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. పలుచోట్ల వర్క్ స్టేషన్లను ఏర్పాటు చేసి వారివారి గ్రామాల్లోనే ఉండి ఉద్యోగాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటాం' అని వివరించారు.

రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు

రాష్ట్రప్రభుత్వానికి అందుతున్న ఫిర్యాదుల్లో 50 శాతం ఫిర్యాదులు భూవివాదాలకు సంబంధించినవే ఉంటున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. వైకాపా హయాంలో ప్రైవేటు భూములను కూడా నిషేధిత భూముల జాబితాలో చేర్చి భూ వివాదాలకు తెరతీశారు. రీసర్వే పేరు చెప్పి రైతుల భూముల సరిహద్దులు మార్చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల భూహక్కులను ప్రశ్నార్థకం చేసే 'ల్యాండ్ టైట్లింగ్ చట్టం' అమలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అత్యంత ప్రమాదకరమైన ఆ చట్టాన్ని మేం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేశాం' అని గుర్తుచేశారు.

పేదలకు మూడు పూటలా భోజనం

పేదలకు కేవలం రూ.15కే మూడు పూటలా భోజనం అందేలా అన్న క్యాంటీన్లను మళ్లీ ప్రారంభించాం. 'డిసెంబరు నెలలోపు స్కిల్ సెన్సస్‌ను పూర్తి చేస్తాం. గ్రామాల్లోని వారు వారికి సమీపంలోని వాగులు, నదీతీరాల నుంచి సొంత అవసరాల కోసం ఇసుకను పూర్తి ఉచితంగా తెచ్చుకోవచ్చు. అలాంటి వారికి ఇబ్బంది పెట్టవద్దని అధికారులను సూచించాం. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులకు శ్రీకారం చుడతాం. నూతన మద్యం విధానంలో భాగంగా పదిశాతం దుకాణాలు గీతకార్మికులకు రిజర్వు చేశాం. గత ప్రభుత్వం మద్యం ధరలను భారీగా పెంచి పేదలు ఆర్థికంగా దెబ్బతినేలా చేసింది. మేము రూ.99కే నాణ్యమైన మద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం' అని వివరించారు.

ఇంటికెళ్లి మరీ వరాలు

పుచ్చకాయలమడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడానికి తలారి గంగమ్మ, చింతగింజల వెంకటేశ్ ఇళ్లకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరికి? ఏయే పథకాలు అందుతున్నాయో వివరాలు అడిగారు. గంగమ్మ కుమారుడు తనకు ఆటో ఇప్పిస్తే ఉపాధి పొందగలనని కోరారు. ఆయనకు బుధవారమే ఆటో కొని ఇవ్వాలని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను సీఎం ఆదేశించారు. అదే విషయాన్ని ప్రజావేదిక సభలో ప్రకటించడంతో గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఆ రెండు కుటుంబాల వారికి ఇళ్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే శ్యాంబాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పుచ్చకాయలమడ గ్రామానికి ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. వివిధ పథకాలకు అర్హులైన గ్రామస్థులకు వరాలు వెల్లడించడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది.



పుచ్చకాయలమడలో చింతగింజల వెంకటేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర దాడి

జెరూసలెం, వాషింగ్టన్: భయాలే నిజమయ్యాయి. పశ్చిమాసియా నిప్పుల కుంపటైంది. ప్రాంతీయ యుద్ధం అంచున నిలిచింది. హెజ్‌బొల్లా, హమాస్ అగ్రనేతలను అంతమొందించిన ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. ఇజ్రాయెల్ నగరాలైన టెల్‌అవీవ్, జెరూసలెంపై మంగళవారం రాత్రి ఏకబిగిన 180 క్షిపణుల్ని ప్రయోగించింది. చాలావాటిని అమెరికా సాయంతో ఇజ్రాయెల్ అడ్డుకోగలిగింది. మరికొన్ని నగరాలను తాకాయి. ప్రాణనష్టం వివరాలు తెలియనప్పటికీ- తమవైపు కొద్దిమందే గాయపడ్డారని ఇజ్రాయెల్ ప్రకటించింది. హెజ్‌బొల్లాపై ప్రతీకారం తీర్చుకునేందుకు లెబనాన్‌లో భూతల దాడులు ప్రారంభించామని ఇజ్రాయెల్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ క్షిపణుల ప్రయోగం మొదలైంది. టెల్‌అవీవ్‌లో, జెరూసలెం సమీపంలో వరుసగా బాంబు పేలుళ్లు వినిపించాయి. ఇరాన్ నుంచి ప్రయోగించిన క్షిపణులు 12 నిమిషాల వ్యవధిలోనే ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించాయి. ఈ దాడుల గురించి తమ అంతర్జాతీయ భాగస్వాములకు ఇరాన్ సమాచారం ఇచ్చింది. పదుల సంఖ్యలో బాలిస్టిక్ క్షిపణుల్ని వాడినట్లు అధికారికంగానూ ప్రకటించింది. ఇది కేవలం తమ తొలి దెబ్బేనని, ఇజ్రాయెల్ ప్రతీకార దాడులకు దిగితే తమ ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ క్షిపణులతో బెంబేలెత్తిన ఇజ్రాయెలీలు బాంబు షెల్టర్లలోకి వెళ్లి తలదాచుకున్నారు. దేశమంతటా సైరన్ల మోత మోగింది. టీవీ ఛానళ్లు, మొబైల్ ఫోన్ల ద్వారా కూడా ప్రజల్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఇరాన్ క్షిపణుల్ని కూల్చేయాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ తమ దళాలకు ఆదేశాలు జారీచేశారు. ఇరాన్ దాడులకు ప్రతీకారం తప్పదని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తాము సర్వసన్నద్ధంగా ఉన్నామని, ఇరాన్‌పై విరుచుకుపడతామని ఇజ్రాయెల్ ప్రకటించింది. దీంతో ఈ పోరు విస్తరించి ప్రాంతీయ యుద్ధంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదిలాఉండగా.. ఇజ్రాయెల్‌లోని జఫ్ఫాలో ఇద్దరు సాయుధులు విచక్షణా రహితంగా కాల్పులు జరపగా ఆరుగురు ఇజ్రాయెలీలు చనిపోయారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు.

సరిహద్దు గ్రామాలపై దాడి

'పరిమిత, స్థానిక' ఆపరేషన్ అంటూ హెజ్‌బొల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ గురిపెట్టింది. ముఖ్యంగా తమ సరిహద్దుకు చేరువగా ఉన్న గ్రామాలపై విరుచుకుపడింది. ఉత్తర ఇజ్రాయెల్‌లో స్థానికులకు తక్షణ ముప్పు పొంచిఉన్న దృష్ట్యా ఇలా చేయకతప్పడం లేదని సమర్థించుకుంది. హెజ్‌బొల్లా మాత్రం దాడుల వార్తల్ని తోసిపుచ్చింది. ఆ గ్రూప్ ప్రతినిధి మహమ్మద్ ఆఫిఫ్ మాట్లాడుతూ- ఇజ్రాయెల్ బలగాలు లెబనాన్‌లోకి ప్రవేశించాయనేది అవాస్తవమని చెప్పారు. శత్రువులతో నేరుగా పోరాడేందుకు తమ ఫైటర్స్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇజ్రాయెల్ వైపు మధ్యశ్రేణి క్షిపణులు ప్రయోగించామని, అది ప్రారంభం మాత్రమే అని హెచ్చరించారు. ఇజ్రాయెల్ సైన్యంలో అత్యంత శక్తిమంతమైన దళాల్లో ఒకటైన 'డివిజన్ 98' పారా ట్రూపర్ కమాండోలు సోమవారం రాత్రి దక్షిణ లెబనాన్‌లోకి అడుగు పెట్టారు. పాలస్తీనా శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ గగనతల దాడి జరపడంతో ఆరుగురు చనిపోయారని తెలుస్తోంది. దక్షిణ లెబనాన్‌లో కొన్ని ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లవద్దని ఇజ్రాయెల్ సూచించింది. అవలి నదికి ఉత్తరాన ఉన్నవారంతా ఖాళీ చేసేయాలని హెచ్చరించింది. దీంతో లెబనాన్ లోపలకు ఎంత దూరం మేరకు ఇజ్రాయెల్ తన బలగాలను పంపాలని భావిస్తోందోననే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హెజ్‌బొల్లా నుంచి దాడులు మరింత ముమ్మరం అయ్యే అవకాశం ఉండడంతో ప్రజల కదలికలపై ఇజ్రాయెల్ సైన్యం ఆంక్షలు విధించింది. బీచ్‌లను మూసివేసింది. వేలమంది రిజర్వ్ సైనికులను ఉత్తర సరిహద్దుకు తరలిస్తోంది.



యుద్ధ భయంతో మధ్య ఇజ్రాయెల్‌లో షెల్టర్లలో తలదాచుకుంటున్న ప్రజలు

నిరంకుశ పాలనను అంతం చేస్తాం: నెతన్యాహు

ఇరాన్ పాలకులు, పౌరులను ఉద్దేశిస్తూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వీడియో విడుదల చేశారు. ఆ దేశంలోని నిరంకుశ పాలనను అంతం చేసి ఇరాన్ ప్రజలకు స్వేచ్ఛ కల్పిస్తామని అన్నారు. "ఇరాన్ కీలుబొమ్మలను మేం ఒక్కొక్కటికీ పెకిలించివేస్తున్నాం. మా దేశాన్ని, ప్రజలను రక్షించుకోవడం కోసం ఎంత దూరమైనా వెళ్తాం. త్వరలోనే ఆ నిరంకుశ పాలన నుంచి మీకు విముక్తి కల్పిస్తాం" అని నెతన్యాహు పరోక్షంగా ఇరాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమని హెజ్‌బొల్లా వెల్లడించింది. లెబనాన్ సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరిక చేసింది. ఐరోపా దేశాలు తమ ప్రజలు, దౌత్యవేత్తల్ని లెబనాన్ నుంచి రప్పించే ప్రయత్నాలు ప్రారంభించాయి. ఒక్క బ్రిటన్ దాదాపు 5,000 మందిని ఖాళీ చేయించనుంది.

ప్రత్యక్ష దాడికి దిగితే సహించబోం: ఆస్టిన్

ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి దిగితే తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇరాన్‌ను హెచ్చరించారు. తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని పునరుద్ఘాటించారు. "అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై జరిగిన తరహా దాడులకు తావులేకుండా ఉండేందుకు సరిహద్దు వెంబడి హెజ్‌బొల్లాకు చెందిన నిర్మాణాలను నిర్వీర్యం చేయాల్సిన అవసరాన్ని మేం గుర్తించాం. సరిహద్దుకు ఇరువైపులా ఉన్న ప్రజలు సురక్షితంగా తమ ఇళ్లకు తిరిగివెళ్లాలి. దానికి దౌత్యపరమైన తీర్మానం అవసరం. అమెరికా సిబ్బంది, మిత్రులను రక్షించుకునేందుకు అమెరికా సంసిద్ధంగా ఉంది. ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి పాల్పడితే.. ఇరాన్ తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ఎక్స్ వేదికగా స్పందించారు.

- యెమెన్ హూతీ తిరుగుబాటుదారులుగా భావిస్తున్న వారు ఎర్ర సముద్రంలో నౌకపై దాడి చేశారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మొదలయ్యాక వాణిజ్య నౌకపై దాడి జరగడం ఇదే తొలిసారి.
- ఖతార్, యూఏఈ, తుర్కియే, ఈజిప్ట్ వంటి దేశాలు లెబనాన్‌కు మద్దతు ప్రకటించాయి.



గాంధీజీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆనంద్‌రాజు

కొండంత స్ఫూర్తికి.. మెండైన చిత్రాంజలి!

అన్నమయ్య జిల్లా రామాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆనంద్‌రాజు భారీ వస్త్రంపై గాంధీ చిత్రాన్ని చిత్రీకరించారు. వారం రోజుల పాటు శ్రమించి 36 అడుగుల పొడవు, 29 అడుగుల వెడల్పు ఉన్న వస్త్రంపై వేసిన చిత్రాన్ని మంగళవారం ప్రదర్శించారు. మహాత్ముడి జయంతి సందర్భంగా ఆయన చేసిన ఈ ప్రయత్నాన్ని ప్రిన్సిపల్ వీవీ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

– న్యూస్‌టుడే, రామాపురం

రాజధాని అమరావతికి ₹15,000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచబ్యాంకు, ఏడీబీ వంటి అంతర్జాతీయ రుణవితరణ సంస్థలు ఒక ప్రాజెక్టుకు ఇంత వేగంగా రుణం మంజూరు చేయడం రికార్డు..! ప్రపంచబ్యాంకు లాంటి సంస్థలు నిర్దిష్ట ప్రాజెక్టులకు రుణాలిస్తాయి. ఆ ప్రాజెక్టు వల్ల పర్యావరణం, సమాజంపై ఎలాంటి ప్రభావం పడుతుంది? నిర్వాసితులకు సహాయ, పునరావాస ప్యాకేజీ సంతృప్తికరంగా ఉందా? వంటి అంశాలన్నీ కూలంకషంగా అధ్యయనం చేశాకే రుణం ఇస్తాయి. సంప్రదింపులకే ఏడాది సమయం పడుతుంది. అలాంటిది రాజధాని అమరావతికి రుణం మంజూరు ప్రక్రియను ఆగస్టు 20న ప్రారంభించి... నవంబరు నాటికి కొలిక్కి తెస్తోంది. మూడు నెలల్లోనే అవసరమైన ప్రక్రియలన్నీ పూర్తిచేసుకుని, రుణం మంజూరు చేస్తుండడం విశేషం. 2019కి ముందు రాజధాని నిర్మాణానికి రూ.3,500 కోట్ల రుణం ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు ముందుకొచ్చి, అవసరమైన ప్రక్రియలన్నీ పూర్తిచేసింది. 2019లో వచ్చిన జగన్ ప్రభుత్వం.. రాజధానికి రుణం అవసరం లేదని కేంద్ర ఆర్థికశాఖ ద్వారా ప్రపంచబ్యాంకుకు చెప్పడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

90 శాతం కేంద్రమే భరిస్తుంది

కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్డీయే భాగస్వాములే అధికారంలో ఉండడంతో రాజధానికి గ్రహణం వీడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రూ.15వేల కోట్ల రుణం అందిస్తామని తాజా బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. అక్కడి నుంచి రుణం మంజూరుకు అవసరమైన పరిణామాలన్నీ శరవేగంగా జరిగాయి. రాజధానికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ ఇస్తోంది పేరుకు రుణమే అయినా... అది రాష్ట్రప్రభుత్వానికి భారం కాబోదు. కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులిస్తోంది. ఈ రుణంపై 15 ఏళ్లపాటు మారటోరియం ఉంటుంది. చెల్లించాల్సిన వడ్డీ కూడా 4%లోపే ఉంటుంది. పైగా ఆ రుణంలో కేంద్రప్రభుత్వం 90%, రాష్ట్రప్రభుత్వం 10% చొప్పున భరించనున్నాయి. రాష్ట్రప్రభుత్వం చెల్లించాల్సిన 10% నిధుల్ని కూడా కేంద్రం వేరే నిధుల నుంచి సర్దుబాటు చేస్తుందని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి.

రాష్ట్ర విపత్తు నిధికి రూ. 1,036 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. 14 వరద ప్రభావిత రాష్ట్రాలకు ఎస్డీఆర్ఎఫ్‌లో కేంద్ర వాటాగా రూ.5,858 కోట్లు విడుదల చేస్తున్నట్లు వివరించారు. వరదల కారణంగా సంభవించిన నష్టాలపై కేంద్ర బృందాలు ఇచ్చిన నివేదికలను అధ్యయనం చేశాక నిర్దేశిత విధానాలకు అనుగుణంగా ప్రభావిత రాష్ట్రాలకు ఎన్డీఆర్ఎఫ్ నుంచి అదనపు ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు.

- విపత్తు స్పందన నిధికి 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు ఏపీకి రూ.6,591.20 కోట్లు కేటాయించారు. ఇందులో 2024-25కి కేంద్ర వాటా రూ.1,036 కోట్లు(75%), రాష్ట్రవాటా కింద రూ.344.80 కోట్ల (25%) కేటాయింపులున్నాయి. సాధారణంగా కేంద్రం తన వాటా నిధులను రెండు విడతలుగా ఇస్తుంది. ఇప్పుడు ఒకే విడతలో మొత్తం రూ.1,036 కోట్లను విడుదల చేసింది.

'కల్తీ నెయ్యి'పై సిట్ దర్యాప్తు తాత్కాలిక నిలిపివేత

(మొదటి పేజీ తరువాయి)



మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు. చిత్రంలో తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, తితిదే చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీవీఎస్‌వో) శ్రీధర్

మాట్లాడారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో ఇంతకన్నా ఎక్కువ మాట్లాడటం సరికాదన్నారు. తితిదే అంతర్గత విచారణ తర్వాత ఫిర్యాదు చేయగా, దాని ఆధారంగా కేసు నమోదు చేశామని చెప్పారు. దర్యాప్తులో భాగంగా సిట్ సభ్యులు రెండు రోజుల పాటు పర్యటించి నెయ్యి సేకరణ, నమూనాలు తీసుకునే విధానం, కల్తీ ఎలా జరిగే ఆస్కారం ఉందనే అంశాలు పరిశీలించినట్లు తెలిపారు. పూర్తి సమాచారం తీసుకునేలోగా న్యాయస్థానం ఆదేశాలు రావడంతో దర్యాప్తును నిలిపివేశామన్నారు. ప్రస్తుతానికి ఒక్క రోజుపాటు అంతరాయం ఉంది, మళ్లీ ఉత్తర్వులు వచ్చిన తర్వాత చూస్తామన్నారు. దర్యాప్తు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని, ఏ కేసులోనూ ఎవరినీ ఇరికించాలనే ఉద్దేశం పోలీసులకు ఉండదని స్పష్టం చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ వేరుగా సాగుతోందని ఆయన వెల్లడించారు.

డీజీపీని కలిసిన సిట్

కల్తీ నెయ్యిపై విచారణ జరుపుతున్న సిట్ బృందం మంగళవారం డీజీపీని కలిసింది. సిట్ అధిపతి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తిరుపతి అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటరావులు ఆయన్ను కలిసి దర్యాప్తు గురించి వివరించినట్లు తెలుస్తోంది. కల్తీ నెయ్యి వ్యవహారంపై తూర్పు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణ నుంచి సమాచారం సేకరించడం, తిరుమలలోని ల్యాబ్‌తో పాటు గిడ్డంగిని పరిశీలించి అక్కడి వివరాలు తెలుసుకోవడం తదితర అంశాల గురించి ఆయనకు వివరించినట్లు తెలిసింది.



జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జిల్లా యువజనోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల విద్యార్థులు తమ నృత్యాలతో హోరెత్తించారు.

– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

నేడు మచిలీపట్నానికి సీఎం చంద్రబాబు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం మచిలీపట్నంలో నిర్వహించనున్న స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రానున్నారు. ఏర్పాట్లను మంత్రులు కొల్లు రవీంద్ర, పి.నారాయణలతో పాటు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాస గృహం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.20 గంటలకు మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. ఆ తరువాత ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంతంలో నిర్వహించే స్వచ్ఛతే సేవలో పాల్గొంటారు. 10.45 గంటలకు అక్కడ నుంచి బయలు దేరి కోనేరు సెంటరులో సుందరీకరణ పనులు పరిశీలిస్తారు. తరువాత 11.05 గంటలకు బస్టాండ్ సమీపంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే సభలో పాల్గొని 12.55 గంటల వరకు సభలో పాల్గొన్నవారితో ముఖాముఖీ నిర్వహించడంతోపాటు సందేశం అందిస్తారు. తిరిగి మధ్యాహ్నం 1.05 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి ఆంధ్రజాతీయ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని 1.10 గంటలకు అక్కడ నుంచి బయలుదేరతారు. 1.30 గంటలకు తాడేపల్లిలో నివాస గృహానికి చేరుకుంటారు. మంత్రులు కొల్లు రవీంద్ర, పి.నారాయణలతో పాటు కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావులు ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాపూ స్ఫూర్తి.. ప్రగతి దీప్తి

పల్లెల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి

గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలంటూ గాంధీ మహాత్ముడు ఆకాంక్షించారు. కానీ గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల ప్రగతిని పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో ఐదేళ్లూ అన్ని పంచాయతీలు నిధులు లేక తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. అలాంటి సంక్షోభం నుంచి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చొరవతో ప్రగతి దిశగా అడుగులు పడుతున్నాయి. నేడు గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

దేశం అభివృద్ధి చెందడం అంటే.. అద్దాల మేడలు రంగుల గోడలు కాదు.. పల్లెసీమలూ ప్రగతి బాట పట్టాలి.. – గాంధీజీ

ప్రకృతి సిద్ధమైన రంగులు, ఆకులు, పువ్వులతో రూపుదిద్దుకునే పెడన కలంకారీ ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో మంచి ఆదరణ ఉంది. సందర్శకులతో పెడన వీధులు కళకళలాడుతున్నాయి. దాదాపు 5వేల మంది కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. పెడనతో పాటు కప్పలదొడ్డి, పోలవరం గ్రామాల్లోనూ కలంకారీ విస్తరించింది. బాపూ కోరుకున్నట్లు గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తోంది. తద్వారా గ్రామీణ ఉపాధిని కలంకారీ పెంపొందిస్తోంది. బెడ్ షీట్లు, డ్రెస్ మెటీరియల్స్, ఫర్నిషింగ్‌లు, కుర్తీలు, చందేరీ, మహేశ్వరీ, కాటన్, సిల్క్ చీరలు, చున్నీలు రూపుదిద్దుకుంటున్నాయి. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ విద్యార్థులు పెడన వచ్చి డిజైన్లను మరింత ఆకర్షణీయంగా రూపుదిద్దడంలో ఇక్కడి కళాకారులకు తర్ఫీదునిస్తున్నారు. కూటమి ప్రభుత్వ వచ్చాక కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పెడన



కలంకారీ హస్తకళ

100 రోజుల్లో పల్లెకు నిధులు

పంచాయతీలకు కేటాయించే ఆర్థిక సంఘ నిధులను గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘ నిధులు విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో 281 పంచాయతీలకు టైడ్ నిధులు రూ.11.09 కోట్లు, అన్‌టైడ్ రూ.7.39కోట్ల చొప్పున మొత్తం రూ.18.48 కోట్లు విడుదల అయ్యాయి. ఆయా గ్రామాల్లో వసతులు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామాల్లోని సంపద కేంద్రాలను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

రూ.110 కోట్ల ఉపాధి నిధులతో పనులు

ఉపాధి హామీ నిధులను గత వైకాపా ప్రభుత్వం మళ్లించడంతో గ్రామాల్లో అంతర్గత రహదారులు, శ్మశాన వాటికలు, డ్రెయిన్లు అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి మండలానికి రూ.3 కోట్ల వరకు కేటాయించారు. ఇప్పటికే రూ.110 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, శ్మశానవాటికలు, సీసీడ్రైన్ల పనులు చేపడుతున్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన


★ జిల్లాలోని 25,323 స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు బ్యాంకు రుణాలతో స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతుంటారు. వైకాపా ప్రభుత్వం వీటి నిర్వీర్యం చేసింది. గత ప్రభుత్వంలో సంఘాలు రూ.20 లక్షల వరకు రుణం తీసుకున్నా రూ.3లక్షలకు మాత్రమే వడ్డీ రాయితీ వర్తింపచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.10లక్షల వరకు వడ్డీ రాయితీ అందించాలని నిర్ణయించడంతో మహిళలు స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు.

మహిళా అక్షరాస్యతలో వ్యత్యాసం

ఉమ్మడి జిల్లాలో 2011 లెక్కల ప్రకారం సగటు అక్షరాస్యత **73.74%**

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు: **63.56%**

★ గాంధీజీ ఆకాంక్షలకు అనుగుణంగా మహిళలు నూరుశాతం అక్షరాస్యత దిశగా అందరూ అడుగులు వేయాల్సి ఉంది.



3,249 రోజులుగా స్వచ్ఛ ఉద్యమం

చల్లపల్లి, న్యూస్‌టుడే

స్వచ్ఛ భారతావనిని నేనెంతో ప్రేమిస్తానన్న మహాత్ముని మాటలను అక్షరాలా అమలు చేసి చూపుతోంది చల్లపల్లి ఉద్యమం. ఇందుకు త్రికరణశుద్ధిగా స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు అంకితమయ్యారు. 3249 రోజులుగా గ్రామంలోని మురుగు కల్మషాలను, చెత్త గుట్టలను శుభ్రం చేస్తూ కర్మ వీరులు విశ్రమించక ముందుకు సాగుతున్నారు. ఇందుకు ముందుండి నడిపిస్తున్నది స్వచ్ఛ యోధుడు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్. వ్యక్తులకే కాకుండా సమాజానికి చికిత్స ప్రారంభించారు ఆయన. ఆయన వెంట డాక్టర్ టి.పద్మావతి, పలువురు కార్యకర్తలు భుజం భుజం కలిపి అడుగులు వేస్తున్నారు. మరెన్నో గ్రామాలు, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

2014 నవంబరు 12న డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ చీపురు పట్టుకుని శుభ్రం చేసుకుంటూ ముందుకు వెళుతుంటే ఆయన వెంట మరో 14 మంది నడిచారు.

స్ఫూర్తి పాఠాలెన్నో..

★ తెల్లవారుజామునే లేచి ఉదయం 4.30 గంటల నుంచే తలపై దీపాలు ధరించి...చీపుర్లు, పారలు, కత్తులు, గొర్రులు, పిచ్చి మొక్కల తొలగింపు యంత్రాలతో చెత్త, వ్యర్థాలపై యుద్ధమే చేస్తారు. ట్రాక్టర్ల కొద్దీ సేకరించిన వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. దాదాపు గత పదేళ్లుగా ఇదే కర్తవ్యాన్ని మనసా, వాచా, కర్మణా కార్యకర్తలు పాటిస్తున్నారు. ప్రస్తుతం చల్లపల్లి రహదారుల రూపురేఖలు మారిపోయాయి. ★ ప్రతి రహదారి వెంట మొక్కలను నాటి ఉద్యానవనాలుగా తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు 30 వేల మొక్కలకు పైగా నాటి సంరక్షిస్తున్నారు.



స్వచ్ఛ సేవతో అద్దంలా పల్లె దారి

యువతకు మార్గదర్శనం



గాంధీజీ జీవితానికి సంబంధించిన ఫొటోలు

పటమట, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ గురించి నేటి తరానికి తెలియజేసేందుకు విజయవాడ నాస్తిక కేంద్రం ఆవరణలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో గాంధీ నేషనల్ మ్యూజియం నుంచి ఫొటోలు సేకరించి 'బాపు దర్శన్' పేరుతో 2019లో ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. మహాత్ముడి బాల్యం, విద్యాభ్యాసం, విదేశీ విద్య, స్వాతంత్ర్యం పోరాటం తదితర అంశాలు తెలియజేసేలా ఫొటోలు ఉన్నాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు.

మహాత్ముని బాటలోనే..



సేవాగ్రామ్ ఆశ్రమంలో మహాత్ముడితో మా కుటుంబ సభ్యులంతా రెండేళ్లు ఉన్నాం. ఆయన బాటలోనే నేటికీ నడుస్తున్నాం. నేటి తరం ఆయన గురించి తెలుసుకోవాలనే బాపు దర్శన్ ఏర్పాటు చేశాం.

- జి.రష్మి, బాపు దర్శన్ కార్యదర్శి

నేటి తరానికి ఆదర్శం



గాంధీజీ.. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించిన మహనీయుడు. ఆయన జీవితం ప్రపంచానికే మార్గదర్శనం. నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలనే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

- జి.సమరం, బాపు దర్శన్ ఛైర్మన్

అమ్మ పండగ.. అదిరిపోయేలా!

వెలిగిపోతున్న ఇంద్రకీలాద్రి ✪ తుది దశకు చేరిన దసరా ఏర్పాట్లు



ఘాట్‌రోడ్డులో..



ఈనాడు డిజిటల్, అమరావతి, – న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు దుర్గగుడి వద్ద అన్ని ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అమ్మవారి పండగను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఉత్సవాల నిర్వహణ విషయంలో గతేడాది లోపాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే ఈ ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే క్యూలైన్లు, స్నానఘాట్‌లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ప్రకాశం బ్యారేజీలో నీరు అధికంగా ఉండడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దుర్గా, పద్మావతి ఘాట్‌ల వద్ద, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తుల కోసం పున్నమి ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు 700 షవర్లు ఏర్పాటు చేశారు.



విద్యుత్తు కాంతుల్లో ఆలయ పరిసరాలు



క్యూలైన్లు సిద్ధం

ప్రసాదం కౌంటర్ మార్పు..

అమ్మవారిని దర్శించుకుని శివాలయం మెట్ల మార్గంలో బయటకు వచ్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కిందకు దిగిన తర్వాత శివాలయం మెట్ల సమీపంలో అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లికార్జున మహామండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్రసాదాల విక్రయాలను కనకదుర్గానగర్‌కు మంగళవారం మార్చారు. రెండు రోజులు ముందుగానే భక్తులకు కనకదుర్గానగర్‌లోని కౌంటర్లలో లడ్డు, చక్రపొంగలి, పులిహోర ప్రసాదాలను విక్రయిస్తున్నారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయ మెట్లు మీదుగా మల్లికార్జున మహామండపానికి వచ్చిన వారు ప్రత్యేక క్యూలైన్‌లో అన్నప్రసాదం స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. బఫే విధానంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ★ సాంస్కృతిక కార్యక్రమాల వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంలో తీవ్ర ఆలస్యమైంది. సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యే కళాకారులకు నేటి వరకు సమాచారం పంపలేదు. వేదికను కనకదుర్గానగర్ ఎంట్రెన్స్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించి యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించారు. దీంతో నవరాత్రుల్లో కళాకారుల ప్రదర్శనలకు మార్గం సుగమం అయ్యింది. దరఖాస్తులు 450 రాగా వాటిల్లో 300 వరకు ప్రదర్శనకు అవకాశం ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పూర్తయిన క్యూలైన్ల పనులు..

కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి ఘాట్ రోడ్డు మీదుగా రెండు కి.మీల మేర నడుచుకుంటూ వెళ్లి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. గతేడాది ఉత్సవాలు ప్రారంభమయ్యే వరకు క్యూలైన్లు, కేశఖండనశాల పనులు జరిగాయి. ఈసారి అధికారులు అప్రమత్తమై రెండు రోజులు ముందుగానే పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఘాట్ రోడ్డులోని మొదటి మలుపు వద్ద రక్షణ గోడ పనులు తుది దశకు చేరుకున్నాయి. కొంతమేర క్యూలైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రద్దీకి తగ్గట్లుగా క్యూలైన్ల సమీపంలోనే లగేజీ, పాదరక్షలు భద్రపర్చుకునేందుకు క్లాక్ రూములు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నిచోట్లా అప్రమత్తం చేస్తూ..

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను ఎక్కడికక్కడ అప్రమత్తం చేసేందుకు ప్రతిచోటా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. భక్తులు క్యూలైన్‌లో ఉన్నప్పుడు తోపులాటకు గురిచేసి విలువైన వస్తువులను అపహరించే ప్రయత్నం చేసే దొంగలున్నారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక బోర్డులు అన్నిచోట్లా ఏర్పాటు చేశారు. ప్రసాదాల కౌంటర్లు.. అన్నదాన మార్గం చూపే బోర్డులు అన్ని చోట్లా సిద్ధం చేశారు. భక్తులు ఈ సూచికలను చూసుకుంటూ ఆయా కౌంటర్ల దగ్గరకు ఎవరినీ అడిగే అవసరం లేకుండా వెళ్లవచ్చు. ★ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు, స్నానఘాట్‌లు, కేశఖండనశాల ఇలా ప్రతిచోటా తాగునీటి ట్యాంకులు పెట్టారు. కేశఖండనశాల, ఘాట్‌రోడ్లలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాట్లు చేశారు.

113 మద్యం దుకాణాలకు గెజిట్ విడుదల

✪ ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

✪ షాపులకు గరిష్ఠంగా రూ.85లక్షల శ్లాబ్ నిర్ధరణ



ఈనాడు, అమరావతి: నూతన మద్యం పాలసీలో భాగంగా దుకాణాలను ప్రభుత్వం ప్రైవేటుకు వ్యక్తులకు అప్పగిస్తోంది. వైకాపా హయాంలో తీసుకొచ్చిన ప్రభుత్వ దుకాణాలు రద్దు కానున్నాయి. ఈ నెల 12 నుంచి ప్రైవేటు షాపులు రానున్నాయి. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ జిల్లా మద్య నిషేధ, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం గెజిట్ విడుదల చేశారు. రెండేళ్ల కాలపరిమితితో 2026 సెప్టెంబరు 30 వరకు ఇది అమలులో ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 113 షాపులను నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో విధివిధానాలను పొందుపరిచారు. ఇవికాకుండా అదనంగా మరికొన్ని షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించనున్నారు. వీటికి సంబంధించిన నోటిఫికేషన్ తర్వాత జారీ చేయనున్నారు. ఒక్కో వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చు. ప్రతి దరఖాస్తుకు విధిగా రూ.2లక్షల రుసుము చెల్లించాలి. ఈ మొత్తాన్ని వెనక్కి ఇవ్వరు. షాపు కేటాయించిన రోజే మొదటి విడత రిటైల్ ఎక్సైజ్ పన్ను చెల్లించాల్సి ఉంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల్లో ఏదో ఒక విధానంలో షాపుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మద్యం దుకాణాల నుంచి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిటైల్ ఎక్సైజ్ పన్నును నాలుగు శ్లాబుల్లో నిర్ణయించారు. రెండో ఏడాది 10 శాతం మేర పన్ను పెంపు ఉంటుంది.

విజయవాడ నగరంలో అత్యధికంగా 39 షాపులు

గెజిట్‌లో ప్రకటించిన 113 షాపుల్లో అత్యధికంగా విజయవాడ నగరపాలిక పరిధిలో నోటిఫై చేశారు. ఆయా నగరపాలికలు, పురపాలికలు, మండలాల్లోని జనాభా ఆధారంగా దుకాణాల సంఖ్యను నిర్ణయించారు. నగరంలో 39 దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. వీటికి ఏడాదికి రూ.85లక్షల మేర రుసుము చెల్లించాల్సి ఉంది. ఆ తర్వాత విజయవాడ గ్రామీణ మండలంలో 10 చొప్పున కేటాయించారు.

గతంలో జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లోనే దరఖాస్తులను స్వీకరించారు. ఈసారి ఆఫ్‌లైన్‌లో జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను తీసుకుంటున్నారు. నగరంలో ఉన్న విజయవాడ, ఈస్ట్, వెస్ట్ స్టేషన్లతో పాటు గ్రామీణంలో మైలవరం, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరులోని ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు సమర్పించవచ్చు.

11న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వేలం

గెజిట్ విడుదల కావడంతో మంగళవారం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు నిర్దేశించారు. 11న నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 8గంటల నుంచి ఆయా దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. 12వ తేదీ నుంచి దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

బాపు ప్రదర్శన టెండర్లలో కక్కుర్తి!

గుట్టుచప్పుడు కాకుండా అప్పగింత

రూ.3.36 లక్షల నష్టం

ఈనాడు, అమరావతి

గత ఆగస్టు నెల.. వర్షాకాలం.. వ్యాపారాలు అంతంతమాత్రం.. అయినా నెల రోజులకు ఆ ప్రాంగణాన్ని రూ.8.26లక్షలకు పాడుకున్నారు. మరో రూ.లక్ష చెల్లించి అదనంగా మరికొన్ని రోజులు పొడిగించారు. ప్రస్తుతం పండగల సీజన్.. ముఖ్యంగా వస్త్రవ్యాపారం పుంజుకునే రోజులు.. ఆదాయం ఎంత ఉండాలి..? కనీసం పది శాతం అయినా పెరగాలి కదా? కానీ అదే ప్రాంగణానికి నెలకు రూ.4.90లక్షలే దక్కించుకున్నారు. అంటే దాదాపు రూ.3.36 లక్షల నష్టం.

– బాపు ప్రదర్శనశాల ప్రాంగణం చేనేత వస్త్ర ప్రదర్శన దుకాణాలకు ఇచ్చిన తీరు ఇది.



పోటీ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా ఒక వ్యక్తికి అతితక్కువకు కట్టబెట్టిన వైనం వెలుగుచూసింది. దీన్ని మిగిలిన చేనేత సంఘాలు గుర్తించి ఉన్నాయి. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి జరిగిందాన్ని టెండర్ పిలవాలని డిమాండ్ చేస్తున్నారు.

విజయవాడ బందరు రోడ్డులో ఉన్న బాపు మ్యూజియానికి దశాబ్దాల చరిత్ర ఉంది. గతంలో విక్టోరియా జూబ్లీ మ్యూజియంగా ఉండేది. దాదాపు 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవనం ఉంది. 1921లో పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని ఇక్కడే మహాత్మాగాంధీ ఆవిష్కరించారు. 1962లో దీన్ని ఆర్కియాలజీ శాఖ స్వాధీనం చేసుకుంది. నాడు దీనిని బాపు మ్యూజియంగా మార్చారు. ఇందులో అమూల్యమైన వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనశాలలో పర్యాటకుల సందర్శనకు ప్రవేశ రుసుము పెద్దలకు రూ.5, పిల్లలకు రూ.2 ఉంచారు. 2019కు ముందు ప్రభుత్వం కొన్ని నిధులు నిర్వహణ కోసం మంజూరు చేసేది. నాటి ప్రభుత్వంలో బాపు మ్యూజియం ఆధునికీకరణకు రూ.8కోట్లు నిధులు అందించింది. ఈ నిధులతో ప్రత్యేక లైటింగ్ వ్యవస్థను పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేశారు.

చేనేత ప్రదర్శనలు..!

నిర్వహణ ఖర్చుల కోసం అని మ్యూజియం ప్రాంగణంలో చేనేత వస్త్ర ప్రదర్శనలకు అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు. సహకార రంగంలో పనిచేస్తున్న చేనేత సంఘాలు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసుకుంటున్నాయి. మొత్తం మీద 90 రోజులు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి పోటీ ఏర్పడడంతో టెండర్ల ద్వారా అప్పగించేవారు. ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారికి ఇస్తున్నారు. విద్యుత్తు కోసం అదనంగా యూనిట్‌కు రూ.8 చొప్పున చెల్లిస్తున్నారు. గత ఆగస్టు నెలలో ఒక సంస్థ దీన్ని నెల రోజులకు రూ.8.26 లక్షలకు దక్కించుకుంది. విజయవాడకు వరదలు రావడంతో పెద్దగా గిరాకీ లేకుండా పోయింది. వారి గడువు ముగిసింది.

ఎవరికీ తెలియనీయకుండా..

దసరా సీజన్‌లో అద్దెకు ఇవ్వడంపై మళ్లీ టెండర్ పిలిచారు. మ్యూజియం సిబ్బంది కోసం కక్కుర్తి పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ సమాచారం ఎవరికీ తెలియనీయలేదు. గుట్టుచప్పుడు కాకుండా సెప్టెంబరు 25న జారీ చేశారు. 26 నుంచి 29 వరకు టెండర్ల విక్రయం చేశారు. 30న సీల్డు టెండర్లను తెరిచారు. ఒకే ఒక్క టెండర్ పడింది. వారికి రూ.4.90లక్షలకే కట్టబెట్టారు. ఒక్క టెండర్ రావడం అనుమానాలకు తావిస్తోందని చెబుతున్నారు. గతంలో అధిక ధరలకు టెండర్ దక్కించుకుని ప్రదర్శనలు ఏర్పాటు చేసి నష్టపోయిన నిర్వాహకులు కనీసం సమాచారం ఇవ్వలేదు. ఐదారు సంస్థలు పాల్గొనేవి. అంతా వ్యూహం ప్రకారం నడిపించారు. వీటిని రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ వస్తోంది.

★ దీనిపై బాపు మ్యూజియం ఉప సంచాలకుడు రామసుబ్బారెడ్డిని వివరణ కోరగా తక్కువ ధర వచ్చిన విషయం వాస్తవమే అయినా.. తాము బహిరంగంగానే టెండర్ పిలిచామని చెప్పారు. రెండు టెండర్లు దాఖలయ్యాయని, ఇద్దరు మహిళలు పాల్గొన్నారని ఒకరికి ఇవ్వడంపై వివరించారు. తాము నోటీసు బోర్డులో పెట్టామని, ఎవరికీ ఫోన్లు చేసి చెప్పలేదంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

మచ్చా.. డ్యాన్స్ రచ్చ రచ్చ..!

ఉత్సాహంగా యువజనోత్సవాలు



యువతుల అభినయం



కేరింతలు కొడుతూ..



అమ్మవారి వేషధారణలో..





జానపద పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జిల్లా యువజనోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల విద్యార్థులు వివిధ రకాల నృత్యాలతో హోరెత్తించారు. వ్యక్తిగత, బృందాలుగా అభినయిస్తూ.. ఆహూతులను అలరించారు. పోటాపోటీగా ప్రదర్శనిచ్చి భళా అనిపించారు. కథలు రాయడం, పెయింటింగ్, వక్తృత్వం, హస్తకళలు తదితర పోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువతే కీలకం

విద్య, కళలు, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రతిభ చూపుతూ యువత దేశాభివృద్ధిలో భాగస్వాములై కీలక పాత్ర పోషించాలని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో, యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పూర్వ కాలం నుంచి వస్తున్న కళలపై ఆసక్తి చూపాలని లక్ష్యంతో ఏటా యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నెహ్రూ యువకేంద్రం సమన్వయకర్త రామ మాట్లాడుతూ... పోటీల ద్వారా దాగివున్న ప్రతిభను వెలికి తీస్తారని, ప్రతి విద్యార్థి తమకున్న కళల్లో రాణించాలని కోరారు. జాతీయ సేవా పథకం జిల్లా సమన్వయకర్త కె.రమేష్, వీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి, న్యూస్‌టుడే : కేఎల్ విశ్వవిద్యాలయం విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష -2025 పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రొఛాన్స్‌లర్ డాక్టర్ జగన్నాథరావు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ప్రవేశ పరీక్ష, విద్యావిధానం, మెరిట్ విద్యార్థులకు ఇచ్చే రాయితీలు, స్కాలర్‌షిప్, ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలను వివరించారు. మూడు విడతల్లో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా పరీక్షలు ఉంటాయని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడత డిసెంబర్ 6 నుంచి 13 వరకు నిర్వహిస్తామని చెప్పారు.



ప్రవేశ పరీక్ష పోస్టర్ విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో వీసీ పార్థసారథి వర్మ, ప్రొఛాన్స్‌లర్ జగన్నాథరావు తదితరులు

మున్సిపల్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట పురపాలక సంఘంలో గుర్తించిన పలు అవకతవలకు సంబంధించి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఉన్నతాధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ధనంబోడులో చేపట్టిన పనులపై ఫిర్యాదులు రావడంతో నిర్వహించిన పరిశీలనా నివేదికను అనుసరించి ఏఈ హనుమంతరావు, డీఈఈ శివకోటేశ్వరరావు, ఈఈ డి.భూషణంలపై చర్యలకు సిఫార్సు చేశారు. దీంతో పాటు వీరిపై మరింత సమగ్రమైన విచారణకు కూడా ఆదేశించారు.

ముంపు సమస్య పరిష్కారానికి కృషి

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఇటీవల వరద ముంపుతో విజయవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన నేపథ్యంలో... రానున్న రోజుల్లో విపత్కర పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టరేట్‌లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, వీఎంసీ కమిషనర్ ధ్యాన్‌చంద్ర, ఆర్డీవో కె.చైతన్య, దక్షిణ మధ్య రైల్వే, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో రైల్వే, ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, ఎస్టేట్ తదితర అంశాలపై మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై కమిషనర్ ధ్యానచంద్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. డ్రెయిన్లలో పూడికతీత, పారిశుద్ధ్య పనులు, మ్యాన్‌హోళ్ల వద్ద చెత్త తొలగింపు, సుందరీకరణ, ఆర్‌యూబీల మంజూరు, నిర్మాణం, ఆక్రమణలు తదితర అంశాలపై చర్చించారు. వీఎంసీ, రైల్వే, జిల్లా అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎంపీ అన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించి పనులు త్వరితగతిన చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశం అనంతరం ఎంపీ మాట్లాడుతూ... నాలుగు ప్రధాన డ్రెయిన్లపై దృష్టి సారించామని, విజయవాడ అర్బన్ పరిధిలో ఈ నెల 3, 4 తేదీల్లో, రూరల్ పరిధిలో ఈనెల 7, 8 తేదీల్లో సంబంధిత శాఖల అధికారులంతా కలిసి డ్రెయిన్ల స్థితిగతులు పరిశీస్తారని, తరువాత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైలవరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాయనపాడు, కొండపల్లి, ఈలప్రోలు తదితర ప్రాంతాల్లో ఆర్‌వోబీల అవసరాన్ని సమావేశం ముందుంచినట్లు చెప్పారు.



సమావేశంలో ఎంపీ శివనాథ్, కలెక్టర్ సృజన, కమిషనర్ ధ్యాన్‌చంద్ర తదితరులు

ఆటోలకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాల్సిందే



లెనిన్‌కూడలిలో ధర్నా చేస్తున్న కార్మికులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో మునిగిన ఆటోలకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం లెనిన్‌కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ.. బుడమేరు వరదతో నగరం విలవిలలాడిందని గుర్తు చేశారు. పది రోజుల పాటు వాహనాలన్నీ మునిగిపోయాయని చెప్పారు. నగరంలో 4వేల ఆటోలు పాడైపోయి కార్మికుల జీవితాలు అస్తవ్యస్తం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు పరిహారం సరిపోదని పేర్కొన్నారు. కార్మికులు రూ.40వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోయారు. వరద ముప్పును జాతీయవిపత్తుగా పరిగణించేందుకు మోదీ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని దుయ్యబట్టారు. కనీసం ఒక్క రూపాయి సహాయం ప్రకటించకపోవటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గూడేల జనార్దన్, నగర కార్యదర్శి కొట్టు రమణారావు, నాయకులు కె.వి.భాస్కరరావు, సంగుల పేరయ్య, మన్నెం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపండి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం ధర్నా చౌక్‌లో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉక్కు పరిశ్రమను సెయిల్‌కు అప్పజెప్పడం ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్రంపై ఒత్తిడి చేసి, ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ లాభాల బాటలో ఉన్న కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ పాటించడంతో పాటు ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఇప్పుడు మాట్లాడకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాము, రామన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూషణం, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు లంకా గోవిందరాజులు, డి.వి.కృష్ణ, దోనెపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, డి.అంజిరెడ్డి, ఉమామహేశ్వరరావు, కేశవరావు, కంచర్ల భార్గవ్, గోపీనాయక్, వెంకటేశ్వరరావు, కార్తిక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న రవీంద్రనాథ్

తల్లి మృతదేహం లభ్యం

పటమట, న్యూస్‌టుడే: విజయవాడ స్క్యూబ్రిడ్జ్ సమీపంలోని బందరు కాలువలో ఆదివారం దూకిన వివాహిత తిరుపతి సుధారాణి మృతి చెందారు. ఆమె మృతదేహం మంగళవారం యనమలకుదురు లాకుల వద్ద దొరికింది. ఆమె కుమార్తె జాస్వి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మూడు రోజులుగా గాలిస్తున్నారు. సుధారాణి భర్త తిరుమలరావు మరో మహిళతో సన్నిహితంగా ఉండటమే దంపతుల మధ్య వివాదానికి కారణమైనట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆదివారం తల్లి తన ఇద్దరు కూతుళ్లతో బందరు కాలువలో దూకిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో చిన్న కుమార్తె బ్లేసి మృతి చెందింది. ఆమె మృతదేహం ఆదివారమే లభ్యమైంది. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తాజాగా తల్లి మృతదేహం దొరికింది. మరో చిన్నారి ఆచూకీ తెలియాల్సి ఉంది.

65,463 మిర్చి బస్తాల విక్రయం

గుంటూరు, (మిర్చియార్డు): మిర్చియార్డుకు రైతులు మంగళవారం 63,626 బస్తాలు తరలించారు. గత నిల్వలతో కలిపి 65,463 బస్తాల అమ్మకాలు జరిగాయి. మిర్చి సీజన్ ముగిశాక అన్‌సీజన్‌లో అధికంగా సరకు విక్రయం జరగడం ఇదే ప్రథమం. క్రయవిక్రయాలు ముగిసే సమయానికి యార్డులో 25,489 బస్తాలు నిల్వ ఉన్నాయి. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-16,800, నాన్ ఏసీ స్పెషల్ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-18,700, తాలు మిర్చికి రూ.5,000-12,000 ధర లభించింది.

ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు

వీరులపాడు, న్యూస్‌టుడే : తమ కుమారుడికి, తమకు.. ఇద్దరి నుంచి ప్రాణహాని ఉందని, వారిపై చర్యలు తీసుకోవాలని వీరులపాడుకు చెందిన సుంకర జ్యోతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జి.అనిల్, బాధితుడి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సుంకర జ్యోతి దంపతుల చిన్న కుమారుడు నాగ శేషు తెదేపా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. ఐటీడీపీలో పని చేస్తున్నారు. గ్రామంలో మంగళవారం పంపిణీ చేసిన పింఛన్ల ఫొటోలను స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. వాటిని చూసిన అదే గ్రామానికి చెందిన పెరుమాళ్లపల్లి రవి కుమార్, పెరుమాళ్లపల్లి సురేష్ (పరిశుద్ధ)... నాగశేషుకు ఫోన్ చేశారు. 'గ్రూపుల్లో ఏంటి నీ హడావుడి. అంత గొప్పవాడివా, ఎక్కువ చెయ్యకు' అంటూ బెదిరించారు. 'అది నా ఇష్టం. గ్రూపు అడ్మిన్‌లకు ఇబ్బందైతే వాళ్లే నన్ను గ్రూపు నుంచి తీసేస్తారు. మీకెందుకు' అని నాగశేషు బదులిచ్చారు. అంతటితో ఆ ఇద్దరు ఆగకుండా.. నాగశేషు తల్లిదండ్రులు ఇంట్లో ఉండగా, కర్రలతో వెళ్లి 'మీ అబ్బాయి ఎక్కడ?, వాడి అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. తనను బెదిరించిన వ్యక్తులు వైకాపా వర్గీయులుగా నాగశేషు తెలిపారు. ఈ మేరకు నాగశేషు తల్లి జ్యోతి ఆ ఇద్దరి నుంచి తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 585 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ఇసుక క్వారీలు తెరిపించాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఇసుక క్వారీలను వెంటనే తెరిపించి, అందరికీ అందుబాటులో ఉంచాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ కోరారు. మంగళవారం గాంధీనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మంది కార్మికులు ఈ రంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం అమ్మిన ధర కంటే.. ఇప్పుడు అదనంగా రూ.రెండు వేలు పెరిగిందన్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. దాని ఊసెత్తకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా జిల్లాల్లో ఇసుక రీచ్‌లు తెరవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి.రమణ, నాయకులు షేక్ మీరావలి, షేక్ బాజి, కనకారావు, సుబ్బారావు, కాశీ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో రామకృష్ణ, రమణ, మీరావలి తదితరులు

హోం, రక్షణ శాఖల పార్లమెంటరీ కమిటీల్లో చోటు

కృష్ణలంక, న్యూస్‌టుడే: పార్లమెంటరీ స్థాయీ సంఘాలను పునర్ వ్యవస్థీకరిస్తూ 24 కొత్త కమిటీలను ఏర్పాటు చేసినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ పి.సి మోడీ ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయవాడ లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ హోం శాఖ, రక్షణ శాఖ కమిటీల్లో సభ్యుడిగా నియమితులైనట్లు గెజిట్ ద్వారా తెలియజేశారు.

30లోగా ఏపీ జీఎన్ఏ ఎన్నికల ప్రక్రియ పూర్తి

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ (ఏపీ జీఎన్ఏ) ఎన్నికల ప్రక్రియ ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ జీఎన్ఏ ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కోఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న తనకు ఏపీ జీఎన్ఏ ఎన్నికల నిర్వహణ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ కమిషనర్ నుంచి తాజాగా మార్గదర్శకాలు అందినట్లు తెలిపారు. అసోసియేషన్ బైలాస్, ఏపీసీఎస్(ఆర్‌వోఎస్ఏ) నిబంధనలు-2001 ప్రకారం ఉమ్మడి కృష్ణా జిల్లా ఓటర్ల జాబితాతో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం



కట్టుబడిపాలెంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు



గొల్లపూడి: పింఛనుదారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని

పేదల సంక్షేమమే ధ్యేయం

న్యూస్‌టుడే బృందం : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కట్టుబడిపాలెంలో స్థానిక నాయకులతో కలిసి పింఛను పంపిణీలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం సీఎం చంద్రబాబుకే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక సుగాలీకాలనీలో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.



తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి ఆధ్వర్యంలో..



పశుదాణా పంపిణీ

వరద ముంపునకు గురైన ఈలప్రోలు పాడిరైతులకు తానా ఆధ్వర్యంలో మంగళవారం పశుదాణా అందించారు..

- న్యూస్‌టుడే, ఈలప్రోలు(కొండపల్లి)

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? గొల్లపూడిలోని పలు వీధుల్లోని రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది.

- అశోక్, స్థానికుడు

✔ రహదారులను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

- స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, గొల్లపూడి

స్పందనకు వందనం

- తిరువూరు 12, 14వ వార్డు కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి మురుగు ప్రవహించడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీశ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. కార్మికులతో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయించారు.
- తిరువూరు 16వ వార్డు తంగెళ్లబీడులో రహదారికి ఒక వైపు నుంచి మరోవైపునకు నీరు ప్రవహించడానికి వీల్లేకుండా ఉందని కాలనీవాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు చేసిన ఫిర్యాదుపై ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీశ్ చర్యలు చేపట్టారు. సిమెంట్ తూరలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు.

- న్యూస్‌టుడే, తిరువూరు

గ్రామాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం విద్యుత్తు సెక్షన్ కార్యాలయానికి చెందిన మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, మండల పరిషత్తు పాఠశాలలు, గ్రామ సచివాలయాలకు తొలిసారిగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. మండల పరిధిలో మొత్తం 170 మీటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్తుశాఖ అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకన్న తెలిపారు. మొదటి దశలో సింగిల్ ఫేసు సర్వీసులున్న కార్యాలయాల్లో మార్చామన్నారు. రెండో దశలో త్రీ ఫేసు మీటర్లు మారుస్తామన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వీటి పనితీరును ఆయన వివరిస్తూ ఈ మీటర్‌కు ముందుగానే రీఛార్జి చేసుకోవాలని ఈ మేరకు కార్యాలయాధికారులు ముందస్తుగా విద్యుత్తు ఛార్జీలకు సంబంధించిన బడ్జెట్‌ను మంజూరు చేయించుకోవాలని సూచించారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండండి

తిరువూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టిసారించి ఉన్నతికి చేరుకోవాలని జేఎఫ్‌సీఎం కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. మోతీలాల్ సూచించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు స్థానిక బీసీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వసతిగృహంలోని వసతులు, విద్యార్థులకు అందించడానికి సిద్ధం చేసిన అల్పాహారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖీ సమావేశంలో మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



అల్పాహారం పరిశీలిస్తున్న న్యాయమూర్తి మోతీలాల్

కార్మికుల సేవలు మరువలేం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కొవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో, ఇటీవల సంభవించిన వరద సమయంలో పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు మరువలేనివని తెదేపా విజయవాడ పార్లమెంట్ మహిళా కార్యదర్శి అంకెం ఇందిరాప్రియదర్శిని కొనియాడారు. స్థానిక సచివాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యదర్శి వై.బసవలింగేశ్వరరావు, సర్పంచి మండల అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు

క్లాప్ మిత్ర సిబ్బందికి సన్మానం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా క్లాప్ మిత్ర సిబ్బందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచి కవిత, కార్యదర్శి మునేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో రెడ్డిగూడెం ఈవోపీఆర్డీ బొమ్మసాని శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో మండలంలో పనిచేస్తున్న 22 మంది గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు అందజేసి సన్మానించారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరెడ్డి, ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

10 మద్యం దుకాణాల కేటాయింపు

మైలవరం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ మైలవరం సర్కిల్ పరిధిలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాలకు సంబంధించి మొత్తం 10 మద్యం దుకాణాలను కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. మైలవరం, జి.కొండూరు మండలాలకు 4 చొప్పున, రెడ్డిగూడెం మండలానికి 2 దుకాణాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. 2011 జనాభా ప్రాతిపదికన మైలవరం, జి.కొండూరు మండలాల్లో ఒక్కో దుకాణానికి వార్షిక ఫీజు రూ.65 లక్షల చొప్పున, రెడ్డిగూడెం మండలంలో ఒక్కో దుకాణానికి రూ.రూ.55లక్షల ఫీజుగా ప్రభుత్వం ఖరారు చేసినట్లు వివరించారు. మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఈ నెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్ లేదా తమ కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. 11వ తేదీన ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో లాటరీ నిర్వహిస్తారని వివరించారు.

మేటేసిన ఇసుక.. కన్నీళ్లే ఇక

వరద ధాటికి వరి పొలాలు నాశనం

కొండపల్లి, న్యూస్‌టుడే

పచ్చని పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు, కౌలుదారులు గగ్గోలు పెడుతున్నారు. గత నెల ఒకటిన బుడమేరు కట్టలు తెగి వరద, బురద నీటితో ఊళ్లు, పొలాలు మునిగిపోవడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. ఈ విపత్కర పరిస్థితులకు మునేరు, బుడమేరు దిగువ భాగాన ఉన్న రైతులతో పాటు గతంలో ఎన్నడూ చూడని విపత్తును విజయవాడ ప్రజలు అనుభవించారు. అలాంటి గడ్డు పరిస్థితులను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోవడంతో పాటు నష్టపోయిన రైతులకు, ప్రజలకు సాయమందించింది. రైతులకు ఎకరాకు గరిష్ఠంగా రూ.10వేల వరకూ పంట పరిహారం అందించి ఆదుకుంది.

దిక్కుతోచని స్థితిలో..

ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఇసుక రూపంలో వచ్చిన బుసకతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంట కోసం చేసిన అప్పుల నుంచి బయటపడేందుకు ప్రభుత్వం సాయం అందించినా పొలాల్లో పేరుకుపోయిన ఇసుక తరలించేందుకు ఎన్ని కష్టాలు ఎదుర్కోవాలోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద రూపంలో వచ్చిన ఇసుక పూర్తిగా తొలగించి దుక్కితే గానీ పొలాల్లో సాధారణ స్థితికి రావు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని ప్రభుత్వ పెద్దలు ఆలోచించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కర్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కవులూరు వద్ద బుడమేరు కింద పొలాల దుస్థితి (పాత చిత్రం)

ప్రభుత్వమే సాయం చేయాలి

కొండపల్లి శాంతినగర్‌లో నాలుగు ఎకరాలు కౌలు కింద సాగు చేస్తున్నాను. మా రైతుకు ఇంకా పరిహారం అందలేదన్నారు. అయితే నాలుగు ఎకరాల్లో ఇసుక మేట వేసింది. దీనిని తొలగించడానికి జేసీబీలు అడిగితే గంటకు 1,400 తీసుకుంటామన్నారు. నాలుగు ఎకరాల్లో ఇసుక తొలగించడానికి 16 గంటలు పడుతుందన్నారు. ఆ తొలగింపు పనులు చేయిస్తే ఈ సంవత్సరం నాకు పూర్తిగా నష్టం వస్తుంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కొండయ్య, కౌలు రైతు, శాంతినగర్

ఆందోళనగా ఉంది

బుడమేరు వరద ధాటికి ఆరు ఎకరాల పంట నాశనమైంది. అందుకు ప్రభుత్వం సాయమందించింది. అయితే ఇసుక మేట వేసిన చేలల్లో ఇప్పుడల్లా సాగు చేసే పరిస్థితి కనిపించడంలేదు. ఇసుక దిబ్బలు తొలగించాలంటే ఎంత ఖర్చు అవుతుందోనని ఆందోళనగా ఉంది.

- జి.శ్రీను, రైతు, కవులూరు

నూతన కార్యవర్గం ఎన్నిక

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మైలవరంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్‌కె ఖాజారహంతుల్లా, కార్యదర్శి ఎస్‌కే ఖాసింషరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. జి.కొండూరు మండలశాఖ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎస్‌కే కొండబాబు నియమించినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాబు ప్రకటనలో తెలియజేశారు.

యూటీఎఫ్..

ఎ.కొండూరు: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య మంగళవారం తెలిపారు. అధ్యక్షుడిగా బీవీ.దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఇస్సాక్, గౌరవాధ్యక్షుడిగా బి.శ్రీరాములు, సహాధ్యక్షుడిగా ఎ.రవీంద్రబాబు, సహాధ్యక్షురాలిగా బి.కృష్ణకుమారి, కోశాధికారిగా ఎస్.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

ఏకనామ స్మరణ పూజలో జనసైనికులు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మంగళవారం మండలంలోని తుమ్మలపాలెం గ్రామ కోదండ రామాలయంలో జనసైనికులు నారాయణ ఏకనామ స్మరణ పూజలు నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన కార్యదర్శి చింతల లక్ష్మీకుమారి, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ వారోత్సవాలలో భాగంగా మంగళవారం కాచవరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఉపాధ్యాయులు పిచ్చి మొక్కలు తొలగించారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు భవాని, ఇర్ఫాన్ పాషాలు పాల్గొన్నారు.



కాచవరం పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మైలవరం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇల్లా రవి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో పరిసరాల్లో విద్యార్థులు చెత్త తొలగించారు. ఉప ప్రిన్సిపల్ రంగారావు, ప్రోగ్రాం అధికారులు ఫణికుమార్, మన్నేస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కొలికపూడి క్షమాపణ చెప్పాలి'

తిరువూరు: తాను ఎన్నికలకు ముందు కాలువల పూడికలు తీయించి రైతులకు మేలు చేస్తే ఈ రోజు సమావేశానికి ఒక్కరూ రాలేదని.. శునకాలకు ఉన్న విశ్వాసం వారికి లేదని సోమవారం తెదేపా కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు రైతులను ఉద్దేశించి మాట్లాడారని తక్షణం ఆయన క్షమాపణలు చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు టి.కృష్ణయ్య, ఎం.డేవిడ్, ఎన్.వనమాలి డిమాండ్ చేశారు. సుంకర వీరభద్రరావు భవన్‌లో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ☛ తెదేపా కార్యకర్తల సమావేశానికి రైతులు రాకపోతే పరుష పదజాలంతో మాట్లాడిన ఎమ్మెల్యేపై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పి.శ్రీనివాసరావు, యు.లక్ష్మీదాసు డిమాండ్ చేశారు.

ముందస్తు దసరా సంబరాలు

తిరువూరు, వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: స్థానిక శ్రీనిధి ఉన్నత పాఠశాలలో, వినగడప ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా సంబరాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు అమ్మవార్ల వేషధారణలు ధరించి ఆకర్షణగా నిలిచారు.



అమ్మవార్ల వేషధారణలతో విద్యార్థినులు

మండల స్థాయి చెకుముకి పోటీలు

ఇబ్రహీంపట్నం : సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జవివే చేస్తున్న ప్రయత్నం ఆహ్వానించదగినదని ఎంపీడీవో రామకృష్ణనాయక్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు మండల స్థాయి పోటీలు ఇబ్రహీంపట్నం జాకీర్‌హుస్సేన్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.

మైలవరం: చెకుముకి సైన్సు ప్రతిభా పోటీల్లో స్థానిక ఆక్స్‌ఫర్డ్, గౌతమ్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ముగ్గురు చొప్పున విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు టాలెంట్ టెస్ట్ కన్వీనర్ గొల్లపూడి సురేష్ తెలిపారు.

పెదకొమిర(గంపలగూడెం), న్యూస్‌టుడే: పెదకొమిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు.



పెదకొమిర జూనియర్ కళాశాలలో..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: చెకుముకి ప్రతిభా పరీక్షల్లో గీతాంజలి, శ్రీనారాయణ, మద్దులపర్వ ఆదర్శ పాఠశాల, కూనపరాజుపర్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల జట్లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జవివే జిల్లా కమిటీ సభ్యుడు జి.మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

తిరువూరు, న్యూస్‌టుడే: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జవివే ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్సు పోటీలు నిర్వహించారు.

సస్యరక్షణ చర్యలపై సూచనలు

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: వరి పంటకు అక్టోబరు మాసం అత్యంత కీలకమైందని జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకురాలు టి.మాధవీలత తెలిపారు. ఈ నెలలోనే ఆ పంటలో చీడపీడల వ్యాప్తి ఉద్ధృతంగా ఉంటుందని, అన్నదాతలు అప్రమత్తంగా ఉంటూ పంటను వాటి బారి నుంచి కాపాడుకోవాలని సూచించారు. మండలంలోని కోడూరులో మంగళవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి వరిలో చిరుపొట్ట దశలో, పత్తిలో పూత, కాయ దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. ఏడీఏ జి.కెనడీ, ఏవో ఎస్‌కే.టిప్పుసుల్తాన్, హెచ్‌వో బి.నరేంద్ర, సర్పంచి సురేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చివరికి అందని సాగర్‌జలాలు

ఆయకట్టులో పంటలు ఎండుముఖం

గంపలగూడెం, న్యూస్‌టుడే

ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు విడుదల చేసిన సాగర్‌జలాలు గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలోని మేజర్ కాల్వలకు సరఫరా చేయడం లేదు. మధిర శాఖ కాల్వకు కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి గత శుక్రవారం సాగర్‌జలాలు విడుదల చేస్తున్నారు. తొలిరోజు మాత్రమే గంపలగూడెం సెక్షన్ పరిధిలోని మేజర్ కాల్వలకు కొంత నీరు చేరింది. తదుపరి మూడు రోజుల నుంచి మధిర శాఖ కాల్వకు విడుదల చేస్తున్న సాగర్‌జలాలను ఎగువన ఉన్న కల్లూరు సెక్షన్ పరిధిలోని పంటలకు తెలంగాణ అధికారులు వినియోగిస్తున్నారు. దీంతో గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలోని పెదకొమిర, గంపలగూడెం, నిదానపురం, మధిర, ఊటుకూరు, ఆర్లపాడు, లింగాల మేజర్లకు నీటి సరఫరా లేదు. ఫలితంగా కాల్వల ఆయకట్టులో వరి, మిరప, పత్తి తదితర పంటలకు సాగు నీటి కొరత ఏర్పడింది. చివరి భూములకు నీటి సరఫరా లేక సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

దిగువ భూముల రైతుల్లో నైరాశ్యం

మధిర బ్రాంచి కెనాల్‌లో 23వ కి.మీ దిగువన ఏపీ పరిధిలోని రైతులకు చెందిన 25వేల ఎకరాలకు సాగర్‌జలాలు సరఫరా చేయాల్సి ఉంది. నెల రోజుల తర్వాత కాల్వకు సాగు నీరు విడుదల చేయగా దిగువకు చేరక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కల్లూరు సెక్షన్ పరిధిలో మేజర్లతో పాటు గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలోని ఆరు మేజర్లకు కూడా కాల్వల సామర్థ్యం మేరకు సాగర్‌జలాలు సరఫరా చేయాల్సి ఉంది. మండుతున్న ఎండలకు నీటి తడులు అందక సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ఎగువన కాల్వల్లో సాగర్‌జలాలు ప్రవహిస్తున్నా దిగువన పంటలకు చేరడం లేదని, పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీటి సరఫరా లేని కాల్వ

విడుదల ఇలా..

మధిర బ్రాంచి కెనాల్ సామర్థ్యం 1,500 క్యూసెక్కులు. గరిష్ఠంగా 1,300 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తారు. కప్పల బంధం నియంత్రిక నుంచి ఈ నెల 27న 727, 28న 838, 29న 763, 30న 801 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. 23వ కి.మీ దిగువకు ఈ నెల 27న 294, 28న 160, 29న 131, 30న 79 క్యూసెక్కుల చొప్పున వచ్చాయి.

తెలంగాణ అధికారులతో మాట్లాడాను

మధిర బ్రాంచి కెనాల్‌లో 23వ కి.మీ దిగువన గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలో మేజర్లకు సాగర్‌జలాల సరఫరాపై తెలంగాణ అధికారులతో సోమవారం మాట్లాడాను. ఇక్కడి పంటలకు సాగు నీటి కొరత ఉందని, తక్షణ నీటి తడులు అందించకపోతే ఎండిపోయే ప్రమాదం ఉందని వివరించాను. కాల్వ సామర్థ్యం మేరకు మధిర శాఖ కాల్వకు సాగర్‌జలాలు విడుదల చేయాలని కోరాను.

- రామ్‌దాస్, ఎన్ఎస్పీ తిరువూరు సబ్‌డివిజన్ డీఈ

అవీ ఇవీ

పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈడా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

భగవద్గీత పుస్తకాల వితరణ

మైలవరం: తితిదే, హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల వితరణ చేపట్టారు. మంగళవారం ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ.సుధాకరరావు కార్యాలయంలో పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులకు వాటిని అందజేశారు.

ఇసుక తరలించేందుకు అనుమతులివ్వండి

తిరువూరు: మండల పరిధిలోని వాగుల్లో ఇసుక తరలించడానికి అనుమతివ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు స్థానిక కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

మైలవరం: కూటమి ప్రభుత్వ లక్ష్యమైన స్వర్ణాంధ్ర -2047 గోడ పత్రికలను మంగళవారం మండలంలోని కీర్తిరాయునిగూడెంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు డి.రాము, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డి.విజయ్‌కుమార్ ఆవిష్కరించారు.

విద్యార్థులకు పోటీలు

మైలవరం: వీరగాథ 4.0 కార్యక్రమంలో భాగంగా స్థానిక 6వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పద్యాల తోరణం, చిత్రలేఖనం, దేశభక్తి గేయాలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

జిల్లా స్థాయికి ఎంపిక

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను, గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలల బాలబాలికలు అండర్-14, అండర్-17 కబడ్డీ, డిస్క్ త్రో, వాలీబాల్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో జిల్లా జట్లకు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు ఎం.క్రిస్టోఫర్, బి.కిరణ్‌కుమార్, పీడీలు హెచ్.అంజయ్య, బి.రాంబాబు మంగళవారం తెలిపారు.

కంభంపాడు(ఎ.కొండూరు) : మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ ఆటల పోటీల్లో అండర్-14, అండర్-17 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో విభాగాల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం, ఆదిశేషు, పీడీ గోపి తెలిపారు.

మాకు పరిహారం అందలేదు

జి.కొండూరు : మండలంలోని గడ్డమణుగు ఎస్సీ ప్రాంతంలోని వరద బాధితులైన దళితులు 40 మంది తమకు నష్ట పరిహారం అందలేదంటూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వినతి పత్రం సమర్పించి ఆదుకోవాలని కోరారు.

మద్యం దుకాణాలకు తొలిరోజు 200 దరఖాస్తులు



- అడ్డొచ్చిన అమావాస్య సెంటిమెంట్
- మొత్తం లక్షకు పైగా అర్జీలు రావొచ్చని అంచనా
- నాన్ రీఫండబుల్ రుసుముల రూపేణా రూ.2 వేల కోట్ల ఆదాయం!
- ఆన్‌లైన్‌లో అర్జీల స్వీకరణకు ప్రత్యేక వెబ్‌పోర్టల్

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో కొత్తగా మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా, తొలిరోజైన మంగళవారం 200కు పైగా వచ్చాయి. వీటిలో ఆఫ్‌లైన్ విధానంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్లలో నేరుగా సమర్పించినవే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి ఎక్సైజ్ శాఖ సోమవారం అర్ధరాత్రి తర్వాత నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం అమావాస్య కావడంతో వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. మొత్తంగా లక్షకు పైగా దరఖాస్తులు రావొచ్చని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుముల రూపంలోనే దాదాపు రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. 2017లో 4,380 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఒక్కో దానికి సగటున 18 చొప్పున మొత్తంగా 78 వేల దరఖాస్తులు అందాయి. ఈసారి 3,396 దుకాణాలకుగానూ ఒక్కో దానికి సగటున 30 వరకు దరఖాస్తులు పడతాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 9 వరకు గడువు ఉండగా, చివరి మూడు రోజుల్లో ఎక్కువ దరఖాస్తులు పడే అవకాశముంది.

ఆన్‌లైన్‌లో అయితే..

మద్యం దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా వెబ్ పోర్టల్ తీసుకొచ్చింది. hpfsproject.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫోన్‌నంబర్‌నే యూజర్ ఐడీగా వినియోగించుకొని, పాస్‌వర్డ్ సృష్టించుకోవాలి. తర్వాత యూజర్ నేమ్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీతో లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన సమగ్ర యూజర్ మాన్యువల్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దరఖాస్తు విధానానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెబ్‌సైట్‌లో పెట్టారు.

విశాఖలో గరిష్ఠం

ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసిన 3,396 దుకాణాల్లో 2,261 (66.57 శాతం) మండలాల్లోనే ఏర్పాటు చేయనుంది. నగరపాలక సంస్థల పరిధిలో 511, పురపాలక సంఘాల్లో 499, నగర పంచాయతీల్లో 125 చొప్పున నోటిఫై చేసింది. అత్యధికంగా విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలో 136, గుంటూరులో 52 చొప్పున ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా తిరుపతిలో 227, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 40 దుకాణాలను నోటిఫై చేసింది.

అందుబాటులో కోరుకున్న మద్యం బ్రాండ్లు

నూతన మద్యం విధానంలో భాగంగా దుకాణాల్లో నేషనల్, మల్టీ నేషనల్ బ్రాండ్లను అందుబాటులో ఉంచనుంది. వినియోగదారులు కోరుకునే బ్రాండ్లన్నీ విక్రయిస్తారు. సరఫరా కంపెనీల నుంచి మద్యం కొనుగోలు కోసం చెల్లించే బేసిక్ ప్రైస్ (మూల ధర)ను చెల్లించేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీ వేయనుంది. 90 రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం మద్యంపై 10 రకాల పన్నులు విధిస్తుండగా, తాజా విధానంలో వాటిని ఆరుకు కుదించారు. ఎక్సైజ్ డ్యూటీ, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్, వ్యాట్, స్పెషల్ మార్జిన్, అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం, రౌండింగ్ ఆఫ్ పన్నులు ఉంటాయి.

జిల్లాల వారీగా అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో నోటిఫై చేసిన మద్యం దుకాణాల సంఖ్య

జిల్లా	దుకాణాలు
శ్రీకాకుళం	158
విజయనగరం	153
పార్వతీపురం మన్యం	52
అల్లూరి సీతారామరాజు	40
విశాఖపట్నం	155
అనకాపల్లి	136
కాకినాడ	155
డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ	133
తూర్పుగోదావరి	125
పశ్చిమగోదావరి	175
ఏలూరు	144
కృష్ణా	123
ఎన్టీఆర్	113
గుంటూరు	127
బాపట్ల	117
పల్నాడు	129
ప్రకాశం	171
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	182
కర్నూలు	99
నంద్యాల	105
అనంతపురం	136
శ్రీసత్యసాయి	87
వైఎస్సార్	139
అన్నమయ్య	111
చిత్తూరు	104
తిరుపతి	227

పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు ఓకే

నదీగర్భంలో జిల్లా ఇసుక కమిటీ ద్వారా తవ్వకాలు

- పట్టాదారుకు టన్నుకు రూ.60 చొప్పున చెల్లింపు
- నదీగర్భం బయట పట్టాదారే తవ్వి, విక్రయించేందుకు అవకాశం
- గరిష్ఠంగా టన్ను రూ.250కి మించి అమ్మకూడదు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నదీగర్భంలో, నదిని ఆనుకొని ఉన్న పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇసుక కొరతను తీర్చేందుకు ఆయా భూముల్లో మేటవేసిన ఇసుకను తవ్వి, విక్రయించేందుకు అవకాశం కల్పించింది. నదీగర్భం లోపల ఉండే భూముల్లోని ఇసుకను జిల్లాస్థాయి ఇసుక కమిటీ ద్వారా తవ్వి విక్రయించనుండగా, నదీగర్భం బయట ఉండే భూముల్లో నేరుగా పట్టాదారే తవ్వుకునేందుకు వీలు కల్పించారు. ఈ మేరకు గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయి. పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు మూడు రకాలుగా వీలు కల్పించారు.



పట్టాదారుకు ఇలా..

- నదీగర్భం లోపల భూముల్లో ఇసుక మేటలు ఉంటే.. పట్టాదారు దరఖాస్తు చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్‌డీడ్ అందజేయాలి. అందులో ఇసుక తవ్వకాలకు అంగీకరిస్తున్నట్లు పేర్కొనాలి.
- వీటిని జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఆదేశాలతో తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారి, భూగర్భజలశాఖ అధికారి, జలవనరులశాఖ ఈఈ, జిల్లా గనులశాఖ అధికారితో కూడిన బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తుంది.
- తర్వాత ఆ భూముల్లో ఇసుక తవ్వకాలకు మైనింగ్ ప్లాన్, పర్యావరణ, పీసీబీ అనుమతులను కలెక్టర్ పేరుతో జిల్లా గనులశాఖ అధికారి తీసుకుంటారు. ఈ ఫీజులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- అనుమతులు వచ్చాక, పట్టాదారుతో జిల్లా ఇసుక కమిటీ ఒప్పందం చేసుకుంటుంది. తర్వాత ఈ కమిటీ ద్వారా ఇసుక తవ్వి, విక్రయిస్తారు. ఇలా తవ్విన ఇసుకలో టన్నుకు రూ.60 చొప్పున పట్టాదారుకు చెల్లిస్తారు.
- ఈ ఇసుక నిల్వలను శాండ్ పోర్టల్‌లో చూపించి, ఆన్‌లైన్ బుకింగ్‌తోనే విక్రయిస్తారు.

ప్రభుత్వ పనులకే..

- నదీగర్భం బయట ఉన్న భూముల్లో.. గతంలో వరదల వల్ల ఇసుక మేటలు వేసి, ముమ్ముందు మళ్లీ వరదలతో ఇసుక వచ్చే అవకాశం లేని భూముల్లో జిల్లా ఇసుక కమిటీ ద్వారానే తవ్వకాలు జరిపిస్తారు. ఇలాంటి భూముల్లో తవ్వకాలకు అనుమతులన్నీ జిల్లా గనులశాఖ అధికారులే తీసుకుంటారు. ఈ ఇసుకను ప్రభుత్వ పనులకే వినియోగిస్తారు.

అనుమతులు తెచ్చుకోవాల్సింది పట్టాదారే

■ నదీగర్భం బయట భూముల్లో గతంలో వరదలతో ఇసుక మేటలు ఏర్పడి, మళ్లీ భవిష్యత్‌లో వరదల వల్ల ఇసుక వచ్చే అవకాశం ఉన్నచోట్ల.. పట్టాదారే ఇసుక తవ్వకాలు చేసేందుకు అనుమతిస్తారు. అయితే వీటికి 5 కి.మీ. పరిధిలో ప్రభుత్వ రీచ్‌లు గానీ, పూడిక రూపంలో ఇసుక తవ్వే పాయింట్లు గానీ ఉండకూడదు. ■ పట్టాదారు దరఖాస్తు చేసుకుంటే, ఆయా శాఖల అధికారుల బృందం పరిశీలించి, జిల్లా ఇసుక కమిటీకి నివేదిక ఇచ్చాక, అది అనుమతిస్తుంది. ■ తర్వాత పట్టాదారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ■ అనంతరం పట్టాదారు తన భూమిలో ఇసుక తవ్వి, గనులశాఖ పోర్టల్ ద్వారా టన్ను రూ.250కి విక్రయించాలి. ఇందులో టన్నుకు రూ.88 సీనరేజి కింద మినహాయిస్తారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరకు రెక్కలు

- విజయవాడలో ఇక రూ.1,918

ఈనాడు వాణిజ్య విభాగం: రెస్టారెంట్లలో, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను ఈ నెల 1 నుంచి (మంగళవారం) పెంచినట్లు చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. హైదరాబాద్‌లో ఈ సిలిండర్ ధర రూ.1919 నుంచి రూ.48 పెరిగి రూ.1967కు చేరింది. విజయవాడలో రూ.1,870 నుంచి రూ.48 అధికమై రూ.1,918కి చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సిలిండర్ ధరను ఆగస్టు, సెప్టెంబరులలో కూడా పెంచారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా వీటి ధరలను కంపెనీలు సవరిస్తుంటాయి. ఇళ్లలో వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలో మార్పులేమీ చేయలేదు.

పేదలకు రాయితీపై కందిపప్పు, పంచదార

- రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచే మొదలైన పంపిణీ


రేషన్ దుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార పంపిణీ 16 నెలల తర్వాత మళ్లీ మొదలైంది. దసరాకు ముందే రూ.67కు కిలో కందిపప్పు, రూ.17కు అరకిలో పంచదార పంపిణీ చేయాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా 1.48 కోట్ల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గతేడాది జూన్ నుంచి కందిపప్పు పంపిణీ నిలిపివేయడంతో అప్పటి నుంచి కార్డుదారులు కిలో రూ.170కు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక కందిపప్పు పంపిణీపై దృష్టి పెట్టింది. మూడు నెలల పాటు సరఫరా చేసేందుకు రెండుసార్లు టెండర్లు పిలిచారు. ఇటీవలే ఖరారు చేసి అక్టోబరు నుంచి కార్డుదారులకు పంపిణీ ప్రారంభించారు. సరఫరాలో జాప్యం కారణంగా కొన్ని జిల్లాలకు కందిపప్పు నిల్వలు ఆలస్యంగా చేరినా.. మిగతాచోట్ల మంగళవారం నుంచి పంపిణీ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

వైకాపా హయాంలో కిలో కోత పెట్టి..

2019 వరకు రేషన్ కార్డుదారులకు రాయితీపై కిలో రూ.40 చొప్పున రెండు కిలోల కందిపప్పు ఇచ్చేవారు. వైకాపా రావడంతోనే కోత పెట్టి కేవలం కిలో చొప్పున పంపిణీ చేసింది. 2020 ఏప్రిల్ నుంచి కిలో ధర రూ.67కు పెంచింది. అయినా పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేయలేదు. ప్రతి నెలా మొత్తం కార్డుల్లో 25% నుంచి 35% మందికి మాత్రమే పప్పు అందేది. 2021 నవంబరు నుంచి 2023 డిసెంబరు వరకు చూస్తే సగటున 30% కుటుంబాలకే కందిపప్పు ఇచ్చారు. జూన్ నుంచి పంపిణీ నిలిపివేశారు. ప్రతి నెలా ధరలు పెరిగి వినియోగదారులపై భారం పడుతున్నా పట్టించుకోలేదు.

జనవరి నుంచి తృణధాన్యాల పంపిణీకి ప్రణాళికలు: మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార అందిస్తామని.. వచ్చే ఏడాది జనవరి నుంచి తృణధాన్యాలు కూడా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో మంగళవారం ఆయన కార్డుదారులకు రాయితీపై కిలో కందిపప్పు, అర కిలో పంచదార అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఎందుకా విజ్ఞానం?

మంచి వ్యక్తిత్వం లేనివారికి ఎంతటి విజ్ఞానం ఉన్నా అది దుష్ట శక్తి కిందే లెక్క. మనం ప్రపంచంలో తరచూ చూస్తుండే 'మహా తెలివైన దొంగలు', 'పెద్దమనుషుల్లాంటి వంచకులు' ఈ కోవలోని వారే!
– మహాత్మా గాంధీ

టెట్ పరీక్షకు వేళాయె..!

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏర్పాట్లు

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే

ఏపీటెట్-2024 పరీక్ష ఈనెల 3 నుంచి 21 వరకు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సీబీటీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష) ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికారులు ఇప్పటికే దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశారు. అభ్యర్థులకు ఈ మేరకు సమాచారం పంపించారు.

	ఎన్టీఆర్ జిల్లా	కృష్ణా జిల్లా	పరీక్ష సమయం
మొత్తం అభ్యర్థులు	32,309	25,780	ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
పరీక్ష కేంద్రాలు	6	3	
హెల్ప్ డెస్క్ నెంబర్లు	9676300884 9440506411 9154473676	9700882034 9700857223	
(ఉదయం 7.30 నుంచి సాయంత్రం 7 వరకు మాత్రమే)			

డిపార్టుమెంట్ అధికారుల నియామకం



ప్రతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించడానికి డిపార్టుమెంట్ అధికారులను నియమించడం జరిగింది. ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా ఇద్దరు ఏడీలు, ఇద్దరు ఎంఈవోలను ఏర్పాటు చేశాం. అన్ని ఏర్పాట్లు పక్కాగా చేశాం. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులుంటే హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. **- యువీ సుబ్బారావు, డీఈవో, ఎన్టీఆర్ జిల్లా**

ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు



అభ్యర్థులు పరీక్షకు గంట ముందుగా ఉదయం 8.30 గంటలకే, మధ్యాహ్నం 1.30 గంటలకే చేరుకోవాలి. హాల్ టికెట్‌లో ఫొటోలేనివారు తాజా పాస్‌ఫోటోతో(ఆధార్/పాన్ కార్డు/ ఓటరుకార్డు)తో హాజరుకావాలి. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. **- తాహెరాసుల్తానా, డీఈవో, కృష్ణా జిల్లా**

సామాన్య భక్తులకు ప్రథమ ప్రాధాన్యం



కృష్ణమ్మకు హారతి ఇస్తున్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత తదితరులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : సామాన్య భక్తుల దర్శనానికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఇంద్రకీలాద్రి దిగువన మోడల్ గెస్టు హౌస్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహనరావు, బొండ ఉమామహేశ్వరరావు గతంలో ఎదురైన సమస్యలను మంత్రి ఆనం దృష్టికి తీసుకొచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అమ్మవారి దర్శనం, లడ్డూ, పులిహోర, అన్న ప్రసాదం అందించేందుకు నిర్ణయించామని చెప్పారు. వీఐపీ దర్శనాలు సైతం ఉదయం 8 నుంచి 10 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటలు ఉంటుందన్నారు. వీఐపీలు ముందస్తుగా స్లాట్‌లో వస్తే ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రొటోకాల్ దర్శనం లభిస్తుందన్నారు. 13 శాఖలతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దసరా ఏర్పాట్లు గతంలో కంటే మెరుగ్గా చేపట్టేందుకు దేవాదాయ శాఖ చర్యలు తీసుకోవడం ప్రశంసనీయమన్నారు. అనంతరం కృష్ణమ్మకు హారతి అందించారు. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ సృజన, ఈవో రామారావు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం. 040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

దసరా నాటికి విజయ డెయిరీ పునరుద్ధరణ

చిట్టినగర్, న్యూస్‌టుడే



రిఫ్రిజిరేటర్ విభాగంలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



కేబుల్స్ విభాగంలో ఇలా..

విజయ డెయిరీ 60 ఏళ్ల చరిత్రలో ఏనాడు మూతపడలేదు. అలాంటిది బుడమేరు వరద వల్ల డెయిరీ ముంపునకు గురైంది. పది రోజుల పాటు ఫ్యాక్టరీలోని యంత్రాలు, ఇతర సామగ్రి నీటిలోనే ఉన్నాయి. బురద పట్టి యంత్రాలు తుప్పు పట్టి ఏ ఒక్కటీ పని చేయని పరిస్థితి. ఈ నేపథ్యంలో వరద వీడిన దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది, టెక్నీషియన్లు శరవేగంగా మరమ్మతులు చేస్తున్నారు. ఇందులో ప్రధానమైన, పాలను నిర్దిష్టమైన రీతిలో కూలింగ్ చేసే రిఫ్రిజిరేటర్ విభాగంలో 270 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన కంప్రెషర్లు దెబ్బతిన్నాయి. ప్యానల్ బోర్డులు పనికి రాకుండా పోయాయి. దీంతో వాటిని బాగు చేస్తున్నారు. ఎలక్ట్రికల్ విభాగం నీట మునగడంతో ప్యానల్ బోర్డులతో పాటు మెయిన్ కేబుల్స్ పాడయ్యాయి. భూగర్భంలో ఉన్న ఈ కేబుల్స్‌ను పూర్తిగా తనిఖీ చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్నారు.

కామధేను ఫ్యాక్టరీ ఆదుకుంది

దెబ్బతిన్న ఫ్యాక్టరీ గురించి 'న్యూస్‌టుడే'తో ఛైర్మన్ ఆంజనేయులు ఇలా మాట్లాడారు. వరదలో డెయిరీ మునిగిపోవడంతో 60 ఏళ్లు వెనక్కి వెళ్లాల్సి వచ్చేది. మార్కెట్ దెబ్బతింది. వినియోగదారులు విజయ పాలను మరచిపోయే పరిస్థితి దాపురించేది. రైతులు ప్రత్యామ్నాయం చూసుకునే వారు. పోటీ కంపెనీలు ఇదే అదునుగా మార్కెట్‌లో దూసుకుపోయేవి. మళ్లీ మొదలు నుంచి రావాల్సి వచ్చేది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ పాలక వర్గం నిర్ణయం మేరకు, పాల రైతుల సహకారంతో హనుమాన్ జంక్షన్ వీరవల్లిలో కామధేనువు పేరుతో కొత్తగా ఫ్యాక్టరీ నిర్మించడం వల్ల ఈ విపత్తు నుంచి బయట పడ్డాం. ఎక్కడా వినియోగదారుడికి, పాలరైతులకు ఇబ్బంది లేకుండా అక్కడ నుంచి పాలు, పాల పదార్థాలు, ఇతర వస్తువులను యథావిధిగా అందించడంతో ప్రజల్లో విజయ బ్రాండ్‌కు ఎలాంటి ఆటంకం రాలేదు. పాత ఫ్యాక్టరీ దసరా నాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసుకుని వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు.

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం



ఎంపీ శివనాథ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో రామారావు, పక్కన వైదిక కమిటీ సభ్యులు



పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరికి..

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దసరా ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో కలిసి హాజరు కావల్సిందిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిలను దేవస్థానం ఈవో రామారావు వారి నివాసాలకు వెళ్లి మంగళవారం ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను అందజేయడంతో పాటు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు. ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు.

4న శాప్ నూతన ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) నూతన ఛైర్మన్‌గా అనిమిని రవినాయుడు ఈ నెల 4వ తేదీన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల శాప్ బోర్డు పదవీ కాలం ముగిసింది. శాప్ ఛైర్మన్‌గా రవినాయుడిని నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రవినాయుడు 4వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి హాజరుకానున్నారు.

యుగపురుషుడు ఎన్టీఆర్ : పురందేశ్వరి



పుస్తకం ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి, రచయిత పూర్ణచంద్రరావు, జయప్రకాష్ నారాయణ

భవానీపురం, న్యూస్‌టుడే : కలియుగంలో ఎంతో మంది పుణ్యాత్ములు జన్మించినా తన యశస్సునంతటిని భారత జాతిపై ప్రసరింపజేసిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. నగరంలోని ప్రసాద్ వి.పొట్లూరి సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆంగ్ల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి పూర్ణచంద్రరావు రచించిన 'ఎన్.టి.ఆర్.శతకం' పుస్తకాన్ని పురందేశ్వరి విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నో విభిన్నమైన పాత్రలకు సజీవరూపం కల్పించి ప్రేక్షకుల మనసుల్లో శాశ్వతముద్ర వేశారన్నారు. పరిపూర్ణమైన వ్యక్తిత్వానికి నిర్వచనం ఎన్టీఆర్ అని, అలాంటి గొప్ప వ్యక్తికి కుమార్తెగా జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడించారు. రచయిత పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తుల్లో ఎన్టీఆర్ ఒకరని తెలిపారు. అలాంటి వ్యక్తి గురించి పుస్తకం రాయడం సంతోషంగా ఉందన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు... ట్రాఫిక్ మళ్లింపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా.. నగరం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు ఈ మళ్లింపులు ఉంటాయని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

భారీ, చిన్న వాహనాలు ఇలా వెళ్లాలి..

- హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, స్వాతి కూడలి, కనకదుర్గా పైవంతెన, కృష్ణలంక, కనకదుర్గమ్మ వారధి, తాడేపల్లి మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెనుతిరుగుతాయి.
- హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను.. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. అదే విధంగా చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై.కూడలి, కబేలా సెంటర్, సీవీఆర్ పైవంతెన, పైపుల రోడ్డు, కండ్రిక, బోడపాడు ఆర్‌యూబీ, ఔటర్ రింగ్‌రోడ్డు, ముస్తాబాద, చిన అవుటపల్లి మీదుగా విశాఖపట్నం మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.
- విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను హనుమాన్‌జంక్షన్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనమూడి వారధి, రేపల్లె, చీరాల, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గన్నవరం, నిడమానూరు, బెంజిసర్కిల్, కనకదుర్గమ్మ వారధి మీదుగా చెన్నైకు పంపిస్తారు. రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగితే.. తాడిగడప 100 అడుగుల రోడ్డు మీదుగా బందరురోడ్డు, అక్కడి నుంచి బెంజిసర్కిల్ మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెనుతిరుగుతాయి.
- గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను బుడంపాడు, తెనాలి, పెనుమూడి వారధి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు, విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గుంటూరు, కనకదుర్గమ్మ వారధి, బెంజిసర్కిల్ పైవంతెన, రామవరప్పాడు, నిడమానూరు, గన్నవరం మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

వసుంధర

vasundhara@eenadu.in

స్నేహం కోసం... జెమనాయ్!

ఇలా చేద్దాం!

మంచి స్నేహాలు మనల్ని ఉన్నతస్థాయిలో నిలబెడతాయి. ఎక్కువ మంది స్నేహితులు ఉన్నవారి ఆయుష్షు పెరుగుతుందని తాజా అధ్యయనాలూ సూచిస్తున్నాయి. కానీ, బాధ్యతలు పెరిగేకొద్దీ చాలామంది అమ్మాయిలు వారి స్నేహితులను విడిచిపెడుతుంటారు. అయితే, స్నేహబంధాలను పదిలంగా ఉంచుకోవడానికి కొరియన్లు ఓ పద్ధతి పాటిస్తున్నారు. అదే 'జెమనాయ్'. అందులో ఏం చేస్తారంటే...

మనతో పోలిస్తే కొరియన్ల జీవనశైలి భిన్నంగా ఉంటుంది. కుటుంబం, స్నేహితులు... ఇలా అన్నింటికీ చోటు కల్పించుకుంటారు వాళ్లు. జ్ఞాపకాలను పోగేసుకుంటారు. వీటన్నింటి కోసం పక్కాగా ఆర్థిక ప్రణాళిక వేసుకుంటారు. అందుకోసమే వాళ్లు ప్రత్యేకించి స్నేహితులతో కలిసి 'జెమనాయ్' గ్రూప్‌లను మొదలుపెట్టారు. ఇదో ఉమ్మడి ఆర్థిక ప్రణాళిక. దీన్లోని సభ్యులు నెలకు కొంత మొత్తం చొప్పున పొదుపు చేసుకుంటారు. కొంత డబ్బు చేకూరాక, అందరూ కలిసి తీర్మానించుకుని వాటితో ఏం చేయాలో నిర్ణయించుకుంటారు. ఉన్న బడ్జెట్‌కు సరిపడేలాగా మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవడం, విహారయాత్ర, సినిమా... ఇలా ఏదో ఒకటి ఎంచుకుంటారు. దీనివల్ల వ్యక్తిగత బడ్జెట్‌తో సంబంధం లేకుండా స్నేహితులందరూ కలిసి ఆనందంగా గడపొచ్చు అన్నది వారి ఆలోచన అట. ఇంతకీ ఈ ఆలోచన వారికి ఎలా



వచ్చిందంటే... 200ఏళ్ల క్రితం పంట పండించడానికి కావాల్సిన పెట్టుబడి ఒక్కరిదగ్గరా సరిపడా ఉండేది కాదట. పైగా అప్పట్లో ఎలాంటి రుణ సదుపాయాలూ లేవు. కాబట్టి, గ్రామంలోని ప్రజలు ఒకరికొకరు డబ్బు పోగేసుకుని పంట పండించుకునేవారట. పండిన ధాన్యాన్ని అందరూ సమానంగా పంచుకునేవారు. ఈ సంస్కృతే తరవాతి కాలంలో వారి స్నేహబంధం దృఢమవడానికీ, కమ్యూనిటీలు కలిసి ఉండడానికీ సాయపడిందట. అందులోంచి వచ్చిందే ఈ 'జెమనాయ్' పద్ధతి కూడా. ఇందుకోసం వీరు స్నేహితుల్లో ఒకరిని డబ్బు నిర్వహణ కోసం ఎంచుకుంటారు. లేదనుకుంటే ఈ గ్రూపులకు సహకరించే బ్యాంకులూ ఉంటాయట. అందులో వీరు ఉమ్మడి అకౌంట్‌ను ఏర్పాటుచేసుకుంటారు. వాటికి బ్యాంకులు వడ్డీనీ ఇస్తాయట. అలా జమైన డబ్బును స్నేహితులంతా కలిసి సరదాగా సమయం గడపడానికి ఉపయోగించుకుంటారట. ఆర్థిక కారణాల వల్ల స్నేహంలోని మధురానుభూతికి దూరమవకూడదనేదే వీరి ఉద్దేశం. మీరూ పాటిస్తారా? ఈ కొరియన్ల ఫ్రెండ్‌షిప్ సీక్రెట్!



పూలతో దైవాన్ని అర్చించడం తెలిసిందే! కానీ ఆ పూలనే అందంగా పేర్చి దైవస్వరూపంగా పూజించడమే 'బతుకమ్మ వేడుక'లో ప్రత్యేకత. బతుకమ్మ అంటేనే పూలు, పాటలు, పడతులు. ప్రకృతిలో పూలు, స్త్రీలది ప్రత్యేక స్థానం. ఈ పండగ ఈ రెండింటి ప్రాధాన్యాన్నీ గుర్తుచేస్తుంది. పూల రూపంలో సమస్త ప్రకృతినీ ఆరాధించడం... 'బతుకమ్మ' అంటూ స్త్రీ శ్రేయస్సును కోరడం... ఈ వేడుక అంతరార్థం!

కలకాలం బతుకమ్మా!

ఒక రాజ్యంలో వీరులైన ఏడుగురు అన్నదమ్ములకు ఒక చెల్లెలుండేది. వాళ్లు లేని సమయంలో వదినలు ఆమెను చంపి, గోతిలో పూడుస్తారు. దానిపై ఓ తంగేడు చెట్టు మొలుస్తుంది. పని పూర్తయ్యి తిరిగొచ్చిన అన్నలు చెల్లెలి జాడకోసం తిరుగుతూ ఆ చెట్టు దగ్గర ఆగుతారు. అప్పుడా చెట్టు జరిగిన విషయమంతా చెబుతుంది. ఆ తంగేడు పూలల్లో తనని చూసుకోమనీ, ఏటా తన పేరిట పండగ చేయమనీ కోరిందట... అలా బతుకమ్మ మొదలైందని ఓ కథనం.

తంజావూరులో బృహదీశ్వరాలయ నిర్మాణం జరుగుతున్న సందర్భంలో చోళులు వేములవాడ చాళుక్యులను యుద్ధంలో ఓడించి వేములవాడ భీమేశ్వరాలయంలోని శివలింగాన్ని తీసుకుపోయారట. అప్పుడు పార్వతీదేవిని ఓదారుస్తూ... ఆమెలో ఉత్సాహం నింపడానికి పూలతో ఇలా ఉత్సవం నిర్వహించడం ప్రారంభించారని మరో కథనం.

ఇంకోకథ ప్రకారం... పూర్వం తెలంగాణ గ్రామాల్లో మహిళలు నవాబులు, భూస్వాముల చేతుల్లో నలిగిపోయేవారు. తన జీవితం అలాకాకూడదని ఒకమ్మాయి ఆత్మహత్యకు పూనుకుంటుంది. కొన ఊపిరితో ఉన్న ఆమెను చుట్టూ ఉన్నవాళ్లు 'కలకాలం బతుకమ్మా' అని దీవించారట. అలా ఆ మహిళలపై సానుభూతితో బతుకమ్మ మొదలైంది.

ఇలా ఈ పండగ నేపథ్యంగా చారిత్రక, సామాజిక గాథలెన్నో ఉన్నాయి. బతుకమ్మను బతుకునిచ్చే అమ్మగా భావిస్తారు. కట్ల, తంగేడు, గన్నేరు, గునుగు, తామర, బంతి, బీర, కనకాంబరం, నిత్యమల్లి, గోరంట, మందార, చేమంతి మొదలైన పూలతో వరుసలుగా పేరుస్తారు. మహిళలంతా ఒకచోట చేరి, వాటి చుట్టూ ఆడిపాడతారు. మహాలయ అమావాస్యతో మొదలయ్యే ఈ వేడుక తొమ్మిది రోజులపాటు సాగుతుంది. ఆ రోజుల్లో వీధులన్నీ మహిళల నృత్యాలు, పాటలతో కళకళలాడుతుంటాయి. నిజానికి భాద్రపదం చివర్లో మహాప్రళయం సంభవించిందట. అప్పటికే వర్షరుతువు ముగిసింది కాబట్టి, తరవాత ప్రారంభమయ్యే శరద్ రుతువులో మొదటి తొమ్మిది రోజుల్లోనే సృష్టి జరిగిందంటారు. అందుకే బతుకమ్మ పండగను ఆశ్వయుజం మొదటి తొమ్మిది రోజుల్లో అహింస, నిగ్రహం, భూతదయ, క్షమ, శాంతం, ధ్యానం, సత్యం, ప్రేమ, మనసులను పోలుస్తూ ఇలా రకరకాల పూలతో పూజిస్తారు.

స్త్రీలు బతుకమ్మ ఆడటం వెనక మరో విశిష్టత ఉంది. పువ్వు, స్త్రీ పునరుత్పత్తికి చిహ్నాలు. స్త్రీ గర్భం దాలిస్తే... పువ్వు ఫలదీకరణ చెంది విత్తనాలను ఇస్తుంది. ఆ విత్తనమే రేపటి అడవికి అంకురమవుతుంది. పూలు, స్త్రీలను పూజించడం, గౌరవించడం ఈ పండగలో కనిపిస్తుంది. ఈ తొమ్మిది రోజులనే స్త్రీ తొమ్మిది నెలల నిండు గర్భానికీ చిహ్నంగా భావిస్తారు. బతుకమ్మ చుట్టూ చేరి పాడే పాటల్లో మహిళలు తమ కష్టసుఖాలు, ప్రేమ, ఆప్యాయత, పురాణాలు వగైరా మేళవిస్తారు. ఊరూ వాడంతా ఒక్కచోట చేరడంతో మనుషుల మధ్య అంతరాలు దూరమవడమే కాదు స్నేహస్ఫూర్తీ ఏర్పడుతుంది. బతుకమ్మ ప్రకృతికి చిహ్నం. ఆ రూపంలో సాక్షాత్తూ గౌరీదేవి తమ పుట్టింటికి తరలి వచ్చినట్టుగా భావిస్తారు. తొమ్మిదోరోజు సద్దుల బతుకమ్మను నిమజ్జనం చేయడం ద్వారా తిరిగి శివుడి వద్దకు సాగనంపినట్టుగా భావిస్తారు. ఆడపిల్లను అత్తారింటికి పంపాకా తనకు ఎల్లప్పుడూ అండగా నిలవాలి, ప్రేమను పంచాలన్న అంతరార్థమూ ఇందులో ఉంటుంది. అలా నీటిలో నిమజ్జనం చేయడం వల్ల ఆ పూలల్లోని ఔషధ గుణాలతో నీరు శుభ్రపడి అనారోగ్యాలు రావనేది శాస్త్రీయ కోణం.

కోలాటమాడతాం...

ఏటా కాకతీయుల కాలం నాటి వేయిస్తంభాల గుడి దగ్గర బతుకమ్మ ఆడతాం. తంగేడు, గునుగు, సీతజడ... పూలతో కొప్పురం ఆకారంలో బతుకమ్మను పేరుస్తాం. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే పాటలు పాడుతూ కోలాటమాడతాం. నువ్వులు, పల్లీలు, సజ్జలు, మొక్కజొన్న, రాగులు, బెల్లంతో చేసిన పిండివంటలను ప్రసాదంగా బతుకమ్మకు సమర్పించి, అందరికీ పంచిపెడతాం. మనం ఆధారపడేదే ప్రకృతిపైన. ఆశ్వయుజ మాసంలో వర్షాలతో చెరువులు, కాలువలన్నీ నిండిపోయి ఉంటాయి. మొక్కలు, పచ్చని పైరుతో, విరబూసిన పూలతో ప్రకృతి పలకరిస్తూ ఉంటుంది. వాటికి కృతజ్ఞతలు చెబుతూనే... మన జీవితాలూ కలకాలం పచ్చగా సాగాలని కోరుకోవడమే బతుకమ్మ అంతరార్థం. దాన్ని ఆనందంగా కొనసాగిస్తూ ప్రకృతితో మానవ అనుబంధాన్ని పిల్లలకు కథలుగానూ చెబుతుంటాం.



- అనూరాధ మేరుగు,
రచయిత్రి, ఉపాధ్యాయురాలు, హనుమకొండ

బాధలన్నీ మర్చిపోతాం...



బతుకమ్మకి ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లందరూ సొంతూళ్లకు వస్తారు. అన్నదమ్ములు ఆడపడుచులను ఆనందంగా అత్తగారింటి నుంచి పుట్టింటికి తీసుకువస్తారు. మా దగ్గర పెత్రమాస (పితృ అమావాస్య) రోజు బతుకమ్మ బావిని తవ్వుతాం. మొదటి ఎనిమిది రోజులు ఆడపడుచులంతా బతుకమ్మ ఆడతాం. సద్దుల బతుకమ్మకు ముందురోజు మగవాళ్లు తంగేడు, గునుగు, టేకు, తామర, అల్లి పూలు తెస్తారు. ఆడవాళ్లు బతుకమ్మ పేర్చి, సత్తు పిండి రకరకాలుగా చేస్తారు. తొమ్మిదో రోజు ఊరి మధ్యలోకి చేరి కొద్దిసేపు, చెరువు గట్టు దగ్గర మరికొంతసేపు బతుకమ్మ ఆడతాం. చెరువులో సద్దుల బతుకమ్మను వదిలి దీవించమని కోరతాం. ఆ సమయంలో ఊరి చెరువు పూలవనంగా మారుతుంది. ఊళ్లో అందరికీ సత్తుపిండి పంచుతాం. మగవాళ్లు బాణాసంచా పేలుస్తారు. ఈ తొమ్మిది రోజులూ బాధలన్నింటినీ మరిచిపోయి... సంతోషంగా గడిపేస్తాం.

- ఎ.తిరుపతవ్వ, వెల్గొండ,
జగిత్యాల జిల్లా

మీకు తెలుసా?



పూలను చూడగానే మురిసిపోని అమ్మాయి ఉండదు. వాటిలో అంతగా ఏముందని చాలామంది ఆశ్చర్యపోతుంటారు కూడా. కానీ దీనివెనక పెద్ద సైకాలజీనే ఉంది. రంగుల ఎంపికలో అమ్మాయిలు ఎంత నిక్కచ్చిగా ఉంటారో తెలుసుగా! పూల రంగు ఏదైనా కానీ... అది వాళ్లని ఇట్టే ఆకర్షించేస్తుందట. మెదడులో హ్యాపీ హార్మోను విడుదలయ్యేలా చేసి... ఎలాంటి మూడ్‌నైనా మార్చేయడమే కాదు ఆనందం నింపేస్తుంది. ఇలా మంత్రం వేస్తాయి కాబట్టే, పూలని చూడగానే అమ్మాయిల పెదాలపై చిరునవ్వు పూస్తుంది!

ఫిర్యాదు చూసి... షాక్ అయ్యా!

నేను నాలుగేళ్లుగా ఓ అంతర్జాతీయ పాఠశాలలో పనిచేస్తున్నా. నా విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరు నా గురించి ఫిర్యాదు చేస్తూ ఉపాధ్యాయుల బృందానికి లేఖ రాశారు. ఇది తెలిసి నేను షాక్ అయ్యా. ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియజేయగలరు.

- ఓ సోదరి

ప్రజలతో మమేకమై పనిచేసే వృత్తుల్లో టీచింగ్ కూడా ఒకటి. అపార్థాలు సహజం. అయితే, మీ సమస్య గురించి ముందు ప్రిన్సిపల్‌కు వివరించండి. నిజానిజాలను విచారించమని కోరండి. ఇలాంటి ఆరోపణలను పరిష్కరించడం ప్రిన్సిపల్ బాధ్యత. దీని గురించి ఎలా స్పందించాలో కూడా ఆయనతో చర్చించండి. కుదిరితే ఆ ఫిర్యాదు ఇచ్చిన తల్లిదండ్రులతో ముఖాముఖి ఏర్పాటు చేయమనండి. మీరు కూడా ఇంతకు ముందు సాధించిన విజయాలు, తల్లిదండ్రులు మీ గురించి ఇచ్చిన సానుకూల అభిప్రాయాలు, పరీక్షల్లో మీ విద్యార్థుల ప్రదర్శన... లాంటివన్నీ జాబితా సిద్ధం చేసుకోండి. వీటన్నింటివల్లా మీ పనితనం వాళ్లకు తెలుస్తుంది. ఇలాంటి ఫిర్యాదులు ఒత్తిడి కలిగిస్తాయని తెలుసు. కానీ దాని గురించి మరీ అంతగా ఆలోచించకండి. తల్లిదండ్రుల గురించి చెడుగానూ ఎక్కడా మాట్లాడకండి. ఈ పరిస్థితిని ఓ సవాలుగా తీసుకోండి. ఇలాంటి సందర్భాలను మీ తోటి టీచర్లు ఎలా ఎదుర్కొన్నారో కూడా అడిగి తెలుసుకోండి. పేరెంట్ టీచర్ మీటింగ్‌లనూ కొనసాగించండి. అంతేకాదు, క్రమశిక్షణకు సంబంధించిన నియమాలకు కట్టుబడి ఉండండి. బోధన లక్ష్యాలేంటీ, ప్రణాళికలు, తరగతి గది మెటీరియల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులతో తరచూ మాట్లాడుతుండడం లాంటివి చేయడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవచ్చు.

డియర్... వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

బంగారం వెండి



1గ్రా ముగింపు-క్రితం


	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	78,180	77,410	75,242	75,800
ఆర్నమెంట్	71,300	71,600	70,500	71,000
వెండి (కిలో)	92,920	92,004	92,700	94,100
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	77,300	77,400	77,480	77,600
ఆర్నమెంట్	71,580	71,670	71,130	71,240
వెండి (కిలో)	91,200	91,200	93,200	93,000
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	76,630	76,760	------	------
ఆర్నమెంట్	70,500	70,810	7,050	7,080
వెండి (కిలో)	93,000	90,000	101.00	101.00

ఉడుత భక్తి కాదు...

సాధారణంగా ఉడుతల బలం ఎంత? కానీ వాటిల్లోనూ 'మెటర్నల్ అగ్రెషన్' ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అంటే వాటి పిల్లలకు ఎవరైనా హాని కలిగిస్తే, వారిని ఎదుర్కోవడానికి చేసే ప్రయత్నాలన్నమాట. అందులో తల్లికాని ఉడుతలు, మగ ఉడుతలతో పోల్చితే తల్లి ఉడుతలలు ఎక్కువగా ప్రతిస్పందించాయట. అందుకే తమ పిల్లల్ని రక్షించుకోవడం కోసం విషపూరితమైన రాటల్‌స్నేక్స్‌తోనూ పోరాడతాయి. ఈ మెటర్నల్ అగ్రెషన్‌కు వాటిలో ఉత్పత్తి అయ్యే హార్మోనులే కారణమట. తమ పిల్లలకు హాని చేస్తే ఏ తల్లి అయినా ఊరుకుంటుందా చెప్పండి!



నేనే అమ్మాయినైతే...



"నేను అమ్మాయిగా పుట్టి ఉంటే మగవాళ్లు మహిళలపై విధించే అన్యాయమైన కట్టుబాట్లను తీవ్రంగా వ్యతిరేకించేవాడిని. నాకు నా భార్యతో పదమూడేళ్లకే పెళ్లయింది. అప్పుడు తన వయసూ అంతే. మా పెళ్లిని సమర్థించుకోవడానికి ఏ ఒక్క కారణమూ కనిపించలేదు. అసలు 16ఏళ్లు దాటని అమ్మాయిలను పెళ్లి చేసుకోనని అబ్బాయిలూ చెప్పగలగాలి. నాకే గనక ఆ హక్కు ఉంటే అమ్మాయిల కనీస పెళ్లి వయసు 20ఏళ్లుగా నిర్ణయించేవాడిని"... మద్రాసు(చెన్నై)లో జరిగిన ఓ సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి గాంధీజీ చెప్పిన మాటలివి. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయడమే కాదు, మహిళల హక్కులు, వరకట్నం, బాల్య వివాహాలు వంటి అనేక సమస్యలపైనా గొంతు విప్పారాయన.

అమ్మాయిల్నీ, అబ్బాయిల్నీ తల్లిదండ్రులు ఒకేలా చూడాలనీ, బాల్య వివాహాలు, వరకట్నాల్లాంటి దురాచారాలను రూపుమాపితేనే మహిళలు శక్తిమంతంగా తయారవుతారంటారు గాంధీ. 'మహిళల హక్కుల విషయంలో నేను రాజీ పడను. అబ్బాయిలకు వర్తించని న్యాయసూత్రాలు అమ్మాయిలకు మాత్రం ఎందుకు? స్త్రీలు పురుషుల కంటే ఏ విషయంలోనూ తక్కువ కాదు. మహిళలను బలహీనులుగా చూడకూడదు. అలా చూస్తున్నామంటే వారిలోని శక్తియుక్తులను అవమానించినట్లే' అంటారు బాపు. అంతేకాదు, ఆడవాళ్లు సహజంగానే ప్రేమ, అహింస, త్యాగం, క్షమా గుణాలను కలిగి ఉంటారని బలంగా నమ్ముతారు. అందుకే, స్వాతంత్ర్య పోరాటంలోనూ మహిళలను భాగస్వాములను చేశారు. సత్యాగ్రహ, దండి యాత్రలు వంటివి మహిళల వల్లే విజయం సాధించాయని భావిస్తారు. ఆడవారిపట్ల ఈ దృక్పథం అలవడడానికి తన తల్లి, భార్య కస్తూర్బాలే కారణం అంటారాయన. మహిళలకు విద్య అందించడం ద్వారా వాళ్లకు స్వేచ్ఛనీ, ఆత్మవిశ్వాసాన్నీ కలిగించొచ్చని నమ్మి... ఆనాడు తెచ్చిన ఎన్నో సామాజిక సంస్కరణలు మహిళా సాధికారతకు పట్టం కట్టాయి.

మరి బాల్య వివాహాలు, వరకట్నాలు రూపుమాపడంలో గాంధీజీ కన్న కలలు నెరవేరాయా అంటే లేదని వెక్కిరించే (చెప్పే) ఘటనలు ఇప్పటికీ మన దేశంలో జరుగుతూనే ఉన్నాయి. తాజాగా రాజస్థాన్‌కు చెందిన 20ఏళ్ల యువతి తన బాల్య వివాహానికి వ్యతిరేకంగా చేసిన పోరాటమే అందుకు ఉదాహరణ. జోధ్‌పూర్‌లోని ఓ పేద రైతు కుటుంబంలో పుట్టింది అనిత. నాలుగు నెలల పసిప్రాయంలోనే 2004లో ఓ వ్యక్తికిచ్చి తనకు పెళ్లిచేశారు తల్లిదండ్రులు. ఇప్పుడు ఆమెకు 20ఏళ్లు. అత్తింటివారు తనను త్వరగా కాపురానికి పంపించాలంటూ తరచూ పోరుపెడుతుండడంతో, ఒత్తిడి తట్టుకోలేని ఆమె బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడే ఓ సంస్థను ఆశ్రయించారు. దాంతో వారు ఆమె తరపున ఫ్యామిలీ కోర్టులో కేసు వేశారు. తాజాగా కోర్టు ఈ పెళ్లిని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. అంతేకాదు కోర్టు ఖర్చులనూ చెల్లించాలని అత్తమామలను ఆదేశించింది. బాల్య వివాహాలను రద్దు చేసుకునే హక్కు పిల్లలకు ఉందనీ, వీటి నిర్మూలనకు సమాజకృషి ఎంతో అవసరమనీ కోర్టు వ్యాఖ్యానించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా, బాల్యవివాహాల నిషేధానికి ఎందరో మహనీయులు కృషిచేసినా ఇంకా అమ్మాయిలు తమ కనీస హక్కుల గురించి కూడా పోరాడాల్సి రావడం బాధాకరం.



అనిత



మిల్లెట్‌లతో ఆర్ట్!

కేక్ ఆర్టిస్ట్‌గా దేశంలోనే కాదు... ప్రపంచవ్యాప్తంగానూ గుర్తింపు తెచ్చుకున్నారు **ప్రాచీ దబల్ దేబ్**. రాయల్ ఐసింగ్ ఆర్ట్‌తో ఎత్తైన కట్టడాలు కట్టి, మూడు ప్రపంచ రికార్డులూ నెలకొల్పారు. అంతేకాదు, యూకే పార్లమెంట్, ఆక్స్‌ఫర్డ్‌ల నుంచి గుర్తింపునీ పొందారు. ఆక్స్‌ఫర్డ్ నుంచి ఆనరీ అవార్డు పొందిన తొలి కేక్ ఆర్టిస్ట్ ప్రాచీ. వీగన్ విధానంలో చారిత్రక కట్టడాలను రూపొందించడం ప్రాచీ ప్రత్యేకత. ఈమెది మధ్యప్రదేశ్. స్థిరపడిందేమో పుణెలో. 2012లో కేక్ తయారీ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె... దానిలో ప్రయోగాలెన్నో చేశారు. విక్టోరియా, యూరోపియన్ కట్టడాలను ఐసింగ్ నైపుణ్యాలతో తీర్చిదిద్దుతుంటారు. బ్రిటిష్ రాజకుటుంబానికి ప్రత్యేకంగా కేకులు చేసిచ్చిన ఘనత ఈమెది. మిలాన్ క్యాథడ్రెల్ చర్చిని కేకు రూపంలో ఆవిష్కరించి గత ఏడాది రికార్డులు సృష్టించారు. అందుకే ప్రాచీకి 'క్వీన్ ఆఫ్ రాయల్ ఐసింగ్'గానూ పేరు. తాజాగా అందంగా తీర్చిదిద్దడంతోపాటు ఆరోగ్యానికీ ప్రాధాన్యమిస్తూ 'మిల్లెట్ కుకీ హౌజ్'ను రూపొందించారు ప్రాచీ. ఏడడుగుల వెడల్పు, 5.1 అడుగుల ఎత్తుతో 75 కేజీల్లో దీన్ని రూపొందించారామె. నట్టీ ఫ్లేవర్‌లో రూపొందించిన ఈ కుకీ హౌజ్ తయారీలో దాల్చినచెక్క, అల్లం, లవంగం వంటి స్పైసెస్‌లను వాడారట. 'మిల్లెట్స్‌లో ఫైబర్, ప్రొటీన్, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ సూపర్ ఫుడ్‌కి మోడరన్ బేకింగ్ టెక్నిక్స్‌నీ, సృజనాత్మకతనూ జోడించి ప్రచారం కల్పించాలనుకున్నా. స్నాక్స్, బేకరీ ఆహారం అంటే ఇష్టపడే యువతకు రుచికితోడు ఆరోగ్యాన్నిచ్చే వాటిని అందివ్వాలనుకున్నా. అలా ఆరోగ్యకరమైన బేకింగ్‌కి ప్రచారం కల్పించడం నా ఉద్దేశం' అంటున్నారీమె. ఈమె తాజా ప్రయత్నానికి నెట్టింట ప్రశంసలూ దక్కుతున్నాయి.



ప్రాచీ



సిలిండర్‌కూ ఓ కవర్!

స్మార్ట్ కిచెన్

ఒక్కో పనికి ఒక్కో వస్తువు వాడడం సాధారణం. ఒకే వస్తువుతో రెండు మూడు పనులు చేయడం స్మార్ట్ వర్క్. అందుకు ఉపయోగపడే కొన్ని వస్తువులు ఇవే...

ఒకే గిన్నె... లాభాలు మూడు!

సాధారణంగా మనం కూరగాయలు కడగడానికీ, క్యారెట్, బీట్‌రూట్ లాంటివి తరగడానికీ... ఇలా ఒక్కోపనికి ఒక్కో వస్తువును వాడుతుంటాం. అలాకాకుండా ఒకేగిన్నెతో మూడు పనులు అయిపోతే బావుంటుంది కదా! అయితే, 'త్రీఇన్‌వన్ గిన్నె'ను తీసుకురండి. దీన్లో గ్రేటర్, డ్రెయిన్ బాస్కెట్, బేసిన్... అన్నీ కలిసి సెట్‌లా వస్తాయి. గ్రేటర్ మనకు మూతలానూ ఉపయోగపడుతుంది. ఎక్కువ చోటు ఆక్రమించదు కాబట్టి, వంటగదిలో ఈజీగా సర్దేయొచ్చు కూడా.



శుభ్రంగా...

గ్యాస్‌స్టవ్‌ను తుడిచినంత తరచుగా సిలిండర్‌ను తుడవము. దాంతో దానిపై దుమ్మూ, ధూళి పేరుకుని చూడ్డానికి ఇబ్బందిగా ఉంటుంది. అలాకాకుండా ఉండేందుకు ఇప్పుడు 'సిలిండర్ కవర్లు' కూడా మార్కెట్లోకి వచ్చేశాయి. రకరకాల డిజైన్లలో అందుబాటులోకి వస్తున్నాయి. వీటివల్ల సిలిండర్‌పై దుమ్ము చేరకుండా ఉండడమే కాదు, చూడ్డానికీ అందంగా ఉంటుంది.





రెండూ ఒకేదాన్లో...

మామూలుగా స్టీలు పాత్రల కోసం స్పాంజి, జిడ్డు పాత్రల కోసం గరుకుగా ఉండే స్క్రబ్బర్‌ను వాడుతుంటాం కదా! పాత్రను బట్టి వీటినీ అదేపనిగా మారుస్తూ ఉండాలి. అలాకాకుండా ఒకే స్క్రబ్బర్‌లో రెండు రకాలవీ ఉంటే పనిచేసుకోవడానికీ అనువుగా ఉంటుంది. అందుకోసం వచ్చిందే ఈ 'డబుల్‌సైడ్ వాషింగ్ స్క్రబ్బర్'. దీంతో పనికూడా వేగంగా అవుతుంది. ఓసారి ప్రయత్నించి చూడండి.

టెస్టు మ్యాచ్‌లో రోజుకు 90 ఓవర్లు వేస్తారు. భారత్-బంగ్లాదేశ్ రెండో టెస్టులో తొలి రోజు 35 ఓవర్ల ఆట మాత్రమే సాగితే.. తర్వాతి రెండు రోజులు ఆట పూర్తి తుడిచిపెట్టుకుపోయింది. నాలుగో రోజు 85 ఓవర్లు, చివరి రోజు 53.2 ఓవర్లు పడ్డాయి. మొత్తంగా ఈ మ్యాచ్‌లో వేసింది 173.2 ఓవర్లే. అంటే కనీసం రెండు రోజుల పూర్తి ఆట కూడా సాగలేదన్నమాట. కానీ బంగ్లాదేశ్‌ను చుట్టేయడానికి, సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడానికి ఆ కొంత సమయం, కొన్ని ఓవర్లే సరిపోయాయి రోహిత్‌సేనకు. నాలుగో రోజు దూకుడైన ఆటతో గెలుపు అవకాశాలు సృష్టించుకున్న టీమ్‌ఇండియా.. చివరి రోజు అనుకున్నట్లే ప్రత్యర్థిని కుప్పకూల్చి, చిన్న లక్ష్యాన్ని అలవోకగా ఛేదించేసి సిరీస్‌లో బంగ్లాతో సున్నా చుట్టించేసింది. పాకిస్థాన్‌పై సంచలన సిరీస్ విజయం తర్వాత గాల్లో తేలిపోయిన బంగ్లా.. భారత్ దెబ్బకు నేలకు దిగొచ్చేసింది.

ఛాంపియన్

18 సొంతగడ్డపై భారత్ వరుసగా సాధించిన సిరీస్ విజయాలు. 11వ సిరీస్ సాధించినపుడే ప్రపంచ రికార్డు భారత్ సొంతమైంది. 2021-22 సీజన్లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడాక టీమ్‌ఇండియా ఇంటా బయటా ఒక్క సిరీసూ ఓడిపోలేదు. ఏడు సిరీస్‌ల్లో ఆరు సొంతం చేసుకుంది. ఒకటి డ్రా అయింది.


ట్రోఫీతో భారత జట్టు

312 ఈ మ్యాచ్‌లో భారత్ ఎదుర్కొన్న బంతులు. ఓ జట్టు గెలిచిన టెస్టులో ఆడిన నాలుగో అత్యల్ప బంతులివి. రికార్డు ఇంగ్లాండ్ (1935లో వెస్టిండీస్‌పై 276) పేరిట ఉంది. రెండో స్థానంలోనూ భారతే ఉంది. ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో టీమ్‌ఇండియా 281 బంతులే బ్యాటింగ్ చేసి మ్యాచ్ గెలిచింది.

ఊడ్చేశారు

● సిరీస్ 2-0తో భారత్ సొంతం

కాన్పూర్ టెస్టులోనూ బంగ్లా చిత్తు ● రెండో ఇన్నింగ్స్‌లో 146కే ఆలౌట్

కాన్పూర్

సొంతగడ్డపై జైత్రయాత్రను కొనసాగించిన టీమ్‌ఇండియా.. మరో సిరీస్ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను 2-0తో చిత్తు చేసింది. రెండో టెస్టుకు వర్షం తీవ్ర అంతరాయం కలిగించినప్పటికీ.. ఉన్న తక్కువ సమయాన్ని చక్కగా వినియోగించుకుంటూ వ్యూహాత్మకంగా, దూకుడుగా ఆడిన రోహిత్ సేన.. 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 26/2తో చివరి రోజు, మంగళవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా.. బుమ్రా (3/17), జడేజా (3/34), అశ్విన్ (3/50)ల ధాటికి 47 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. షాద్మన్ ఇస్లామ్ (50; 101 బంతుల్లో 10×4), ముష్ఫికర్ రహీమ్ (37; 63 బంతుల్లో 7×4) కాస్త పోరాడారు. అనంతరం 95 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 17.2 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (51; 45 బంతుల్లో 8×4, 1×6) మరో మెరుపు అర్ధశతకం సాధించాడు. అతడికే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. రెండు మ్యాచ్‌ల్లో కలిపి 11 వికెట్లు, 114 పరుగులు సాధించిన అశ్విన్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు. రెండు జట్లు గురువారం నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడతాయి. తర్వాత రెండు వన్డేల సిరీస్ జరుగుతుంది.

అలవోకగా..: లంచ్‌కే బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిసిపోయింది. ఇంకా రెండు సెషన్లున్నాయి. చేయాల్సిన పరుగులు 95 పరుగులే. వర్షం ముప్పు లేదు. ఖాయంగా కనిపించిన విజయాన్ని సొంతం చేసుకోవడానికి భారత్ ఎక్కువ సమయం తీసుకోలేదు. గంటన్నరలోనే పని పూర్తి చేసింది. కానీ ఆరంభంలో భారత్ కొంత ఉత్కంఠను ఎదుర్కొంది. కెప్టెన్ రోహిత్ (8), శుభ్‌మన్ (6) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. వీళ్లిద్దరినీ స్పిన్నర్ మెహిదీ హసన్ మిరాజ్ (2/44) పెవిలియన్ చేర్చి భారత్ మీద ఒత్తిడి తెచ్చినా.. ఓపెనర్ యశస్వి తొలి ఇన్నింగ్స్ ఊపును కొనసాగిస్తూ మరో మెరుపు ఇన్నింగ్స్ ఆడడం, కోహ్లి (29 నాటౌట్; 37 బంతుల్లో 4×4) అతడికి సహకరించడంతో భారత్ అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. 43 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన యశస్వి.. విజయానికి 3 పరుగులే అవసరమైన స్థితిలో ఔటయ్యాడు. పంత్ (4 నాటౌట్) ఫోర్ కొట్టి లాంఛనాన్ని పూర్తి చేశాడు.

నిలవలేక..: బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో నాలుగో రోజే రెండు వికెట్లు పడిపోయాయి. ఆ రెండూ అశ్విన్ ఖాతాలో చేరాయి. సోమవారం సాయంత్రం బంతి తిరిగిన తీరు చూస్తేనే.. చివరి రోజు అశ్విన్, జడేజాలను ఎదుర్కోవడం బంగ్లా బ్యాటర్లకు అంత తేలిక కాదని.. ఎంత పోరాడినా టీలోపే వాళ్ల కథ ముగించి భారత్ విజయం దిశగా దూసుకెళ్తుందని విశ్లేషకులు అంచనా వేశారు. అయితే బంగ్లా పోరాటం రెండో సెషన్ వరకు కూడా వెళ్లలేదు. లంచ్ లోపే ఆ జట్టు కథ ముగించేశారు బౌలర్లు. ముందు రోజు ఊపును కొనసాగిస్తూ అశ్విన్ తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో మొమినుల్ (2)ను పెవిలియన్ చేర్చడంతో బంగ్లాకు ఆరంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. అయితే షాద్మన్‌తో కలిసి బంగ్లా కెప్టెన్ నజ్ముల్ శాంటో (19) పోరాడడంతో గంట పాటు వికెట్ పడలేదు. వీరి పట్టుదల చూస్తే బంగ్లా డ్రా కోసం గట్టిగానే ప్రయత్నిస్తుందనిపించింది. కానీ జడేజా మాయ మొదలవడంతో చూస్తుండగానే ఆ జట్టు కుప్పకూలిపోయింది. బంతిని చక్కగా టర్న్ చేస్తూ బంగ్లా బ్యాటర్లకు సవాలు విసిరిన జడ్డూ.. స్వల్ప వ్యవధిలో నజ్ముల్, లిటన్ (1), షకిబ్ (0)లను ఔట్ చేసి బంగ్లాను కోలుకోలేని దెబ్బ తీశాడు. మరోవైపు ఆకాశ్ దీప్.. నిలకడగా ఆడుతున్న షాద్మన్‌ను పెవిలియన్ చేర్చాడు. దీంతో బంగ్లా 91/3 నుంచి 94/7కు చేరుకుంది. ఈ స్థితిలో ముష్ఫికర్, మెహిదీ హసన్ మిరాజ్ (9) కొంచెం ప్రతిఘటించినా.. బుమ్రా తన కొత్త స్పెల్‌లో మూడు వికెట్లు పడగొట్టి బంగ్లా కథ ముగించాడు.


జైస్వాల్ 51


అశ్విన్

7.36 రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఈ మ్యాచ్‌లో భారత్ రన్‌రేట్. ఓ టెస్టులో 300కు పైగా పరుగులు చేసిన జట్లలో ఇదే అత్యధికం. 2005లో జింబాబ్వేపై దక్షిణాఫ్రికా (6.80) నెలకొల్పిన రికార్డు బద్దలైంది.

11 టెస్టుల్లో అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు. అగ్రస్థానంలో ఉన్న ముత్తయ్య మురళీధరన్‌ను సమం చేశాడు.

బజ్‌బాల్‌ను మించి..

ఈనాడు క్రీడావిభాగం

పరిమిత ఓవర్ల క్రికెట్లో మాదిరి ధనాధన్ బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను బెదరగొట్టడం.. ఫలితం రాబట్టడం కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం.. త్వరగా డిక్లేర్ చేయడం.. తద్వారా విజయానికి బాటలు వేసుకోవడం.. ఈ తరహా శైలికి ఇంగ్లాండ్ పెట్టుకున్న పేరు 'బజ్‌బాల్'. ఈ శైలితోనే ఇంగ్లిష్ జట్టు కొన్ని అద్భుత విజయాలు సాధించింది. కానీ కొన్నిసార్లు బజ్‌బాల్ పేరుతో అనాలోచిత నిర్ణయాలు ఎదురు దెబ్బలూ తింది. కానీ ఇప్పుడు టీమ్‌ఇండియా దూకుడు, వ్యూహం కలగలిపి 'బజ్‌బాల్'ను మించే శైలితో బంగ్లాదేశ్‌పై కాన్పూర్‌లో తిరుగులేని విజయం సాధించింది. రెండున్నర రోజులకు పైగా ఆట వర్షార్పణం అయినా.. ఏమాత్రం వెరవకుండా విజయం మీదే కన్నేసి వ్యూహాత్మకంగా, ప్రత్యర్థిని బెంబేలెత్తించే దూకుడుతో ఆడి ఇంకా సగం రోజు ఆట మిగిలుండగానే మ్యాచ్‌ను సొంతం చేసుకున్న తీరు అసామాన్యం. బంగ్లాదేశ్‌తో సిరీస్ అంటే మామూలుగా పెద్దగా ఆసక్తి, ప్రాధాన్యం ఉండవు. కానీ పాకిస్థాన్‌ను దాని సొంతగడ్డపై చిత్తు చేసి సిరీస్ విజయం సాధించడంతో బంగ్లాను అంత తేలిగ్గా తీసుకోలేని పరిస్థితి. మరోవైపు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఫైనల్లో చోటు సంపాదించాలంటే సిరీస్‌లో కచ్చితంగా గెలవాల్సిన స్థితిలో భారత్ ఉంది. ఈ నేపథ్యంలో ఫలితం అటు ఇటు అయితే భారత్‌కు చాలా ఇబ్బంది అయ్యేది. తొలి టెస్టును తిరుగులేని ఆధిపత్యంతో నెగ్గిన భారత్‌కు కాన్పూర్‌లో వరుణుడు అడ్డు పడ్డాడు. అయినా సంచలన ఆటతీరుతో రోహిత్‌సేన మ్యాచ్‌ను గెలుచుకుంది. గెలవడం కంటే గెలిచిన తీరు ప్రత్యేకం. ఈసారి ఎలాగైనా డబ్ల్యూటీసీలో విజేతగా నిలవాలని పట్టుదలతో ఉన్న రోహిత్‌సేనకు ఈ విజయం ఎంతో స్ఫూర్తినిచ్చేదే. అందులోనూ గత పర్యాయం డబ్ల్యూటీసీ ఫైనల్లో ఓడించిన ఆస్ట్రేలియాను బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఎదుర్కొనే ముందు ఇలా గెలవడం జట్టుకు మంచి ఉత్సాహాన్నిస్తుంది. ఈ సిరీస్‌లో మరో సానుకూలాంశం.. విదేశాల్లో పిచ్‌లకు మరింత అలవాటు పడేలా రెండు మ్యాచ్‌ల్లోనూ పేస్ పిచ్‌లను తయారు చేయించుకుని వాటి మీద ఆధిపత్యం చలాయించి విజయాలు సాధించడం. చెన్నై ఎన్నడూ లేనంతగా పేస్‌కు సహకరించింది. దాన్ని భారత్ చక్కగా ఉపయోగించుకుంది. కాన్పూర్‌లోనూ పరిస్థితులు పేసర్లకు అనుకూలించాయి. అలాగే స్పిన్నర్లూ ప్రభావం చూపారు. బ్యాటింగ్‌కు సవాలుగా నిలిచిన పరిస్థితులను భారత్ బాగానే కాచుకుంది. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు సొంతగడ్డపై న్యూజిలాండ్‌తోనూ సిరీస్ ఆడబోతోంది భారత్. అందులోనూ ఇదే తరహాలో సవాలు విసిరే పిచ్‌లు రూపొందించుకుని, మెరుగైన ప్రదర్శనతో సిరీస్ సాధిస్తే.. బోర్డర్ గావస్కర్ ట్రోఫీకి మరింత ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం కావచ్చు.

మహిళల టీ20 ప్రపంచకప్ రేపటి నుంచే

అమ్మాయిలకూ ఓ 83 కావాలి!



ఈనాడు క్రీడావిభాగం

కపిల్ డెవిల్స్ 1983 ప్రపంచకప్ విజయం భారత్‌లో క్రికెట్‌ను ఎలా మార్చిందో వేరే చెప్పక్కర్లేదు. ఆటలో భారత్ ఇప్పుడో బలీయమైన శక్తి. అయితే మహిళల క్రికెట్లోనూ మనదేశం ఆ స్థాయిని అందుకోవాలన్నది అందరి ఆకాంక్ష. గత కొన్నేళ్లలో మహిళల క్రికెట్లో ఎంతో ప్రగతి సాధించిందనడంలో సందేహం లేదు. అయితే ప్రబల శక్తిగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి జట్ల సరసన నిలవాలంటే మహిళలకూ ఓ '83' అవసరం. అమ్మాయిల క్రికెట్లో కప్పు కోసం భారత్ నిరీక్షణ దశబ్దాలది. ఆ నిరీక్షణకు తెర దించడానికి ఇప్పుడో చక్కని అవకాశం భారత్ ముందుంది. యూఏఈలో రేపటి నుంచే మహిళల టీ20 ప్రపంచకప్. హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు మంచి అంచనాలతోనే బరిలోకి దిగుతోంది. నిజానికి నారీ జట్టు ఇప్పటికే కప్పును ముద్దాడాల్సింది. కానీ అది అందినట్లే అంది చేజారింది. 2020 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో పరాభవం మిగిల్చిన వేదన అంతా ఇంతా కాదు. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడింది. 2017 వన్డే ప్రపంచకప్ ఫైనల్లోనూ భారత్ పరాజయంపాలైంది. ఇంగ్లాండ్‌తో ఫైనల్లో చక్కగా ఆడినా.. విజయాన్ని ఒడిసి పట్టలేకపోయింది. గెలుపు ముంగిట బోల్తా కొట్టింది. మొత్తంగా ఐసీసీ మహిళల ప్రపంచకప్ ఫైనల్స్‌లో భారత్ మూడుసార్లు భంగపడింది. మరి ఆటను, స్థాయిని, విజయేచ్ఛనూ పెంచుకున్న మన జట్టు.. ఈసారైనా కప్పు కొడుతుందా? దీర్ఘకాల స్వప్నాన్ని నెరవేర్చుకుంటుందా? కోట్ల జతల కళ్లు అటే చూస్తున్నాయి ఆశగా, నమ్మకంగా..!


మంధాన


హర్మన్

హర్మన్‌సేన సిద్ధం

టీ20 ప్రపంచకప్‌లో బలమైన జట్లలో హర్మన్ బృందం ఒకటి. కిందటిసారి సెమీఫైనల్లో ఓడిన భారత్.. ఈసారి మరింత పట్టుదలతో పోరాటానికి సిద్ధమైంది. గ్రూప్-ఎలో శుక్రవారం దుబాయ్‌లో న్యూజిలాండ్‌తో పోరుతో కప్పు వేటను ఆరంభిస్తుంది. అయితే భారత్ సన్నాహకం గొప్పగా లేదనే చెప్పాలి. గత రెండు నెలల్లో అంతర్జాతీయ క్రికెట్టే ఆడలేదు. జులైలో శ్రీలంకతో ఆసియాకప్ ఫైనలే భారత్‌కు ఆఖరి మ్యాచ్. జట్టు సుదీర్ఘ సన్నాహక శిబిరంలో బాగానే సాధన చేసింది. ఛాంపియన్‌గా నిలవడానికి అవసరమైన అన్ని వనరులూ భారత్‌కు ఉన్నాయి. మంచి ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు షెఫాలి వర్మ, స్మృతి మంధాన జట్టుకు గొప్ప బలం. కొంతకాలం ఫామ్ కోల్పోయినా.. తిరిగి పరుగుల బాట పట్టిన జెమీమా రెట్టించిన ఉత్సాహంతో ఉంది. హార్డ్ హిట్టర్ రిచా ఘోష్ రూపంలో మంచి ఫినిషర్ ఉండడం భారత్‌కు మరో సానుకూలాంశం. కాస్త ఇబ్బందిపడ్డా హేమలత మూడో స్థానంలో కుదురుకుంది. భారత్ బౌలింగ్‌లో కూడా బలంగా ఉంది. ముఖ్యంగా దీప్తి శర్మ, రాధ, ఆశా శోభన, శ్రేయాంకలతో పటిష్ఠమైన స్పిన్ విభాగంతో స్పిన్‌కు అనుకూలించే మందకొడి పిచ్‌లపై పోరుకు భారత్ సై అంటోంది. అయితే శ్రేయాంక ఎడమచేతి గాయం ఆందోళన కలిగించే విషయమే. ఇక పేస్ విభాగంలో రేణుక సింగ్ కొత్త బంతితో రాణించడం భారత్‌కు కీలకం. పూజ వస్త్రాకర్, తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి ఇటీవల కాలంలో బాగా మెరుగుపడ్డారు. అయితే దుబాయ్, షార్జాల్లో వేదికలు పేస్ బౌలర్లకు పెద్దగా సహకరించవు. మొత్తంగా జట్టులో చాలా మంది మంచి క్రికెటర్లే ఉన్నా.. వాళ్లు సమష్టిగా రాణిస్తారా లేదా అన్నదానిపైనే జట్టు భవితవ్యం ఆధారపడి ఉంది.

తేలిక కాదు

డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్థాన్‌లతో పాటు భారత జట్టు గ్రూప్-ఎలో ఉంది. అన్నీ బలమైన జట్లే. జట్టు బాగానే ఉన్నా.. ఈ కఠినమైన గ్రూప్ నుంచి సెమీఫైనల్ చేరడం భారత్‌కు అంత తేలిక కాదు. నాలుగు మ్యాచ్‌ల్లో కనీసం మూడు నెగ్గాలి. అత్యుత్తమంగా ఆడితే తప్ప ముందంజ వేయడం కష్టం. ఆరు టైటిళ్లతో తిరుగులేని రికార్డున్న ఆస్ట్రేలియా జట్టు.. భారత్‌కు పెద్ద అడ్డంకి. ఇప్పటివరకు ఆ జట్టుతో ఆడిన 34 టీ20 మ్యాచ్‌ల్లో భారత్ 8 మాత్రమే గెలిచింది. న్యూజిలాండ్‌కు కూడా భారత్‌పై మెరుగైన రికార్డుంది. ఆ జట్టుతో ఆడిన 13 మ్యాచ్‌ల్లో భారత్ నాలుగు మాత్రమే నెగ్గింది. ఇక పాకిస్థాన్(ముఖాముఖిలో భారత్ 12-3)తో మ్యాచ్ అంటే ఎంత తీవ్రత, ఒత్తిడి ఉంటాయో తెలిసిందే. మరోవైపు శ్రీలంకతో ముఖాముఖిలో తిరుగులేని రికార్డు (18-5) ఉన్నప్పటికీ ఆ జట్టును ఏమాత్రం అంచనా వేయడానికి వీల్లేదు. చమరి ఆటపట్టు నేతృత్వంలోని ఆ జట్టు ఈ ఏడాది మహిళల ఆసియాకప్ ఫైనల్లో భారత్‌కు షాకిచ్చింది. మరి హర్మన్‌ప్రీత్ బృందం ఈ సవాళ్లను ఎలా అధిగమిస్తుందో చూడాలి.

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 233; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 285/9 డిక్లేర్డ్

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: షాద్మన్ (సి) యశస్వి (బి) ఆకాశ్ 50; జాకిర్ ఎల్బీ (బి) అశ్విన్ 10; హసన్ మహమూద్ (బి) అశ్విన్ 4; మొమినుల్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 2; నజ్ముల్ (బి) జడేజా 19; ముష్ఫికర్ (బి) బుమ్రా 37; లిటన్ (సి) పంత్ (బి) జడేజా 1; షకిబ్ (సి) అండ్ (బి) జడేజా 0; మిరాజ్ (సి) పంత్ (బి) బుమ్రా 9; తైజుల్ ఎల్బీ (బి) బుమ్రా 0; ఖలెద్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (47 ఓవర్లలో ఆలౌట్) **146; వికెట్ల పతనం:** 1-18, 2-26, 3-36, 4-91, 5-93, 6-94, 7-94, 8-118, 9-130; **బౌలింగ్:** బుమ్రా 10-5-17-3; అశ్విన్ 15-3-50-3; ఆకాశ్ దీప్ 8-3-20-1; సిరాజ్ 4-0-19-0; జడేజా 10-2-34-3

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (సి) హసన్ (బి) మిరాజ్ 8; యశస్వి (సి) షకిబ్ (బి) తైజుల్ 51; శుభ్‌మన్ ఎల్బీ (బి) మిరాజ్ 6; కోహ్లి నాటౌట్ 29; పంత్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 0 **మొత్తం:** (17.2 ఓవర్లలో 3 వికెట్లకు) **98; వికెట్ల పతనం:** 1-18, 2-34, 3-92; **బౌలింగ్:** మెహిదీ హసన్ మిరాజ్ 9-0-44-2; షకిబ్ 3-0-18-0; తైజుల్ ఇస్లామ్ 5.2-0-36-1

షకిబ్‌కు కోహ్లి బ్యాట్


షకిబ్, కోహ్లి

కాన్పూర్: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్‌కు టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి తన బ్యాట్‌ను బహుమతిగా ఇచ్చాడు. బంగ్లాపై భారత్ ఘన విజయం సాధించిన తర్వాత.. విరాట్ బంగ్లా జట్టు దగ్గరకు వెళ్లి తన బ్యాట్‌ను షకిబ్‌కు అందించాడు. ఇద్దరూ సరదాగా కాసేపు మాట్లాడుకున్నాక.. షకిబ్ ఆ బ్యాట్‌తో షాడో సాధన చేశాడు. స్వదేశంలో వీడ్కోలు పలికే అవకాశం లభిస్తే ఓ టెస్టు మ్యాచ్ ఆడతానని, లేదంటే కెరీర్లో కాన్పూర్ మ్యాచ్ తనకు ఆఖరిదని షకిబ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాన్పూర్ టెస్టు షకిబ్ కెరీర్‌లో 71వ మ్యాచ్. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ఈ ఆల్‌రౌండర్ క్రికెట్‌కు పూర్తిగా వీడ్కోలు పలికే అవకాశం ఉంది.

సూర్యవంశీ శతకం

భారత్‌కు స్వల్ప ఆధిక్యం


సూర్యవంశీ

చెన్నై: వైభవ్ సూర్యవంశీ (104; 62 బంతుల్లో 14×4, 4×6) సెంచరీ సాధించడంతో ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో తొలి అనధికారిక టెస్టులో భారత్ అండర్-19 జట్టు 3 పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 103/0తో మంగళవారం, రెండోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ ఒక దశలో 133/0తో పటిష్ఠమైన స్థితిలో నిలిచింది. కానీ సెంచరీ చేసిన 13 ఏళ్ల సూర్యవంశీ (ఓవర్‌నైట్ స్కోరు 81) ఔటయ్యాక తడబడింది. భారత సంతతికి చెందిన లెగ్ స్పిన్నర్ విశ్వ రామ్ కుమార్ (4/79), ఆఫ్ స్పిన్నర్ థామస్ బ్రౌన్ (3/79) విజృంభించడంతో క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుని 296 పరుగులకే ఆలౌటైంది. సూర్యవంశీతో పాటు మరో ఓవర్‌నైట్ బ్యాటర్ విహాన్ మల్హోత్రా (76) రాణించాడు. కెప్టెన్ సోహమ్ (33), అభిగ్యాన్ (32), నిఖిల్ (20) కాస్త నిలవడంతో భారత్ 300 చేరువగా స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 293 పరుగులు చేసింది.

పార్థ్‌కు రెండు స్వర్ణాలు


పార్థ్

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్(పెరూ)లో పార్థ్ రాకేశ్ మానె మెరిశాడు. రెండు స్వర్ణ పతకాలతో సత్తాచాటాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో పార్థ్ 250.7- 250తో హువాంగ్ లివాన్లిన్ (చైనా)పై నెగ్గి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. పార్థ్, అభినవ్ షా, అజయ్ మలిక్‌లతో కూడిన భారత జట్టు టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది. భారత్ (1883.5), అమెరికా (1877.6), జర్మనీ (1873.9) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో భారత్ బంగారు పతకం కైవసం చేసుకుంది. గౌతమి భానోత్, శాంభవి క్షీరసాగర్, అనుష్క ఠాకూర్‌లతో కూడిన భారత బృందం (1894.8) అగ్రస్థానం సాధించింది. మొత్తం అయిదు స్వర్ణాలతో పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

హైదరాబాద్ సారథి తిలక్

ఈనాడు, హైదరాబాద్: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టుకు తిలక్ వర్మ సారథ్యం వహించనున్నాడు. 2024-25 రంజీ సీజన్‌లో మొదటి రెండు మ్యాచ్‌ల కోసం హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) సీనియర్ సెలెక్షన్ కమిటీ మంగళవారం జట్టును ప్రకటించింది. కెప్టెన్‌గా తిలక్, వైస్ కెప్టెన్‌గా రాహుల్ సింగ్‌ను ఎంపిక చేసింది.

హైదరాబాద్-చెన్నయిన్ మ్యాచ్ డ్రా

ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్ ఎఫ్‌సీ పాయింట్ల ఖాతా తెరిచింది. మంగళవారం 0-0తో చెన్నయిన్ ఎఫ్‌సీతో డ్రా చేసుకుంది. ఈ మ్యాచ్‌లో రెండు జట్లూ గోల్స్ కోసం గట్టిగానే పోరాడినా ఫలితం సాధించలేకపోయాయి. ఈ సీజన్లో 3 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ తొలి రెండింట్లో ఓడిపోయింది.

మెరిసిన రహానె.. ముంబయి 237/4



రహానె

లఖ్‌నవూ: కెప్టెన్ అజింక్య రహానె (86 బ్యాటింగ్; 197 బంతుల్లో 6×4, 1×6) సత్తాచాటడంతో రెస్ట్ ఆఫ్ ఇండియాతో జరుగుతున్న ఇరానీ కప్ పోరులో ముంబయి భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. తొలి రోజు, మంగళవారం ఆట నిలిచే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 68 ఓవర్లలో 4 వికెట్లకు 237 పరుగులు సాధించింది. ముకేశ్ కుమార్ (3/60) విజృంభించడంతో 37 పరుగులకు మూడు వికెట్లు నష్టపోయి కష్టాల్లో చిక్కుకున్న ముంబయికి రహానె, శ్రేయస్ అయ్యర్ (57) అండగా నిలిచారు. అనంతరం రహానె.. సర్ఫరాజ్ (54 బ్యాటింగ్)తో అయిదో వికెట్‌కు అజేయంగా 98 పరుగులు జతచేసి ముంబయిని మెరుగైన స్థితికి చేర్చాడు. టీ విరామానంతరం వెలుతురు మందగించడంతో అంపైర్లు ఆటను ముందే నిలిపివేశారు.


పోలీసు వాహనంలో వాంగ్‌చుక్

పోలీసుల నిర్బంధంలో సోనమ్ వాంగ్‌చుక్

దిల్లీ: లద్దాఖ్‌కు ఆరో షెడ్యూల్, రాష్ట్ర హోదాలు కోరుతూ ర్యాలీగా వస్తున్న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సహా మరో 120 మందిని దిల్లీ సరిహద్దులో సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారంతా మంగళవారం నుంచి తమను నిర్బంధించిన పోలీసుస్టేషన్లలోనే నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. లేహ్ అపెక్స్ బాడీ (ఎల్‌ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ) నేతృత్వంలో గత నెల 1న లేహ్ నుంచి వాంగ్‌చుక్ 'దిల్లీ చలో పాదయాత్ర'ను మొదలుపెట్టారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చే విషయంలో జనాలు, వారి భూమి, సాంస్కృతిక గుర్తింపును రక్షించేలా చట్టాలను రూపొందించే అధికారాన్ని ఇస్తుంది. పోలీసులు తనను నిర్బంధించారని సోనమ్ వాంగ్‌చుక్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'నన్ను, 150 మంది పాదయాత్రదారులను వెయ్యి మంది పోలీసులు నిర్బంధించారు. మా భవిష్యత్తు ఏంటో తెలియదు' అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వాంగ్‌చుక్ నిర్బంధాన్ని సవాల్ చేస్తూ దిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అయితే దాన్ని మంగళవారం విచారణ చేయాలని కోరిన న్యాయవాదిని గురువారం మధ్యాహ్నం విచారించేందుకు ఆమోదం తెలిపింది. వాంగ్‌చుక్‌ను నిర్బంధించడం ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. వాంగ్‌చుక్ నిర్బంధంపై కాంగ్రెస్ ఖండనను భాజపా ఆక్షేపించింది. వారి వ్యవహారం భారీ కపటత్వంతో కూడుకుని ఉందని విమర్శించింది.



ప్రేమతో సాధించుకున్నదే చిరస్థాయిగా ఉంటుంది

ద్వేషం ఎప్పుడూ చంపుతుంది. ప్రేమ ఎన్నటికీ చావదు. రెంటి మధ్యా అంత తేడా ఉంది. ప్రేమతో సాధించుకున్నది చిరస్థాయిగా ఉండిపోతుంది. ద్వేషంతో సాధించుకున్నది వాస్తవంలో గుదిబండలా తయారవుతుంది, ఎందుకంటే అది ద్వేషాన్ని మరింత పెంచుతుంది కాబట్టి!

– మహాత్మా గాంధీ

శీతల పానీయాలు, కాఫీలతో పక్షవాత ముప్పు

జ్ఞాన నేత్రం

వాషింగ్టన్: శీతల పానీయాలు, రెడీమేడ్‌గా లభ్యమయ్యే ఫ్రూట్ జ్యూస్‌లు ఎక్కువగా తాగడం వల్ల పక్షవాతం ముప్పు పెరిగే అవకాశాలున్నాయని అంతర్జాతీయ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. వీటి కన్నా నీరు తాగితే ప్రయోజనాలు ఎక్కువని వెల్లడైంది. రోజుకు నాలుగు కప్పుల కన్నా ఎక్కువగా కాఫీ సేవించడం అనర్థదాయకమని కూడా గుర్తించినట్లు పరిశోధకులు తెలిపారు. మెదడులోని ఏదైనా భాగానికి రక్తసరఫరా నిలిచిపోయి, ఆ అవయవంలోని కణాలు దెబ్బతిన్న పరిస్థితుల్లో పక్షవాతం రావొచ్చు. ఇందులో.. మెదడులోని రక్తనాళాల్లో అవరోధాల వల్ల ఇస్కీమిక్ పక్షవాతం, ఆ భాగంలో రక్తస్రావం వల్ల తలెత్తే హెమరేజిక్ పక్షవాతం అనే రెండు రకాలు ఉంటాయి. 'ఇంటర్‌స్ట్రోక్' ప్రాజెక్టు కింద అంతర్జాతీయ శాస్త్రవేత్తలు 27 దేశాల్లోని దాదాపు 27వేల మందిపై పరిశోధన చేశారు. వీరిలో 13,500 మంది మొదటిసారి పక్షవాతం బారినపడ్డారు. అధ్యయనంలో భాగంగా శీతల పానీయాలు, రెడీమేడ్ ఫ్రూట్ జ్యూస్‌ల వినియోగంపై దృష్టిసారించారు. అందులో వెల్లడైన అంశాలివీ..

■ శీతల పానీయాల వినియోగానికి, పక్షవాతానికి మధ్య సంబంధం ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా తూర్పు/ మధ్య ఐరోపా, పశ్చిమాసియా, దక్షిణ అమెరికావాసుల్లో ఇది ప్రస్ఫుటంగా కనిపించింది.

■ ఫ్రూట్ జ్యూస్‌లుగా మార్కెట్‌లో విక్రయిస్తున్న ఉత్పత్తుల్లో ఎక్కువభాగం.. కాన్సెంట్రేట్ల నుంచి తయారైనవే. వీటిలో అదనపు చక్కెరలు, ఎక్కువకాలం నిల్వ ఉండేలా చూసే ప్రిజర్వేటివ్‌లు వాడుతున్నారు. తాజా పండ్ల రసాలతో వచ్చే ప్రయోజనాలను ఇవి దెబ్బతీస్తూ పక్షవాతం ముప్పును పెంచుతున్నాయి.



■ మెదడులో రక్తస్రావం వల్ల వచ్చే పక్షవాతం ముప్పును రెడీమేడ్ ఫ్రూట్‌జ్యూస్‌లు 37% పెంచుతున్నాయి. ఇలాంటివి రోజుకు రెండు పానీయాలు తాగితే ముప్పు మూడింతలు పెరుగుతుంది.

కాఫీ, టీలతో..

■ రోజుకు నాలుగు కప్పుల కన్నా ఎక్కువగా కాఫీ తాగితే పక్షవాతం ముప్పు 37 శాతం పెరుగుతుంది. టీ తాగడం వల్ల ఈ ప్రమాదం 18-20 శాతం తగ్గొచ్చు.


■ బ్లాక్ టీ సేవనం వల్ల పక్షవాతం ముప్పు 29 శాతం తగ్గే వీలుంది. పాలు కలపడం వల్ల టీలో సహజసిద్ధంగా ఉండే ప్రయోజనకారి యాంటీఆక్సిడెంట్ల ప్రభావం క్షీణించే అవకాశం ఉంది.

నీరు మేలు..

■ రోజుకు ఏడు కప్పుల కన్నా ఎక్కువగా నీరు తాగితే మెదడులో రక్తం గడ్డకట్టడం వల్ల వచ్చే పక్షవాతం ముప్పు తగ్గుతుంది.

రహదారుల మధ్యలో

ఏ మత నిర్మాణమూ ఉండొద్దు



- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న బుల్డోజర్ న్యాయంపై తీవ్ర విమర్శలు వస్తోన్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వ్యక్తుల ఇళ్లు/ఆస్తుల కూల్చివేత, రహదారుల మధ్యలో ఉన్న ప్రార్థనా మందిరాలు, ఆలయాల తొలగింపులో దేశమంతటికీ వర్తించేలా మార్గదర్శకాలను రూపొందిస్తామని తెలిపింది. కూల్చివేతలపై అక్టోబరు 1 వరకు విధించిన నిలిపివేత ఉత్తర్వులను పొడిగించింది. తుది తీర్పు వెలువడే వరకూ అవి అమలులో ఉంటాయని జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. అప్పటి వరకు తమ అనుమతి లేనిదే ఏ నిర్మాణాన్నీ కూల్చరాదని నొక్కి చెబుతూ తీర్పును రిజర్వు చేసింది. అక్రమంగా నిర్మించిన కట్టడాలను ఆయా వ్యక్తుల మత విశ్వాసాలతో సంబంధంలేకుండా తొలగించాల్సిందేనని ధర్మాసనం పేర్కొంది. ఆ వ్యక్తి ఏదైనా నేరంలో నిందితుడిగా ఉన్నాడనో, దోషిగా తేలాడనో ప్రాతిపదికగా చేసుకొని వారి ఆస్తుల ధ్వంసం తగదని విస్పష్టం చేసింది. "మనది లౌకిక రాజ్యం. పౌరులందరికీ, అన్ని సంస్థలకూ సమానంగా వర్తించేలా చట్ట నిబంధనలు ఉంటాయ"ని తెలిపింది.

> ఏదైనా కేసులో నిందితుడైనా గానీ, దోషి అని తేలినా గానీ వారి ఆస్తుల కూల్చివేత తగదు. బుల్డోజర్ న్యాయానికి అసలు ఆ అంశమే ప్రాతిపదిక కారాదు. రహదారుల మధ్యలో ఏ మతం వారివి అయినా సరే ప్రార్థనా మందిరాలు ఉండరాదు. ప్రజా ప్రయోజనాలే సర్వోన్నతం. ప్రజల సౌలభ్యం కోసం వాటిని తొలగించాలి.
>
> –సుప్రీంకోర్టు ధర్మాసనం

ప్రజల భద్రతకే ప్రాధాన్యం

రహదారులపై ఉండే నిర్మాణాల వల్ల ప్రమాదాలు జరుగుతాయి. ప్రజల భద్రతకు వాటితో ముప్పు ఉంటుంది. రోడ్డుమధ్యలోకి వచ్చిన ఏ ప్రార్థనా మందిరాన్నైనా, గుడినైనా తొలగించాల్సిందేనని ధర్మాసనం అభిప్రాయపడింది. జలాశయాలు, ప్రభుత్వ స్థలాలు, ప్రజోపయోగ ప్రదేశాలు, రహదారులు, ఫుట్‌పాత్‌లు, అడవులను ఆక్రమించి నిర్మించే అక్రమ కట్టడాలకు తాము రక్షణ కల్పించబోమని స్పష్టం చేసింది.

గడువిస్తే పోయేదేముంది?

ఏదైనా కట్టడం అక్రమమని గుర్తించినప్పుడు అధికారులు ముందుగా నోటీసు ఇవ్వాలని, అది కూడా రిజిస్టర్డుపోస్టులో పంపించాలని ధర్మాసనం తెలిపింది. నోటీసును గోడకు అతికించి వెళ్లడం తగదంది. నోటీసుకు, కూల్చివేతకు మధ్య 10 నుంచి 15 రోజుల వ్యవధి ఉంటే వచ్చే నష్టమేమిటని ప్రశ్నించింది. 'మహిళలు, చిన్నారులు వీధిన పడే దృశ్యాలు ఆవేదన కలిగిస్తాయ'ని ధర్మాసనం తెలిపింది. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఏదైనా నేరంలో నిందితుడు కావడమే వ్యక్తి ఇంటిపై బుల్డోజర్‌ను పంపించటానికి ప్రాతిపదిక కావాలా? అని ఆయన్ను ధర్మాసనం ప్రశ్నించింది. దీనికి మెహతా స్పందిస్తూ.. 'కచ్చితంగా కాదు' అని సమాధానమిచ్చారు. ఒక అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకున్న అధికారులు మరో అక్రమ కట్టడాన్ని ఉపేక్షించడం సమస్యగా మారుతోందని ధర్మాసనం తెలిపింది.

కశ్మీర్‌లో 68% పోలింగ్

జమ్మూ/ శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం జరిగిన చివరి విడత పోలింగ్‌లో 68.72 శాతం మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకున్నారు. ఏడు జిల్లాల్లోని 40 శాసనసభ స్థానాలకు పటిష్ఠమైన భద్రత మధ్య పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైనప్పటి నుంచి ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరి కనిపించారు. సాయంత్రం 6 గంటలకు గడువు ముగిసిన తర్వాతా కొన్నిచోట్ల ఇదే పరిస్థితి కొనసాగింది. నియంత్రణ రేఖ వద్ద ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలు సహా అన్నిచోట్లా ఎన్నికలు ప్రశాంతంగానే ముగిశాయని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని అధికారులు ప్రకటించారు. అత్యధికంగా సాంబా జిల్లాలో 73.45శాతం, ఉధంపుర్‌లో 72.91% పోలింగ్ నమోదైంది. కఠువాలో 70.53%, జమ్మూలో 66.79 శాతం, బందీపురలో 64.95శాతం, కుప్వారాలో 62.76శాతం, బారాముల్లాలో 55.73 శాతం మంది ఓట్లు వేశారు.


బందీపురలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు

1947 తర్వాత తొలిసారి చూపుడు వేలుపై సిరాచుక్క

370 అధికరణం రద్దయ్యాక తొలిసారి అసెంబ్లీ ఎన్నికల ఓటుహక్కు పొందిన పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులు, వాల్మీకి సమాజ్, గూర్ఖా తెగలవారు ఉత్సాహంగా దానిని వినియోగించుకున్నారు. ఉదయాన్నే వారంతా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. 1947లో దేశ విభజన తర్వాత తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశామంటూ పలువురు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

నటుడు గోవిందా ఇంట్లో పేలిన తుపాకీ..

కాలిలో దిగిన బుల్లెట్



ముంబయి: బాలీవుడ్ నటుడు, మాజీ ఎంపీ గోవిందా (60) ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున తుపాకీ పేలి, ఆయన కాలిలోకి బుల్లెట్ దూసుకుపోయింది. ఓ షో నిమిత్తం కోల్‌కతా వెళ్లేందుకు విమానాశ్రయానికి బయలుదేరే హడావుడిలో ఉండగా ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగినట్లు నటుడి మేనేజర్ శశిసిన్హా తెలిపారు. కుటుంబసభ్యులు వెంటనే సమీప ప్రయివేటు ఆస్పత్రికి గోవిందాను తరలించారు. ఎడమకాలి మోకాలి కింద బుల్లెట్ తగిలిందని, 8 - 10 కుట్లు పడినట్లు శస్త్రచికిత్స చేసిన డాక్టర్ అగర్వాల్ మీడియాకు వెల్లడించారు. ప్రాణాపాయం తప్పినట్లు తెలిపారు. గోవిందా సోదరుడు కీర్తికుమార్ ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఇంట్లో ఉన్న లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను చెక్ చేస్తున్న సమయంలో అనుకోకుండా చేజారి పేలినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోవిందా ఓ ఆడియో ప్రకటన విడుదల చేస్తూ.."బుల్లెట్ తొలగించారు. మీ అందరి ఆశీస్సులతో క్షేమంగా ఉన్నాను. వైద్యులకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే ఆయనను పరామర్శించారు. 1986లో "లవ్ 86" చిత్రంతో గోవిందా సినీరంగ ప్రవేశం చేశారు.

సర్పంచి పదవికి వేలంలో రూ.2 కోట్లు!

చండీగఢ్: సర్పంచి పదవికి గ్రామస్థులు నిర్వహించిన వేలంలో ఓ వ్యక్తి ఏకంగా రూ.2 కోట్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. పంజాబ్‌లోని గురుదాస్‌పుర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పంజాబ్‌లో ఈ నెల 15న పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే కొన్ని స్థానాలు ఏకగ్రీవమైనట్లు ప్రకటనలు వచ్చాయి. మరోవైపు, హార్దోవాల్ కలాం గ్రామంలో ఎన్నికల ప్రక్రియతో సంబంధం లేకుండా సర్పంచి పదవికి వేలంపాట నిర్వహించారు. రూ.50 లక్షల నుంచి వేలం మొదలవగా స్థానిక భాజపా నేత ఆత్మాసింగ్ పదవి కోసం రూ.2 కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

మంటల్లో స్కూలు బస్సు.. 23 మంది దుర్మరణం!


- బ్యాంకాక్‌లో దుర్ఘటన



బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. పాఠశాల బస్సు ఒకటి మంటల్లో చిక్కుకొంది. ఈ ఘటనలో 20 మంది చిన్నారులు, ముగ్గురు ఉపాధ్యాయులు చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. బస్సు సెంట్రల్ ఉతాయ్ థాని ప్రావిన్స్ నుంచి తిరిగివస్తున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. "బస్సులో మొత్తం 44 మంది ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. వీరిలో 38 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. వీరిలో కొందరిని రక్షించారు. మిగిలిన వారి విషయంపై ఇంకా స్పష్టత లేదు. 20 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్ల ఆచూకీలేదు" అని థాయ్‌లాండ్ రవాణశాఖ మంత్రి సూరియా జుంగ్రురెంగిట్ పేర్కొన్నారు. వీరు మరణించి ఉంటారని భావిస్తున్నారు. అగ్నికీలల్లో చిక్కుకున్న బస్సు నుంచి దట్టమైన పొగ వెలువడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వచ్చాయి. ప్రమాదం జరిగి గంటలు గడుస్తున్నా.. మృతదేహాలు ఇంకా బస్సులోనే ఉండిపోయాయి. డ్రైవర్ పరారైనట్లు అధికారులు తెలిపారు. బస్సు టైరు పేలిపోయి, రోడ్డు రక్షణ గోడను ఢీ కొట్టిందని, దీనివల్ల వాహనంలో మంటలు చెలరేగి ఉంటాయని సహాయ సిబ్బంది పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు మా పోరు

- బలహీనవర్గాలు, దళితుల్ని మోదీ విస్మరిస్తున్నారు
- కాంగ్రెస్‌కు శత్రువుల్లేరు: రాహుల్



చండీగఢ్: దేశంలో పేదలు, దళితులు, రైతులు, బలహీనవర్గాలకు ఏమైనా మిగిలిఉందంటే అది రాజ్యాంగం వల్లనే అని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ చెప్పారు. దానిని నాశనం చేయాలని భాజపా చూస్తుంటే రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు తాము పోరు సాగిస్తున్నామని తెలిపారు. హరియాణాలోని సోనీపత్‌లో మంగళవారం ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. అంబానీ, అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకే కేంద్రం పెద్దపీట వేస్తుందంటూ మరోసారి విరుచుకుపడ్డారు. ''పేదలు, యువత, రైతులు, దళితుల సంక్షేమం కోసం మోదీ సర్కారు చేసిందేమీ లేదు. కొద్ది మంది బడా పారిశ్రామికవేత్తల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ఏకైక ధ్యేయం. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలులో తప్పుల వల్ల చిన్నవ్యాపారులంతా నష్టపోయారు. ఇద్దరు ముగ్గురు కోటీశ్వరుల కోసం కేంద్రం, హరియాణా ప్రభుత్వం పనిచేస్తుండటం వల్ల చాలామంది వ్యాపారులు దెబ్బతిన్నారు. అగ్నివీర్ పథకం ద్వారా జవాన్ల ప్రయోజనాల్లో కోతపెట్టారు. తద్వారా రక్షణరంగ బడ్జెట్‌ను గౌతం అదానీకి ఇచ్చేశారు. కర్మాగారాలను ప్రైవేటు పరం చేశారు. ఎక్కడ చూసినా అదానీ, అంబానీ పేర్లే కనిపిస్తున్నాయి. రక్షణ ఒప్పందాలను అదానీకి కట్టబెట్టాలని మోదీ కోరుకుంటున్నారు" అని రాహుల్ ఆరోపించారు.

ముంద్రా పోర్టు డ్రగ్స్‌పై కిమ్మనరేం?

అదానీకి చెందిన ముంద్రా ఓడరేవులో వేల కిలోల మాదక ద్రవ్యాలు లభ్యమైనా దానిపై ఎంతమందిని జైలుకు పంపించారని మోదీని రాహుల్ ప్రశ్నించారు. పెట్టుబడిదారుల రుణాలను రద్దుచేస్తూ పేదల్ని మాత్రం చెల్లింపుల కోసం డిమాండ్ చేయడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తికే విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. అంబానీ ఇంట్లో పెళ్లికైన రూ.వేల కోట్ల ఖర్చు ప్రజాధనమేనని చెప్పారు. '56 అంగుళాల ఛాతీ ఉందని చెప్పే మోదీ కూడా నేను పార్లమెంటులో మాట్లాడితే పారిపోతారు. ఎందుకంటే మా సిద్ధాంతంలో విద్వేషానికి తావులేదు. మాకెవరూ శత్రువులు లేరు. భాజపా, మోదీలనూ నేను ద్వేషించను. సిద్ధాంత ప్రాతిపదికనే మా పోరాటం. నేను దేనికీ భయపడను' అని చెప్పారు.

ఎల్‌ఏసీ వద్ద పరిస్థితులు సాధారణంగా లేవు

- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడి



దిల్లీ: తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన (ఎల్‌ఏసీ) రేఖ వద్ద పరిస్థితులు స్థిరంగా ఉన్నప్పటికీ.. సాధారణంగా లేవని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. ఇప్పటికీ పరిస్థితి సున్నితంగానే ఉందన్నారు. మంగళవారమిక్కడ ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "భారత్, చైనాల మధ్య దౌత్య చర్చల ద్వారా సానుకూల సంకేతాలు వస్తున్నప్పటికీ.. కార్యాచరణ అమలు మాత్రం క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా సైనిక కమాండర్లపై ఆధారపడి ఉంటుంది. 2020 ఏప్రిల్‌కు ముందు నాటి పరిస్థితులను పునరుద్ధరించాలని మేం కోరుకుంటున్నాం. ఎల్‌ఏసీ వద్ద సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకు అది సున్నితమైన అంశమే. ఏవైనా ఊహించని పరిణామాలు ఎదురైతే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం" అని పేర్కొన్నారు. 2020 మే నెలలో ఎల్‌ఏసీ వద్ద భారత్, చైనా మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అప్పటి నుంచి ఆ ప్రాంతంలో ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్న విషయం తెలిసిందే.

అదొక మాస్టర్ స్ట్రోక్..

లెబనాన్‌లో హెజ్‌బొల్లా శ్రేణులే లక్ష్యంగా కొద్దిరోజుల క్రితం ఇజ్రాయెల్ జరిపిన 'పేజర్ బ్లాస్ట్ ఆపరేషన్'పై జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పందించారు. అదొక మాస్టర్ స్ట్రోక్ అన్నారు.

శత్రువులకు తగిన సమాధానం ఇవ్వగల సామర్థ్యం వాయుసేనకు ఉంది

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వెల్లడి

దిల్లీ: భారత దేశ శత్రువులకు తగిన సమాధానం ఇవ్వగల సామర్థ్యం భారత వైమానిక దళాని(ఐఏఎఫ్)కి ఉందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఐఏఎఫ్ 92వ వార్షికోత్సవాల్లో భాగంగా లద్దాఖ్ జాతీయ యుద్ధ స్మారకం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సముద్ర మట్టానికి 3,068 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రపంచంలోని అత్యంత ఎత్తయిన వైమానిక దళ స్టేషన్లలో ఒకటైన లద్దాఖ్‌లోని థోయిస్ వద్ద 'వాయు వీర్ విజేత' కారు ర్యాలీని ప్రారంభించారు.

మధ్యప్రదేశ్‌లాగే హరియాణాలో

కాంగ్రెస్ పగటి కలలు : మోదీ



పల్‌వల్: పదేళ్లుగా భాజపా సర్కారు ఇక్కడ ఉన్నందున హరియాణా ప్రజలు ఈసారి పళ్లెంలో పెట్టి అధికారం తమకు అప్పగిస్తారని కాంగ్రెస్ పార్టీ కలలు కంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇలాగే అనుకొని ముందస్తు సంబరాలు చేసుకొన్న ఆ పార్టీకి అక్కడి ప్రజలు పగలే చుక్కలు చూపించారని తెలిపారు. హరియాణాలోనూ అదే జరగబోతోందని జోస్యం చెప్పారు. మంగళవారం పల్‌వల్ ఎన్నికల సభలో మోదీ మాట్లాడారు. తప్పుడు వాగ్దానాలు తప్పితే చేతల్లేని రాజకీయాలు కాంగ్రెస్ పార్టీవి కాగా, భాజపా ఫలితాల కోసం పరిశ్రమించే పార్టీ అన్నారు. పవిత్రమైన గీతాసారం అందించిన ఈ ప్రాంతం ఇచ్చే సందేశం కూడా అదేనన్నారు. అక్టోబరు 5న పోలింగు జరగనున్న హరియాణాలో ఇది తన చివరి ఎన్నికల సభ అని, రాష్ట్రంలోని గ్రామ గ్రామాల్లో భాజపా ప్రభంజనం కనిపిస్తోందన్నారు. హరియాణాకు పొరుగున ఉన్న రాజస్థాన్ ఎన్నికల్లోనూ భాజపాకు వ్యతిరేకంగా రైతులను, యువతను రెచ్చగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించిన కాంగ్రెస్ పార్టీ చివరకు అదే 'ధడాం' (చతికిలపడటం) అయిందని ఎద్దేవా చేశారు. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే, రాష్ట్రంలోనూ అదే పార్టీని ఆదరించే ట్రాక్ రికార్డు ఉన్న హరియాణా ప్రజలు వరుసగా మూడోసారి ఇక్కడా భాజపా సర్కారు ఏర్పాటుకు ఇప్పటికే నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించారు.

పేదల హక్కులు దోచి.. 'గరీబీ హటావో' అన్న కాంగ్రెస్

పేదల హక్కులు దోచుకున్నవారే 'గరీబీ హటావో' అంటూ నినాదమిచ్చారని కాంగ్రెస్ పార్టీపై మోదీ తన దాడిని కొనసాగించారు. అయోధ్య, మహిళా రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాఖ్, జమ్మూకశ్మీర్‌లో రాజ్యాంగ సంపూర్ణ అమలు వంటి దేశానికి ముఖ్యమైన ప్రతి అంశాన్ని ఆ పార్టీ చిక్కుల్లోకి నెట్టిందన్నారు. బుజ్జగింపు రాజకీయాలే వారి ఏకైక ఎజెండా అని ధ్వజమెత్తారు. దళితులు, బీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని కాంగ్రెస్ చెబుతోందని, ఆ పార్టీలోని రాజకుటుంబం మన శత్రువులను పొగుడుతోందని విమర్శించారు. ఆర్టికల్ 370 వంటి అంశాల్లో పాకిస్థాన్‌ను సంతోషంగా ఉంచాలనుకునే కాంగ్రెస్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను వెనక్కు తెస్తామని ఎప్పుడైనా చెప్పిందా అని మోదీ ప్రశ్నించారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో కుమ్ములాటలను గమనిస్తున్న ప్రజలు ఆ పార్టీని దూరం పెట్టబోతున్నారనేది సుస్పష్టం అని మోదీ తెలిపారు.

దుష్యంత్ చౌటాలా వాహనశ్రేణిపై ఇటుకతో దాడి

జీంద్: జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) నాయకుడు దుష్యంత్ చౌటాలా వాహనశ్రేణిపైకి ఓ వ్యక్తి ఇటుక విసిరాడు. దీంతో ఓ ఎస్‌యూవీ వెనకవైపు అద్దం పగలడంతోపాటు, కారుపై గీత పడినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. దుష్యంత్ సోమవారం సాయంత్రం తన నియోజకవర్గం ఉచానా కలాంలో ప్రచార సమయంలో వాహనశ్రేణిని నిలిపిఉంచగా ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. ఇటుక పడిన సమయంలో వాహనం లోపల ఎవరూ లేరని చెప్పారు. ప్రచారం సందర్భంగా సోమవారం 74 ఏళ్ల వృద్ధుడు కొన్ని అంశాలపై దుష్యంత్‌ను ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుందని, ప్రస్తుతం ఆ వృద్ధుడిని విచారిస్తున్నట్లు ఉచానా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో తెలిపారు. ప్రస్తుత హరియాణా ఎన్నికల్లో మాజీ ఎంపీ అజయ్‌సింగ్ చౌటాలా నేతృత్వంలోని జేజేపీ, చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం)లు జట్టుకట్టిన సంగతి తెలిసిందే.

చైనా సూపర్‌మార్కెట్‌లో కత్తితో దుండగుడి దాడి

ముగ్గురి మృతి.. 15 మందికి గాయాలు

బీజింగ్: చైనా 75వ జాతీయ దినోత్సవం(అక్టోబరు 1) జరుపుకొంటున్న వేళ ఆ దేశంలోని అతి పెద్ద నగరమైన షాంఘైలో ఓ వ్యక్తి కత్తితో పలువురిపై దాడిచేసిన ఘటన కలకలం సృష్టించింది. స్థానిక పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఓ సూపర్‌మార్కెట్‌లో సోమవారం లిన్ అనే ఇంటి పేరుగల వ్యక్తి కత్తితో జనంపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ముగ్గురు మృతి చెందగా.. 15 మంది గాయపడ్డారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

మున్ముందు గడ్డుకాలమే..

- చైనా పౌరులకు అధ్యక్షుడు జిన్‌పింగ్ హెచ్చరిక

బీజింగ్: రానున్న రోజుల్లో తీవ్ర సవాళ్లు ఎదురుకానున్నాయని, వాటిని అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని తమ దేశ ప్రజలను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హెచ్చరించారు. భారత్ సహా పొరుగు దేశాలతో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అమెరికాతో తీవ్ర పోటీ, ఆర్థిక ప్రతికూలతల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 75వ జాతీయ దినోత్సవం సందర్భంగా బీజింగ్‌లోని తియనన్మెన్ స్క్వేర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జిన్‌పింగ్ ప్రసంగించారు. "మున్ముందు పరిస్థితులు అంత సాఫీగా ఉండవు. ఎన్నో సమస్యలు, అడ్డంకులు ఎదురు కావచ్చు. తీవ్ర ఒడుదొడుకులు, కఠిన సమయాలు ఉండొచ్చు. ఇటువంటి సమయాల్లో అప్రమత్తంగా ఉంటూ ముందుకెళ్లాలి. కమ్యూనిస్టు పార్టీతో పాటు మొత్తం సైన్యం, అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ముందుకెళ్లాలి. అప్పుడు ఏ కష్టాలు కూడా చైనీయులను అడ్డుకోలేవు" అని అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు.

■ చైనా 75వ జాతీయ దినోత్సవం సైనిక కవాతుల వంటి అట్టహాస కార్యక్రమాలేమీ లేకుండా సాదాగా జరిగింది.

ఈశాన్యంలోనూ మంచి వర్షాలే

- అక్టోబరు-డిసెంబరు కాలానికి అంచనాలు వెల్లడించిన ఐఎండీ

దిల్లీ: ఈ నెలారంభం నుంచి డిసెంబరు మధ్య ఈశాన్య రుతుపవన కాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం వెల్లడించింది. ముఖ్యంగా మధ్య, దక్షిణభారత రాష్ట్రాలతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో మంచి వర్షాలు కురుస్తాయంది. అక్టోబరు నెలలో మధ్య, దక్షిణ భారతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని తెలిపింది. ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర వర్చువల్‌గా విలేకరులతో మాట్లాడుతూ..తమిళనాడు, కోస్తాంధ్ర, రాయలసీమ, కేరళ, కర్ణాటక దక్షిణ ప్రాంతాలు సహా, మధ్య భారతంలో సాధారణాన్ని మించి (112 శాతం) వర్షాలు కురుస్తాయన్నారు.



వాయవ్య భారతం, ఈశాన్య, దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే తక్కువ వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొన్నారు. నైరుతి రుతుపవన కాలంలో దేశంలో సాధారణాన్ని మించి 7.6 శాతం అధిక వర్షపాతం నమోదైందని మహాపాత్ర తెలిపారు. రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో అధిక వర్షాలు కురిశాయన్నారు.

జపాన్ ప్రధానిగా షిగేరు ఇషిబా

లాంఛనంగా ఎన్నుకున్న పార్లమెంటు



టోక్యో: లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధిపతి షిగేరు ఇషిబాను కొత్త ప్రధానమంత్రిగా జపాన్ పార్లమెంటు మంగళవారం లాంచనంగా ఎన్నుకుంది. ప్రధాని పదవిలో ఉన్న ఫుమియో కిషిదా తన పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అవసరమైంది. ఈ నెల 27న పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహించాలని ఇషిబా యోచిస్తున్నారు. "కొత్త ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ప్రజా తీర్పును పొందడం చాలా ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు. అయితే ఇంత తక్కువ వ్యవధిలో ఎన్నికలు నిర్వహించాలనుకోవడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. కొత్త ప్రధాని విధానాలను పరిశీలించడానికి, పార్లమెంటులో చర్చించడానికి ఈ సమయం సరిపోదని వాదిస్తున్నాయి. మూడేళ్ల కిందట అధికారంలోకి వచ్చిన కిషిదా ప్రభుత్వం తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంది. ఇది ఆయన రాజకీయ ప్రతిష్ఠను మసకబార్చింది. దీంతో అక్టోబరులో తన పదవికి రాజీనామా చేస్తానని ఆయన ఆగస్టులోనే ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం కిషిదా నేతృత్వంలో సమావేశమైన క్యాబినెట్.. రాజీనామా నిర్ణయాన్ని తీసుకుంది. అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నాయకుడిగా ఇషిబా ఇప్పటికే ఎన్నికయ్యారు.

మా సీక్రెట్ సర్వీస్ అధిపతే

ఇజ్రాయెల్ గూఢచారిగా మారిపోయాడు

ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదీనిజాద్ వెల్లడి



ఇంటర్నెట్ డెస్క్: ఇజ్రాయెల్‌పై నిఘా కోసం ఏర్పాటుచేసిన ఓ ఇంటెలిజెన్స్ అధిపతే చివరికి తమను మోసం చేశాడని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదీనిజాద్ వాపోయారు. అతడు తమ సమాచారం ఇజ్రాయెల్‌కు చేరవేసేవాడని ఆరోపించారు. టెహ్రాన్‌లో మొస్సాద్ సంస్థ ఏ స్థాయిలో వేళ్లూనుకుందో వెల్లడిస్తూ ఈ విషయాన్ని సీఎన్‌ఎన్ తుర్క్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మొస్సాద్ విజయవంతంగా మా ఇంటెలిజెన్స్ యూనిట్స్‌ను తన వైపునకు తిప్పుకొందని చెప్పారు. వారిలో సీనియర్ అధికారులు కూడా ఉన్నట్లు చెప్పారు. దాదాపు 20 మంది నిఘా సిబ్బంది డబుల్ ఏజెంట్లుగా మారిపోయి ఇజ్రాయెల్‌కు అత్యంత కీలకమైన అణు రహస్యాలను చేరవేశారన్నారు. మా నిఘా సంస్థకు చెందిన ఓ అధిపతే ఇజ్రాయెల్ గూఢచారని 2021లో బయటపడిందన్నారు.

విజ్ఞప్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

- నెలాఖరుకు ఫ్రీహోల్డ్ భూముల వివరాల పరిశీలన పూర్తి చేయాలి
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



ఈనాడు, అమరావతి: ప్రజల నుంచి వచ్చే వినతులను జాప్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. గ్రామ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సిద్ధం కావాలని కోరారు. మంగళగిరిలోని సీసీఎల్‌ఎ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యాజమాన్య హక్కులు కల్పించిన భూముల (ఫ్రీ హోల్డ్) వివరాల పరిశీలన ఈ నెలాఖరునాటికి పూర్తిచేయాలన్నారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా... భూముల రీ-సర్వేను రైతుల సమ్మతితో చేపట్టే వాతావరణాన్ని తీసుకురావాలని ఆదేశించారు. సర్వే చేసిన పొలాలతోపాటు త్వరలో ఇళ్లు, ఇంటి స్థలాలకు కూడా జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. సర్వే రాళ్లపై ఉన్న జగన్ పేరును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ మంత్రి కార్యాలయం నుంచి.. 1,414 అర్జీలు పరిష్కారం కోసం కలెక్టర్లకు పంపగా కేవలం 16 వినతులపై మాత్రమే సమాధానం రావడం ఏమిటని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా కలెక్టర్లను ప్రశ్నించారు. సమావేశంలో సీసీఎల్‌ఎ జయలక్ష్మి, జాయింట్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజీ శేషగిరి బాబు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అక్రమ కట్టడాల కూల్చివేత

- మంత్రి నారాయణ స్పష్టం



ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: ఆపరేషన్ బుడమేరు తరహాలోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ అక్రమ కట్టడాల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కాలువలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ కట్టడాలు ఎవరివైనప్పటికీ, పార్టీలకతీతంగా వాటిని కూల్చివేస్తామని హెచ్చరించారు. పేదలను ఇబ్బంది పెట్టకుండా ప్రత్యామ్నాయం చూపాకే నిర్మాణాలు తొలగిస్తామన్నారు. మచిలీపట్నంలో మంగళవారం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. 'బుడమేరు ఆక్రమణలతోనే విజయవాడను వరద ముంచెత్తింది. రాష్ట్రవ్యాప్తంగా కాలువలు, చెరువులను ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలి. లేదంటే అన్నిచోట్లా విజయవాడ లాంటి పరిస్థితులే రావొచ్చు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించమ'ని నారాయణ స్పష్టం చేశారు. 'తెదేపా గత ప్రభుత్వంలో తాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ బ్యాంకు ద్వారా రూ.5,350 కోట్లు మంజూరు చేయించాం. ఈ పనుల్లో రాష్ట్ర వాటాగా 30 శాతం ఖర్చు చేయాల్సి ఉండగా, వైకాపా హయాంలో ఒక్క రూపాయీ ఇవ్వలేదు. దీంతో నిధులన్నీ వెనక్కి వెళ్లాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా, మళ్లీ అనుమతులు వచ్చాయి. రెండేళ్లలోనే ఈ పనులు పూర్తిచేస్తామ'ని మంత్రి వివరించారు.

క్లినికల్ విభాగాల్లో 20% రిజర్వేషన్


జీవో 85కు సవరణ ఉత్తర్వుల జారీ

ఈనాడు, అమరావతి: పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటా సీట్ల కేటాయింపునకు సంబంధించిన జీవో 85 సవరిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో పేర్కొన్నట్లు 6 విభాగాల్లో కలిపి 15% సీట్లు కాకుండా, అన్ని విభాగాల్లో కలిపి 20% సీట్లు ఇవ్వనున్నట్లు తాజా ఉత్తర్వుల్లో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఈ నిర్ణయాన్ని అమల్లోకి తెస్తారు. పీజీ మెడికల్ డిప్లొమా చేసి, వైద్యులుగా చేరిన వారికి పీజీ మెడికల్ డిగ్రీ పూర్తిచేసేందుకు వీలుగా 12 నెలల డిప్యుటేషన్ అవకాశం కల్పిస్తారు. పీజీ డిగ్రీ కలిగిన వారు మరోసారి డిగ్రీ చేసేందుకు అనుమతించరు. సూపర్ స్పెషాల్టీ కోర్సుల ప్రవేశాల్లోనూ ఈ నియమం వర్తిస్తుంది. జీవో సవరణకు ఆందోళన బాటపట్టిన పీహెచ్‌సీ వైద్యులకు మంత్రి సత్యకుమార్ ఇచ్చిన హామీ మేరకు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఉద్యోగుల సంఖ్యలో 7.5% వృద్ధి శుభసూచకం: లంకా దినకర్

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల సంఖ్యలో 7.5% వృద్ధి సాధించడం వికసిత భారత్‌కు శుభసూచకమని భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయాల వల్ల సేవారంగాలతోపాటు మౌలిక సదుపాయాలు, తయారీ రంగాలకు లభించిన ప్రోత్సాహం వల్ల సానుకూల ఫలితాలు వస్తున్నాయి. యువతలో ఉపాధి అవకాశాల మెరుగుకు స్కిల్ సర్వేను మంత్రి లోకేశ్ కూడా ప్రారంభించారు. ఈ వినూత్న విధానాలు తయారీ, సేవల రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాయి. దీనివల్ల వికసిత్ భారత సాధ్యమవుతుంది' అని పేర్కొన్నారు.

ప్రేమతోనే జయించండి



కారు చీకటిలో నుంచి కాంతి పుంజాలు వస్తున్నప్పుడు.. విద్వేష భావాల మధ్య నుంచే ప్రేమ ఎందుకు పుట్టుకురాదు? ఎక్కడ యుద్ధాలు జరుగుతున్నా.. ఎక్కడ శత్రువులు ఎదురైనా.. వాళ్లను మీరు ప్రేమతోనే జయించండి!
– మహాత్మా గాంధీ



దేదీప్యమానంగా ఇంద్రకీలాద్రి

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి విజయవాడ ఇంద్రకీలాద్రిపై విద్యుత్ దీపాలు అలంకరించారు. దీపాలన్నీ బిగించాక ఓ సారి వేసి అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూశారు. ఆలయ గోడలకు ఇటీవలే కొత్తగా రంగులు అద్దడంతో.. ఆ దీపాల వెలుగుల్లో గుడి పరిసరాలు దేదీప్యమానంగా ప్రకాశించాయి.
– ఈనాడు, అమరావతి

1.13 లక్షల ఎకరాలపై కన్ను!

- ఇందులో ఎసైన్డ్ భూములే 1.12 లక్షల ఎకరాలు
- వైకాపా పాలనలో అక్రమార్కుల దందా ఇది..
- తాజాగా ప్రభుత్వ పరిశీలనలో వెల్లడి

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో ఎసైన్డ్ భూముల వ్యవహారానికి సంబంధించిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఎసైన్డ్ భూములు, విలేజ్ సర్వీస్ ఇనాం భూములు, చుక్కల భూములు, షరతులున్న భూముల కింద కలిపి 13,59,804 ఎకరాలను నిషిద్ధ (22ఏ) జాబితానుంచి నాటి వైకాపా ప్రభుత్వం తప్పించింది. ఇందులో 4,04,374 (38.7%) ఎకరాల పరిశీలనను తాజాగా ఎన్డీయే ప్రభుత్వం చేపట్టింది. ఈ పరిమిత విస్తీర్ణంలోనే 1,13,125 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా అప్పటి పాలకులు తప్పించినట్లు గుర్తించారు. ముఖ్యంగా 20 ఏళ్లు దాటిన ఎసైన్డ్ భూములను నిషిద్ధ జాబితానుంచి తప్పించే పేరుతో గడువు దాటని భూములపైనా కన్నేశారని స్పష్టమైంది. యాజమాన్య హక్కులంటూ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నిషిద్ధ జాబితా (22ఏ) నుంచి తప్పించిన భూముల్లో 1,12,589 ఎకరాలున్నట్లు పరిశీలనలో వెల్లడైంది. ఈ అక్రమాల్లో వైకాపా నేతలకు రెవెన్యూ అధికారులు సంపూర్ణంగా సహకరించారు.

గడువు ముగియకుండా అక్రమాల తంతు

పేదలకిచ్చి 20 ఏళ్ల గడువు పూర్తి కాకుండానే నిషిద్ధ జాబితా నుంచి తప్పించి నాయకులు ఆక్రమించిన సంఘటనలు రాయలసీమలో ఎక్కువగా బయటపడ్డాయి. జీవో 595ను నాటి ప్రభుత్వం 2023 డిసెంబరు 19న జారీ చేసింది. ఈ తేదీ నుంచి 20 ఏళ్లకు ముందు కేటాయించిన ఎసైన్డ్ భూములకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఈ క్రమంలో గతంలో వివిధ దశల్లో పేదలకిచ్చిన ఎసైన్డ్ భూముల్లో 9.93 లక్షల ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి అప్పట్లో తప్పించారు. ఇందులో 1.12 లక్షల ఎకరాలను ప్రభుత్వ జీఓలోని నిబంధనలకు విరుద్ధంగా తొలగించినట్లు ఇప్పటివరకు గుర్తించారు. అనుభవదారులు లేకున్నా, భూమిపై మరొకరు ఉన్నా రెవెన్యూ సిబ్బంది ముడుపులు తీసుకొని వైకాపా నేతలకు వీటిపై హక్కు కల్పించారు. వారసులమంటూ తప్పుడు పత్రాలనూ పరిగణనలోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా 63,800 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 16,447 ఎకరాలు ఇలా తొలగించినట్లు నిర్ధారించారు. ఇతర రాయలసీమ జిల్లాలతోపాటు ఉత్తరాంధ్రలోనూ వేలల్లో ఇలా తొలగించి ఆక్రమించినట్లు గుర్తించారు.

నిబంధనల అతిక్రమణ

రిజిస్ట్రేషన్ అయిన 21,940 ఎకరాల్లో 5,828 ఎకరాల రిజిస్ట్రేషన్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. గిఫ్ట్‌డీడ్ రూపంలో ఇతరులకు బదిలీ అయినవి 10,292 ఎకరాలున్నాయి. మిగిలిన భూములకు పార్టిషన్, జీపీఏ, ఇతర పద్ధతుల్లో రిజిస్ట్రేషన్లు అయ్యాయి. తక్కువ డబ్బు ఇచ్చి, బెదిరించి ఖరీదైన భూములను పేదలనుంచి వైకాపా నేతలు కొట్టేశారు. అప్పట్లో యాజమాన్య హక్కుల కల్పన జీవో రాకముందే ముందస్తు ఒప్పందాలు చేసుకొని భారీగా లబ్ధి పొందారు. మూడోవంతు భూముల్లోనే ఇన్ని అక్రమాలు వెల్లడైనందున మిగిలిన ఆస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

■ విలేజ్ సర్వీస్ ఇనాం భూముల కేటగిరిలో 1,38,846 ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి తప్పించారు. ఇందులో ఇప్పటివరకు 48,451 ఎకరాల వివరాలను పరిశీలించారు. 281 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా నిషిద్ధ జాబితానుంచి తప్పించినట్లు తేల్చారు.

■ 1,94,231 ఎకరాలను చుక్కల భూములనుంచి తప్పించారు. ఇందులో 31,614 ఎకరాల వివరాలను పరిశీలించారు. 232 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా 22ఏ జాబితా నుంచి తొలగించారు.

■ షరతులున్న పట్టాల కేటగిరిలో 33,442 ఎకరాలున్నాయి. ఇందులో 25,297 ఎకరాల వివరాలను పరిశీలించారు. ఇందులో 22.48 ఎకరాలను అక్రమంగా నిషిద్ధ జాబితానుంచి తప్పించారు.

కాలినడకన తిరుమల చేరుకున్న పవన్ కల్యాణ్

- నేడు ప్రాయశ్చిత్త దీక్ష విరమణ

తిరుమల, తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ విషయంలో అపచారం జరిగిందంటూ శ్రీవారికి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. బుధవారం శ్రీవారిని దర్శించుకుని, ఆ తర్వాత దీక్ష విరమించనున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి మంగళవారం సాయంత్రం 4.30కు తిరుపతి చేరుకున్న ఆయన అలిపిరి మెట్లమార్గం నుంచి కాలినడకన తిరుమలకు బయలుదేరారు. వెంట భారీగా అభిమానులు తరలివచ్చారు. మార్గమధ్యంలో భక్తులతో మాట్లాడుతూ.. అక్కడక్కడ సేదతీరుతూ డిప్యూటీ సీఎం నడక సాగింది. ఏడోమైలు వద్ద రాష్ట్ర సీసీఎఫ్ నాగేశ్వరరావుతో కాసేపు మాట్లాడారు. గత సంవత్సరం చిరుత దాడికి పాల్పడటంతో మృతి చెందిన లక్షిత, గాయపడిన బాలుడి వివరాలను, అనంతరం చేపట్టిన రక్షణ ఏర్పాట్లను ఆయన వివరించగా పవన్‌కల్యాణ్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు కొంతసేపు ఆయన కాలికి ఫిజియోథెరపీ చేశారు. అనంతరం మహావిష్ణువు, తుంబురుడికి నమస్కరించి శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. రాత్రి 9.25 గంటలకు జీఎన్‌సీ వద్ద ఆఖరు మెట్టుకు కొబ్బరికాయ కొట్టి అతిథిగృహం చేరుకున్నారు. కుమారుడు అకీరా నందన్, కుమార్తె ఆద్య, దర్శకుడు త్రివిక్రమ్ అతిథిగృహానికి విచ్చేశారు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న తర్వాత మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించనున్నారు.



ఆఖరి మెట్టు వద్ద కర్పూరం వెలిగించి కొబ్బరి కాయ కొడుతున్న పవన్ కల్యాణ్

మూడంచెల భద్రత ఏర్పాటు

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పోలీసు శాఖ మూడంచెల భద్రత కల్పించింది. విమానాశ్రయం వద్ద ఎస్పీ సుబ్బరాయుడు.. భద్రత గురించి పర్యవేక్షించారు. విమానాశ్రయం నుంచి ముందుగా పద్మావతి అతిథి గృహం అనంతరం అలిపిరికి చేరుకున్నారు. నడకమార్గంలో మూడంచెల స్పెషల్ రోప్‌పార్టీల భద్రత కల్పించారు. మొదట ఆర్మ్‌డ్, రెండోదశలో ఎస్టీఎఫ్, మూడోదశలో సివిల్ పోలీసులతో రక్షణ ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీల రాజీనామాలకు ఇప్పట్లో ఆమోదం లేనట్లేనా..?

- ఆగస్టులో ముగ్గురు ఎమ్మెల్సీల రాజీనామా
- ఎటూ తేల్చని ఛైర్మన్ మోషేనురాజు

ఈనాడు, అమరావతి: 'నా పదవికి రాజీనామా చేస్తున్నా' అని ముగ్గురు వైకాపా ఎమ్మెల్సీలు ఆగస్టు నెలాఖరులో వేర్వేరుగా రాజీనామాలు సమర్పించారు. కానీ, వాటికి ఇంకా ఆమోదముద్ర పడలేదు. 'మేం రాజీనామా చేసి నెల దాటిపోయింది, వాటిని ఆమోదించండి' అని కోరుతూ ఆ ముగ్గురూ మండలి ఛైర్మన్ మోషేనురాజుకు లేఖలు రాశారు. అయినా ఇంకా రాజీనామాలకు ఆమోదం దక్కలేదు. 'రాజీనామా ఎందుకు చేశారు? స్వచ్ఛందంగానే చేశారా' లాంటి అంశాలపై వ్యక్తిగతంగా పిలిచి మాట్లాడాక ఛైర్మన్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి. ముగ్గురిలో ఇద్దరు ఎమ్మెల్సీలు ఛైర్మన్‌ను కలిసి తమ రాజీనామాలను సమర్పించడంతో పాటు.. 'మేం స్వచ్ఛందంగానే రాజీనామా చేస్తున్నాం.. మాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. . ఆమోదించండి' అని అప్పుడే తెలిపారు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఆ ఎమ్మెల్సీలు ఛైర్మన్‌కు ఇప్పుడు లేఖ పంపారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని మండలి ఛైర్మన్‌కు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ సోమవారం పంపిన లేఖ మంగళవారం బయటకు వచ్చింది. అందులో.. 'నిర్దేశిత ఫార్మాట్‌లోనే రాజీనామా పత్రాన్ని నేనే మీకు అందించాను. అప్పుడే నా వివరణ కూడా ఇచ్చాను. 31 రోజులు దాటిపోయినా ఆమోదించలేదు. వెంటనే నా రాజీనామాను ఆమోదించండి. సరైన కారణాలు లేకుండా ఆమోదం తెలిపేందుకు ఇంకా జాప్యం చేస్తే అది అనవసర ఊహాగానాలకు దారి తీస్తుందని నేను భయపడుతున్నా' అని ఆమె పేర్కొన్నారు. ఆమెతో పాటు బల్లి కల్యాణ చక్రవర్తి కూడా ఆగస్టు 30నే మండలిలో ఛైర్మన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి రాజీనామా అందజేశారు. అంతకుముందు ఆగస్టు 28న మరో ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామా చేశారు. ఆమె రాజీనామా పత్రాన్ని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ కార్యాలయంలో సమర్పించారు. కానీ, ఇప్పటివరకూ ఈ ముగ్గురి రాజీనామాలకు ఆమోదముద్ర పడలేదు.

నందిగం, అవుతు బెయిల్ పిటిషన్లను కొట్టేయండి

- వాదనలు వినిపించిన సిద్ధార్థ లూథ్రా
- ఈనెల 4న హైకోర్టు తీర్పు

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కార్యాలయంపై మూకుమ్మడి దాడి కేసులో అరెస్టై జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ, వైకాపా నేత నందిగం సురేష్, మరో నిందితుడు అవుతు శ్రీనివాసరెడ్డిల బెయిలు పిటిషన్లను కొట్టేయాలని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ మంగళవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. దర్యాప్తు కీలక దశకు చేరిందని, ఈ దశలో బెయిలిస్తే ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. నాడు ఎంపీగా ఉన్న సురేష్.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని, ప్రతిపక్ష రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమేనన్నారు. 'దాడి ఘటనలో సురేష్ పాత్ర ఉందని, అప్పుడు ఆయన అక్కడే ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు, సహ నిందితులు వాంగ్మూలమిచ్చారు. ఈ కేసులో నిందితుల పాత్రను రుజువు చేసేందుకు సెల్‌ఫోన్ కీలక సాక్ష్యం. ఫోన్‌లోని డేటా ద్వారా గూగుల్ టైమ్ లైన్‌ను సేకరించాల్సి ఉంది. కానీ, సురేష్ తన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించకుండా తప్పించుకుంటున్నారు. అతనికి నేరచరిత్ర ఉంది. ఓ హత్య కేసులో ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారించేందుకు అనుమతి కోరుతూ మెజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన పీటీ వారెంట్ పెండింగ్‌లో ఉంద'ని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని మూడేళ్లుగా ఈ కేసు దర్యాప్తును తొక్కిపెట్టారని, దీని వెనుక ఎవరున్నారో తేల్చాల్సి ఉందన్నారు.

■ పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పి.వీరారెడ్డి వాదించారు. 'రాజకీయ ప్రతీకారంతో పిటిషనర్లపై కేసు పెట్టారు. ఇప్పటికే పోలీసు కస్టడీలో వారిపై విచారణ ముగిసింది. ఇంకా జైల్లో ఉంచాల్సిన అవసరం లేదు. బెయిలు మంజూరు చేయండ'ని కోరారు. ఈ వ్యవహారంలో ఇరువైపులా వాదనలు ముగియడంతో ఈనెల 4న నిర్ణయం వెల్లడించనున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ప్రకటించారు.

కిమ్స్‌లో బధిరులకు టెలిమెడిసిన్ సేవలు

- ప్రత్యేక కేంద్రం ప్రారంభం

ఈనాడు-హైదరాబాద్, న్యూస్‌టుడే-రెజిమెంటల్ బజార్: బధిరుల కోసం టెలిమెడిసిన్ సేవలను కిమ్స్ ఆసుపత్రి అందుబాటులోకి తెచ్చింది. సైగల భాష తెలిసిన సర్టిఫైడ్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్(ఐఎస్‌ఎల్) ఇంటర్‌ప్రెటర్లు 300 మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్(కేఎఫ్‌ఆర్‌సీ) ఆధ్వర్యంలో వీడియో ఇంటర్‌ప్రెటేషన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇందులో రియల్ టైంలో వైద్య నిపుణులకు, బధిరులకు మధ్య ఐఎస్‌ఎల్ ఇంటర్‌ప్రెటర్లు అందుబాటులో ఉంటారు. బధిరులు తెలిపిన సమస్యలను వైద్యులకు వీరు వివరిస్తారు. ఈ కన్సల్టెన్సీ సేవలను ఉచితంగానే అందించనున్నారు. సికింద్రాబాద్ పాత కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రిలో మంగళవారం ఈ టెలిమెడిసిన్ సెంటర్‌ను ఆసుపత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, రాజ్యశ్రీ దంపతులు ప్రారంభించారు. డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ.. దేశంలో దాదాపు 18 లక్షల మందికి పైగా వినికిడిలోపంతో బాధపడుతున్నారని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లల్లో ముందే వినికిడి లోపాన్ని గుర్తించి తమ వద్దకు తీసుకువస్తే ప్రభుత్వ పథకాల ద్వారా ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. టెలిమెడిసిన్ సెంటర్ ద్వారా బధిరులకు ఇంటి వద్దే అనారోగ్య, ఇతర సమస్యలకు చికిత్సలు అందించవచ్చని చెప్పారు. ఈ సేవల కోసం డెఫ్ ఎనేబుల్డ్ ఫౌండేషన్(డీఈఎఫ్) సహకారం అందిస్తోందని తెలిపారు. డీఈఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ.. బధిరుల కోసం రియల్ టైంలో చేతి సైగలను టెక్స్ట్ రూపంలోకి మార్చగల ఆధునిక వ్యవస్థను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భుజంగరావు, డాక్టర్ సుభాష్ కౌల్ తదితరులు పాల్గొన్నారు.



టెలిమెడిసిన్ సేవలను పరిశీలిస్తున్న కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ భుజంగరావు, డాక్టర్ సుభాష్ కౌల్ తదితరులు


వరద కష్టం.. వెల్లువెత్తుతున్న సాయం

రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద కష్టాలు ప్రజలను ఇంకా వెంటాడుతున్నాయి. కష్టార్జితం నీళ్లపాలై ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలు మళ్లీ మొదటి నుంచి జీవనపోరాటాన్ని ప్రారంభిస్తున్నాయి. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన అభాగ్యులకు దాతలు అండగా నిలుస్తున్నారు. తలాకొంత సాయం అందిస్తూ తమ ఔదార్యాన్ని చాటుకుంటున్నారు.



ఎర్నేని జగన్మోహన్‌రావు, విజయలక్ష్మి, హైదరాబాద్
విరాళం: రూ. 2,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..



ముంతిమడుగు వేణుగోపాలకృష్ణమూర్తి, గుంటూరు
విరాళం: రూ.1,00,000

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
పవర్‌ట్రెక్ ఇండస్ట్రీస్, గుంటూరు	50,000
వెంకటేశ్వర యోగా సేవా సంస్థ, చిలకలూరిపేట, పల్నాడు జిల్లా	26,000
పోలవరపు సుబ్రహ్మణ్యేశ్వరరావు, హైదరాబాద్	25,000
మోతడక టెంట్‌హౌస్ ఫ్రెండ్స్ గ్రూప్, మోతడక, గుంటూరు జిల్లా	20,000
వల్లభనేని సత్యవతి, హైదరాబాద్	20,000
జాగర్లమూడి నాగేశ్వరరావు, జె.పంగులూరు, బాపట్ల జిల్లా	11,111
కుర్రా శ్రీరఘురామ్, హిమబిందు, సిడ్నీ, ఆస్ట్రేలియా	10,116
జక్కా ఆదిత్య, హైదరాబాద్	10,000
జక్కా విక్రమ్, హైదరాబాద్	10,000
అన్నంరెడ్డి వెంకటేశ్వరరావు, రాజవోలు, తూర్పుగోదావరి జిల్లా	10,000
ఎద్దుల రామచంద్రారెడ్డి, హైదరాబాద్	10,000
ఎం.సుధాకరరావు, విశాఖపట్నం	10,000
ఎస్.ఆర్.ఆచార్యులు, హైదరాబాద్	10,000
ఉప్పాల చంద్రశేఖర్, రాజేశ్వరి, సూర్యాపేట	5,116
నూలు లక్ష్మిరెడ్డప్ప, బెంగళూరు	5,001
జాగర్లమూడి రాధిక, హైదరాబాద్	5,001
క్రాపా రవిశంకర్‌కృష్ణ, సీతారామపురం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా	5,001
టి.సత్యవతి దేవి, సికింద్రాబాద్	5,001
ఎం.ధ్రువకుమార్, భానూర్ పటాన్‌చెరు, సంగారెడ్డి జిల్లా	5,001
సంజీవి షణ్ముఖి, రైతునాగారం, నంద్యాల జిల్లా	5,001
శిష్ట్లా రమేశ్, సికింద్రాబాద్	5,001
చెరుకూరి రవిచంద్, విజయవాడ	5,000
శనక్కాయల లక్ష్మీప్రసన్న, హైదరాబాద్	5,000
పగడాల లక్ష్మీతులసి, హైదరాబాద్	5,000
కామనూర్ సుధాకర్, ధర్మవరం, సత్యసాయి జిల్లా	5,000
రంగా శ్రీనివాసరావు, నరసరావుపేట	5,000
పాలకోడేటి వేణు, హైదరాబాద్	5,000
బి.వరలక్ష్మి, విశాఖపట్నం	5,000

స్పందించే హృదయాలు.. తుడిచేను బాధితుల కన్నీళ్లు!

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

అమరావతి అభివృద్ధికి సహకరించండి

ప్రపంచ బ్యాంకు బృందానికి రాజధాని రైతుల విజ్ఞప్తి



తుళ్లూరు శివారులో నివాసాలను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి అభివృద్ధికి రుణాలిచ్చి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ప్రపంచ బ్యాంకు బృందాన్ని రాజధాని రైతులు కోరారు. రాజధాని గ్రామాల్లో మంగళవారం బృంద సభ్యులు పర్యటించారు. స్థానిక సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని రైతులు, రైతు కూలీలు, డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. 'అమరావతి నిర్మాణం జరిగితే పెద్ద సంఖ్యలో కార్మికులు వస్తారు. మీకున్న ఆదాయ వనరులు ఏంటి? ఏమైనా సమస్యలు, సందేహాలు ఉన్నాయా?' అని ప్రపంచ బ్యాంకు బృందం డ్వాక్రా మహిళలను ప్రశ్నించింది. రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్, రిటర్నబుల్ ప్లాట్లు, అభివృద్ధి విధానాలు, ఇంకా భూ సేకరణ చేయాల్సిన భూములు తదితర అంశాలపై రైతులు, రైతు కూలీలను అడిగి తెలుసుకున్నారు. తుళ్లూరులో ఎన్-14 రహదారి కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి ఇచ్చిన ప్రత్యామ్నాయ స్థలాలను ప్రపంచ బ్యాంకు బృందం పరిశీలించింది. అనంతరం హైకోర్టు భవనాలను సందర్శించింది. ఈ బృందంలో సభ్యులు ఐయాబీ రెడ్డి, రాజన్ వర్మ, కైటి రోజినెన్స్, జయ శర్మ ఉన్నారు. సీఆర్డీఏ సామాజిక అభివృద్ధి గ్రూప్ డైరెక్టర్ పి.కృష్ణ మోహన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరో రూ.3 వేల కోట్ల రుణం సమీకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రిజర్వు బ్యాంకు నిర్వహించిన వేలంలో పాల్గొని రూ.3,000 కోట్ల రుణం తీసుకుంది. అందులో రూ.1,000 కోట్లు 14 ఏళ్ల కాలపరిమితితో తీర్చేలా 7.11 శాతం వడ్డీకి, మరో రూ.1,000 కోట్లు 20 ఏళ్ల కాలపరిమితికి, ఇంకొక వెయ్యి కోట్లు 24 ఏళ్ల కాలపరిమితికి 7.14 శాతం వడ్డీ చొప్పున చెల్లించేలా రుణాన్ని సమీకరించింది.

కబ్జా కోరల్లో బుడమేరు!

బుడమేరు పరీవాహక ప్రాంతం:	2,930 ఎకరాలు
వాగు వెడల్పు:	50 నుంచి 120 మీటర్లు
ఆక్రమణలకు గురైన భూమి:	380 ఎకరాలు
సేద్యం చేస్తున్న పొలాలు:	260 ఎకరాలు
నిర్మాణాలు జరిపిన విస్తీర్ణం:	80 ఎకరాలు
ప్రైవేటు భూమి ఆక్రమణలు:	40 ఎకరాలు
భవన నిర్మాణాలు:	3,100

రూ.800 కోట్ల విలువైన భూముల ఆక్రమణ

అక్రమంగా 3,100 భవనాలు కట్టేశారు ● సర్వేలో వెల్లడైన వాస్తవాలు

విజయవాడ నగర పరిధిలో బుడమేరు వాగు భూములు దాదాపు 80 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిలో చిన్న చిన్న ఇళ్ల మొదలుకొని బహుళ అంతస్తుల భవనాల వరకూ వేల సంఖ్యలో నిర్మించేశారు. జక్కంపూడి కాలనీ నుంచి ఎనికేపాడు వరకు ఈ ఆక్రమణలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎకరం భూమి విలువ దాదాపు రూ.10 కోట్ల వరకు ఉంటుంది. అంటే ఆక్రమిత స్థలాల విలువ రూ.800 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. గజాల చొప్పున చూస్తే ఈ విలువ ఇంకా ఎక్కువగానే ఉంటుంది. అంతే కాదు.. గ్రామీణంలోనూ ఆక్రమణలు జరిగాయి.


వరదల వేళ బుడమేరు కాలువ ఉగ్రరూపం

ఆపరేషన్ బుడమేరు దిశగా..

విజయవాడ నగరాన్ని వరదలు ఇటీవల ముంచెత్తిన విషయం తెలిసిందే. నగరంలో సగ భాగం దాదాపు 10 రోజులపాటు జలమయమైంది. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. కొందరు ప్రాణాలు కోల్పోయారు. భారీగా వర్షాలు పడటంతోపాటు ఊహించని విధంగా వరద ముంచెత్తడంతోపాటు.. బుడమేరు పరిధిలో జరిగిన ఆక్రమణలూ ప్రధాన కారణమే. అందువల్ల ఈ కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఆపరేషన్ బుడమేరు చేపట్టనున్నట్లు రాష్ట్రపురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించారు. ఇందులోభాగంగా విజయవాడ నగరం, గ్రామీణం పరిధిలో బుడమేరు ఆక్రమణలపై కలెక్టర్ సృజన సర్వే చేయించారు. ఆ వివరాలతో నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

ఇదీ పరిస్థితి

☛ గంపలగూడెం, విస్సన్నపేట ప్రాంతంలో పుట్టి పలు వాగులను కలుపుకొని బుడమేరు ప్రవహిస్తుంది. ఈ నెల 1న అత్యధికంగా వరద రావడంతో బుడమేరు మళ్లింపు కాలువకు పలుచోట్ల గండ్లు పడి గ్రామాలు మునిగిపోయాయి. 40 గ్రామాల మీదుగా ప్రవహించే బుడమేరు పరీవాహక ప్రాంతం జిల్లాలో 2,930 ఎకరాలుగా గుర్తించారు. అయితే ఆక్రమణల కారణంగా బుడమేరు చాలామేరకు కుంచించుకుపోయింది.

☛ ఈ కబ్జాల నిగ్గు తేల్చేందుకు రెవెన్యూ, జలవనరుల శాఖల సిబ్బందితో సర్వే నిర్వహించారు. వారం రోజుల పాటు సర్వే జరిగింది. బుడమేరు వాగు పలుచోట్ల కుంచించుకుపోయింది. నగర పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో 30 మీటర్ల వరకు తగ్గిపోయింది.

☛ విజయవాడ గ్రామీణంలో 260 ఎకరాల మేర బుడమేరును ఆక్రమించి సాగు చేస్తున్నారు. సర్వే నంబర్ల వారీగా ఈ వివరాలు సేకరించారు. ఇదే ప్రాంతంలో 40 ఎకరాల పట్టా భూములు సైతం కబ్జాలకు గురైనట్లు సర్వే బృందం దృష్టికి వచ్చింది. ఇది బుడమేరు విస్తరణకు సేకరించాల్సిన భూమి కావడం గమనార్హం.

☛ సింగ్‌నగర్, ఆర్ఆర్‌పేట నుంచి ఎనికేపాడు టన్నెల్ వరకు 80 ఎకరాలను కబ్జా చేశారు. బుడమేరు వాగు వెంట.. బుడమేరు భూమిలో 3,100 భవనాలను కట్టేశారు. వీటిలో పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటికి రోడ్లు వేసేందుకు కూడా ఇక్కడి స్థలాలను ఆక్రమించారు. ఇదంతా జరుగుతున్నా జలవనరుల శాఖ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.


ఒకవైపు బుడమేరు.. మరోవైపు ఏలూరు కాలువలు నిండుగా ప్రవహిస్తూ..

తీసుకోవాల్సిన చర్యలు ఇవీ..!

బుడమేరు వాగు వెడల్పు (50 నుంచి 120 మీటర్లు) ప్రామాణికంగా ఉండేలా నిర్ణయించాలి. ఇది అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండేలా చూడాలి. కొన్ని ప్రాంతాల్లో హెయిర్‌పిన్ తరహాలో వంకర్లు తిరిగింది. సరి చేయాలి. బుడమేరుకు సమాంతరంగా పాముల కాలువ నుంచి ఒక వాగు ఉండేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇది కనుమరుగైంది. దీనిని పునరుద్ధరిస్తే.. కొంత వరద దీని ద్వారా వెళుతుంది. దీనిని గుర్తించి పునరుద్ధరించాల్సి ఉంది. బుడమేరుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ కట్టాలనే ప్రతిపాదన కూడా ఉంది. అయితే దీనికి ఖర్చు ఎక్కువ అవుతుంది. ముందుగా ఆక్రమణలను తొలగించి బుడమేరు స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు బుడమేరు ఆపరేషన్ చేపట్టనున్నారు. తన ప్రతిపాదనలను ప్రభుత్వానికి తెలియజేశానని కలెక్టర్ జి.సృజన 'ఈనాడు'కు చెప్పారు.

- ఈనాడు, అమరావతి

బాలయోగికి లోక్‌సభ స్పీకర్ నివాళి



లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ ఓం బిర్లా

ఈనాడు, దిల్లీ: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా సభాపతి ఓం బిర్లా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఇక్కడి సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలయోగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. బాలయోగి లోక్‌సభకు వరుసగా రెండు సార్లు స్పీకర్‌గా వ్యవహరించారు. అంతకుముందు పదో లోక్‌సభ సభ్యుడిగానూ సేవలందించారు. ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. 2002 మార్చి 3న పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో కన్నుమూశారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌తోపాటు, లోక్‌సభ సచివాలయ సిబ్బంది నివాళులర్పించారు.

సీఎం ఎందుకు మాట్లాడారనడం సరైనదేనా?

- అందరూ ఆలోచించాల్సిన విషయమిది
- భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రానికి ముఖ్యమంత్రి పెద్ద. తిరుమల లడ్డూ వ్యవహారంలో ఉన్న పరిస్థితులు సమీక్షించుకొని దానిపై ప్రకటన చేయాలా? వద్దా? అన్నది సీఎం ఆలోచన విధానంపై ఆధారపడి ఉంటుంది' అని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి వ్యాఖ్యానించారు. సాధారణంగా కోర్టులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సవ్యంగా అమలవుతున్నాయా? లేవా? అన్నవి పరిగణనలోకి తీసుకుంటాయని తెలిపారు. లడ్డూ వ్యవహారంలో సీఎం ఎందుకు మాట్లాడారని ప్రశ్నించే అధికారం కోర్టులకు ఉందా? అన్న అంశంపై అందరూ ఆలోచన చేయాల్సి ఉందని పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో విజ్ఞప్తుల స్వీకరణ సందర్భంగా మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. 'భూవివాదాలపై ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయి. వీటి గురించి జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళితే సానుకూల స్పందన కనిపిస్తోంది. బదిలీలు, ఉపాధి అవకాశాల కల్పన గురించి కూడా మాకు అభ్యర్థనలు అందుతున్నాయి. ఉపాధి కల్పన గురించి ప్రైవేటు సంస్థల వారితో మాట్లాడుతున్నాం. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వేదికగా వారధి పనిచేస్తోంది' అని అన్నారు.



పని చెయ్యకపోతే ఫలితం ఉండదు

మీరు చేసే పనులకు ఫలితాలు ఎలా ఉంటాయో మీరు ఎప్పటికీ చెప్పలేకపోవచ్చు, ఊహించలేకపోవచ్చు కూడా. కానీ ఏ పనీ చెయ్యకపోతే మాత్రం ఏ ఫలితమూ ఉండదు. అది తథ్యం!

– మహాత్మా గాంధీ

'గనుల' వెంకటరెడ్డికి 3 రోజుల ఏసీబీ కస్టడీ

ఆదేశాలు జారీ చేసిన న్యాయస్థానం

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో వైకాపా పెద్దల గనులు, ఇసుక దోపిడీకి అన్నీ తానై సహకరించిన గనుల శాఖ పూర్వ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డిని మూడు రోజుల పాటు ఏసీబీ కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వైకాపా హయాంలో చోటుచేసుకున్న ఇసుక కుంభకోణానికి సంబంధించి మరిన్ని వాస్తవాలను వెలికితీసేందుకు ఆయనను సమగ్రంగా విచారించాల్సి ఉందని, ఏడు రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరగా.. కోర్టు మూడు రోజుల కస్టడీ ఇస్తున్నట్లు తెలిపింది. 3, 4, 5 తేదీల్లో ఆయన్ను కస్టడీలోకి తీసుకోవాలని పేర్కొంది. ఇసుక గుత్తేదారు సంస్థలైన జేపీవీఎల్, జీసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థలకు అనుచిత లబ్ధి కలిగించేలా పాల్పడ్డ ఉల్లంఘనలపై ఏసీబీ అధికారులు ఆయన్ను ప్రశ్నించనున్నారు.

అంగన్‌వాడీల గుత్తేదారులకు రూ.220 కోట్ల మేర బిల్లుల బకాయి

ప్రభుత్వం నిధులు విడుదల చేసినా జమ చేయని అధికారులు

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్లు, బాలసంజీవని కిట్లు సరఫరా చేసే గుత్తేదారులకు 5 నెలలుగా బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. మార్చి, మే, జూన్, జులై, ఆగస్టు నెలలకుగాను రూ.220 కోట్ల మేర బిల్లులు బకాయి ఉన్నాయి. సెప్టెంబరు కూడా ముగిసిన నేపథ్యంలో ఇంకో వారం, పది రోజులు గడిస్తే ఈ బిల్లులు కూడా చెల్లించాల్సి ఉంటుంది. మే, జూన్ నెలలకు సంబంధించి ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ కింద ప్రభుత్వం నిధులు విడుదల చేసి 20 రోజులు గడుస్తోంది. అయినా మహిళాశిశు సంక్షేమశాఖ అధికారులు మాత్రం చెల్లింపులు చేయడం లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం నిధులకు సంబంధించిన దస్త్రం ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిధులు విడుదల చేసినా అధికారులు జాప్యం చేస్తున్నారని గుత్తేదారులు ఆరోపిస్తున్నారు.


పదో తరగతి హిందీ సబ్జెక్టులో నాలుగు పాఠాలు తొలగింపు

ఈనాడు, అమరావతి: పదోతరగతి హిందీ సబ్జెక్టులో సిలబస్‌ను తగ్గిస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ) సిలబస్‌ను అమలు చేస్తున్నారు. దీంతో హిందీ సబ్జెక్టుకు సైతం ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలనే వినియోగిస్తున్నారు. ఇందులో పాఠాలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు ఉపాధ్యాయులు అధికారుల దృష్టికి తీసుకురాగా.. నాలుగు పాఠాలను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పద్యభాగంలో-7, గద్యభాగం-11, 12, ఉపవాచకంలో మూడో పాఠాన్ని మినహాయించారు. వీటిని ఉపాధ్యాయులు బోధించాల్సిన అవసరం లేదు. పరీక్షల్లోనూ ఈ పాఠాల నుంచి ఎలాంటి ప్రశ్నలు ఇవ్వరు. సీబీఎస్ఈలో తొమ్మిదో తరగతి నుంచి ఐదు సబ్జెక్టుల విధానం ఉంటుంది. అక్కడ రెండో భాషగా హిందీ ఐచ్ఛికంగా తీసుకుంటారు. రాష్ట్రంలో ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను వినియోగిస్తున్నా ఆరు సబ్జెక్టుల విధానం అమలు చేస్తున్నారు. దీంతో ఐచ్ఛికం లేకుండా హిందీ తప్పనిసరిగా చదవాల్సిన సబ్జెక్టుగా మారింది.

వరద బాధితులకు దాతల చేయూత

ఈనాడు డిజిటల్, అమరావతి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు దాతలు స్పందించి సాయం అందిస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కి గానన్ డంకర్లీ, కోఆపరేటివ్ లిమిటెడ్ సంస్థ రూ.25 లక్షల విరాళం ప్రకటించింది. ఆ సంస్థ ఎండీ మనోజ్‌కుమార్‌సింగ్, సీఓఓ బండారు శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ డీవీ రమణ.. ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబుకు సంబంధిత చెక్కు అందజేశారు. మిగతావారు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విరాళాలు అందించారు. తాడిపత్రికి చెందిన రోటరీ క్లబ్ ప్రతినిధులు రూ.1.1 లక్షలు, పల్నాడు జిల్లా అర్చకసేవా సంఘం ప్రతినిధి జి.కృష్ణమాచార్యులు రూ.లక్ష, వేములపల్లి శివరామకృష్ణ రూ.50 వేలు, గుంటూరుకు చెందిన ఆర్.రవికుమార్ రూ.50 వేలు, కదిరికి చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధి కె.శ్రీనివాసులు రూ.20 వేలు, కన్నెగంటి నవ్యత రూ.8 వేలు ఇచ్చారు.

★ తన మిత్రులతో కలిసి ఎన్‌వీవీఎస్ వరప్రసాద్ అన్న క్యాంటీన్లకు రూ.5 లక్షలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సంబంధిత చెక్కు ఇచ్చారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న గానన్ డంకర్లీ, కోఆపరేటివ్ లిమిటెడ్ సంస్థ ఎండీ మనోజ్‌కుమార్‌సింగ్, ఇతర ప్రతినిధులు

అరగంటలో ఇసుకంతా బుకింగ్

- అర్ధరాత్రి వేళ ఆన్‌లైన్ బుకింగ్ మొదలు
- వారం రోజుల నిల్వలన్నీ ఖాళీ

ఈనాడు, అమరావతి: ఈ వారంలో ఎవరికి ఇసుక కావాలన్నా దొరకని పరిస్థితి నెలకొంది. ఇసుక అవసరమైనవాళ్లు వచ్చే సోమవారం వరకూ ఎదురుచూడక తప్పదు. ఈ వారానికి ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్‌కు అవకాశం కల్పించగా.. అరగంటలోనే అన్ని నిల్వ కేంద్రాల్లోని ఇసుక బుక్ అయిపోయింది. గనులశాఖ అధికారులు ఏయే కేంద్రాల్లో ఎంతెంత ఇసుక ఉంది, రోజుకు ఎంత చొప్పున.. వారంపాటు ఎంత సరఫరా చేస్తారో పేర్కొంటూ శాండ్‌పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా ఈ వారానికి ఆదివారం అర్ధరాత్రి దాటాక శాండ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్ బుకింగ్‌కు వీలు కల్పించారు. ఈ విషయం తెలిసిన కొందరే ఆ సమయంలో శరవేగంగా బుక్ చేసేసుకున్నారు. రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు వేర్వేరు సమయాల్లో బుకింగ్ తెరవగానే.. అరగంటలోనే అంతా బుక్ అయిపోయింది. సామాన్యుల కంటే.. కొందరు ఇసుక రవాణాదారులే వీటిని బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇలా అర్ధరాత్రి బుకింగ్ తెరవడం, ఈ విషయం అందరికీ తెలియకపోవడంతో. . సామాన్యులు, ఇసుక అవసరమైనవాళ్లు ఎక్కువమందికి ఇసుక బుక్ చేసుకునే అవకాశం లభించలేదు.



16 నుంచి తవ్వకాలకు 108 రీచ్‌లు సిద్ధం

ప్రస్తుతం ఇసుక నిల్వలు తక్కువగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం రుతుపవనాల సీజన్‌లో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదు. గత ప్రభుత్వంలో వీటితో సంబంధం లేకుండా ఇష్టానుసారం ఇసుక తవ్విపారేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాత్రం.. సుప్రీంకోర్టు, ఎన్జీటీ ఆదేశాలను పాటిస్తోంది. దీంతో నిల్వ కేంద్రాల్లోని ఇసుకనే విక్రయిస్తున్నారు. అక్టోబరు 15తో రుతుపవనాల సీజన్ ముగుస్తుంది. 16వ తేదీ నుంచి పెద్దయెత్తున రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

★ కూలీలతో ఇసుక తవ్వి, లోడ్ చేసే (మాన్యువల్) 108 రీచ్‌లకు అనుమతులు తీసుకున్నారు. వీటిలో 50 లక్షల టన్నుల ఇసుక ఉంది. వీటన్నింటిలో 16 నుంచి తవ్వకాలు ఆరంభించి, అక్కడి నుంచే నేరుగా లారీల్లో లోడింగ్ చేసేలా చూడనున్నారు.

★ 5 హెక్టార్లకు పైగా ఉండే రీచ్‌ల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలకు అవకాశం ఉంది. ఇటువంటి రీచ్‌లు 22 గుర్తించారు. వీటిలో 1.5 కోట్ల టన్నుల ఇసుక ఉంది. ఇందులో ఇప్పటికే 15 రీచ్‌లకు అభిప్రాయ సేకరణ పూర్తిచేశారు. వీటికి రాష్ట్రస్థాయి ఎక్స్‌పర్ట్ అప్రైజర్ కమిటీ (ఎస్ఈఏసీ), రాష్ట్రస్థాయి పర్యావరణ మదింపు సంస్థ (సియా) నుంచి అనుమతులు తీసుకోవాలి. వీటి కమిటీలు జూన్‌లో రాజీనామాలు చేశాయి. కొత్త కమిటీలు ఏర్పాటై, పర్యావరణ అనుమతులు (ఈసీలు) జారీచేస్తే.. ఆయా రీచ్‌ల్లో యంత్రాలతో నవంబరు నుంచి ఇసుక తవ్వకాలు ఆరంభించాలని భావిస్తున్నారు.

★ శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు తదితర జిల్లాల్లోని బ్యారేజీలు, జలాశయాల పరిధిలో పూడిక రూపంలో ఉన్న ఇసుక తవ్వి, కొరత లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. వీటికీ పర్యావరణ అనుమతులు పొందడం సాధ్యం కావట్లేదు.

పట్టణ స్థానిక సంస్థలకు కేంద్రం షాక్

- రూ.138 కోట్ల ఆర్థిక సంఘం నిధుల నిలిపివేత
- 2025-26 నాటికి నష్టం రూ.1,000 కోట్లపైనే
- గత వైకాపా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించని ఫలితం

ఈనాడు, అమరావతి: ఎన్నికలు నిర్వహించకపోవడం, ఆస్తిపన్ను ఆదాయం పెంచుకోని కారణంగా రాష్ట్రంలో 29 పట్టణ స్థానిక సంస్థలకు రూ.138 కోట్ల ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపేసింది. 15వ ఆర్థిక సంఘం కాలపరిమితి 2025-26లో ముగిసే నాటికి నష్టపోయే నిధులు రూ.1,000 కోట్లకు పైగా చేరుతాయని అంచనా. దీంతో ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న పనులపై ప్రభావం పడనుంది. పట్టణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. గత వైకాపా ప్రభుత్వంలో పట్టణ స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేయడంతో పరిపాలన గాడితప్పింది. గత నాలుగేళ్లుగా వేచిచూసిన కేంద్రం తాజాగా నాలుగు నగరపాలక సంస్థలు, మరో 25 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఆర్థికసంఘం నిధులు నిలిపేసింది. 2023-24 సంవత్సరానికి మొదటి విడతగా రూ.523 కోట్లు విడుదల చేయాల్సిన కేంద్రం. . రూ.138 కోట్లు తగ్గించి రూ.385 కోట్లే ఇచ్చింది. సంస్కరణలు పూర్తిగా అమలుచేయని పట్టణ స్థానిక సంస్థలకు నిధులు నిలిపివేస్తున్నట్లుగా పేర్కొంది.

నిధులు ఎందుకు నిలిపివేశారంటే..

★ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలంటే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి. కానీ, వైకాపా ప్రభుత్వం 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదు. కోర్టుకేసుల పేరుతో వీటిని గత ప్రభుత్వం పక్కన పెట్టింది.

★ ఆస్తిపన్ను ఆదాయం పెంచుకోవడంలోనూ పలు పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు విఫలమైనట్లుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఉదాహరణకు 2022-23 కంటే 2023-24 ఆర్థిక సంవత్సరం ఆదాయం 12.01% పెరగాలన్న నిబంధన ఆరు పట్టణ స్థానిక సంస్థల్లో అమలుకాలేదు.

★ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద ఆరేళ్లకు రూ.6,495 కోట్లు కేటాయించింది. 2020-21లో మొదలైన 15వ ఆర్థిక సంఘం 2025-26 నాటికి ముగియనుంది. 2020-21, 2021-22, 2022-23, 2023-24 వరకు గత నాలుగేళ్లలో కేంద్రం 3,644.65 కోట్లు ఇచ్చింది. గత ఏడాది నిధుల్లో నుంచి (2023-24) కోత పెట్టింది.

నిధులు కోల్పోయిన పట్టణ స్థానిక సంస్థలివే..

నగరపాలక సంస్థలు: శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, కాకినాడ, మంగళగిరి-తాడేపల్లి

పురపాలక సంఘాలు: ఆమదాలవలస, రాజాం, పాలకొండ, ఏలేశ్వరం, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, కొవ్వూరు, చింతలపూడి, గుడివాడ, వైఎస్ఆర్ తాడిగడప, బాపట్ల, నరసరావుపేట, రేపల్లె, పొన్నూరు, కందుకూరు, అద్దంకి, పొదిలి, గూడూరు(నెల్లూరు జిల్లా), కావలి, ఆలూరు, శ్రీకాళహస్తి, బి.కొత్తకోట

నిధులు మళ్లించి పనులకు గ్రహణం పట్టించారు

పట్టణ స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను గత వైకాపా ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించి పట్టణాల్లో అభివృద్ధి పనులకు గ్రహణం పట్టించింది. ఉదాహరణకు 2020-21 నుంచి 2022-23 మధ్య మూడేళ్లలో ఆర్థిక సంఘం నిధులతో పుర, నగరపాలక సంస్థల్లో మంజూరైన 8,909 పనుల్లో కేవలం 2,603 పూర్తయ్యాయి. మరో 778 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక రూ.454 కోట్లను పట్టణ స్థానిక సంస్థలకు విడుదల చేయడంతో మళ్లీ ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి.

ఆయుధాలు తిరిగిచ్చే విషయంపై కౌంటర్ వేయండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: తమకు చెందిన లైసెన్సు ఆయుధాలను తిరిగి అప్పగించేలా పోలీసులను ఆదేశించాలంటూ పుంగనూరు వైకాపా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె వైకాపా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కౌంటర్ వేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 14కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. పోలీసుల తరఫు ప్రభుత్వ న్యాయవాది కేఎం.కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో అధికార, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తల మధ్య ఉద్రిక్త పరిస్థితులున్నాయన్నారు. శాంతిభద్రతల సమస్య సున్నితంగా తయారైందని తెలిపారు. అక్కడి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆయుధాలను వెనక్కి ఇచ్చే విషయమై పోలీసులు పునరాలోచిస్తున్నారని వివరించారు. ప్రత్యర్థులపై ఆయుధాలను వినియోగిస్తారేమోనన్న ఆందోళన ఉందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని కోరారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది వీఆర్ఎన్.ప్రశాంత్ వాదనలు వినిపించారు. ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉన్న నేపథ్యంలో ఆయుధాలను వెనక్కిచ్చేలా ఆదేశించాలని కోరారు.

వాలంటీర్లకు దినపత్రిక కోసం ఇచ్చే రూ.200 సాయం నిలుపుదల

ఈనాడు, అమరావతి: దినపత్రిక కొనుగోలు చేసేందుకు వాలంటీర్లకు నెలకు రూ.200 చొప్పున చెల్లించడాన్ని నిలిపివేస్తూ గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాలంటీర్లకు రూ.5 వేల గౌరవ వేతనంతో పాటు దిన పత్రిక కొనుగోలుకు నెలకు రూ.200 చొప్పున చెల్లించాలని గత ప్రభుత్వం 2022 జూన్ 29న జీవో (ఆర్టీ నంబరు 12) జారీ చేసింది. 'సాక్షి' పత్రిక సర్క్యులేషన్ పెంచుకోవడంతో పాటు ఆ సంస్థకు ప్రతి నెలా కోట్ల రూపాయిల ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకే వైకాపా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ప్రతిపక్ష తెదేపా ఆరోపించింది. ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ఆర్థిక దుర్వినియోగంపై చర్యలు చేపట్టింది. మంత్రివర్గ సమావేశంలో వాలంటీర్లకు దినపత్రిక కొనుగోలుకు సాయం నిలుపుదల చేయాలన్న ప్రతిపాదనను ఆమోదించారు. ఇందుకు సంబంధించి తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన బాట

పలుచోట్ల షాపులు తెరవకుండా నిరసన

ఈనాడు, అమరావతి: మద్యం రిటైల్ వ్యాపారాన్ని ప్రైవేటుకు అప్పగించేలా ప్రభుత్వం నూతన విధానాన్ని ఖరారు చేయటంతో ప్రస్తుతం ఏపీఎస్‌బీసీఎల్ నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మద్యం దుకాణాలను తెరవకుండా నిరసన తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. దీంతో దాదాపు వెయ్యికి పైగా దుకాణాలు మూతపడ్డాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు ఎక్సైజ్ కానిస్టేబుళ్లతో మధ్యాహ్నానికి వాటిని తిరిగి తెరిపించారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాలు తెరుచుకోకపోవటంతో కొనుగోలుదారులు నిరసన తెలిపారు. ప్రభుత్వ దుకాణాల్లో పొరుగు సేవల ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందికి ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై చర్చలు జరుపుతున్నామని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

98 % మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మంగళవారం 98 శాతం ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరుచుకున్నాయని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. వీటిల్లో పనిచేస్తున్న సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు కొన్నిచోట్ల ఆందోళన బాట పట్టినా ఆ ప్రభావమేమీ లేదని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి దుకాణాలు తెరిచామన్నారు. మంగళవారం రూ.82 కోట్ల విలువైన మద్యం విక్రయించామని చెప్పారు.

మావోయిస్టు మిలీషియా సభ్యులు 17 మంది లొంగుబాటు


మిలీషియా సభ్యుల వివరాలు వెల్లడిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, అదనపు ఎస్పీ ధీరజ్

పాడేరు, న్యూస్‌టుడే: ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని గిన్నెల కోట, లండులు, ఇంజరి ప్రాంతాలకు చెందిన 17 మంది మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యులు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. 'పదేళ్లుగా వీరంతా వివిధ రూపాల్లో మావోయిస్టులకు సహకారం అందిస్తూ వచ్చారు. లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు అందజేస్తాం. మావోయిస్టు పార్టీ నుంచి బయటకు వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలనుకునే వారు స్వచ్ఛందంగా గానీ, బంధుమిత్రుల ద్వారా గానీ పోలీసు అధికారులను సంప్రదించవచ్చు' అని తెలిపారు. 'ప్రస్తుతం మేమంతా మావోయిస్టు కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నాం. వారి చర్యలతో విసిగి పోలీసులకు లొంగిపోయాం' అని మిలీషియా సభ్యుడొకరు పేర్కొన్నారు.

EENADU Vol: 51, Iss: 53 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao


TVS Racing
TVS
CELEBRATE WITH INDIA'S MOST POWERFUL* 160cc
BEST-IN-CLASS POWER*
3 RIDE MODES | LED HEADLAMP
WINNER
BOOK A TEST RIDE
PRICE STARTS AT ₹1 09 990*
LOW DOWN PAYMENT ₹9 999*
SAVINGS UP TO ₹20 000**
CASHBACK UP TO ₹7 500*
Apache
RTR SERIES
RACING DNA UNLEASHED


MARUTI SUZUKI
NEXA
ధైర్యవంతులకు విజయం అనుకూలంగా ఉంటుంది.
ఈ నవరాత్రికి, NEXA ప్రీమియం హ్యాచ్ బాక్ Balenoను ఇంటికి డ్రైవ్ చేయండి మరియు అద్భుతమైన పండగ ఆఫర్లను ఆనందించండి.
CREATE. INSPIRE.
BALENO
3 years 100 000 km WARRANTY*
EXTENDABLE UPTO 6 YEARS
THE NEW AGE
BALENO
TECH GOES BOLD

రైలుకు అడ్డంగా రాడ్డు పెట్టి.. దోపిడీకి విఫలయత్నం


గుజరాత్‌లో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

బొటాద్: రైలులో దోపిడీకి పాల్పడేందుకు దుండగులు దుస్సాహసానికి ఒడిగట్టారు. సుమారు ఐదారడుగుల పొడవున్న భారీ ఇనుప కడ్డీని రైలు పట్టాలకు అడ్డంగా పెట్టారు. అయితే, లోకోపైలట్ చాకచక్యంగా వ్యవహరించి రైలును అదుపుచేయడంతో భారీ ప్రమాదం తప్పింది. సెప్టెంబరు 25న గుజరాత్‌లోని బొటాద్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బొటాద్ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు ఆర్థిక సమస్యల నుంచి బయటపడేందుకు చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. రైలు పట్టాలు తప్పేలా చేసి అందులోని ప్రయాణికులను దోచుకోవాలని పన్నాగం పన్నారు. పక్కా వ్యూహం ప్రకారం.. నిర్జన ప్రాంతంలో పట్టాలకు అడ్డంగా భారీ ఇనుప కడ్డీని పెట్టి.. దగ్గర్లోని పంట పొలాల్లో దాక్కున్నారు. సెప్టెంబరు 25న తెల్లవారుజామున ఓఖా- భావ్‌నగర్ ప్యాసింజర్ రైలు లోకోపైలట్ కడ్డీని దూరం నుంచే గమనించి రైలు వేగాన్ని నియంత్రించారు. రైలు దానిని ఢీ కొట్టినప్పటికీ, వేగం తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా ఒక్కసారిగా బయటకు రావడంతో.. నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. లోకోపైలట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రమేశ్ సాలియా, జయేశ్ బవిలియా అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

బిహార్‌లో వరద బీభత్సం

పట్నా: బిహార్‌లో వరద పరిస్థితి దారుణంగా ఉంది. రాష్ట్రంలో 16 జిల్లాల్లోని 78 మండలాల్లో 11.84 లక్షల మందిపై ఈ ప్రభావం పడింది. అనేకచోట్ల ప్రజలు నీటిలో చిక్కుకుపోయారు. ఏడుచోట్ల నదులకు గండ్లు పడ్డాయి. మంగళవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ పర్యటించారు. అక్కడి దుస్థితిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. దిల్లీ నుంచి తిరిగొచ్చిన ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా ఏరియల్ సర్వే నిర్వహించారు. నేపాల్‌లో రికార్డు స్థాయి వర్షాలతో సరిహద్దుల్లోని బ్యారేజీ నుంచి లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో బిహార్‌లో ఈ పరిస్థితి ఏర్పడింది. వరద బాధితులకు భారత వైమానిక దళ హెలికాప్టర్ల ద్వారా ఆహార పొట్లాలను జారవిడిచారు. సీతామర్హి, దర్భంగా జిల్లాల్లోని రెండు లక్షల మంది దీనివల్ల ఉపశమనం పొందారని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు. 840 బోట్లు, 10 బోటు అంబులెన్స్‌లతో సహాయ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 24 పునరావాస శిబిరాల్లో 12,400 మంది తలదాచుకుంటున్నట్లు వివరించారు.

నాటో కొత్త సారథిగా మార్క్ రుట్



బ్రసెల్స్: ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి 'నాటో' ప్రధాన కార్యదర్శిగా పదేళ్లపాటు వ్యవహరించిన జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ మంగళవారం రాజీనామా చేసి, ఆ పదవీ బాధ్యతలను నెదర్లాండ్స్ మాజీ ప్రధానమంత్రి మార్క్ రుట్‌కు అప్పగించారు. నార్వే దేశానికి చెందిన స్టోల్టెన్‌బర్గ్ 2014లో నాటో ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టారు. తన తరవాత ఈ పదవి చేపట్టడానికి అన్ని విధాల అర్హుడు మార్క్ రుట్ అని ఆయన ప్రశంసించారు. రుట్ 14 ఏళ్లపాటు నెదర్లాండ్స్ ప్రధానిగా ఉన్నారు. నాలుగు సంకీర్ణ ప్రభుత్వాల సారథిగా పరిపాలన సాగించారు. ఆ అనుభవం 32 దేశాల నాటోను నిర్వహించడానికి ఎంతో ఉపకరిస్తుందని స్టోల్టెన్‌బర్గ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలుపెట్టి 1000 రోజులైన సందర్భంలో రుట్ నాటో సారథ్యం స్వీకరిస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్‌లలో ఎవరు గెలిచినా వారితో కలసి సమన్వయంతో పనిచేయగలనని రుట్ ప్రకటించారు.

జర్నలిస్టుగా విధి నిర్వహణే నా నేరం: అసాంజ్



స్ట్రాస్ బర్గ్ (ఫ్రాన్స్): పాత్రికేయుడిగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చడమే తాను చేసిన నేరమని ఒప్పుకొని సుదీర్ఘ కారాగారవాసం నుంచి విముక్తి పొందానని వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజ్ వెల్లడించారు. 46 దేశాలతో ఏర్పడిన ఐరోపా మండలికి చెందిన పార్లమెంటరీ అసెంబ్లీ మానవ హక్కుల, న్యాయ వ్యవహారాల కమిటీని ఉద్దేశించి మంగళవారం ఆయన ప్రసంగించారు. జర్నలిస్టుగా విశ్వసనీయ వర్గాల నుంచి సేకరించిన ముఖ్యమైన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడమే తాను చేసిన నేరమని అమెరికా న్యాయశాఖ ముందు ఒప్పుకున్నానని అసాంజ్ తెలిపారు. ఇరాక్, అఫ్గానిస్థాన్ యుద్ధాలలో అమెరికా సైన్యం చేసిన దారుణాలను బయటపెట్టినందుకు అమెరికా ఆయనపై మండిపడింది. అప్పుడు ఆయన లండన్‌లోని ఈక్వెడార్ రాయబారి కార్యాలయంలో ఏడేళ్లపాటు రాజకీయ ఆశ్రయం పొందారు. తరవాత ఆశ్రయాన్ని ఈక్వెడార్ ఉపసంహరించడంతో అమెరికా రక్షణ రహస్యాలను బయటపెట్టానని అమెరికా న్యాయశాఖ ముందు అంగీకరించారు. ఆపైన బ్రిటిష్ జైలులో అయిదేళ్లపాటు శిక్ష అనుభవించాక ఈ ఏడాది జూన్‌లో విడుదలై స్వదేశం ఆస్ట్రేలియాకు సతీసమేతంగా చేరుకున్నారు.

అమెజాన్ అడవుల్లో భీకర కార్చిచ్చు

బ్రెజిల్‌లో మూడొంతులు కమ్ముకొన్న పొగ..

ఇంటర్నెట్ డెస్క్: అమెజాన్ అడవుల్లో భీకర కార్చిచ్చు చెలరేగింది. దీంతో ఆ దేశంలోని 80 శాతం ప్రాంతంలో పొగ అలముకొంది. గత 14 ఏళ్లలో ఏనాడు ఈ స్థాయి కార్చిచ్చు రాలేదని ఈయూ కోపర్నికస్ అబ్జర్వేటరీ పేర్కొంది. ఓవైపు బ్రెజిల్ తీవ్రమైన కరవుతో ఇబ్బందిపడుతుంటే మరోవైపు ఈ కార్చిచ్చులు పచ్చదనాన్ని హరించివేస్తున్నాయి. ఇప్పటికే అర్జెంటీనా, బ్రెజిల్, బొలీవియా, కొలంబియా, ఈక్వెడార్, పరాగ్వే, పెరూల్లో లక్షల హెక్టార్ల అటవీ భూమి, పొలాలు దహనమైపోయాయి. భూమిపై అమెజాన్ ప్రాంతం అత్యంత తేమ ప్రాంతంగా పేరుంది. కానీ, గత వారం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్పేస్ రీసెర్చి ఉపగ్రహ చిత్రాల్లో 80 శాతం బ్రెజిల్ భూభాగంపై పొగ అలముకొన్నట్లు తేలింది. ఈ పొగ పీలిస్తే రోజూ ఐదు సిగరెట్లు కాల్చినంత ప్రభావం ఆరోగ్యంపై పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో అమెజాన్‌లో ఏర్పడిన కార్చిచ్చుల్లో ప్రజల హస్తం ఎక్కువగా ఉన్నట్లు భావిస్తున్నారు. అటవీ భూమిని సాగుకు యోగ్యం చేసేందుకు నిప్పుపెడుతున్నట్లు గుర్తించారు.

జమైకా ప్రగతి పయనంలో

భారత్ విశ్వసనీయ భాగస్వామి

- ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్య
- జమైకా ప్రధాని ఆండ్రూతో భేటీ
- మోదీ విందులో క్రికెటర్ క్రిస్ గేల్
- ముర్ము, ధన్‌ఖడ్, నడ్డాలతోనూ ఆండ్రూ సమావేశం



దిల్లీలోని హైదరాబాద్ హౌస్ వద్ద జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్‌నెస్‌కు స్వాగతం పలుకుతున్న ప్రధాని మోదీ

దిల్లీ: కరీబియన్ దేశం జమైకా అభివృద్ధి పయనంలో భారతదేశం విశ్వసనీయ భాగస్వామి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీవ ఇంధనం, కొత్త ఆవిష్కరణలు, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం వంటి పలు రంగాల్లో జమైకాతో నైపుణ్యాన్ని పంచుకోడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్‌నెస్‌తో ప్రధాని మోదీ మంగళవారం సమావేశమై విస్తృత చర్చలు జరిపారు. అనంతరం పీఎంవో ఓ మీడియా ప్రకటన విడుదల చేసింది. ఇద్దరు దేశాధినేతల మధ్య పలు ప్రాంతీయ, భౌగోళిక అంశాలు చర్చకు వచ్చాయని.. వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకొని, ప్రపంచ శాంతిభద్రతల కోసం ఇరుపక్షాలు కలిసి పనిచేయాలని అంగీకారానికి వచ్చినట్లు వెల్లడించారు. ఐక్యరాజ్యసమితిలోని భద్రతామండలి సహా పలు ప్రపంచస్థాయి సంస్థల్లో సంస్కరణలు అవసరమనే విషయంలో రెండు దేశాలు ఏకాభిప్రాయంతో ఉన్నట్లు తెలిపారు. రక్షణ రంగంలో జమైకా సాయుధ దళాలకు శిక్షణ, సామర్థ్యాన్ని పెంపొందించడంలో తాము ముందుంటామని మోదీ అన్నారు. వ్యవస్థీకృత నేరాలు, మాదక ద్రవ్యాలు, ఉగ్రవాదం ఇరు దేశాలు ఎదుర్కొంటున్న సాధారణ సవాళ్లుగా పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌లతోనూ జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్‌నెస్ సమావేశమై చర్చలు జరిపారు. జమైకా ప్రతినిధి బృందం గౌరవార్థం ప్రధాని మోదీ ఇచ్చిన విందుకు జమైకన్ క్రికెటర్ క్రిస్ గేల్ కూడా హాజరయ్యారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా ప్రారంభించిన 'భాజపా గురించి తెలుసుకోండి' కార్యక్రమంలో భాగంగా నడ్డాతోనూ ఆండ్రూ భేటీ అయ్యారు.

పశ్చిమబెంగాల్‌లో మళ్లీ జూనియర్ వైద్యుల ఆందోళన

- ఆసుపత్రుల్లో నిరవధికంగా అన్ని రకాల సేవల నిలిపివేత



జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ కోల్‌కతాలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో జూనియర్ వైద్యులు మళ్లీ ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు అన్నిరకాల సేవలను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఆగస్టు 9న ఇక్కడి ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ జూనియర్ వైద్యులు 42 రోజుల పాటు చేపట్టిన సమ్మెను సెప్టెంబరు 21న విరమించారు. పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే తమ భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ సరైన చర్యలు చేపట్టనందున మళ్లీ నిరవధిక నిరసన ప్రారంభిస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. డ్యూటీ గదుల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఆసుపత్రుల్లో శాశ్వత మహిళా పోలీసు సిబ్బందిని నియమించాలని, పోలీసు బందోబస్తు పెంచాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీసీటీవీల ఏర్పాటు, మరుగుదొడ్లు, ప్రత్యేక విశ్రాంతి గదుల నిర్మాణాలను పూర్తిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని సోమవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇంతవరకు సగం పనులే జరిగాయని, మొత్తం పనులను అక్టోబరు 15కల్లా పూర్తిచేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.

వేల మందితో భారీ ర్యాలీ: జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ మంగళవారం కోల్‌కతాలో వేల మంది ప్రజలు ఐదు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ నిర్వహించారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతోపాటు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. వైద్యుల ఉమ్మడి వేదిక కింద జరిగిన ఈ ర్యాలీ కాలేజ్ స్క్వేర్ దగ్గర మొదలై జేఎల్ నెహ్రూ రోడ్డు మీదుగా రబీంద్ర సదన్ దగ్గర ముగిసింది. ఈ సందర్భంగా ఆందోళనకారులు మహిళలకు భద్రతతోపాటు సమానహక్కులు కల్పించాలని నినదించారు. "న్యాయం జరిగేవరకు మా నిరసనలు కొనసాగుతాయి. 'మహాలయ'ను పురస్కరించుకుని నేడు మేం అందరం ఒకదగ్గర సమావేశమయ్యాం. దుర్గా పూజ రోజుల్లోనూ మా సోదరికోసం జరిగే ఈ పోరు కొనసాగుతుంది" అని ర్యాలీలో పాల్గొన్న వైద్యుడు మల్లిక్ చెప్పారు. ఈ సందర్భంగా ఆందోళనల్లో పాల్గొన్న వైద్యులు తమ మొబైల్ ఫోన్ లైట్లను ఆన్‌చేసి అటూ ఇటూ ఊపుతూ నిరసన తెలిపారు.

ట్రంప్ అయినా సరే.. ఇక మాట్లాడుకోవడాల్లేవ్

- కిమ్ సర్కారు వెల్లడి

ఇంటర్నెట్‌డెస్క్: దౌత్యం విషయంలో ఉత్తరకొరియా రూటు మార్చింది. ఇక నుంచి వ్యక్తిగత దౌత్యాలు నెరపకూడదని కిమ్ సర్కారు నిర్ణయించింది. ఈ విషయాన్ని ఆ దేశ దూత సాంగ్ కిమ్ న్యూయార్క్‌లోని ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో వెల్లడించారు. "అమెరికాలో ఎవరు అధికారంలోకి వచ్చినా అమెరికా ప్రభుత్వంతోనే డీల్ చేస్తాం. ఏ కార్యవర్గం అధికారంలోకి వచ్చినా డీపీఆర్‌కేతో వ్యవహారాలు జరపాల్సి ఉంటుంది" అని పేర్కొన్నారు. ఉత్తర కొరియా నుంచి అమెరికాకు పారిపోయిన ఓ మాజీ ఉన్నతస్థాయి దౌత్యవేత్త ఇటీవల మాట్లాడుతూ ట్రంప్ కార్యవర్గం అధికారంలోకి వస్తే చర్చలు జరపాలని కిమ్ సర్కారు భావిస్తోందన్నారు. బేరసారాలకు సరికొత్త దౌత్యనీతిపై ఆ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. హారిస్‌ను ఓడించి ట్రంప్‌ను అధికారంలోకి తీసుకొచ్చేలా ఉత్తర కొరియా అధికారులు వ్యూహరచన చేస్తున్నట్లు అంచనా వేశారు. అనంతరం ఆంక్షల తొలగింపు, ఉగ్రవాద దేశంగా ఉన్న ముద్రను తుడిపేసుకోవాలన్నది వారి లక్ష్యమని వెల్లడించారు. గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో ఉత్తరకొరియా విషయంలో పట్టువిడుపులతో వ్యవహరించారు.

లెబనాన్ సరిహద్దుల్లో 900 మంది భారత జవాన్లు

- ఇజ్రాయెల్ భూతల దాడుల నేపథ్యంలోనూ అక్కడే విధులు
- అందరూ సురక్షితంగా ఉన్నట్లు యూఎన్ఐఎఫ్ఐఎల్ వర్గాల వెల్లడి

జెరూసలెం: హెజ్‌బొల్లాతో పోరు నేపథ్యంలో లెబనాన్‌పై భూతల దాడులు నిర్వహించాలని ఇజ్రాయెల్ నిర్ణయించినప్పటికీ.. దక్షిణ లెబనాన్‌లో ఐరాస తరఫున పనిచేస్తున్న దళానికి (యూఎన్ఐఎఫ్ఐఎల్) చెందిన భారత బృందం అక్కడే విధులు నిర్వర్తించనుంది. "900 మందికిపైగా సైనికులతో కూడిన భారత బృందం అక్కడే ఉంది. అందరూ సురక్షితంగా ఉన్నారు" అని దక్షిణ లెబనాన్‌లోని యూఎన్ఐఎఫ్ఐఎల్ వర్గాలు మంగళవారం తెలిపాయి. బ్లూ లైన్‌కు రెండో వైపున గల ఇజ్రాయెల్ పట్టణాలకు ముప్పుగా పరిణమించిన హెజ్‌బొల్లా లక్ష్యాలు, మౌలిక వసతులు గల దక్షిణ లెబనాన్‌లోని సరిహద్దు గ్రామాలపై లక్షిత, పరిమిత స్థాయిలో దాడులను కొన్ని గంటల క్రితం ప్రారంభించామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) మంగళవారం ఉదయం ప్రకటించింది. లెబనాన్‌లో ప్రవేశించిన పదాతి దళాలకు సైన్యం, వైమానిక దళాల నుంచి సహకారం అందుతోందని వెల్లడించింది. మరోవైపు, ఈ దాడులను తాము సమర్థంగా ఎదుర్కొంటామని హెజ్‌బొల్లా తెలిపింది.

అమెరికా సరిహద్దుల్లోకి దూసుకొచ్చిన రష్యా యుద్ధ విమానం

ఇంటర్నెట్ డెస్క్: రష్యా యుద్ధ విమానం మరోసారి అమెరికా సరిహద్దుల్లో దుందుడుకుగా వ్యవహరించింది. ఇందుకు సంబంధించిన వీడియోను సైనిక అధికారులు విడుదల చేశారు. మాస్కో విమానాన్ని వెనక్కి పంపడానికి అమెరికా కూడా ఎఫ్-16 ఫైటర్‌జెట్‌ను రంగంలోకి దింపాల్సి వచ్చింది. ఈ వీడియోలో రష్యాకు చెందిన ఫైటర్‌జెట్ అమెరికా విమానానికి కొన్ని అడుగుల దూరం వరకు వచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఘటన నార్తర్న్ అమెరికన్ ఏరోస్పేస్ కమాండ్ పరిధిలో సెప్టెంబరు 23న జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో అలాస్కా ఎయిర్ డిఫెన్స్ జోన్‌లోకి తరచూ రష్యా విమానాలు చొచ్చుకొస్తున్నాయి. "రష్యాకు చెందిన ఎస్‌యూ-35 విమానం అసురక్షితంగా ప్రయాణించింది. ఇది ఏమాత్రం ప్రొఫెషనల్ ఎయిర్‌ఫోర్స్‌లా అనిపించలేదు" అని ఆ కమాండ్ అధిపతి జనరల్ గ్రెగరీ గ్యూలాంట్ పేర్కొన్నారు. రష్యా దౌత్య కార్యాలయానికి కూడా ఈ ఘటనపై సమాచారం పంపించామన్నారు.



రష్యా దాడి చేయడంతో ఉక్రెయిన్‌లోని జపోరిజియాలో ధ్వంసమైన అపార్ట్‌మెంట్

రష్యా దాడి.. ఉక్రెయిన్‌లో ఆరుగురి మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని ఖేర్సన్ నగరంపై మంగళవారం రష్యా జరిపిన ఫిరంగి దాడిలో ఆరుగురు పౌరులు మరణించారు. మరో ముగ్గురు గాయపడ్డారు. సిటీ సెంటర్ మార్కెట్ దుకాణాల వద్ద బాధితులు కూరగాయలు కొంటున్న సమయంలో దాడి జరిగినట్లు స్థానిక గవర్నర్ ఒలెక్సాండర్ ప్రొకుదిన్ వెల్లడించారు. అంతకుముందు ఏడుగురు చనిపోయినట్లు వార్తలు వచ్చినా చివరకు ఆరుగురని తేలింది. మరోవైపు తమ దేశానికి మరింత సాయం అందజేయాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ పశ్చిమదేశాలకు విజ్ఞప్తి చేశారు.



మెక్సికో అధ్యక్షురాలిగా క్లాడియా

మెక్సికో సిటీ: మెక్సికో తొలి మహిళా అధ్యక్షురాలిగా క్లాడియా షిన్‌బౌమ్ (62) మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. శాస్త్రవేత్తగా ఉండి రాజకీయాల్లోకి వచ్చిన క్లాడియా ముందు పెచ్చరిల్లుతున్న హింస, మందగించిన ఆర్థిక పరిస్థితి, హరికేన్ ఇక్కట్ల వంటి పలు తక్షణ సవాళ్లు ఉన్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు సైతం మెక్సికో స్థితిగతులపై ప్రభావం చూపించే అవకాశముంది. తాను గెలిస్తే మెక్సికోలో తయారైన వాహనాలపై వంద శాతం సుంకాలు విధిస్తానని డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు.

అత్యంత విధ్వంసక క్షిపణిని ప్రదర్శించిన దక్షిణ కొరియా

సియోల్: ఉత్తరకొరియాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో దక్షిణకొరియా తన అమ్ములపొదిలో ఉన్న అత్యంత విధ్వంసక హ్యున్‌మో-5 బాలిస్టిక్ క్షిపణిని ప్రదర్శించింది. ఇది 8 టన్నుల వార్‌హెడ్‌ను మోసుకుపోగలదని, ఉత్తర కొరియాలో ఉన్న భూగర్భ బంకర్‌లలోకి చొచ్చుకుపోయి విధ్వంసం సృష్టించగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. మంగళవారం దక్షిణ కొరియా జాతీయ సైనిక దినోత్సవం సందర్భంగా సియోల్‌లోని సైనిక విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమానికి అధ్యక్షుడు యూన్ సూక్ యోల్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాము కనుక అణ్వాయుధాలను ప్రయోగించాలని నిర్ణయించుకుంటే ఉత్తర కొరియా నామరూపాల్లేకుండా పోతుందని హెచ్చరించారు. ఉత్తర కొరియా ఇటీవల తన అణు క్షిపణులను, యురేనియం శుద్ధి కర్మాగారాలను పరిచయం చేస్తూ ఉద్రిక్తతలను పెంచుతున్న నేపథ్యంలో దక్షిణ కొరియా ఆయుధ ప్రదర్శన ప్రాధాన్యం సంతరించుకుంది.

నేపాల్‌లో 224కు చేరిన 'వరద' మృతుల సంఖ్య

కాఠ్‌మాండూ: నేపాల్‌లో భారీ వరదల కారణంగా చనిపోయినవారి సంఖ్య 224కు చేరినట్లు ప్రధాన మంత్రి కె.పి.శర్మ ఓలీ పేర్కొన్నారు. 24 మంది ఆచూకీ గల్లంతైందని తెలిపారు. ఈ విపత్తు బారి నుంచి 4,331 మందిని రక్షించినట్లు చెప్పారు. విదేశీ పర్వతారోహకులు సహా 900 మందిని హెలికాప్టర్ల సాయంతో కాపాడినట్లు అధికారులు తెలిపారు. గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల తూర్పు, మధ్య నేపాల్‌లోని అనేక ప్రాంతాలు నీట మునిగాయని చెప్పారు. ఆదివారం కాఠ్‌మాండూలో వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.


దిల్లీ సీఎం ఆతిశీని అడ్డుకున్న పోలీసులు

దిల్లీ: నిర్బంధంలో ఉన్న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను కలిసేందుకు బవానా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ పరిణామంపై ఆమె స్పందిస్తూ భాజపా, ఎల్జీ నియంతృత్వ ధోరణిని అనుసరిస్తున్నారని దుయ్యబట్టారు. వాంగ్‌చుక్, లద్దాఖ్ ప్రజలు ఎల్జీ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని, దిల్లీలో కూడా ఎల్జీ పాలన అంతం కావాలని పేర్కొన్నారు. వాంగ్‌చుక్ నిర్బంధంపై ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో దిల్లీ ఎల్జీ వీకే సక్సేనాకు వ్యతిరేకంగా ఆప్ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. దీంతో బవానా పోలీసు స్టేషన్ పరిధిలో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు.

రాహుల్‌గాంధీకి నాసిక్ కోర్టు సమన్లు

ముంబయి: హిందుత్వ సిద్ధాంత కర్త వి.డి.సావర్కర్‌పై వ్యాఖ్యలకు గాను దాఖలైన పరువునష్టం కేసులో మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా కోర్టు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మంగళవారం సమన్లు జారీ చేసింది. దేశభక్తుడైన వ్యక్తిపై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దీపాలి పరిమల్ కడుస్కర్ ఆ నోటీసులో పేర్కొన్నారు. తదుపరి విచారణకు వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా కానీ హాజరుకావాలని తెలిపారు. విచారణ తేదీ ఇంకా ఖరారు కాలేదు.

కేజ్రీవాల్ విడుదల వెనక భాజపా: వాద్రా



దిల్లీ: హరియాణా ఎన్నికల వేళ ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి విడుదల కావడం వెనక భాజపా ప్రమేయం ఉందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా ఆరోపించారు. డేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ విషయంలోనూ అదే జరిగిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీయాలన్న లక్ష్యమే దీని వెనుక కారణమని పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ విమర్శించారు. ప్రధాని మోదీ, ఇతర భాజపా నేతలు తన పేరును వాడుకుంటూ కించపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. "నేను హరియాణాలో యువతకు ఉద్యోగాలివ్వగలను. కానీ భాజపా ప్రభుత్వం నా సహచరులను బెదిరింపులకు గురిచేయడంతో వారు దూరంగా వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో నేను పని చేయడం కష్టం. ఆర్థికంగానూ నన్ను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఆరోపించారు.

ఈ మాతృ ఘాతకుడికి ఉరిశిక్ష సబబే

సమాజ మనస్సాక్షిని కుదిపేసే ఘటన: బాంబే హైకోర్టు



సునీల్ కుచ్‌కొరవీ

ముంబయి: మహారాష్ట్రలో సంచలనం సృష్టించిన ఓ హత్యకు సంబంధించి ట్రయల్ కోర్టు విధించిన మరణశిక్షను బాంబే హైకోర్టు సమర్థించింది. కన్నతల్లిని చంపి.. ముక్కలుగా చేసిన మృతదేహాన్ని వండుకు తినేందుకు ప్రయత్నించిన కేసులో దోషికి మరణశిక్షే సబబని బాంబే హైకోర్టు పేర్కొంది. సమాజ మనస్సాక్షిని కుదిపేసే ఇటువంటి నేరాలు అత్యంత అసాధారణమైనవని, ఇందులో శిక్ష తగ్గించేందుకు ఆస్కారమే లేదని అభిప్రాయపడింది. 2017 ఆగస్టు 28న.. మద్యానికి బానిసైన కొల్హాపుర్‌కు చెందిన సునీల్ కుచ్‌కొరవీ (38) తాగుడుకు డబ్బులు ఇవ్వలేదన్న ఆగ్రహంతో తల్లి (63)ని కిరాతకంగా హత్య చేశాడు. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు సునీల్‌కు మరణశిక్ష విధిస్తూ 2021లో తీర్పు చెప్పింది. దీనిని హైకోర్టులో సవాలు చేయగా.. జస్టిస్ రేవతి మోహితే డేరే, జస్టిస్ పృథ్వీరాజ్ చవాన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఆ తీర్పును సమర్థించింది. ఇది నరమాంస భక్షణ కిందికి వస్తుందని జస్టిస్ చవాన్ పేర్కొనగా.. ఇంతకంటే భయంకరమైన, అనాగరిక చర్యను గతంలో ఎన్నడూ చూడలేదని జస్టిస్ మోహితే డేరే అభిప్రాయపడ్డారు. ఇటువంటి వ్యక్తిని సమాజంలోకి వదిలితే మళ్లీ అటువంటి నేరాలకే పాల్పడే ప్రమాదముందని వ్యాఖ్యానించారు. పుణెలోని యరవాడ జైలులో ఉన్న సునీల్‌కు హైకోర్టు తీర్పు గురించి వీడియో కాన్ఫరెన్సు ద్వారా తెలియజేశారు.

డేరా బాబాకు 20 రోజుల పెరోల్ మంజూరు

చండీగఢ్: డేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రామ్ రహీం సింగ్ (డేరా బాబా)కు హరియాణా ప్రభుత్వం మంగళవారం 20 రోజుల పెరోల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా హరియాణాలో అడుగుపెట్టరాదని, రాష్ట్ర శాసనసభ ఎన్నికల సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనరాదంటూ షరతు విధించింది. తన ఆశ్రమానికి చెందిన ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారానికి పాల్పడిన కేసులో 2017లో అతనికి 20 ఏళ్ల కారాగార శిక్ష పడింది. అప్పటి నుంచి రోహ్‌తక్‌లోని సునారియా జైల్లో ఉంటున్న అతను తాజాగా తనకు 20 రోజుల పెరోల్ కావాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నాడు. దీనికి రాష్ట్రప్రభుత్వం షరతులతో ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ఆ 20 రోజుల పాటు డేరా బాబా ఉత్తర్‌ప్రదేశ్‌లోని భాగ్‌పత్‌లో గల డేరా ఆశ్రమంలో ఉండనున్నాడు.

చెత్తకుప్ప సమీపంలో పేలుడు

బిహార్‌లోని భాగల్పుర్ జిల్లాలో ఏడుగురు చిన్నారులకు గాయాలు

భాగల్పుర్: చెత్తకుప్ప సమీపంలో పేలుడు సంభవించడంతో ఏడుగురు పిల్లలకు గాయాలయ్యాయి. వారిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బిహార్‌లోని భాగల్పుర్ జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. ఖిలాఫత్ నగర్ ప్రాంతంలో పేలుడు సంభవించిందని, పిల్లలు అనుకోకుండా పేలుడు పదార్థాన్ని తాకి ఉంటారని భాగల్పుర్ ఎస్ఎస్‌పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. సమీపంలోని ఆసుపత్రిలో ఏడుగురు చిన్నారులు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదన్నారు. చెత్త కుప్ప సమీపంలో ముందుగా ఉంచిన బాంబు పేలిందని గాయపడిన చిన్నారుల్లో కొందరు చెప్పగా, మరికొందరు మాత్రం ఓ వ్యక్తి వచ్చి తమపై ఏదో వస్తువు విసిరాడని అనంతరం పేలుడు సంభవించిందని చెప్పారని ఓ పోలీసు అధికారి తెలిపారు. మరోవైపు, పేలుడుకు గల కచ్చితమైన కారణాన్ని గుర్తించేందుకు ఫోరెన్సిక్ నిపుణులు కృషి చేస్తున్నారు.

వారణాసిలో ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాల తొలగింపు

వారణాసి (యూపీ): వారణాసిలోని పలు ఆలయాల నుంచి మంగళవారం శిర్డీ సాయిబాబా విగ్రహాలను తొలగించారు. 'సనాతన్ రక్షక్ దళ్' చేపట్టిన ప్రచారంలో భాగంగా 10 మందిరాల్లో బాబా విగ్రహాల తొలగింపు కొనసాగింది. "ప్రజలు సరైన పరిజ్ఞానం లేకుండా ఇంతకాలం సాయిబాబాను ఆరాధించారు. వాస్తవానికి శాస్త్రాల్లో బాబా ఆరాధన గురించి ఎక్కడా చెప్పలేదు" అని వారు పేర్కొన్నారు. అయోధ్యలోని హనుమాన్ గఢీ ఆలయ మహంతు రాజుదాస్ సైతం ఈ చర్యను సమర్థించారు. "సాయిబాబా ధర్మగురువే కావచ్చు, దేవుడు కాదు" అన్నారు. కాశీలో పరమేశ్వరుడి ఆరాధన మాత్రమే జరగాలని 'సనాతన్ రక్షక్ దళ్' రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌శర్మ స్పష్టం చేశారు. వారణాసిలోని సంత్ రఘువర్ దాస్ నగర్‌లో వెలసిన బాబా ఆలయ పూజారి సమర్ ఘోష్ దీనిపై స్పందిస్తూ.. "ఈరోజు సనాతనులమని అంటున్నవారే గతంలో ఈ ఆలయాల్లో సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇది సరైన చర్య కాదు" అన్నారు. యూపీ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల అధికార ప్రతినిధులు మనీశ్ హిందీ, సునీల్‌సింగ్ సజన్ ఈ చర్యల వెనుక భాజపా ఉందని ఆరోపించారు. బాబాను భగవంతుని అవతారంగా అన్ని మతాలవారు పూజిస్తారని శిర్డీకి చెందిన శ్రీ సాయిబాబా సనాతన్ ట్రస్టు తన వెబ్‌సైటు ద్వారా పేర్కొంది.

గ్రామాలు అభివృద్ధి చెందకుండా వికసిత్ భారత్ అసాధ్యం

కాగ్ గిరీశ్ చంద్ర ముర్ము వెల్లడి

దిల్లీ: దేశంలోని గ్రామాలు అభివృద్ధి కాకుండా వికసిత్ భారత్ లక్ష్యం చేరుకోవడం సాధ్యం కాదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గిరీశ్ చంద్ర ముర్ము పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో గ్రామీణ భారతం కీలకమని వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని, గ్రామ సభలు, స్థానిక సంస్థలకు ఇంకా తగిన గుర్తింపు లభించడం లేదని చెప్పారు. "క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగకుండా.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం సులువు కాదు. దేశంలోని 50 శాతం జనాభా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తోంది. ప్రభుత్వ పాలన, వారి అభివృద్ధి, వారి పాలనాధికారాలు, వారికి తగిన వనరులు అందించకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యం అందుకోవడం సాధ్యం కాదు" అని గిరీశ్ చంద్ర అన్నారు.

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ నియంత్రణకు సెబీ చర్యలు

నవంబరు 20 నుంచి దశలవారీగా నూతన విధానాలు



దిల్లీ: చిన్న మదుపర్ల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు స్టాక్ మార్కెట్లలో స్థిరత్వాన్ని తీసుకొచ్చే నిమిత్తం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగంలో కఠిన విధానాలను సెబీ మంగళవారం ప్రకటించింది. ఈక్విటీ డెరివేటివ్స్ కనీస కాంట్రాక్టు విలువ పెంచడం, ఆప్షన్ల ప్రీమియంను ముందుగానే వసూలు చేయడం లాంటివి ఇందులో ఉన్నాయి. ఇంట్రాడే పొజిషన్ల పరిమితిని పర్యవేక్షించడం, ఎక్స్‌పైరీ రోజున క్యాలెండర్ స్ప్రెడ్ ప్రయోజనాన్ని దూరం చేయడం, వారంలో గడువు తీరే సూచీ కాంట్రాక్టుల సంఖ్య తగ్గింపు లాంటి చర్యలను ప్రకటించింది. నవంబరు 20 నుంచి దశలవారీగా వీటిని అమల్లోకి తెస్తామని సెబీ వివరించింది. ఈ ప్రకారం..

✦ సూచీల డెరివేటివ్స్‌కు కనీస కాంట్రాక్టు విలువను ప్రస్తుత రూ.5-10 లక్షల నుంచి రూ.15-20 లక్షలకు పెంచారు. కనీస కాంట్రాక్టు విలువను 2015 తర వాత మార్చడం ఇప్పుడే. రూ.15- 20 లక్షల మధ్య కాంట్రాక్టు విలువ ఉండేలా లాట్ సంఖ్యను నిర్ణయించాల్సి ఉంటుంది.

✦ స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను నియంత్రించేందుకు.. ఏదో ఒక ప్రామాణిక సూచీకి మాత్రమే వారంలో గడువు తీరే కాంట్రాక్టును అందుబాటులో ఉంచాలని ఎక్స్ఛేంజీలను ఆదేశించింది.

✦ ఎక్స్‌పైరీ రోజున షార్ట్ (సెల్లింగ్) ఆప్షన్స్ కాంట్రాక్టుకు అదనంగా 2% మార్జిన్ వసూలు చేస్తారు. ఆప్షన్స్ కొనుగోలుదార్లు ముందుగానే పూర్తి స్థాయిలో ప్రీమియం మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. రోజువారీగా పొజిషన్ల పరిమితిని స్టాక్ ఎక్స్ఛేంజీలు పరిశీలించాలి. ఉల్లంఘనలను గుర్తించేందుకు కనీసం 4 సార్లు స్నాప్‌షాట్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి దీనిని అమలు చేయాలి. స్ట్రైక్ ధరల హేతుబద్ధీకరణపై ఆదేశాలు ఏమీ ఇవ్వలేదు.

విద్యుత్ వాహనాలకు సబ్సిడీ పథకం



● రూ.10,900 కోట్లు కేటాయింపు

● 'పీఎమ్ ఇ-డ్రైవ్'ను ఆవిష్కరించిన కేంద్రం

దిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని పెంచేందుకు, ఛార్జింగ్ వసతుల ఏర్పాటుకు, ఈవీల తయారీ వ్యవస్థ అభివృద్ధికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం మంగళవారం రూ.10,900 కోట్లతో 'పీఎమ్ ఇ-డ్రైవ్' పథకాన్ని ఆవిష్కరించింది.

అమలు: 2024 అక్టోబరు 1 నుంచి 2026 మార్చి 31 వరకు. (ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు అమలైన ఈఎమ్‌పీఎస్-2024 స్థానంలో దీనిని తీసుకొచ్చారు. అంతక్రితం 'ఫేమ్' పథకాలుండేవి.)

ప్రయోజనం ఇన్ని వాహనాలకు

విభాగం	వాహనాల సంఖ్య
ఇ-ద్విచక్ర	24.79 లక్షలు
ఇ-త్రిచక్ర	3.16 లక్షలు
ఇ-బస్‌లు	14,028

ప్రస్తుత సామర్థ్యాలు ఇలా: మార్కెట్లో ప్రస్తుతం లభిస్తున్న ఓలా, టీవీఎస్, ఏథర్, హీరో విడా, బజాజ్ చేతక్ ద్విచక్ర వాహనాల బ్యాటరీ సామర్థ్యాలు 2.88-4 కిలోవాట్ అవర్ (కేడబ్ల్యూహెచ్) ఉండగా.. ఈ వాహన ధరలు రూ.90,000-1,50,000 మధ్య ఉన్నాయి.

సబ్సిడీ ఇలా తీసుకోవచ్చు: ఇందుకోసం మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తారు. దీని సహాయంతో ఈ పథకం కింద ఇ-వోచర్లను అందించడం ద్వారా మొత్తం ప్రక్రియను సరళతరం చేస్తారు. ఒక ఆధార్ నంబరుపై ఒక వాహనాన్నే అనుమతిస్తారు. కొనుగోలుదారు వివరాలను వెంటనే పోర్టల్‌లో ఆధార్ ఆధారిత ఇ-వోచర్ జనరేట్ అవుతుంది. దానిపై సంతకం చేసి డీలరుకు అందిస్తే, ప్రోత్సాహకాలు పొందొచ్చు.

వీటికీ: విద్యుత్తు విభాగంలోని ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, అంబులెన్స్‌లు, ట్రక్కులు, ఇతర వాహనాలకు రూ.3,679 కోట్ల మేర సబ్సిడీలను ఈ పథకం కింద అందిస్తారు. కార్లకు 22,100 ఫాస్ట్ ఛార్జర్ వసతులను, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు 48,400 ఫాస్ట్ ఛార్జర్ల కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందుకు రూ.2,000 కోట్లు కేటాయించారు.

సబ్సిడీ ఎంతంటే

❒ విద్యుత్ ద్విచక్ర వాహనాలకు వాటి బ్యాటరీ సామర్థ్యం ఆధారంగా సబ్సిడీ ఉంటుంది. కిలోవాట్ అవర్‌కు రూ.5,000 సబ్సిడీ అందజేస్తారు. మొత్తం సబ్సిడీ తొలి ఏడాదిలో రూ.10,000కు మించదు. రెండో ఏడాది కిలోవాట్‌కు రూ.2,500 చొప్పున ఉంటుంది. అయితే మొత్తం ప్రయోజనం రూ.5,000కు మించదు.

❒ త్రిచక్ర వాహనాలకు (ఇ-రిక్షాలు సహా) తొలి ఏడాది రూ.25,000, రెండో ఏడాది రూ.12,500 చొప్పున ప్రోత్సాహకాలు అందుతాయి.

❒ ఎల్5 విభాగం (రవాణా త్రిచక్ర వాహనాలకు)లో తొలి ఏడాది రూ.50,000, రెండో ఏడాది రూ.25,000 చొప్పున ఇస్తారు.

ఈనాడు బిజినెస్

ఐరోపా దేశాలకు మన కాఫీ

కూర్గ్ కాఫీ తోటల యజమానులతో స్కోడా ఆటో భాగస్వామ్యం

ముంబయి: ఐరోపా దేశాలకు నేరుగా భారతీయ కాఫీని సరఫరా చేయడం కోసం 'క్యూరియాసిటీ ఫ్యూయల్' ప్రాజెక్ట్‌ను స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా (ఎస్ఏవీడబ్ల్యూఐపీఎల్) చేపట్టింది. ఇందు కోసం కర్ణాటకలోని కూర్గ్ కాఫీ తోటల యజమానులతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. చెక్ రిపబ్లిక్‌లోని తన ప్లాంట్లకు దాదాపు 25 టన్నుల కూర్గ్ కాఫీని సరఫరా చేసినట్లు కంపెనీ వెల్లడించింది. 1.25 బి. డాలర్ల ఎగుమతులతో ప్రపంచంలోనే అతి పెద్ద కాఫీ తయారీదార్లలో మన దేశానికి ఎనిమిదో స్థానం ఉంది. కూర్గ్‌లో కుటుంబ యాజమాన్యం కింద ఉండే కాఫీ తోటలకు మద్దతునివ్వడం కోసం నేరుగా స్థానిక రైతుల నుంచే కాఫీ సేకరించాలని స్కోడా నిర్ణయించింది. భారత్‌కున్న అత్యున్నత వ్యవసాయ వారసత్వానికి, మా పరిశ్రమకు మధ్య ఒక అనుబంధం ఏర్పడిందని స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా ఎండీ, సీఈఓ పీయూష్ అరోరా పేర్కొన్నారు.

విక్రేతలకు రుసుము తగ్గింపు: అమెజాన్ ఇండియా

ఈనాడు, హైదరాబాద్: పండగల సీజన్ దృష్ట్యా తమ ప్లాట్‌ఫామ్‌పై విక్రయాలు జరుపుతున్న వ్యాపారులకు రుసుమును 3-12% తగ్గించినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. చిన్న, మధ్య స్థాయి విక్రేతల ఆదాయం పెరిగేందుకు, వినియోగదారులకు తగ్గింపు ధరల్లో కిరాణా, ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు లభించేందుకు ఇది ఉపకరిస్తుందని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ మంగళవారం ఇక్కడ తెలిపారు. తెలంగాణ నుంచి 55వేల మంది విక్రేతలున్నారని, గత ఏడాదితో పోలిస్తే 10వేల మంది పెరిగారని చెప్పారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి ఉత్పత్తులు వెళ్తున్నాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ లాంటి సాంకేతికతల వల్ల అమెజాన్‌లో విక్రేతల నమోదు, వారి వస్తువుల ప్రదర్శన ఎంతో సులభంగా జరుగుతోందన్నారు. ఈ ఏడాది 5,200లకు పైగా కొత్త ఉత్పత్తులు అమెజాన్ వేదికగా అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

ఐపీఓకు రానున్న మిడ్‌వెస్ట్

రూ.650 కోట్ల సమీకరణ లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: గ్రానైట్ ఉత్పత్తిలో నిమగ్నమైన హైదరాబాదీ సంస్థ మిడ్‌వెస్ట్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా రూ.650 కోట్లు సమీకరించేందుకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాన్ని దాఖలు చేసింది. రూ.250 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తామని, రూ.400 కోట్ల మేరకు ప్రస్తుత ప్రమోటర్లు తమ వాటాలను ఆఫర్-ఫర్-సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయిస్తారని పేర్కొంది. కొల్లారెడ్డి రామ రాఘవ రెడ్డి రూ.360 కోట్ల విలువైన షేర్లను, గుంటక రవీంద్రా రెడ్డి రూ.40 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. ప్రీ-ఐపీఓలో భాగంగా రూ.50 కోట్లు సమీకరించేందుకు కంపెనీ సన్నాహాలు చేస్తోంది. వచ్చిన మొత్తంలో నుంచి రూ.127.05 కోట్లను మిడ్‌వెస్ట్ నియోస్టోన్ పెట్టుబడికి కేటాయిస్తారు. రూ.25.75 కోట్లతో విద్యుత్ డంప్ ట్రక్కులు, రూ.3.26 కోట్లతో గనుల ప్రాంతంలో సౌర విద్యుత్ శక్తి ఏర్పాటు, రూ.53.80 కోట్లను రుణాలను చెల్లించేందుకు వినియోగించనున్నట్లు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.585.62 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.



2వ ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	535
గోదావరి	535
విశాఖపట్నం	535
చిత్తూరు	523

హెచ్‌సీఎల్ సెమీకండక్టర్ జేవీలో ఫాక్స్‌కాన్ రూ.424 కోట్ల పెట్టుబడులు!

దిల్లీ: హెచ్‌సీఎల్ గ్రూప్ ఏర్పాటు చేసిన సెమీకండక్టర్ సంయుక్త సంస్థ (జేవీ)లో తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ రూ.424 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని ప్రణాళికలు రచిస్తోంది. ఐఫోన్లను కాంట్రాక్ట్ పద్ధతిలో తయారు చేసే ఫాక్స్‌కాన్, సెమీకండక్టర్ సంయుక్త సంస్థలో 40% వాటాను రూ.312 కోట్లకు కొనుగోలు చేసింది. రూ.112 కోట్లకు ఎక్కువ కాకుండా.. పెట్టుబడులు పెట్టి మొత్తం వాటా విలువ రూ.424 కోట్లకు లోపు (50,510,000 డాలర్లు) ఉంచేలా చేయనున్నట్లు సంస్థ పేర్కొంది. జేవీకి ఇంకా పేరు నిర్ణయించలేదు. విశ్వసనీయ వర్గాల ప్రకారం.. ఫాక్స్‌కాన్-హెచ్‌సీఎల్ ఓఎస్ఏటీ (అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్) ప్లాంటును భారత్‌లోనే ఏర్పాటు చేస్తారు.

అరబిందో ఫార్మా ఔషధానికి అమెరికాలో అనుమతి

ఈనాడు, హైదరాబాద్: అమెరికాలో సెఫలెగ్జిన్ ట్యాబ్లెట్లు ఉత్పత్తి చేసి, విక్రయాలు జరిపేందుకు, అరబిందో ఫార్మాకు యూఎస్ఎఫ్‌డీఏ (అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ) అనుమతి ఇచ్చింది. ఎలి లిల్లీ అనే బహుళ జాతి సంస్థకు చెందిన కెఫ్లెట్ అనే ట్యాబ్లెట్‌కు ఇది బయోఈక్వలెంట్ ఔషధం. దీన్ని 250 ఎంజీ, 500 ఎంజీ డోసులో విడుదల చేసేందుకు అనుమతి లభించిందని అరబిందో ఫార్మా వెల్లడించింది. దీనికి 180 రోజుల పాటు ప్రత్యేక విక్రయ హక్కులు (షేర్డ్ జనరిక్ డ్రగ్ ఎక్స్‌క్లూజివిటీ) తమకు లభించినట్లు పేర్కొంది. పలు రకాల బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లను అదుపు చేయడానికి ఈ ఔషధాన్ని వినియోగిస్తున్నారు.

నయా.. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్

ఏఐ ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం పూర్తి

దేశీయంగా విమానయాన సంస్థల విలీనంలో సరికొత్త శకం ఆరంభమైంది. టాటా గ్రూప్‌నకు చెందిన చౌకధరల విమానయాన సంస్థలు ఎయిరిండియా (ఏఐ) ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్ (గతంలో ఎయిరేషియా ఇండియా)ల విలీన ప్రక్రియ మంగళవారం (అక్టోబరు 1న) పూర్తయ్యింది. ఇకపై 'ఐఎక్స్' కోడ్‌తో విలీన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సేవలు లభిస్తాయి. విమానాల కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేకుండా, ఇరు సంస్థల విలీన ప్రక్రియ ఏడాదిలోపే పూర్తవ్వడం.. ఈ రంగ భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని ఎయిరిండియా చీఫ్ క్యాంబెల్ విల్సన్ సంతోషం వ్యక్తం చేశారు. టాటా గ్రూప్‌నకే చెందిన ఎయిరిండియా, విస్తారా సంస్థలు కూడా నవంబరు 12న విలీనం కానున్నాయి.



జీఎస్‌టీ వసూళ్లు రూ.1.73 లక్షల కోట్లు



దిల్లీ: ఈ ఏడాది సెప్టెంబరులో జీఎస్‌టీ వసూళ్లు అంతకుముందు నెల కంటే 6.5% తగ్గి రూ.1.73 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఆగస్టులో ఇవి రూ.1.75 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే 2023 సెప్టెంబరులో నమోదైన రూ.1.63 లక్షల కోట్లతో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబరులో జీఎస్‌టీ వసూళ్లు ఎక్కువే. గత నెలలో రిఫండ్‌లు రూ.20,458 కోట్లుగా ఉన్నాయి. ఏడాదిక్రితంతో పోలిస్తే ఇవి 31% అధికమయ్యాయి. రిఫండ్‌ల సర్దుబాటు అనంతరం సెప్టెంబరులో నికరంగా జీఎస్‌టీ ఆదాయం 3.9% అధికమై రూ.1.53 లక్షల కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- సెప్టెంబరులో జీఎస్‌టీ వసూళ్లు 9.5% పెరిగి రూ.10.87 లక్షల కోట్లకు చేరాయి.

ఆర్‌బీఐ ఎంపీసీకి ముగ్గురు కొత్త సభ్యులు

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన కమిటీ (ఎంపీసీ)కి కొత్తగా ముగ్గురు ఎక్స్‌టర్నల్ సభ్యులను ప్రభుత్వం మంగళవారం నియమించింది. వీరిలో రామ్ సింగ్ (దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్), సౌగట భట్టాచార్య (ఆర్థికవేత్త), నగేశ్ కుమార్ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్టడీస్ ఇన్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్, న్యూదిల్లీ డైరెక్టర్, సీఈఓ) ఉన్నారు. ఆర్‌బీఐ గవర్నర్ నేతృత్వంలోని ఎంపీసీ ప్రతి రెండు నెలలకొకసారి సమావేశమై, కీలక వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంటుంది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (2% అటు ఇటుగా) స్థిరపరిచేందుకు, వడ్డీ రేట్లలో సవరణలు చేయడం ఎంపీసీ బాధ్యత. కొత్త సభ్యులతో ఏర్పాటైన ఎంపీసీ తొలి సమావేశం అక్టోబరు 7-9 తేదీల్లో జరగబోతోంది. దీనికి ఆర్‌బీఐ గవర్నర్ అధ్యక్షత వహించడంతో పాటు పరపతి విధాన నిర్ణయాలను 9వ తేదీ ఉదయం ప్రకటిస్తారు.

సెబీకి ఐపీఓల వరద

ఒక్కరోజే 13 కంపెనీల దరఖాస్తు



దిల్లీ: స్టాక్ మార్కెట్‌లో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల జోరు కొనసాగనుంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద మంగళవారం ఒక్కరోజే 13 కంపెనీలు ప్రాథమిక పత్రాలు దాఖలు చేశాయి. ముసాయిదా పత్రాల ప్రకారం ఈ కంపెనీలన్నీ కలిపి కనీసం రూ.8,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఈ కంపెనీలు నిధులు సమీకరించనున్నాయి. ప్రాథమిక మార్కెట్‌లో ఐపీఓలకు మంచి స్పందన వస్తున్నందునే, ఇన్ని కంపెనీలు ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి.

✦ ఐపీఓలు దాఖలు చేసిన కంపెనీల్లో విక్రమ్ సోలార్, ఆదిత్య ఇన్ఫోటెక్, వరిందేరా కన్‌స్ట్రక్షన్స్, అజాక్స్ ఇంజినీరింగ్, రాహీ ఇన్ఫోటెక్, విక్రన్ ఇంజినీరింగ్, మిడ్‌వెస్ట్, వినే కార్పొరేషన్, సంభవ్ స్టీల్ ట్యూబ్స్, జారో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆల్‌టైమ్ ప్లాస్టిక్స్, స్కోడా ట్యూబ్స్, దేవ్ యాక్సెలరేటర్ వంటి కంపెనీలు ఉన్నాయి.

✦ సోలార్ మాడ్యుల్ సంస్థ విక్రమ్ సోలార్ రూ.1500 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 1.74 కోట్ల ప్రమోటర్ల షేర్లను విక్రయించనుంది. ఆదిత్య ఇన్ఫోటెక్ రూ.1300 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రూ.500 కోట్ల తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.800 కోట్ల షేర్లను అమ్మనుంది.

✦ వరిందేరా కన్‌స్ట్రక్షన్స్ ఐపీఓతో రూ.1200 కోట్లు సమీకరించనుంది. జారో ఇన్‌స్టిట్యూట్ రూ.570 కోట్లు, ఆల్‌టైమ్ ప్లాస్టిక్స్ రూ.350 కోట్లు, స్కోడా ట్యూబ్స్ రూ.275 కోట్లు, సంభవ్ స్టీల్ రూ.540 కోట్లు, రాహీ ఇన్‌ఫ్రాటెక్ రూ.420 కోట్లు, విక్రన్ ఇంజినీరింగ్ రూ.1000 కోట్లు కూడగట్టనున్నాయి.

మారుతీ, హ్యుందాయ్, టాటా టోకు విక్రయాలు తగ్గాయ్



దిల్లీ: మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ నుంచి డీలర్లకు వాహన సరఫరాలు సెప్టెంబరులో తగ్గాయి. గిరాకీ తగ్గడం, ఇప్పటికే డీలర్ల వద్ద వాహన నిల్వలుండటమే దీనికి కారణం. మారుతీ సుజుకీ ఇండియా దేశీయ ప్రయాణికుల వాహన టోకు విక్రయాలు 2023 సెప్టెంబరులో 1,50,812 కాగా, గత నెలలో 4% తగ్గి 1,44,962కు పరిమితమయ్యాయి. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్-ప్రెసోల విక్రయాలు 10,351 నుంచి 10,363కు పెరిగాయి. కాంపాక్ట్ కార్ల విభాగంలో బాలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వ్యాగన్‌ఆర్‌ల విక్రయాలు 68,551 నుంచి 60,480కి తగ్గాయి. యుటిలిటీ వాహన విభాగంలో బ్రెజా, ఎర్టిగా, ఎస్-క్రాస్, ఎక్స్‌ఎల్6 విక్రయాలు 59,272 నుంచి 4% పెరిగి 61,549కు చేరాయి. అయితే ఎగుమతులు కలిపితే విక్రయాలు 2% పెరిగాయి.

✦ హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశీయ సరఫరాలు 54,241 నుంచి 6% తగ్గి 51,101కి పరిమితమయ్యాయి. టాటా మోటార్స్ ప్రయాణికుల వాహన దేశీయ విక్రయాలు (విద్యుత్ వాహనాలతో కలిపి) 44,809 నుంచి 8% తగ్గి 41,063కు చేరాయి. ఎం అండ్ ఎం ఎస్‌యూవీ టోకు విక్రయాలు దేశీయ విపణిలో 24% పెరిగి 51,062కు చేరాయి. టయోటా కిర్లోస్కర్ మోటార్ టోకు విక్రయాలు 23,590 నుంచి 14% పెరిగి 26,847కు చేరాయి. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా రిటైల్ విక్రయాలు 8% తగ్గి 4,588కి పరిమితమయ్యాయి. కియా ఇండియా విక్రయాలు 20,022 నుంచి 17% పెరిగి 23,523కు చేరాయి.

సెప్టెంబరులో ఆయా కంపెనీల వాహన (దేశీయ+ఎగుమతులు) విక్రయాలు

కంపెనీ	2024	2023	వృద్ధి/క్షీణత (%)
మారుతీ సుజుకీ	1,84,727	1,81,343	2
టాటా మోటార్స్	69,694	82,023	–15
మహీంద్రా అండ్ మహీంద్రా	51,062	41,267	24
హ్యుందాయ్ మోటార్	64,201	71,641	–10
టయోటా	26,847	23,590	14
కియా ఇండియా	23,523	20,022	17
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్	4,588	5,003	–8
ద్విచక్ర వాహనాలు			
హీరో మోటోకార్ప్	6,37,050	5,36,499	19
బజాజ్ ఆటో	4,69,531	3,92,558	20
టీవీఎస్ మోటార్	4,82,495	4,02,553	20
వాణిజ్య వాహనాలు			
వీఈసీవీ	7,609	7,322	5.7
అశోక్ లేలాండ్	17,233	19,202	–10
ట్రాక్టర్లు			
మహీంద్రా	44,256	43,210	2
ఎస్కార్ట్స్ కుబోటా	12,380	12,081	2.5

✦ ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో దేశీయ విక్రయాలు 2,53,193 నుంచి 23% పెరిగి 3,11,887కు చేరాయి. హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా టోకు దేశీయ విక్రయాలు 4,91,802 నుంచి 5,36,391కి పెరిగాయి. హీరో మోటోకార్ప్ టోకు దేశీయ విక్రయాలు 5,19,789 నుంచి 6,16,706కు చేరాయి.

జెన్ టెక్నాలజీస్‌కు రూ.46 కోట్ల ఏఎంసీ కాంట్రాక్టు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన జెన్ టెక్నాలజీస్‌కు కేంద్ర రక్షణ శాఖ నుంచి సిమ్యులేటర్ల నిర్వహణకు సంబంధించిన రూ.46 కోట్ల ఏఎంసీ (వార్షిక నిర్వహణ కాంట్రాక్టు) లభించింది. ఈ కాంట్రాక్టు కాలవ్యవధి అయిదేళ్లు. జెన్ టెక్నాలజీస్ సరఫరా చేసిన ఆయుధ, ఆయుధ వ్యవస్థల సిమ్యులేటర్లను సమర్థంగా నిర్వహించడం ఈ కాంట్రాక్టులోని ప్రధాన లక్ష్యం.

ఎన్‌సీసీ లిమిటెడ్‌కు రూ.2,327 కోట్ల ఆర్డర్లు

ఈనాడు, హైదరాబాద్: మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్వహించే సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్‌కు, గత నెలలో రూ.2,327 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగ సంస్థల నుంచి ఈ ఆర్డర్లు వచ్చినట్లు ఎన్‌సీసీ వెల్లడించింది. ఇందులో ట్రాన్స్‌పోర్టేషన్, విద్యుత్తు, భవన నిర్మాణ కాంట్రాక్టులు ఉన్నాయి.

యాంటీ ప్రాఫిటీరింగ్ కొత్త ఫిర్యాదులు ఏప్రిల్ 1 వరకే

పెండింగ్ కేసుల విచారణ బాధ్యత జీఎస్‌టీఏటీ ప్రధాన ధర్మాసనానికి

దిల్లీ: జీఎస్‌టీ చట్టంలో యాంటీ ప్రాఫిటీరింగ్ నిబంధనకు 2025 ఏప్రిల్ 1ను ముగింపు తేదీగా ప్రభుత్వం నోటిఫై చేసింది. జీఎస్‌టీ రేట్ల కోత ప్రయోజనాలను వినియోగదార్లకు బదిలీ చేయకుండా, ఆ మొత్తాన్ని లాభాలుగా కంపెనీలు మల్చుకోవడాన్ని యాంటీ ప్రాఫిటీరింగ్‌గా వ్యవహరిస్తారు. యాంటీ ప్రాఫిటీరింగ్ నిబంధనల కింద నమోదైన పెండింగ్ ఫిర్యాదులను అక్టోబరు 1 నుంచి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు బదులు జీఎస్‌టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ (జీఎస్‌టీఏటీ) ప్రధాన ధర్మాసనం (ప్రిన్సిపల్ బెంచ్) విచారిస్తుందని జీఎస్‌టీ పాలసీ వింగ్ మరో నోటిఫికేషన్ ద్వారా తెలియజేసింది. జీఎస్‌టీ చట్టంలో యాంటీ ప్రాఫిటీరింగ్‌కు ముగింపు తేదీని నిర్దేశించేందుకు సీజీఎస్‌టీ చట్టం-2017లోని సెక్షన్ 109, సెక్షన్ 171లో సవరణలు చేయాలని జూన్ 22న జరిగిన జీఎస్‌టీ మండలి 53వ సమావేశంలో సిఫారసు చేసింది. యాంటీ ప్రాఫిటీరింగ్ కేసుల విచారణను జీఎస్‌టీఏటీ ప్రధాన ధర్మాసనానికి అప్పగించాలని సూచించింది. ఈ సిఫారసుల ఆధారంగా తాజా నోటిఫికేషన్లను ప్రభుత్వం జారీ చేసింది. యాంటీ ప్రాఫిటీరింగ్‌కు సంబంధించి కొత్త దరఖాస్తుల స్వీకరణకు 2025 ఏప్రిల్ 1వ తేదీని ముగింపు తేదీగా జీఎస్‌టీ మండలి సిఫారసు చేసింది. జీఎస్‌టీ పాలసీ వింగ్ విడుదల చేసిన తాజా నోటిఫికేషన్‌ల ప్రకారం.. 2025 ఏప్రిల్ 1 నుంచి యాంటీ ప్రాఫిటీరింగ్ కింద వినియోగదార్లు ఫిర్యాదు చేయలేరు. తుది నిర్ణయానికి వచ్చేవరకు 2025 ఏప్రిల్ 1కు ముందు అందిన ఫిర్యాదులను జీఎస్‌టీఏటీ ప్రధాన ధర్మాసనం విచారిస్తుంది.

హలాల్ మాంసం ఎగుమతిపై నిబంధనలు నోటిఫై

దిల్లీ: హలాల్ చేసిన నిర్దిష్ట మాంసం, మాంసం ఉత్పత్తుల ఎగుమతికి నిబంధనలను ప్రభుత్వం నోటిఫై చేసింది. 15 దేశాలకు హలాల్ ధ్రువీకృత మాంసం ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నిబంధనలను నిర్దేశించింది. ఇండియా కన్ఫార్మిటీ అసెస్‌మెంట్ స్కీమ్(ఐ-సీఏఎస్)-హలాల్ ఆఫ్ ద క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ) కింద ధ్రువీకృత పత్రం పొందిన ప్లాంటులోనే ఈ తరహా ఉత్పత్తుల తయారీ లేదా ప్రాసెస్/ప్యాకేజింగ్ జరగాలి. ఎగుమతి అనంతరం కొనుగోలుదారుకు సంబంధిత దేశంలో సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుంది. ఆ 15 దేశాల జాబితాలో బహ్రెయిన్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, ఇరాన్, ఇరాక్, కువైట్, మలేషియా, జోర్డాన్, ఒమన్, ఫిలిప్పీన్స్, ఖతర్, సౌదీ అరేబియా, సింగపూర్, తుర్కియే, యూఏఈ ఉన్నాయి.

మూడో రోజూ సూచీలు డీలా



ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.5,578 కోట్లు

డీఐఐల కొనుగోళ్లు: రూ.4,609 కోట్లు

సెన్సెక్స్ ▼ 33 84266 | **నిఫ్టీ ▼ 14 25797**

సమీక్ష

మదుపర్ల అమ్మకాలతో వరుసగా మూడో రోజూ సూచీలు నష్టాల్లో ముగిశాయి. చమురు-గ్యాస్, కొన్ని ఎఫ్ఎమ్‌సీజీ షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. అంతర్జాతీయ మార్కెట్లు స్తబ్దుగా ఉండటం, ఎఫ్ఐఐల అమ్మకాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. గత మూడు రోజుల్లో సెన్సెక్స్ 1570 పాయింట్లు, నిఫ్టీ 419 పాయింట్ల చొప్పున నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 3 పైసలు తగ్గి 83.82 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.66% నష్టంతో 70.51 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో టోక్యో లాభపడగా, మిగతావి పనిచేయలేదు. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

✦ సెన్సెక్స్ ఉదయం 42 పాయింట్ల (క్రితం ముగింపు 84,299.78) నష్టంతో 84,257.17 వద్ద ప్రారంభమైంది. అనంతరం లాభాల్లోకి వచ్చి, ఇంట్రాడేలో 84,648.40 వద్ద గరిష్ఠాన్ని తాకింది. అనంతరం మళ్లీ నష్టాల్లోకి జారుకుని ఒకదశలో 84,098.94 పాయింట్లకు పడిపోయింది. చివరకు 33.49 పాయింట్ల నష్టంతో 84,266.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 13.95 పాయింట్లు కోల్పోయి 25,796.90 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,739.20- 25,907.60 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ క్యాష్, ఎఫ్ అండ్ ఓ ట్రేడ్‌లకు లావాదేవీ ఫీజులను సవరించిన నేపథ్యంలో బీఎస్‌ఈ షేరు 4.70% పెరిగి రూ.3,858 వద్ద ముగిసింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 16 డీలాపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.68%, ఏషియన్ పెయింట్స్ 1.54%, హెచ్‌యూఎల్ 1.27%, టాటా మోటార్స్ 0.96%, టాటా స్టీల్ 0.86%, టైటన్ 0.83%, రిలయన్స్ 0.81%, ఎన్‌టీపీసీ 0.70% నష్టపోయాయి. టెక్ మహీంద్రా 2.93%, ఎం అండ్ ఎం 2.22%, ఇన్ఫోసిస్ 1.50%, కోటక్ బ్యాంక్ 1.48%, ఎస్‌బీఐ 1.19%, హెచ్‌సీఎల్ టెక్ 1.14% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. టెలికాం, చమురు-గ్యాస్, యుటిలిటీస్, స్థిరాస్తి, విద్యుత్ 0.86% వరకు తగ్గాయి. ఐటీ 1%, సేవలు 0.98%, టెక్ 0.72%, కమొడిటీస్ 0.71% మెరిశాయి. బీఎస్‌ఈలో 1668 షేర్లు నష్టాల్లో ముగియగా, 2296 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 90 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

నేడు మార్కెట్లకు సెలవు

గాంధీ జయంతి సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు ప్రకటించారు. బులియన్, ఫారెక్స్, కమొడిటీ మార్కెట్లు కూడా పని చేయవు.

✦ **టాఫేతో ఏజీసీఓ ఒప్పందాలు రద్దు:** ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ (టాఫే)తో పలు ఒప్పందాలను అమెరికా సంస్థ ఏజీసీఓ కార్పొరేషన్ రద్దు చేసుకుంది. ఇందులో మాసే ఫెర్గుసన్ బ్రాండ్ లైసెన్స్ కూడా ఉంది. అయితే ప్రస్తుత స్థితిని యథాతథంగా ఉంచాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు టాఫే తెలిపింది. ఏజీసీఓ కార్పొరేషన్‌పై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసినట్లు వెల్లడించింది.

✦ **క్యాస్ట్రాల్ ఇండియా** కొత్త ఛైర్మన్‌గా రాకేశ్ మఖిజా నియమితులయ్యారు. దాదాపు 24 ఏళ్ల పాటు సేవలందించిన తర్వాత ఆర్.గోపాలకృష్ణన్ సంస్థ ఛైర్మన్ పదవి నుంచి వైదొలిగారు.

✦ **98% రూ.2000 నోట్లు వెనక్కి:** 2023 మేలో రూ.2000 నోట్ల ఉపసంహరణను ప్రారంభించాక, ఇప్పటివరకు ఆర్థిక వ్యవస్థ నుంచి 98% రూ.2000 నోట్లు వెనక్కి వచ్చాయని ఆర్‌బీఐ తెలిపింది. 2023 మే 19న రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు వినియోగంలో ఉండగా, ప్రస్తుతం అవి రూ.7,117 కోట్లకు పరిమితమయ్యాయి.

✦ అప్పుల్లో కూరుకుపోయిన స్థిరాస్తి సంస్థ **సూపర్‌టెక్ లిమిటెడ్‌**కు చెందిన 17 ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థ **ఎన్‌బీసీసీ** చేసిన ప్రతిపాదనను పరిశీలించేందుకు ఎన్‌సీఎల్ఏటీకి సుప్రీం కోర్టు మంగళవారం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల కోసం అడ్వాన్సులు ఇచ్చిన దాదాపు 27,000 మంది కొనుగోలుదార్లు ఇబ్బంది పడుతున్నారు.

✦ **వీడియోకాన్ కేసులో సెబీ డిమాండ్ నోటీసులు:** వీడియోకాన్ ఇండస్ట్రీస్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ కార్యకలాపాలకు పాల్పడినందున, రూ.1.03 కోట్లు చెల్లించాల్సిందిగా కోరుతూ సంస్థ ఎండీ వేణుగోపాల్ ధూత్, మరో రెండు సంస్థలు ఎలక్ట్రోపార్ట్స్ ఇండియా, వీడియోకాన్ రియాల్టీలకు సెబీ డిమాండ్ నోటీసులు పంపింది. 15 రోజుల్లోగా జరిమానా మొత్తాన్ని చెల్లించకుంటే అరెస్ట్ చేయడంతో పాటు బ్యాంక్ ఖాతాలు, ఆస్తులను అటాచ్‌మెంట్ చేస్తామని వేణుగోపాల్ ధూత్‌ను సెబీ హెచ్చరించింది. 2021 సెప్టెంబరులో సెబీ జరిమానా చెల్లించడంలో వీరు విఫలం కావడంతో తాజాగా సెబీ డిమాండ్ నోటీసులు ఇచ్చింది.

ఈనాడు సినిమా

నానికి జోడీగా 'కేజీఎఫ్' సుందరి


నాని

'దసరా', 'హాయ్ నాన్న', 'సరిపోదా శనివారం'తో హ్యాట్రిక్ హిట్లు కొట్టారు కథానాయకుడు నాని. ఇప్పుడీ జోష్‌లోనే 'హిట్ 3' కోసం రంగంలోకి దిగిపోయారు. శైలేశ్ కొలను తెరకెక్కిస్తున్న ఈ సినిమాని ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. ఇందులో నాయికగా 'కేజీఎఫ్' భామ శ్రీనిధి శెట్టి సందడి చేయనుందని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతుండగా.. నాని, శ్రీనిధిలపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. ఈ నెల రెండో వారం వరకు ఈ షెడ్యూల్ కొనసాగనున్నట్లు తెలుస్తోంది. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతోన్న ఈ సినిమాలో నాని శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనున్నారు. ఇది వచ్చే ఏడాది మే 1న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, ఛాయాగ్రహణం: సాను జాన్ వర్గీస్.


శ్రీనిధి శెట్టి

విజయ్‌తో పూజాహెగ్డే?


విజయ్


పూజా హెగ్డే


తెలుగు సినిమాల్లో ఈమధ్య పూజా హెగ్డే సందడి తక్కువైందేమో కానీ... తమిళంలో మాత్రం ఆమె వరుసగా సినిమాలకు పచ్చజెండా ఊపుతోంది. ప్రస్తుతం సూర్య సరసన కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న ఆమె, తదుపరి మరో అగ్ర కథానాయకుడు విజయ్ సరసన నటిస్తోందని సమాచారం. హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ కథానాయకుడిగా ఆయన 69వ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం నటీనటుల ఎంపిక పూర్తయింది. బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నట్టు చిత్రబృందం మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఇందులో కథానాయికగా పూజాహెగ్డే దాదాపు ఖాయమైనట్టే అని తమిళ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు కూడా ఇందులో ఓ కథానాయిక అనే ప్రచారం కూడా సాగుతోంది. ఈ విషయాలపై త్వరలోనే స్పష్టత రానుంది.

మట్కా విడుదల ఖరారు


వరుణ్ తేజ్

చివరి దశ చిత్రీకరణలో ఉన్న 'మట్కా' విడుదల తేదీ ఖరారైంది. ఈ ఏడాది నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు సినీ వర్గాలు మంగళవారం అధికారికంగా ప్రకటించాయి. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా... కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మట్కా'. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి కథానాయికలు. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కథానాయకుడు వరుణ్‌తేజ్, ఇతర ఫైటర్లు పాల్గొని కొన్ని యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలూ జరుగుతున్నాయి. 1958 నుంచి 1982 వరకూ సాగే ఈ పీరియాడిక్ కథలో, వరుణ్‌తేజ్ నాలుగు విభిన్నమైన అవతారాల్లో కనిపించనున్నారు. వరుణ్ తేజ్ కెరీర్‌లోనే అత్యధిక వ్యయంతో రూపొందించిన ఈ సినిమాని, సుదీర్ఘమైన వారాంతాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే నెల 14న విడుదల చేయాలని నిర్ణయించినట్టు చిత్రవర్గాలు తెలిపాయి. నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి.రవిశంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: ఎ.కిశోర్‌కుమార్, కూర్పు: కార్తీక శ్రీనివాస్.ఆర్.

నిలకడగా రజనీ ఆరోగ్యం


రజనీ కాంత్

ప్రముఖ కథానాయకుడు రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. సోమవారం రాత్రి రజనీకాంత్ ఆసుపత్రిలో చేరడంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై పలు రకాల వదంతులు వ్యాపించాయి. ఇది ఆయన అభిమానులను ఆందోళనకు గురిచేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం చెన్నై గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆసుపత్రి వర్గాలు మెడికల్ బులెటిన్‌ను విడుదల చేశాయి. అందులో... రజనీకాంత్ గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళంలో వాపు ఏర్పడిందని తెలిపాయి. దీనికి ట్రాన్స్‌కాథెటర్ పద్ధతి ద్వారా చికిత్స అందించి స్టెంట్ అమర్చినట్టు వెల్లడించాయి. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండు రోజుల్లో డిశ్చార్జి అవుతారని తెలిపాయి. రజనీకాంత్ త్వరగా కోలుకోవాలంటూ తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆకాంక్షిస్తూ ప్రకటనలు విడుదల చేశారు. ప్రస్తుతం రజనీకాంత్ 'వేట్టయన్', 'కూలీ' చిత్రాల్లో నటిస్తున్నారు. 'వేట్టయన్' ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

– న్యూస్‌టుడే, చెన్నై

గాంధీ సిరీస్‌కు రెహమాన్ సంగీతం


రెహమాన్

మహాత్మాగాంధీ జీవితం ఆధారంగా ఎన్నో సినిమాలొచ్చాయి. ఇప్పుడు మహాత్ముని జీవిత కథతో 'గాంధీ' సిరీస్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ సిరీస్‌కు సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని సిరీస్ బృందం పంచుకుంది. ఈ సిరీస్‌కు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరాలు అందించనున్నట్లు తెలుపుతూ సిరీస్‌ను నిర్మిస్తోన్న అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియో సంస్థ గాంధీ జయంతి సందర్భంగా వెల్లడించింది. ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. 'ఈ సిరీస్‌లో గాంధీజీ జీవితం, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం. . గురించి తెలుస్తుంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సహకారంతో, హన్సల్ మెహతా దర్శకత్వంలో ఈ సిరీస్‌కు సంగీతం అందించడం గౌరవంగా ఉంది' అన్నారు. 'ఇది తరతరాలకు స్ఫూర్తినిచ్చే కథ. గాంధీ జీవితంలోని భావోద్వేగం, ఆధ్యాత్మికతను తెరపైకి తీసుకురావడమే మా లక్ష్యం' అని సిరీస్ బృందం తెలిపింది. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా ఈ సిరీస్‌ను రూపొందిస్తున్నారు.

తొలి రెండు రోజులూ బాగున్నా తర్వాత కష్టమైంది


శ్రీవిష్ణు

వైవిధ్యభరితమైన కథలకు చిరునామాగా నిలుస్తుంటారు హీరో శ్రీవిష్ణు. ఆయన చిత్రాలు కొత్తదనంతో పాటు పసందైన వినోదాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. 'సామజవరగమన', 'ఓం భీమ్ బుష్' విజయాల తర్వాత ఇప్పుడాయన నుంచి వస్తున్న కొత్త చిత్రం 'శ్వాగ్'. 'రాజ రాజ చోర' విజయం తర్వాత విష్ణుతో హసిత్ గోలి చేసిన రెండో సినిమా ఇది. ఈ నెల 4న థియేటర్లలోకి వస్తోంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు శ్రీవిష్ణు.

? అచ్చ తెలుగు చిత్రమంటూనే టైటిల్ 'శ్వాగ్' అని పెట్టారెందుకు

"శ్వాగణిక వంశ కథ ఇది. 'శ్వాగణిక వంశానికి సుస్వాగతం' అని పెడితే అంత పెద్ద పేరు పలకడానికి ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యంగా ఈతరం యువతకు అంత తేలికగా చేరువ కాకపోవచ్చు. అందుకే చిన్నగా 'శ్వాగ్' అని పెట్టాం. తెలుగు ప్రేక్షకులు కొత్త కథ ఎప్పుడు చెప్పినా ఆదరించారు. అదే ధైర్యంతో మేము ఈ సినిమా చేశాం".

? శ్వాగణిక వంశ కథతో ఏం చెప్పనున్నారు.. ఆ రాజ్య విశేషాలేంటి

"ఈ కథ 1500 సంవత్సరంలో మొదలవుతుంది. ఇందులో మాతృస్వామ్య, పితృస్వామ్య వ్యవస్థల మధ్య ఉన్న సంఘర్షణ కనిపిస్తుంది. దీని ద్వారా ఆడ, మగ.. ఇద్దరిలో ఎవరు గొప్ప అనే అంశంపై వినోదాత్మకంగా చర్చించాం. నిజానికిది చాలా పెద్ద కథ. సినిమా చూశాక 'రెండున్నర గంటల్లో ఇంత పెద్ద కథ చెప్పారా' అనిదర్శకుణ్ని మెచ్చుకుంటారు. ఇది నా కెరీర్‌లో అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది".

? ఈ సినిమాలో మీరు మొత్తం ఎన్ని పాత్రల్లో కనిపిస్తారు?

"నేనిప్పటి వరకు ద్విపాత్రాభినయం చేయలేదు. కానీ, ఈ సినిమాలో ఏకంగా నాలుగు పాత్రలు పోషించా. అవి ఒకే వంశంలో.. ఒకే పోలికతో ఉండే పాత్రలుగా ఉంటాయి".

? ఇందులో మీరు పోషించిన నాలుగు పాత్రల్లో బాగా సవాల్‌గా అనిపించిందేంటి?

"సింగ పాత్ర మినహా మిగిలిన మూడు పాత్రలు సవాల్‌గానే అనిపించాయి. వాటి గెటప్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డిక్షన్ దేనికవే ప్రత్యేకంగా ఉంటాయి. ముఖ్యంగా కింగ్ భవభూతి పాత్రకు మోనో లాగ్స్ ఉన్నాయి. తను మాట్లాడే భాష కాస్త గ్రాంధికం ఉంటుంది. అందుకే ఆ పాత్ర కోసం ఎక్కువ ప్రాక్టీస్ చేశా. దీంట్లో 90ఏళ్ల పాత్ర కూడా ఉంటుంది. అది చాలా బాగా వచ్చింది. ప్రోస్థటిక్ మేకప్ వేసుకోవడానికి నాలుగు గంటలు.. దాన్ని తీయడానికి రెండు గంటలు పట్టేది. తొలి రెండు రోజులు బాగానే అనిపించింది కానీ, ఆ తర్వాత ఆ ప్రక్రియంతా కష్టంగా అనిపించేది. టీజర్‌కు వచ్చిన ఆదరణ చూశాక మా కష్టానికి తగిన ఫలితం దక్కిన అనుభూతి కలిగింది".

ఈ సినిమాకి సీక్వెల్ ఛాన్స్ ఉందా? మీ కొత్త చిత్ర విశేషాలేంటి?

"ఈ చిత్రంలోని ప్రతి పాత్రకు సంబంధించిన బ్యాక్‌స్టోరీతో ప్రీక్వెల్స్ తీసుకునే అవకాశముంది. ఇక నా తదుపరి సినిమా థ్రిల్లర్ జానర్‌లో ఉంటుంది. అది చిత్రీకరణ దశలో ఉంది. అలాగే గీతా ఆర్ట్స్ పతాకంపై ఓ చిత్రం చేస్తున్నా. అది చాలా వినోదాత్మకంగా ఉంటుంది".

'కాంతార'లో మోహన్‌లాల్?



కన్నడ కథానాయకుడు రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన 'కాంతార' సినిమా బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు రాబట్టిన సంగతి తెలిసిందే. విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1'ను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో మలయాళ అగ్రకథానాయకుడు మోహన్‌లాల్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. "రాబోయే ఈ ప్రీక్వెల్‌ను ప్రేక్షకుల ఊహలకందని విధంగా తీర్చిదిద్దుతున్నారు రిషబ్. ఇప్పుడీ చిత్రంలో ఆయనకు తండ్రిగా నటించడానికి మోహన్‌లాల్‌ను ఎంపిక చేసే పనిలో ఉంది చిత్రబృందం. ఈ విషయమై ప్రస్తుతం ఆయనతో చర్చలు జరుపుతున్నారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించనున్నార"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'బరోజ్', 'ఎల్2:ఎంపురాన్' లాంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు మోహన్‌లాల్.

దో పత్తిలో ద్విపాత్రాభినయం


కృతి సనన్

తొలిసారిగా ద్విపాత్రాభినయంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'దో పత్తి'. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. దీనికి శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. కవలలైన అక్కాచెల్లెళ్ల గురించిన రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కనిపించనుంది కాజోల్. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకం పై కృతి నిర్మిస్తున్న తొలి చిత్రమిది. షహీర్ షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలక పాత్రలు పోషించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం అక్టోబరు 25న ఓటీటీల్లో విడుదల కానుంది. ఇటీవలే ఈ సినిమా విడుదలకు సంబంధించిన ఓ వీడియోను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. 'కథ ప్రారంభంతో.. ఆట ఇప్పుడే మొదలైంది..' అనే వ్యాఖ్యను జోడించింది.

లోపల ఎంతో ప్రేమ ఉంటే తప్ప ఈ తరహా కథ రాయలేరు :కార్తి


కార్తి

"సత్యం సుందరం' లాంటి మంచి సినిమాలు ప్రశంసలకే పరిమితమైపోకూడదు. కమర్షియల్‌గానూ విజయం సాధిస్తేనే నిర్మాతలకు ప్రోత్సాహకంగా ఉంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో సి.ప్రేమ్ కుమార్ తెరకెక్కించిన చిత్రమే 'సత్యం సుందరం'. సూర్య, జ్యోతిక నిర్మించారు. ఇది ఇటీవల విడుదలైన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్తి మాట్లాడుతూ.. "దర్శకులు కె.విశ్వనాథ్, బాలచందర్, దాసరి నారాయణరావు లాంటి వాళ్లు ఇలాంటి సినిమాలతో ఎప్పుడో మెప్పించేశారు. వాళ్ల వల్లే నేనీ కథ ఒప్పుకున్నా. దర్శకుడు ఈ కథను ఓ నవలలా రాశారు. దీంట్లో ఊపేసే ఇంటర్వెల్.. అదిరిపోయే క్లైమాక్స్ ఏదీ లేదు. లోపల ఎంతో ప్రేమ ఉంటే తప్ప ఈ తరహా కథల్ని రాయలేరు. దీన్ని తెలుగులోకి అనువదిస్తున్నారని చెప్పినప్పుడు 'దీంట్లో యాక్షన్ లేదు.. హీరోయిన్ లేదు. చూస్తారా?' అని రాకేందు మౌళిని అడిగా. డైరెక్ట్‌గా ఓటీటీకి ఇచ్చేద్దామా అంటే నిర్మాత సునీల్ వద్దన్నారు. సినిమాపై.. ప్రేక్షకులపై నమ్మకముందన్నారు. కొత్త కాన్సెప్ట్‌తో వస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని దీనితో మరోసారి నిజమైంది" అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, శ్రీదివ్య, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

సవాలే అయినా ఆత్రుతగా ఎదురుచూస్తున్నా!


మాళవిక మోహనన్

'ఇప్పటివరకూ ఎన్నో రకాల పాత్రలు పోషించాను కానీ 'సర్దార్ 2'లో నా పాత్ర వాటికి భిన్నంగా ఉంటుంది' అని చెబుతోంది అందాల తార మాళవిక మోహనన్. ఇటీవల 'తంగలాన్', 'యుద్రా' చిత్రాలతో ప్రేక్షకులను అలరించిందామె. ప్రస్తుతం ఈమె 'సర్దార్ 2'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. కార్తీ కథానాయకుడిగా స్పై యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. పి ఎస్ మిత్రన్ తెరకెక్కించిన 'సర్దార్'కు సీక్వెల్‌గా రానుంది. ఈ చిత్రం గురించి మాళవిక సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ.. . "ప్రస్తుతం 'సర్దార్ 2' కోసం పనిచేస్తున్నా. ఇది చాలా భిన్నమైన, సవాలుతో కూడుకున్న పాత్ర. ఇప్పటి వరకూ ఇలాంటి పాత్రలో నటించలేదు. ఈ పాత్రను తెరపై ఎప్పుడు చూసుకుంటానని ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పింది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'రాజా సాబ్' చిత్రీకరణలో బిజీగా ఉంది మాళవిక.

గెలాక్సీ ఎస్24 ఎఫ్‌ఈ వచ్చింది

టెక్ కబురు

సామ్‌సంగ్ మనదేశంలో అధికారికంగా కొత్త గెలాక్సీ ఎస్ శ్రేణి స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. పేరు సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్24 ఎఫ్‌ఈ. దీని డిజైన్ ఇతర గెలాక్సీ ఎస్24 ఫోన్ల మాదిరిగానే ఉంటుంది. 6.7 అంగుళాల డైనమిక్ ఎమోలెడ్ 2ఎక్స్ డిస్‌ప్లే, 1080×2340 పిక్సెల్స్ రెజల్యూషన్‌తో కూడిన ఇది వెనకాల 50ఎంపీ మెయిన్ లెన్స్‌తో మూడు కెమెరాల వ్యవస్థ కలిగుంది. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ సపోర్టు కూడా ఉంది.



సెల్ఫీల కోసం 10ఎంపీ కెమెరాను అమర్చారు. ఎక్సీనోస్ 2400ఇ ప్రాసెసర్‌తో కూడిన ఈ ఫోన్ 8జీబీ ర్యామ్, 512జీబీ వరకూ అంతర్గత స్టోరేజీతో వస్తోంది. 4,700ఎంఏహెచ్ బ్యాటరీ, 25డబ్ల్యూ ఛార్జింగ్ సామర్థ్యం దీని సొంతం. 5జీ, ఎల్‌టీఈ, వైఫై 6ఈ, బ్లూటూత్ 5.3, జీపీఎస్ వంటి కనెక్టివిటీ ఆప్షన్లు ఉన్నాయి. సర్కిల్ టు సెర్చ్, లైవ్ ట్రాన్స్‌లేట్, నోట్ అసిస్ట్, కంపోజర్, ఇంటర్‌ప్రెటర్ మోడ్ వంటి గెలాక్సీ ఏఐ ఫీచర్లు ప్రత్యేకం. ఆండ్రాయిడ్ 14తో పనిచేసే దీనికి ఏడు సంవత్సరాల వరకూ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ లభిస్తాయి. ఐపీ68 రేటింగ్, ఇన్‌డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ స్కానర్, సామ్‌సంగ్ నాక్స్ వాల్ట్ సపోర్టు వంటి ఫీచర్లూ పొందొచ్చు. ఇది బ్లూ, మింట్, గ్రాఫైట్ రంగుల్లో అందుబాటులో ఉంది. 8జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజీ రకం ధర రూ.59,999. 8జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజీ రకం ధర రూ.65,999.

నవ మెటా ఏఆర్ గ్లాసెస్

మెటా సంస్థ ఓరియన్ ఆగ్మెంటెడ్ రియాల్టీ గ్లాసెస్‌ను పరిచయం చేసింది. న్యూరల్ రిస్ట్‌బ్యాండ్‌తో పాటు మరిన్ని కొత్త సామర్థ్యాలను దీనికి జోడించింది. సైగలతో పనులను నియంత్రించటానికి రిస్ట్‌బ్యాండ్‌ను వాడుకోవచ్చు.



ఇతర సంప్రదాయ ఏఆర్, వీఆర్ పరికరాల మాదిరిగా కాకుండా మెటా ఓరియన్ తేలికగా ఉంటుంది. కళ్లద్దాల మాదిరిగానూ ఉపయోగించుకోవచ్చు. గ్లాసెస్ వాడుతున్నా యూజర్లు, ఎదుటివారు ఇద్దరూ ఒకరిని ఒకరు చూసుకోవచ్చు. గోడ మీద నిలువెత్తు హోలోగ్రామ్‌లను ప్రత్యక్షం చేయటంతో పాటు ఇవి మెటా ఏఐతోనూ సమ్మిళితమై ఉంటాయి. యూజర్లు వాస్తవ ప్రపంచాన్ని చూడటంతో పాటు కమాండ్స్‌ను బాగా అర్థం చేసుకోవటానికీ వీలుంటుంది. ఉదా: గ్లాసెస్ పెట్టుకొని ఫ్రిజ్‌ను తెరవచ్చు, అందులో ఉన్న వస్తువులతో ఏయే వంటకాలు చేయొచ్చో అనీ అడగొచ్చు.

శుక్రయానానికి సన్నాహం



అంతర్ గ్రహ ప్రయోగాల్లో మనదేశం మరో మైలురాయిని చేరుకోనుంది. 2013లో చేపట్టిన మంగళ్‌యాన్ అనంతరం శుక్రయానానికి సిద్ధమైంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2028, మార్చిలో వీనస్ ఆర్బిటర్ మిషన్‌ను ప్రయోగించనుంది. దీనికి కేంద్ర కేబినెట్ ఇటీవలే ఆమోదం తెలిపింది. దీని వివరాలేంటో చూద్దాం.

శుక్రుడిని మన భూమికి కవల గ్రహంగా పరిగణిస్తుంటారు. ఈ రెండింటి ద్రవ్యరాశి, సాంద్రత, పరిమాణం ఒకేలా ఉంటాయి. అందువల్ల శుక్రుడి మీద అధ్యయనం చేస్తే భూ పరిణామ రహస్యాలు లభించే అవకాశముంది. ఎప్పుడో ఒకప్పుడు శుక్రుడి మీద నీరుండేదన్నది శాస్త్రవేత్తల భావన. కానీ ఇప్పుడు పొడిగా, దుమ్ముతో కూడిన గ్రహంగా మారిపోయింది. వీనస్ ఆర్బిటర్ మనదేశంతో పాటు ఇతర దేశాలకు చెందిన శాస్త్రీయ పరికరాలను మోసుకెళ్తుంది. ఇవి శుక్రుడి ఉపరితలం, ఉపరితలం కింది పొరను పరీక్షిస్తాయి. శుక్రుడి వాతావరణం, దాని అయానావరణం, సూర్యుడితో శుక్రుడు జరిపే చర్యలనూ ఇవి పరిశీలిస్తాయి.

భూమి కన్నా భిన్నం

కవల గ్రహంగా భావించినా శుక్రుడి తీరుతెన్నులు భూమితో పోలిస్తే చాలా భిన్నం. అక్కడి ఉపరితలం అధిక వేడిగా.. సుమారు 462 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతతో ఉంటుంది. ఇది సూర్యుడికి దగ్గరగా ఉండే బుధ గ్రహం ఉపరితల ఉష్ణోగ్రత కన్నా అధికం.

- భూమి మీది కన్నా శుక్రుడి మీద వాతావరణ పీడనం చాలా ఎక్కువ. అది భూమి మీద మహా సముద్రాల లోతుల్లోని పీడనంతో దాదాపు సమానంగా ఉంటుందని చెప్పుకోవచ్చు.
- శుక్రుడి వాతావరణంలో 96.5% కార్బన్ డయాక్సైడ్ ఉంటుంది. ఆ గ్రహం మీద సల్ఫ్యూరిక్ ఆమ్లంతో కూడిన మేఘాలూ నిండి ఉంటాయి.
- భూమితో పోలిస్తే శుక్ర గ్రహం తన అక్షం మీద చాలా నెమ్మదిగా భ్రమిస్తుంటుంది. ఒకసారి తన చుట్టూ తాను తిరగటానికి సుమారు 243 భూమి రోజులు పడుతుంది.

ఏరో బ్రేకింగ్ నైపుణ్యంతో

వీనస్ మిషన్‌లో మనదేశం తొలిసారిగా ఏరో బ్రేకింగ్ నైపుణ్యాన్నీ ప్రదర్శించనుంది. అంటే ఉపగ్రహాన్ని దశలు దశలుగా కిందికి దించటం అన్నమాట. అంతరిక్షంలో ఇంధనం కొరతను దృష్టిలో పెట్టుకొని ఉపగ్రహాన్ని ముందుగా శుక్రుడికి చాలా ఎత్తులో సుమారు 500 కి.మీ.× 60,000 కి.మీ. దీర్ఘవృత్తాకార కక్ష్యలో కుదురుకునేలా చేస్తారు. అయితే అంత ఎత్తు నుంచి శాస్త్ర పరికరాలు ప్రయోగాలు నిర్వహించలేవు. అందుకే ఏరో బ్రేకింగ్ సాయంతో ఉపగ్రహాన్ని కిందికి దించి 300×300 కి.మీ. లేదా 200×600 కి.మీ. కక్ష్యకు తీసుకొస్తారు. దీర్ఘ వృత్తాకార కక్ష్యలో ఉపగ్రహం శుక్రుడికి సమీపంలోకి వచ్చినప్పుడు దాన్ని చాలాసార్లు త్వరత్వరగా సుమారు 140 కి.మీ. మేరకు కిందికి దించుతారు. ఈ సమయంలో ఉపగ్రహం శుక్ర వాతావరణం వెలుపలి పొర గుండా వేగంగా కిందికి దిగుతుంది. వాతావరణ ఘర్షణ ప్రభావంతో ఉపగ్రహం వేగం నెమ్మదిస్తుంది. క్రమంగా కక్ష్య ఎత్తు తగ్గుతూ వస్తుంది. శుక్ర వాతావరణం నుంచి ఉపగ్రహాన్ని అత్యంత జాగరూకతతో కిందికి దించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఉపగ్రహం మరీ లోతుకు దిగితే తీవ్ర ఘర్షణ మూలంగా మండిపోవచ్చు. అంతగా కిందికి దిగకపోతే నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహం చేరటానికి చాలా సమయం పడుతుంది. వీనస్ మిషన్ నిర్ణీత కక్ష్యలోకి చేరటానికి దాదాపు 6 నెలలు పడుతుంది. ఒకసారి అక్కడికి చేరుకున్నాక ఉపగ్రహం శుక్రుడి వాతావరణ ప్రభావం నుంచి పూర్తిగా విడివడుతుంది. లేకపోతే ఘర్షణ తలెత్తి ఎక్కువ ఇంధనం ఖర్చవుతుంది.

వీనస్ మిషన్ ప్రత్యేకతలివీ..

నిజానికి శుక్ర ప్రయోగం గత సంవత్సరమే జరగాలి. కానీ ఇటీవల కేంద్ర కేబినెట్ అనుమతి మేరకు 2028, మార్చిలో ప్రయోగించాలని నిర్ణయించారు. భూమి, శుక్ర గ్రహం 19 నెలలకు ఒకసారే అత్యంత సమీపంలోకి వస్తాయి. ఇది దగ్గరి దారి కావటం వల్ల ఆ సమయానికి అనుగుణంగా ప్రయోగాన్ని చేపట్టనున్నారు. శుక్ర ప్రయోగంలో ఇది చాలా ముఖ్యమైన విషయం.

- వీనస్ మిషన్ సుమారు 100 కిలోల శాస్త్రీయ పరికరాలను మోసుకెళ్తుంది. మనదేశం చేపట్టిన ఇతర అంతరిక్ష ప్రయోగాల తీరునే ఇదీ అనుసరిస్తుంది. ఉపగ్రహం భూ కక్ష్యలో వేగాన్ని పుంజుకొని, ఒకేసారి శుక్రుడి దిశగా ప్రయాణిస్తుంది. చివరికి అక్కడి కక్ష్యలో స్థిరపడుతుంది.
- భూ కక్ష్యను విడిచి పెట్టిన తర్వాత ఉపగ్రహం సుమారు 140 రోజుల తర్వాత శుక్రుడి వద్దకు చేరుకుంటుంది.

ఇతర దేశాల ప్రయోగాలు

ఇంతకుముందు అమెరికా, ఒకప్పటి యూఎస్ఎస్ఆర్, జపాన్ శుక్రుడి వద్దకు ప్రయోగాలు నిర్వహించాయి. జపాన్ భాగస్వామ్యంతో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) కూడా మిషన్‌ను చేపట్టింది. అమెరికా మరో రెండు వీనస్ మిషన్లను చేపట్టాలని భావిస్తోంది. 2029లో డావించీ, 2031లో వెరిటాస్‌ను ప్రయోగించాలని నిర్ణయించింది. ఈఎస్ఏ 2020లో ఇన్‌విజన్ ప్రయోగానికీ సిద్ధమైంది.

పరమ్ శక్తి!



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల మూడు పరమ్ రుద్ర సూపర్ కంప్యూటర్లను జాతికి అంకితం చేశారు. వీటితో దేశ అత్యధిక నైపుణ్య కంప్యూటింగ్ సామర్థ్యాలకు మరింత బలం చేకూరినట్టయ్యింది. బహుముఖ శాస్త్ర అభివృద్ధికి కొత్త ఊతం లభించింది. ఈ సూపర్ కంప్యూటర్లతో ఖగోళ, వైద్య, హై ఎనర్జీ భౌతికశాస్త్ర రంగాల్లో పరిశోధనలు ఊపందుకోనున్నాయి. ఇంతకీ ఏంటీ పరమ్ రుద్ర?

నేషనల్ సూపర్‌కంప్యూటింగ్ కార్యక్రమం కింద సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) దేశీయంగా పరమ్ రుద్ర సూపర్ కంప్యూటర్లను రూపొందించింది. అధునాతన శాస్త్ర పరిశోధనల కోసం వీటిని దిల్లీ, పుణె, కోల్‌కతాలోని ప్రముఖ సంస్థల్లో నెలకొల్పారు.

- పుణెలోని జెయింట్ మెట్రో రేడియో టెలిస్కోప్ (జీఎంఆర్‌టీ)లో నెలకొల్పిన సూపర్‌కంప్యూటర్‌ను రేడియో తరంగ పౌనఃపున్యాల్లో ప్రకాశంగా, అతి తక్కువ వ్యవధిలో కనిపించే విద్యుదయస్కాంత, రేడియేషన్ ప్రచోదనాలు (ఎఫ్ఆర్‌బీస్), ఖగోళ దృగ్విషయాల మీద అధ్యయనం కోసం వినియోగిస్తారు.
- దిల్లీలోని ఇంటర్-యూనివర్సిటీ యాక్సిలరేటర్ సెంటర్ (ఐయూఏసీ)లో ఏర్పాటు చేసిన సూపర్‌కంప్యూటర్ పదార్థ విజ్ఞానం, అణు భౌతికశాస్త్ర రంగాల్లో అధునాతన పరిశోధనలకు వీలు కల్పిస్తుంది.
- కోల్‌కతాలోని ఎస్.ఎన్.బోస్ సెంటర్‌లో నెలకొల్పినదేమో భౌతికశాస్త్రం, ఖగోళం, భూ విజ్ఞాన రంగాల పరిశోధనలకు తోడ్పడుతుంది.

వీటిల్లో అన్నింటికన్నా శక్తిమంతమైంది ఏయూఏసీలో నెలకొల్పిన సూపర్ కంప్యూటర్. ఇది 3 పెటాఫ్లాప్ సామర్థ్యం కలిగుంది. జీఎంఆర్‌టీలో ఏర్పాటు చేసినది ఒక పెటాఫ్లాప్, ఎస్.ఎన్. బోస్ సెంటర్‌లో నెలకొల్పినది 838 టెరాఫ్లాప్స్ సామర్థ్యాన్ని కలిగున్నాయి.

ఫ్లాప్స్ అంటే?

కంప్యూటింగ్ నైపుణ్యాన్ని ఒక సెకండుకు ఫ్లోటింగ్-పాయింట్ ఆపరేషన్స్ (ఫ్లాప్స్) ఆధారంగా లెక్కిస్తారు. సామర్థ్యాన్ని బట్టి బిలియన్స్ (గిగా), ట్రిలియన్స్ (టెరా), క్వాడ్రిలియన్స్ (పెటా) ఫ్లాప్స్‌గా వర్గీకరించొచ్చు. ఒక పెటాఫ్లాప్ వెయ్యి టెరాఫ్లాప్స్‌కు సమానం.

ఐఫోన్‌లో కొలతల యాప్

ఐఫోన్లలో బోలెడన్ని ఫీచర్లు. వీటిల్లో తెలిసిన వాటి కన్నా తెలియనివే ఎక్కువ. అలాంటిదే **మెజర్ యాప్**. ఆగ్మెంటెడ్ రియాలిటీ పరిజ్ఞానంతో కూడిన ఇది చతురస్రాలు, దీర్ఘ చతురస్రాల వంటి వాటితో పాటు అడ్డదిడ్డం వస్తువుల ఆకారాల కొలతలనూ చూపిస్తుంది. ప్రొ మోడళ్లయితే ఇన్‌బిల్ట్ లైడర్ స్కానర్ సాయంతో వ్యక్తుల ఎత్తును కొలవటానికీ వీలు కల్పిస్తాయి. కొలతను సెంటీమీటర్ల నుంచి అంగాళాలకూ మార్చుకోవచ్చు. తీసుకున్న కొలతలను ఇమేజ్ రూపంలో ఫొటోస్ యాప్‌లో సేవ్ చేసుకోవచ్చు కూడా. ఏదైనా వస్తువును నచ్చిన కోణంలో అమర్చుకోవాలనుకుంటే దాని వాలును కూడా కొలుచుకోవచ్చు. ఐఫోన్ 6ఎస్, ఆ తర్వాతి మోడళ్లలోని మెజర్ యాప్‌లో ఇన్‌బిల్ట్‌గా స్పిరిట్ లెవల్ అనే ఫీచర్ సైతం ఉంది. ఏదైనా వస్తువు నేలకు లంబంగా ఉందో లేదో దీని ద్వారా చూసుకోవచ్చు. అంటే గోడ మీదున్న పెయింటింగ్ నిలువుగా, అడ్డంగా తిన్నగా ఉందో లేదో కొలుచుకోవచ్చన్నమాట. ఈ స్పిరిట్ లెవల్ టూల్‌ను ఎలా వాడుకోవాలంటే..

- ఐఫోన్‌లో మెజర్ యాప్‌ను ఓపెన్ చేయాలి. అడుగున ఉండే 'లెవల్' ట్యాబ్ మీద తాకాలి. తిన్నగా ఉందో లేదో తెలుసుకోవాలనే వస్తువుకు ఎదురుగా ఐఫోన్‌ను పట్టుకోవాలి.
- ఫోన్‌ను తిప్పుతూ వస్తుంటే వస్తువు లెవల్ సమాన స్థితికి వచ్చినప్పుడు తెర ఆకుపచ్చగా అవుతుంది. తెర మీద 0 డిగ్రీలని చూపిస్తుంది. దాని ప్రకారం ఫోన్ తిప్పటమే తరువాయి.

వాట్సప్ స్టేటస్‌లో మెన్షన్స్

యాప్‌రే

ఇన్‌స్టాగ్రామ్‌లో మాదిరిగా వాట్సప్ కూడా స్టేటస్ అప్‌డేట్స్‌లో ఇతరులను ప్రస్తావించటానికి (మెన్షన్) వీలు కల్పించే ఫీచర్‌ను తీసుకురానుంది. అయితే ఇది పూర్తిగా వ్యక్తిగతం. అంటే స్టేటస్ అప్‌లోడ్ చేసిన యూజర్, యూజర్ ప్రస్తావించిన వారు మాత్రమే చూడగలరు అన్నమాట. స్టేటస్ అప్‌డేట్‌లో మెన్షన్ చేసిన వారికి దానికి సంబంధించిన నోటిఫికేషన్ అందుతుంది. ఆండ్రాయిడ్ కోసం రూపొందించిన వాట్సప్ బీటా వర్షన్ 2.24.20.3లో ఈ ఫీచర్‌ను గుర్తించామని వాబీటాఇన్ఫో పేర్కొంది. ప్రస్తుతం వాట్సప్‌లో యూజర్లు ఇతరులెవరినీ ట్యాగ్ చేయటానికి లేదు. తాజా అప్‌డేట్‌తో సేవ్ చేసుకున్న కాంటాక్ట్‌లను స్టేటస్‌లో ప్రస్తావించటం సాధ్యమవుతుంది. ఈ ఫీచర్ స్క్రీన్‌షాట్‌లో 'మెన్షన్స్'గా కనిపిస్తుంది.

తెలుగులోనూ లింక్డ్‌ఇన్

లింక్డ్‌ఇన్ ఇప్పుడు తెలుగునూ సపోర్టు చేయనుంది. దీనికి ఇటీవల కొత్తగా 10 భాషలను జోడించారు. వీటిల్లో మనదేశానికి చెందిన తెలుగుతో పాటు బెంగాలీ, మరాఠీ, పంజాబీ భాషలున్నాయి. ఇప్పటికే లింక్డ్‌ఇన్ హిందీని సపోర్టు చేస్తోంది. తాజా అప్‌డేట్‌తో భారతీయ భాషల సంఖ్య ఐదుకు చేరింది. మనదేశంలో లింక్డ్‌ఇన్ యూజర్ల సంఖ్య 13.5 కోట్లు దాటింది. ఏటా 20% చొప్పున యూజర్లు పెరుగుతున్నారు. తాజా భాషల అప్‌డేట్‌తో ఇది మరింత పెరిగే అవకాశముంది. భాషా అవరోధాలను అధిగమించటానికి, యూజర్లు అర్థవంతమైన వృత్తిగత ఐడీలను ఏర్పాటు చేసుకోవటానికి, ఇతరులతో మరింత సమర్థంగా చర్చించుకోవటానికి మార్గం సుగమం కానుంది.

కాళ్ల చేప!



చేపలు ఈదుతాయని తెలుసు. మరి కీటకాల మాదిరిగా కాళ్లతో నడిస్తే? సముద్రం అడుగున సంచరించే సీ రాబిన్స్ అనే చేపలు ఇలాగే చేస్తున్నాయని తాజాగా గుర్తించారు. ఇవి కాళ్ల వంటి ఉపాంగాలతో నడుస్తుండటం విచిత్రం. కరెంట్ బయాలజీ పత్రికలో ప్రచురితమైన రెండు పరిశోధన పత్రాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఆయా పరిస్థితులకు అనుగుణంగా జీవులు పరిణామం చెందిన తీరుకు ఇదో గొప్ప నిదర్శనంగా నిలుస్తోంది. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి కోరీ అలార్డ్ 2019లో కేప్ కార్డ్స్ మెరైన్ బయలాజికల్ లేబరేటరీని సందర్శించినప్పుడు సీ రాబిన్స్‌ను చూసి ఆశ్చర్యపోయారు. అవి తమ కాళ్లను ఎలా వాడుకుంటున్నాయి? ఆ కాళ్ల అభివృద్ధిని ఏయే జన్యు అంశాలు నియంత్రిస్తున్నాయి? అనేవి తెలుసుకోవటం మీద దృష్టి సారించారు. నిజానికివి ఛాతీకి రక్షణగా నిలిచే మొప్పలని, క్రమంగా అవి కాళ్లుగా మారాయని అధ్యయనంలో తేలింది. ఇవి ఒకో వైపు మూడు చొప్పున శరీరానికి రెండు వైపులా ఉంటాయి. నడవటానికే కాకుండా యాంత్రిక, రసాయన ప్రేరేకాలను గుర్తించే జ్ఞానేంద్రియాలుగానూ ఇవి ఉపయోగ పడుతున్నాయని బయటపడింది. సీ రాబిన్స్‌కు చెందిన రెండు సుదూర జాతుల్లో కాళ్ల నిర్మాణాలు, సామర్థ్యాలు భిన్నంగా ఉంటున్నట్టూ తేలటం విచిత్రం. ఒక జాతి చేపల కాళ్లు పార మాదిరిగా ఉన్నాయని, వీటి మీద రుచిమొగ్గల్లాంటి బుడిపెలూ ఉన్నాయని తేలింది. వీటి సాయంతో నేలను తవ్వి, లోపల దాగిన జీవులను బయటకు తీస్తున్నాయి. మరో జాతి చేపల కాళ్లకు రుచిమొగ్గలేవీ లేవు. అవి తమ కాళ్లను ప్రధానంగా కదలటానికి, వెతకటానికి వాడుకుంటున్నాయి.

యురేకా

ఇ-వ్యర్థాల నుంచి లోహాల సంగ్రహణ



ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుంచి మరింత సమర్థంగా విలువైన లోహాలను వెలికి తీయటానికి రైస్ యూనివర్సిటీ పరిశోధకులు వినూత్న పద్ధతిని రూపొందించారు. పదార్థాల గుండా విద్యుత్తును ప్రసరింపజేసి, వాటిని అతి వేగంగా వేడెక్కించటం (ఫ్లాష్ జౌల్ హీటింగ్) దీనిలోని కీలకాంశం. ఈ ప్రక్రియలో పదార్థాలు స్వల్ప వ్యవధిలో అత్యధిక ఉష్ణోగ్రతలకు చేరుకుంటాయి. ఫలితంగా అవి వివిధ పదార్థాల రూపాల్లోకి విడిపోతాయి. ఫ్లాష్ జౌల్ హీటింగ్ ప్రక్రియ సాయంతో పరిశోధకులు ఇ-వ్యర్థాల నుంచి గ్యాలియం, ఇండియమ్, టాంటలమ్ వంటి విలువైన లోహాలను వెలికి తీయటంలో విజయం సాధించారు. హైడ్రోమెటలర్జీ, పైరోమెటలర్జీ వంటి సంప్రదాయ పునర్వినియోగ పద్ధతులకు ఎక్కువ విద్యుత్తు, ఇంధనం అవసరమవుతాయి. హానికర వ్యర్థాలు పుట్టుకొస్తాయి. పెద్దమొత్తంలో ఆమ్లమూ అవసరమవుతుంది. కొత్త పద్ధతిలో ఇలాంటి ఇబ్బందులేవీ ఉండవు. కచ్చితంగా పదార్థాలను అవసరమైన ఉష్ణోగ్రతల మేరకు వేడి చేయొచ్చు. నీరు, ఆమ్లం వంటి ద్రావణాలేవీ లేకుండా వేగంగా లోహాలను వెలికి తీయొచ్చు. అంటే పర్యావరణానికి ఎలాంటి హాని కలగదన్నమాట. వ్యర్థ ప్రవాహాల నుంచి కీలక లోహాలను సంగ్రహించటానికీ పరిశోధకులు ఈ ప్రక్రియను వర్తింపజేయనున్నారు.

తాత ఫోన్ స్మార్ట్‌గా..

డివైస్ మజా

వయోధికులకూ స్మార్ట్‌ఫోన్లు అవసరంగా మారుతున్నాయి. చదువులు, ఉద్యోగాల పేరుతో దూరంగా ఉండే పిల్లలకు వీడియోకాల్ చేసి మాట్లాడటం దగ్గరి నుంచి కూరగాయలు, సరకులు కొనటానికి డబ్బులు చెల్లించటం వరకూ ఎన్నెన్నో పనులకివి చేదోడుగా నిలుస్తున్నాయి. కాకపోతే మొదట్లో స్మార్ట్‌ఫోన్లు వాడటానికి కాస్త తికమక పడుతుంటారు. ఎన్నో సెటింగ్స్, ఎన్నెన్నో ఫీచర్లు ఉండటం వల్ల వాటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియక ఇబ్బంది పడుతుంటారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో కొన్ని సెటింగ్స్ మార్చుకుంటే తేలికగా వాడుకునేలా చేయొచ్చు.



ఫాంట్ సైజు పెద్దగా

స్మార్ట్‌ఫోన్లలో అక్షరాలు చిన్నగా ఉంటే మనకే కష్టంగా ఉంటుంది. ఇక వయోధికుల గురించి చెప్పేదేముంది? సరిగ్గా కనిపించక తెగ ఇబ్బంది పడతారు. అందువల్ల ముందుగా చేయాల్సింది ఫాంట్ సైజును పెంచటం. ఆండ్రాయిడ్ ఫోన్లలో దీన్ని సులువుగానే చేయొచ్చు. ఆయా కంపెనీల ఫోన్లను బట్టి కాస్త అటూఇటూగా ఉన్నప్పటికీ చాలా ఫోన్లలో దాదాపు ఒకలాంటి సెటింగ్సే ఉంటాయి. ఇందుకోసం ముందుగా సెటింగ్స్‌లోకి వెళ్లి, డిస్‌ప్లే విభాగం మీద తాకాలి. జాబితాలో కిందికి వెళ్తే డిస్‌ప్లే సైజ్ అండ్ టెక్స్ట్ విభాగముంటుంది. ఇందులో సిస్టమ్ ఫాంట్, ఫాంట్ సైజ్ అండ్ స్టైల్ వంటి ఆప్షన్లు కనిపిస్తాయి. ఫాంట్ సైజులోని టెక్స్ట్ సైజు ఆప్షన్ ద్వారా కావాల్సిన సైజులో సెట్ చేసుకోవచ్చు. ఫోన్ వాడే వయోధికులకు సౌకర్యంగా ఉన్న సైజును ఎంచుకుంటే చాలు.

వాడని యాప్స్ డిలీట్

ఆండ్రాయిడ్ ఫోన్లలో బోలెడన్ని యాప్స్ ఉంటాయి. వీటిల్లో అవసరం లేనివీ ఎన్నో. వయోధికులకైతే ఎన్నడూ ఉపయోగపడవు కూడా. అవసరం లేని యాప్స్ వీరిని తికమక పడేలానూ చేయొచ్చు. మరోవైపు ఇవి ఫోన్‌లో ఎక్కువ స్టోరేజీనీ తీసుకుంటాయి. కాబట్టి వాడని యాప్స్‌ను డిలీట్ చేయటమే మంచిది. కాకపోతే కొత్త ఫోన్లలో ముందుగానే ఇన్‌స్టాల్ అయి ఉన్న బ్లోట్‌వేర్ యాప్సే ఎక్కువ. ఇవి కనిపించకుండా వెనకాల రన్ అవుతుంటాయి. వీటిని గుర్తించటమూ కష్టమే. యాప్స్ సెక్షన్‌లోకి వెళ్లి వెతకాల్సి ఉంటుంది. అనవసరమైనవి ఎంచుకొని, డిలీట్ చేయాలి.

ఆండ్రాయిడ్ లాంచర్ల సాయం

ఆండ్రాయిడ్ ఫోన్లలో మంచి విషయం ఏంటంటే- ఇష్టమున్నట్టుగా మార్చుకునే వీలుండటం. ఇందుకు ఆండ్రాయిడ్ లాంచర్లు బాగా ఉపయోగపడతాయి. హోం స్క్రీన్ శుభ్రంగా ఉండేలా చూసుకోవటానికి, అవసరాలకు అనుగుణంగా ఇష్టమున్నట్టుగా మార్చుకోవటానికి తోడ్పడతాయి. తేలికగా వాడుకోవటానికి వీలైన ఇంటర్ఫేస్ గల లాంచర్లను ఎంచుకోవాలి. ఐకన్లు, టెక్స్ట్ సైజు పెద్దగా ఉన్నవైతే మంచిది. సింపుల్ లాంచర్, బిగ్ లాంచర్, హెల్ప్ లాంచర్ వంటివి వయోధికులకు బాగా ఉపయోగపడతాయి. వీటిని గూగుల్ ప్లే స్టోర్ నుంచి తేలికగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కీబోర్డు సైజు ఎత్తుగా

ఆండ్రాయిడ్ ఫోన్లలో కీబోర్డును పెద్దగా, విశాలంగా చేసుకునే ఆప్షన్ ఉంటుంది. అయితే ఇది ఆయా కంపెనీల స్మార్ట్‌ఫోన్లను బట్టి ఆధారపడి ఉంటుంది. ఆండ్రాయిడ్ ఫోన్లలో జీబోర్డు ముందే లోడ్ అయ్యుంటుంది. ఇందులో కీబోర్డు సైజును మార్చుకోవటానికి రకరకాల ఆప్షన్లుంటాయి. ముందుగా టెక్స్ట్‌ను ఇన్‌సర్ట్ చేయటానికి వీలు కల్పించే ఏ యాప్‌నైనా ఓపెన్ చేయాలి. ఉదాహరణకు వాట్సప్‌ను ఓపెన్ చేశారనుకోండి. మెసేజ్‌ను టైప్ చేసే ఫీల్డ్ మీద తాకగానే కీబోర్డు కనిపిస్తుంది కదా. అక్షరాలకు పైన ఉండే చక్రం గుర్తు మీద తాకితే సెటింగ్స్ పేజీ ఓపెన్ అవుతుంది. ఇందులో ప్రిఫరెన్సెస్ మీద తాకితే కింద జాబితా కనిపిస్తుంది. వాటిల్లో కీబోర్డు హైట్ మీద తట్టి అవసరమైన విధంగా సైజు పెంచుకోవచ్చు. కొన్ని కీబోర్డుల్లో నాలుగు చదరాల గుర్తు మీద తాకితే రీసైజ్ ఆప్షన్ కనిపిస్తుంది. దీన్ని ఎంచుకొని సైజును మార్చుకోవచ్చు.

కాల్ షార్ట్‌కట్స్

వయోధికులు కాంటాక్ట్‌లను వెతక్కోవటం కష్టమనుకుంటే కాల్ షార్ట్‌కట్స్ సెట్ చేసి ఇవ్వచ్చు. దీంతో తేలికగా కాల్ చేయటానికి వీలుంటుంది. డైరెక్ట్ డయల్ విడ్జెట్ ద్వారా కాల్ షార్ట్‌కట్స్‌ను పెట్టుకోవచ్చు. హోం స్క్రీన్‌లో ఖాళీగా ఉన్న చోట కాసేపు అదిమి పట్టాలి. తర్వాత విడ్జెట్స్ మీద తాకి, కాంటాక్ట్స్‌ను ఎంచుకుంటే జాబితా మొత్తం కనిపిస్తుంది. అందులో షార్ట్‌కట్‌గా పెట్టుకోవాలనుకునే కాంటాక్ట్‌ను ఎంచుకుంటే చూజ్ షార్ట్‌కట్ ఆప్షన్ ఓపెన్ అవుతుంది. ఓకే మీద నొక్కగానే ఆ కాంటాక్ట్ హోం స్క్రీన్ మీద కనిపిస్తుంది. దాన్ని తాకి తేలికగా కాల్ చేసుకోవచ్చు.

కృత్రిమ మేధతో అదృశ్య పిల్లల జాడ

ఏఐ తరంగం

తప్పిపోయిన పిల్లలను గుర్తించటానికీ కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగపడుతోంది. ఇది సమర్థంగా పనిచేస్తున్నట్టు కెన్యా వంటి దేశాల్లో నిరూపితమైంది. నాలుగేళ్లలోనే 496 మంది అదృశ్య పిల్లలను గుర్తించింది. ఇప్పుడిది మనదేశానికీ విస్తరించనుంది. పశ్చిమబెంగాల్‌కు చెందిన సాహిద్ ఎస్.కె. తప్పిపోయిన పిల్లల జాడను గుర్తించేందుకు రాజస్థాన్ పోలీసులు చేపట్టిన కార్యక్రమంతో చేయి కలిపారు. ఎప్పుడో తప్పిపోయిన పిల్లల పాత, మసకబారిన ఫొటోలను ఏఐ టూల్స్ సాయంతో ఇప్పటి రూపాల్లోకి మారుస్తున్నారు. "గుర్తుపట్టటానికే కష్టమైన స్థితిలో ఉన్న పిల్లల పాత, మసకబారిన చిత్రాలు నాకు ఇచ్చారు. ఏఐ, ఏజ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ సాయంతో వారి ముఖాలను తిరిగి సృష్టించాను. ఇప్పుడు వారెలా ఉంటారో ఊహించాను. ఇది కష్టమైన పనే అయినా కుటుంబాలు తిరిగి కలుస్తాయనే ఆలోచనే ముందుకు నడిపిస్తోంది" అని సాహిద్ ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో పేర్కొన్నారు. ఒక హిందీ పత్రికలో వచ్చిన వార్తా కథనం ఫొటోతో పాటు తన అనుభవాన్ని, అభిప్రాయాలను పంచుకున్నారు. రాజస్థాన్ పోలీసులు చేపట్టిన కార్యక్రమం గొప్ప ప్రభావాన్ని చూపించగలదని, దీన్ని ఇతర రాష్ట్రాల్లోని పోలీసులూ అనుసరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



ప్రస్తుతం ఏఐ టూల్స్ చాలా అధునాతనంగా మారాయి. కేవలం చిన్న ఫొటో ఆధారంగానే ముమ్మందు వారెలా ఉంటారో అనేదీ ఊహిస్తున్నాయి. అధునాతన ఇమేజ్ రికగ్నిషన్, మెషిన్ లెర్నింగ్ సాయంతో కృత్రిమ మేధ పాత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో, బహిరంగ డేటాబేస్‌లలో, నిఘా కెమెరాల్లో ఉన్న లక్షలాది ఫొటోలతో పోల్చి చూస్తుంది. ఒకేరకం ముఖ కవళికలు ఉన్నవాటిని గుర్తిస్తుంది. ఇలా పిల్లలు పెద్దగా అవుతున్నకొద్దీ వారిని గుర్తించటంలో అధికారులకు, కుటుంబాలకు సాయం చేస్తుంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం రోజూ 2,000 కన్నా ఎక్కువగా అమ్మాయిలు తప్పిపోతున్నారు. వీరి సంఖ్య 2028లో 66వేల నుంచి 2022లో 85వేలకు ఎగబాకింది. ఈ నేపథ్యంలో వీరి ఆచూకీని పట్టుకోవటానికి ఏఐ కొత్త ఆశా కిరణంగా కనిపిస్తోంది.



తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్‌ఫ్రమ్‌హోమ్

యాక్టింగ్

సంస్థ: డ్యువోలోప్ టెక్నాలజీస్ ప్రై. లి.
నైపుణ్యాలు: యాక్టింగ్ అడిక్షన్, యాక్టింగ్ టెక్నిక్, హిందీ మాట్లాడటం
స్టైపెండ్: రూ. 3,000-5,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 24
☛ internshala.com/i/80ed35

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్

సంస్థ: యానిలట ఏబీ (గోథెన్‌బర్గ్, స్వీడన్)
నైపుణ్యాలు: అడ్వినో, సీ++ ప్రోగ్రామింగ్, సీ ప్రోగ్రామింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, పీసీబీ డిజైన్, పైతాన్, రాస్‌బెర్రీ పై
స్టైపెండ్: రూ. 5,000
☛ internshala.com/i/f0b471

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్

సంస్థ: విద్యాశాల
నైపుణ్యాలు: బ్రిటిష్ ఇంగ్లిష్, డిజిటల్ అడ్వర్‌టైజింగ్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ. 3,000
☛ internshala.com/i/1ad2da

హైదరాబాద్‌లో

కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్

సంస్థ: అఫాక్ క్లినిక్స్
నైపుణ్యాలు: .నెట్, క్లయింట్ ఇంటరాక్షన్, క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, లీడ్ జనరేషన్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ. 9,000-12,000
☛ internshala.com/i/696f93

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: గరుడా 3డీ
నైపుణ్యాలు: డిజిటల్ అడ్వర్‌టైజింగ్, డిజిటల్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, గూగుల్ యాడ్‌వర్డ్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ. 12,000-15,000
☛ internshala.com/i/f5e72d

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 26

కెమికల్ ఇంజినీరింగ్

సంస్థ: డీప్‌థాట్ ఎడ్యుటెక్ వెంచర్స్ ప్రై. లి.
నైపుణ్యం: కెమికల్ ఇంజినీరింగ్
స్టైపెండ్: రూ. 15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 13
☛ internshala.com/i/75e524

ఆలోచన.. ఆచరణ ఉత్సాహంగా!

ఈ రోజుల్లో విద్యార్థిగా రాణించడం అంత సులభమైన పని కాదు. చురుగ్గా దూసుకుపోతూ లక్ష్యాలన్నీ అనుకున్న సమయంలో పూర్తి చేయాలి. కెరియర్ పరంగా ఇంట్లోనూ, కాలేజీలోనూ బోలెడన్ని అంచనాలు. వాటిని అందుకోవడానికి ఎంతో శ్రమించాలి. ఇన్ని ఒత్తిళ్ల మధ్య ఆలోచన, ఆచరణ ఉత్సాహంగా ఉండేది ఎలా?



రోజువారీ చదువుల్లో విద్యార్థులు చాలా అలసిపోతుంటారు. ఒకపక్క తరగతులూ, మరోపక్క ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్.. ఇవి కాక ఇంటర్వ్యూలు, అనేక ఒత్తిళ్లు.. ఇవన్నీ సమర్థంగా నిర్వహించాలంటే మనపై మనకు ఎంతోకొంత శ్రద్ధ ఉండాలి. సొంత ప్రయత్నం చేయాలి. అలా శ్రద్ధ వహించకుండా వీటిని ఎదుర్కోవడం, లక్ష్యాలను చేరుకోవడం కష్టం. నిరంతరం ఉల్లాసంగా ఉంటేనే లక్ష్యాలు తేలిగ్గా సాధించగలం. ఇందుకు కొన్నిటిపై దృష్టి పెట్టాలి.

తెర తగ్గిద్దాం

డిజిటల్ తెరలను చూడటం వీలైనంతమేరకు తగ్గించాలి. ఎక్కువగా స్క్రీన్ చూడటం చాలా విధాలుగా చేటు చేస్తుంది. దీనివల్ల తెలియకుండానే శారీరక శ్రమ తగ్గిపోతుంది. మానసికంగానూ చురుగ్గా ఉండలేం. సోషల్ స్కిల్స్‌పై దుష్ప్రభావం, చదువులో ఏకాగ్రత చూపలేకపోవడం వంటివీ సంభవిస్తాయి. విద్యార్థుల దైనందిన పని తీరును సైతం ఈ అలవాటు దెబ్బతీస్తుంది. ఆధునిక డివైజెస్ వాడకం మీద పరిమితులు తప్పనిసరి. ముఖ్యంగా నిద్రపోయే ముందు మరింతగా తగ్గించుకోవాలి. అప్పుడే మరుసటి రోజంతా ఉత్సాహంగా ఉండే వీలుంటుంది.

సరికొత్తగా

మెదడు కూడా కత్తి లాంటిదే. వాడకపోతే పదును కోల్పోతుంది. నిరంతరం వివిధ అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండటం, కొత్తగా ఏదో ఒకటి నేర్చుకునేందుకు ప్రయత్నించడం అవసరం. దీని ద్వారా మనసునూ, ఆలోచనలనూ చురుగ్గా ఉంచుకోవడానికి వీలవుతుంది. పాత, కొత్త పుస్తకాలు చదవడం, ఏదైనా టెక్నికల్ లేదా సాఫ్ట్ స్కిల్స్ ఆన్‌లైన్ కోర్సు నేర్చుకోవడం, నచ్చిన హాబీ సాధన చేయడం.. ఇలా ఎల్లప్పుడూ కొత్త పనులు చేయడం ఉల్లాసాన్ని కొనసాగేలా చేస్తుంది.

ఏకాగ్రత

ఏ పని చేసినా.. ఏకాగ్రత చాలా ముఖ్యం. ఇది దానంతట అది వచ్చేది అయినా.. సాధనతో మరింత పెంచుకోవచ్చు. ధ్యానం, ప్రాణాయామం వంటివి ముప్పిరిగొనే ఆలోచనలను తగ్గించి, ఒకే పని మీద ధ్యాస నిలిచేలా చేస్తాయి. ఇంతేకాదు.. ఇవి మన ఆలోచనలను నియంత్రణలో ఉంచుకోవడానికీ, పరీక్షలు, ఇతరత్రా ఒత్తిళ్ల తాలూకూ ఆందోళనల వంటి వాటిని తగ్గించుకోవడానికి ఉపయోగపడతాయి. భావోద్వేగాలూ, పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఇదో చక్కని సాధనం.

సవాళ్లు

బుర్రకు పదును పెట్టే లాంటి పజిల్స్, ఆటలు, కొత్త తరహా నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. మెదడును ఎప్పుడూ ఛాలెంజ్ చేయాలి. అది నిరంతరం శ్రమిస్తూ ఉంటేనే ఇంకా బాగా పనిచేయగలదు. దీని ద్వారా విశ్లేషణాత్మక ధోరణి, సమస్యలను పరిష్కరించే తత్వం, కొత్త విధానాల్లో ఆలోచించడం.. వంటివన్నీ తెలుస్తాయి. మనతో మనకి ఉండే ఆరోగ్యకరమైన పోటీ ఎన్నడూ మంచే చేస్తుంది. అదే సమయంలో ఆచరణ సాధ్యమైన వాటిని ప్రయత్నించడం మేలు.

కుతూహలం

త్వరగా నేర్చుకునేందుకు ఒక బలమైన ఆయుధం..కుతూహలం. ఏదైనా తెలుసుకోవాలనే ఉత్సాహం లేనివారు ఎక్కడ ఉన్నారో అక్కడే ఆగిపోతారు. తరచూ ప్రశ్నలు అడగడం, కొత్త ఆలోచనల గురించి తెలుసుకోవడం, విభిన్నమైన ప్రక్రియలు, సరళులను ఆహ్వానించడం ద్వారా ఆసక్తిని పెంచుకోవచ్చు. అప్పుడే చేసే పనిలో ఉత్సాహం ఉంటుంది. ఆచరణలో అది కనిపిస్తుంది.

కలివిడిగా

ఇతరులతో కలిసి పనిచేయడం మన మనసును ఉల్లాసంగా ఉంచడంలో సహాయపడుతుంది. సోషల్ ఐసొలేషన్‌ను దూరం చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. కాలేజీల్లో ఉండే వివిధ క్లబ్స్‌లో చేరడం, గ్రూప్ యాక్టివిటీల్లో పాల్గొనడం, ఆర్గనైజేషన్లలో వాలంటీర్లుగా చేరడం.. ఇటువంటి వాటి ద్వారా నలుగురిలోనూ కలవడం నేర్చుకోవచ్చు.

ఆహారం

ఆరోగ్యకరమైన ఆహారం ఉండాల్సిన విధంగా శరీర బరువు ఉండేందుకు దోహదం చేస్తుంది. ఎముకలు, కండరాలను బలంగా మారుస్తుంది. మానసిక ఎదుగుదలకు దోహదం చేస్తుంది. ఏకాగ్రతను పెంచి మంచి జ్ఞాపకశక్తి ఉండేలా చూస్తుంది. ఆరోగ్యకర ఆహారం విద్యార్థులు విద్యా సంవత్సరమంతా చక్కగా విద్యాభ్యాసం కొనసాగించేలా సాయపడుతుంది. అందుకే తాజా కూరగాయలు, పండ్లు, ఎండు ఫలాలు, చిరుధాన్యాలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. అధిక మోతాదులో తీపి ఉన్న పదార్థాలకూ, ప్రాసెస్డ్ ఫుడ్‌కీ వీలైనంత దూరంగా ఉండాలి.

వ్యాయామం

కార్డియో రెస్పిరేటరీ యాక్టివిటీ విద్యార్థుల ఎదుగుదలలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. బలమైన ఎముకలు, కండరాలను కలిగి ఉండేలా, బరువు మీద అదుపు ఉండేలా, ఒత్తిడి నుంచి దూరమయ్యేలా చేస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం మెదడుకు రక్త సరఫరాను పెంచుతుంది. తద్వారా జ్ఞాన సంబంధ (కాగ్నిటివ్) పనితీరు మెరుగుపడుతుంది. ఇందుకు నచ్చిన కార్యకలాపాల్లో దేన్నయినా ఎంచుకోవచ్చు. ఎక్సర్‌సైజ్, డాన్సింగ్, రన్నింగ్, జాగింగ్ యోగా.. లాంటివన్నీ చేయొచ్చు.

తగిన నిద్ర

నిద్రలేమి ప్రవర్తనాలోపాలకు గురిచేయగలదు. ఇది ఇతరులతో మనకు లేనిపోని ఇబ్బందులు తెచ్చిపెట్టగలదు. అందుకే రోజూ కనీసం 7, 8 గంటల నిద్రపోవాలి. అప్పుడే మెదడుకు పూర్తిగా విశ్రాంతి దొరికి.. చదివింది అర్థం చేసుకుని కొత్త విషయాలు గుర్తుంచుకునేందుకు వీలుంటుంది. ఏకాగ్రత కుదరడానికీ, నేర్చుకున్నవి ఎక్కువకాలం గుర్తుండటానికీ సరైన నిద్ర చాలా అవసరం. నిద్రలో మెదడు అభివృద్ధికి కావాల్సిన హార్మోన్లు విడుదల అవుతాయి.

ప్రశాంతత

ఒత్తిడి మెదడు పనితీరును దెబ్బతీయగలదు. వివిధ రకాలైన స్ట్రెస్ మేనేజ్‌మెంట్ చిట్కాలను అనుసరించి దీన్ని అధిగమించవచ్చు. రిలాక్సేషన్ ఎక్సర్‌సైజులు, జర్నలింగ్ (మనసులోని భావాలను స్వేచ్ఛగా రాతలో వ్యక్తీకరించడం) వంటివి ఇందుకు ఉపకరిస్తాయి. ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తేనే ఆలోచనలోనూ, ఆచరణలోనూ ఉత్సాహంగా ఉండగలం.

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

బామర్ లారీ లిమిటెడ్‌లో జూనియర్ ఆఫీసర్లు

కోల్‌కతాలోని ప్రభుత్వ రంగ సంస్థ- బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన 4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- జూనియర్ ఆఫీసర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్)- 02
- జూనియర్ ఆఫీసర్ (ఆపరేషన్స్)- 02

అర్హత: ఏదైనా డిగ్రీ. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.
పని **ప్రదేశాలు:** బెంగళూరు, కోల్‌కతా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04-10-2024.
వెబ్‌సైట్: www.balmerlawrie.com/

మారిటైమ్ వర్సిటీలో సిబ్బంది

విశాఖపట్నంలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ.. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్/ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
1. డిప్యూటీ రిజిస్ట్రార్
2. ఫ్యాకల్టీ
3. సీనియర్ టెక్నీషియన్
4. రిసెర్చ్ అసిస్టెంట్

విభాగాలు: ఓషన్, డ్రెడ్జింగ్, మెరైన్, నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్ తదితరాలు. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం. **వయసు:** ఫ్యాకల్టీ పోస్టులకు 65 ఏళ్లు; డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులకు 64 ఏళ్లు; మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీ: 09-10-2024 (రిసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు మాత్రమే ఇంటర్వ్యూ) **వేదిక:** ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ, విశాఖపట్నం క్యాంపస్, వంగలి గ్రామం, టెక్కలిపాలెం, సబ్బవరం, విశాఖపట్నం.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15-10-2024.
వెబ్‌సైట్: www.imu.edu.in/imunew/recruitment

వాక్-ఇన్స్

మహేశ్వరం వైద్య కళాశాలలో టీచింగ్ పోస్టులు

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఒప్పంద ప్రాతిపదికన 96 టీచింగ్ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
- ప్రొఫెసర్- 04
- అసోసియేట్ ప్రొఫెసర్- 08
- అసిస్టెంట్ ప్రొఫెసర్- 39
- సీనియర్ రెసిడెంట్- 45

విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, సైకియాట్రిక్, ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ తదితరాలు.
అర్హత: ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ, ఎండీఎస్, ఎంఎస్సీ, మెడికల్ పీజీతో పాటు టీచింగ్ అనుభవం. **వేతనం:** ప్రొఫెసర్ పోస్టుకు నెలకు రూ.1,90,000; అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,50,000; అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,25,000; సీనియర్ రెసిడెంట్‌కు రూ.92,575. **ఇంటర్వ్యూ తేదీ:** 04-10-2024.
వేదిక: జీఎంసీ, మహేశ్వరం ఏరియా హాస్పిటల్, వనస్థలిపురం, రెండో అంతస్తు. **వెబ్‌సైట్:** https://gmcmaheshwaram.org/

సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ల్యాబ్ టెక్నీషియన్లు

సికింద్రాబాద్‌లోని గాంధీ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన 12 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
- సైంటిస్ట్ సి (మెడికల్/ నాన్ మెడికల్) - 03
- డీఈఓ (డేటా ఎంట్రీ ఆపరేటర్)- 02
- రిసెర్చ్ అసోసియేట్- 01
- ప్రాజెక్ట్ అసిస్టెంట్- 02
- రిసెర్చ్ అసిస్టెంట్- 02
- ల్యాబ్ టెక్నీషియన్- 01
- ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్ III- 01



అర్హత: సంబంధిత విభాగాల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
వేతనం: సైంటిస్ట్ సి పోస్టుకు నెలకు రూ.67,000; డీఈఓకు రూ.20,000; రిసెర్చ్ అసోసియేట్‌కు రూ.56,840; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.32,350-33,700; రిసెర్చ్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.28,000; ల్యాబ్ టెక్నీషియన్‌కు రూ.20,000.
ఎంపిక: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా.
దరఖాస్తు గడువు: 05-10-2024.
ఇంటర్వ్యూ తేదీ: 08-10-2024.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా 'గాంధీ మెడికల్ కాలేజ్, ప్రిన్సిపల్, జీఎంసీ, హైదరాబాద్' చిరునామాకు పంపించాలి.
వెబ్‌సైట్: https://gmcsecunderabad.org/

విదేశీ వైద్యవిద్య ఎందుకంటే..

మనదేశంలో వైద్యవిద్య అభ్యసించాలని ఆశపడే విద్యార్థులకు కొదవ లేదు. అయితే పరిమితమైన సీట్లు, విపరీతమైన పోటీ, అధిక ఫీజు ప్రతిబంధకం. ప్రత్యామ్నాయంగా చాలామంది విదేశాల్లో మెడిసిన్ చదవాలని అనుకుంటూ ఉంటారు. కానీ తిరిగి వచ్చి ప్రాక్టీస్ చేయాలంటే ఉత్తీర్ణులు కావాల్సిన పరీక్షల విషయం ఆలోచించి.. నిర్ణయం తీసుకోవడంలో కాస్త వెనకడుగు వేస్తుంటారు. అయితే విదేశాల్లో చదివేటప్పుడు కలిగే ప్రయోజనాలు కొన్ని ఉన్నాయంటున్నారు నిపుణులు. అవేంటో పరిశీలిస్తే..



ఉన్నత ప్రమాణాలు: కరీబియన్, ఐరోపా, అమెరికా వంటి వివిధ దేశాల్లో అడ్వాన్స్‌డ్ కరిక్యులమ్, టెక్నాలజీ, ఉన్నత ప్రమాణాలతో వైద్య విద్య అందుతుంది. అంతర్జాతీయంగా అనుమతించిన మెడికల్ ఎడ్యుకేషన్ మోడల్స్‌ను వినియోగిస్తున్నారు. ప్రాక్టికల్ లెర్నింగ్, రిసెర్చ్ అవకాశాలు, క్లినికల్ శిక్షణ.. ఇలా మెరుగ్గా నేర్చుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్నేషనల్ మెడికల్ స్కూల్స్ ఆధునిక ల్యాబ్ సౌకర్యాలతో, ఆసుపత్రులతో.. ఇతర చోట్లకు క్లినికల్ రొటేషన్స్‌తో విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించేలా నేర్పిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పోటీని తట్టుకునేలా, నూతన విధానాలను వినియోగించేలా ఈ విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

- **తక్కువ పోటీ:** వైద్యవిద్య చదవాలనుకునే విద్యార్థులు మన వద్ద నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) రాయాలి. అయితే ప్రభుత్వ కళాశాలల్లో సీటు దక్కించుకోవడం అంత సులభమైన పని కాదు, విపరీతమైన పోటీ! ఏటా లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనా, కోరిన చోట సీటు దక్కించుకోగలిగేది కొందరే. దీనికి భిన్నంగా ఇతర దేశాల్లో ఉన్న మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు కాస్త సులభ ప్రక్రియలతో కూడి ఉంటాయి. అక్కడా పోటీ, ప్రవేశపరీక్షలు ఉన్నప్పటికీ.. సీటు దక్కడం ఇక్కడంత కష్టం కాదు. ఇక్కడ కొద్దిపాటి మార్కుల తేడాతో నచ్చిన సీటు మిస్సయిన విద్యార్థులు.. విదేశాల్లో ప్రయత్నించవచ్చు.
- **అంతర్జాతీయ దృక్పథం:** ఇతర దేశాల్లో మెడిసిన్ చదవడం కేవలం అకడమిక్‌గానే కాదు.. ఇతర విషయాల్లోనూ ఉపయోగపడుతుంది. సరికొత్త దేశం, భాష, సంస్కృతుల గురించి తెలుసుకునేందుకు ఇదో మంచి అవకాశం. విద్యార్థులు తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి సొంతంగా నేర్చుకోవడం, జీవించడం తెలుసుకునే మార్గం. ఇతర దేశాల్లో వైద్య విధానాలు, సేవలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఇది గొప్ప మార్గం. వివిధ దేశాల విద్యార్థులతో కలిసి చదువుకోవడం వారికి మంచి అవగాహన కలిగేందుకు దోహదపడుతుంది.
- **మెరుగైన అవకాశాలు:** గ్లోబల్ మెడికల్ కెరియర్ అందుకోవాలంటే విదేశాల్లో చదవడాన్ని ఒక షార్ట్‌కట్‌గా చెప్పవచ్చు. చాలా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూషన్లు యూఎస్, యూకే, కెనడా, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో క్లినికల్ రొటేషన్లు చేయిస్తూ ఉంటాయి. దీని వల్ల విభిన్నమైన వైద్య విధానాల గురించి తెలుసుకునే వీలుంటుంది. ఇతర దేశాల్లో లైసెన్సింగ్ పరీక్షల కోసం శిక్షణ ఇచ్చే మెడికల్ స్కూల్స్‌ను ఎంచుకోవడం మరో తెలివైన మార్గం. వీటిలో ఉత్తీర్ణత సాధించడం రెసిడెన్సీ ప్రోగ్రామ్స్ వంటి వాటిలోకి ప్రవేశించేందుకు దారి సుగమం చేస్తుంది.
- **స్కాలర్‌షిప్‌లు:** చాలామంది విద్యార్థులు, తల్లిదండ్రులు అనుకునే విధంగా విదేశాల్లో మెడిసిన్ చదవడం భారత్‌లో కంటే మరీ ఖరీదైనదేమీ కాదు. మనదేశంలోని ప్రైవేటు మెడికల్ స్కూళ్లతో పోలిస్తే తక్కువ ధరకు విద్యాభ్యాసం పూర్తిచేసే అవకాశం కల్పిస్తున్నాయి. మరికొన్ని చోట్ల స్కాలర్‌షిప్స్, సులభ వాయిదాలు వంటి అవకాశాలున్నాయి.

వైద్యవిద్య అభ్యసించడం ఎందరికో కల. దీనికి అంతర్జాతీయ వేదికలను పరిశీలించడం మెరుగైన వ్యూహం!

ఏ కోర్సు మెరుగు?

మా అమ్మాయి ఇంటర్ (బైపీసీ) చదువుతోంది. వెంటనే ఉద్యోగం సంపాదించాలంటే నర్సింగ్/ బీ ఫార్మసీ/ అగ్రికల్చర్.. ఈ మూడింట్లో ఏ డిగ్రీ చదివితే మంచిది? – సంధ్య



■ డిగ్రీలో ఏ సబ్జెక్ట్ చదివించాలనే నిర్ణయాన్ని తీసుకునే ముందు, మీ అమ్మాయి ఆసక్తి, అభిరుచి, ఆశయాలను కూడా దృష్టిలో పెట్టుకోండి. ఉద్యోగానికి చదువు అవసరమే కానీ చదువు ఉద్యోగం కోసం మాత్రమే కాదు. చాలా సందర్భాల్లో, కొన్ని డిగ్రీలు త్వరగా ఉపాధినివ్వగలవు కానీ, చేసే పనిలో ఆసక్తిని కల్పించలేకపోవచ్చు. వేతనాలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆసక్తి లేని ఉద్యోగం చేయడం చాలా కష్టం. ఇప్పుడు ఎంచుకొనే డిగ్రీ మీ అమ్మాయి నలభై సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అందుకే ఉద్యోగావకాశాలతో పాటు విధులకు కావాల్సిన నైపుణ్యాలు, పని తీరు, పని వేళలు, ఒత్తిళ్లు, పదోన్నతి అవకాశాలు, వేతనాలు లాంటివి పరిగణనలోకి తీసుకోండి.

నర్సింగ్, బీఫార్మసీ, అగ్రికల్చర్‌లలో దేని ప్రత్యేకత దానిది. ఈ మూడు రంగాల్లోనూ డిగ్రీ తరువాత పీజీ, పీహెచ్‌డీ చేసి, బోధన/ పరిశోధన రంగంలో ప్రవేశించవచ్చు. ఫార్మసీ, నర్సింగ్ అనేవి వైద్య, ఆరోగ్యానికి సంబంధించినవి. అగ్రికల్చర్ ఆహారానికి సంబంధించినది. సమాజానికి ఈ మూడింటి అవసరం ఎప్పుడూ ఉంటుంది. ప్రతి డిగ్రీలోనూ కొన్ని అనుకూలతలూ, మరికొన్ని ప్రతికూలతలూ ఉంటాయి. ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ లక్షణాలూ విభిన్నం. మీ అమ్మాయి స్వభావం, తెలివితేటలు ఎలాంటి డిగ్రీ చదవడానికి ఉపయోగకరమో అవగాహనకు రండి.

- బీఎస్సీ నర్సింగ్ చదివినవారు స్టాఫ్ నర్స్, నర్సింగ్ మేనేజర్, నర్స్ ఎడ్యుకేటర్, క్లినికల్ రిసెర్చ్ నర్స్, పబ్లిక్ హెల్త్ నర్స్, హోం హెల్త్‌కేర్ నర్స్, ఆక్యుపేషనల్ హెల్త్ నర్స్ లాంటి హోదాల్లో చేరవచ్చు.
- బీ ఫార్మసీ చదివినవారు ఫార్మసిస్ట్, క్లినికల్ రిసెర్చ్ అసోసియేట్, మెడికల్ రిప్రజెంటేటివ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్, ఫార్మకో విజిలెన్స్ ఆఫీసర్ లాంటి కొలువులు చేయొచ్చు.
- బీఎస్సీ అగ్రికల్చర్ చదివిన వారు అగ్రికల్చర్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, అగ్రోనమిస్ట్, ప్లాంట్ బ్రీడర్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, ఫార్మ్ మేనేజర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఎన్విరాన్‌మెంటల్ కన్జర్వేషన్ స్పెషలిస్ట్ లాంటి ఉద్యోగాల్లో చేరొచ్చు.

మీ అమ్మాయి స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆశయాలు ఏంటి? ప్రభుత్వ- ప్రైవేటు ఉద్యోగాల్లో దేనిపై ఆసక్తి? విదేశాలకు వెళ్లే ఉద్దేశం ఉందా? మనదేశంలో గ్రామీణ- పట్టణ ప్రాంతాల్లో ఎక్కడ పనిచేయాలనుకుంటోంది? షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వహించటంపై అభ్యంతరం ఉందా? ఆరోగ్య పరిరక్షణ.. వ్యాపార రంగాల్లో దేనిపై మొగ్గు చూపుతోంది? ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంజినీర్లూ.. మీకోసమే!



దరఖాస్తుకు చివరి తేదీ: 21.10.2024
వెబ్‌సైట్: https://career.hurl.net.in

ఝార్ఖండ్ రాష్ట్రం సింద్రీలోని హిందుస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్ (హెచ్‌యూఆర్‌ఎల్) 212 గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ, డిప్లొమా ఇంజినీర్ ట్రెయినీ పోస్టులను ప్రకటించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ లిమిటెడ్, కోల్ ఇండియా లిమిటెడ్‌ల జాయింట్ వెంచరే ఈ హెచ్‌యూఆర్‌ఎల్. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయబోతున్నారు.

1. గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ–67: ఇంజినీరింగ్ డిగ్రీ లేదా కెమికల్ ఇంజినీరింగ్/ కెమికల్ టెక్నాలజీ/ కెమికల్ ప్రాసెస్ టెక్నాలజీ/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఇండస్ట్రియల్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఏఎంఐఈ 60 శాతం మార్కులతో పూర్తిచేయాలి. 30 సంవత్సరాలు మించకూడదు.

2. డిప్లొమా ఇంజినీర్ ట్రెయినీ–145: ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇండస్ట్రియల్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ప్రాసెస్ కంట్రోల్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్/ అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజినీరింగ్‌లో మూడేళ్ల ఫుల్‌టైమ్ డిప్లొమా 50 శాతం మార్కులతో పూర్తిచేయాలి. వయసు 27 సంవత్సరాలు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: జీఈటీలకు రూ.750, డీఈటీలకు రూ.500.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ, వైద్యపరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

- ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాల ఆధారంగా అభ్యర్థులను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)కు ఎంపిక చేస్తారు. ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీలకు 100 ప్రశ్నలు సబ్జెక్టు సంబంధిత అంశాల నుంచి ఇస్తారు.
- డిప్లొమా ఇంజినీర్ ట్రెయినీలకు సబ్జెక్టు సంబంధిత అంశాల నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు.
- జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ జనరల్ నాలెడ్జ్/ అవేర్‌నెస్ నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు.
- రుణాత్మక మార్కులు లేవు.
- సీబీటీ తేదీ, సమయం, వేదికలను అడ్మిట్ కార్డులో తెలియజేస్తారు. దీన్ని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఈ సమాచారాన్ని అభ్యర్థుల ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలియజేస్తారు.
- సీబీటీని దిల్లీ, లక్నో, పట్నా, రాంచీల్లో నిర్వహిస్తారు.
- సీబీటీలో 50 శాతం కనీసార్హత మార్కులు సాధించిన వారిని ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేస్తారు

సన్నద్ధత

సబ్జెక్టు సంబంధిత అంశాలకు వంద మార్కులు కేటాయించారు. కాబట్టి డిగ్రీ, డిప్లొమాలో చదివిన ముఖ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలి. వాటిపైన పట్టుసాధించాలి.
- జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అంశాలకు ఎస్ఎస్‌సీ, బ్యాంకు, రైల్వే పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం వల్ల ఫలితం ఉంటుంది.
- రుణాత్మక మార్కులు లేవు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అన్ని ప్రశ్నలకూ సమాధానం రాయడానికి ప్రయత్నించాలి.

గమనించాల్సినవి:

- 30.09.2024 నాటికి తగిన విద్యార్హతలు, వయసు ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేయాలి.
- ఎంపికైన వారికి ఏడాది శిక్షణ ఉంటుంది.
- శిక్షణ సమయంలో గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీలకు రూ.40 వేలు, డిప్లొమా ఇంజినీర్ ట్రెయినీలకు రూ.23 వేలు స్టైపెండ్‌గా చెల్లిస్తారు.
- శిక్షణను విజయవంతంగా ముగించిన జీఈటీలను ఇంజినీర్/ ఆఫీసర్‌గా, డీఈటీలను జూనియర్ ఇంజినీర్ అసిస్టెంట్‌గా నియమిస్తారు. జీఈటీల వేతన శ్రేణి రూ.40,000 నుంచి, రూ.1,40,000 వరకూ ఉంటుంది. డీఈటీల వేతన శ్రేణి రూ.23,000 నుంచి రూ.76,200 వరకూ ఉంటుంది.
- మూలవేతనంతోపాటు.. ఇండస్ట్రియల్ డీఏ, హౌస్ రెంట్ అలవెన్స్, మెడికల్, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, నేషనల్ పెన్షన్ స్కీమ్‌లాంటి ఇతర సదుపాయాలుంటాయి.

గణిత పరిక్రియలు (Mathematical Operations)

గమనిక: గణిత సమాసాన్ని సాధిస్తున్నపుడు BODMAS నియమం (బ్రాకెట్లు, ఆఫ్, భాగహారం, గుణకారం, సంకలనం, వ్యవకలనం) ప్రకారం చేయాలి.

సూచన (ప్ర. 1 – 5): కిందివాటిలో సరైన సమాధానాన్ని గుర్తించండి.

1. + అంటే ÷, ÷ అంటే –, – అంటే ×, × అంటే + అయితే,

$12 + 6 \div 3 - 2 \times 8 = ...$

ఎ) 2 బి) 8 సి) 4 డి) –2

సాధన: సరైన సంకేతాలను ఉపయోగించడం ద్వారా మనం దీన్ని సాధించవచ్చు.

$12 \div 6 - 3 \times 2 + 8$

$= 2 - 3 \times 2 + 8$

$= 2 - 6 + 8$

$= 10 - 6 = 4$

సమాధానం: సి

2. + అంటే –, – అంటే ×, ÷ అంటే +, × అంటే ÷ అయితే

$15 - 3 + 10 \times 5 \div 5 = ...$

ఎ) 22 బి) 52 సి) 5 డి) 48

సాధన: $15 \times 3 - 10 \div 5 + 5$

$= 15 \times 3 - 2 + 5$

$= 45 - 2 + 5$

$= 50 - 2 = 48$

సమాధానం: డి

3. A అంటే +, B అంటే –, C అంటే × అయితే (10C4) A (4C4) B6 విలువ ఎంత?

ఎ) 66 బి) 50 సి) 46 డి) 56

సాధన: 10C4A4C4B6

$= 10 \times 4 + 4 \times 4 - 6$

$= 40 + 16 - 6$

$= 56 - 6 = 50$

సమాధానం: బి

4. – అంటే 'భాగహారం', + అంటే 'గుణకారం', ÷ అంటే 'వ్యవకలనం', × అంటే 'సంకలనం' అయితే కింది సమీకరణాలలో ఏది సరైంది?

ఎ) $6 + 20 - 12 \div 7 - 1 = 38$

బి) $6 - 20 \div 12 \times 7 + 1 = 57$

సి) $6 \div 20 - 12 \div 7 \times 1 = 62$

డి) $6 \div 20 \times 12 + 7 - 1 = 70$

సాధన: ఆప్షన్ డి లో సరైన గణిత సంకేతాలను (సింబల్స్) ఉపయోగించి ప్రవచనాన్ని పొందొచ్చు.

$6 - 20 + 12 \times 7 \div 1$

$= 6 - 20 + 12 \times 7$

$= 6 - 20 + 84$

$= 90 - 20 = 70$

సమాధానం: డి

5. ÷ అంటే =, × అంటే <, + అంటే >, – అంటే ×, > అంటే ÷, < అంటే +, = అంటే – అయితే, కింది వాటిలో సరైన ప్రవచనాన్ని గుర్తించండి.

ఎ) $1 - 3 > 2 + 1 - 5 = 3 - 1 < 2$

బి) $1 - 3 > 2 + 1 \times 5 = 3 \times 1 > 2$

సి) $1 - 3 > 2 + 1 \times 5 + 3 - 1 > 2$

డి) $1 \times 3 > 2 + 1 \times 5 \times 3 - 1 > 2$

సాధన: ఆప్షన్ డి ని ఉపయోగించి సరైన సమాధానాన్ని పొందొచ్చు.

$1 \times 3 \div 2 > 1 < 5 > 3 \times 1 \div 2$

$= \frac{3}{2} > 1 > \frac{3}{2}$ ఇది సత్యం

సమాధానం: డి

సూచన (ప్ర. 6 – 7): కింది ప్రశ్నల్లో కొన్ని సంకేతాలను కింద చూపిన విధంగా అక్షరాలతో సూచించారు.

+	–	×	÷	=	>	<
B	G	E	C	D	A	F

ప్రతి సందర్భంలో సరైన సమాసాన్ని గుర్తించండి.

6. ఎ) 18A3E6B8G4B12 బి) 18F3B6E8G4E12

సి) 18C3D6B8C4G12 డి) 18C3G6B8B4D12

సాధన: 18C3G6B8B4D12

$18 \div 3 - 6 + 8 + 4 = 12$

$6 - 6 + 8 + 4 = 12$

$12 = 12$ ఇది సత్యం

సమాధానం: డి

7. ఎ) 15C5F8C4B6C3 బి)15B5G8B4G6F3

సి) 15C15B8F4B6C3 డి) 15A5ESC4B6E3

సాధన: 15C5F8C4B6C3

$= 15 \div 5 < 8 \div 4 + 6 \div 3$

$= 3 < 2 + 2$

$= 3 < 4$ ఇది సత్యం

సమాధానం: ఎ



భిన్నమైనదాన్ని గుర్తించి.. నిజ సంకేతంతో భర్తీ చేసి!

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

సూచన (ప్ర. 8 – 10): కింది ప్రశ్నలో ఏ సంకేతాలను పరస్పరం మార్చడం ద్వారా ఇచ్చిన సమీకరణాన్ని సరైందిగా మార్చొచ్చు.

8. $6 \times 4 + 2 = 16$

ఎ) +, ÷, 2, 3 బి) +, ÷, 2, 4

సి) +, ×, 4, 6 డి) ఏదీకాదు

సాధన: $6 \times 4 + 2 = 16$

+, ×, 4, 6 లను పై సమీకరణంలో ప్రతిక్షేపించగా,

$4 + 6 \times 2 = 16$

$4 + 12 = 16$

$16 = 16$

సమాధానం: సి

9. $(6 \div 3) \times 2 = 0$

ఎ) ÷, ×, 2, 3 బి) ×, –, 2, 3

సి) ×, +, 2, 3 డి) ÷, +, 2, 3

సాధన: $(6 \div 3) \times 2$

×, –, 2, 3లను పై సమీకరణంలో ప్రతిక్షేపిస్తే సరైన సమాధానాన్ని పొందొచ్చు.

$(6 \div 2) - 3$

$3 - 3 = 0$

సమాధానం: బి

10. $4 \times 6 - 2 = 14$

ఎ) ×, ÷, 2, 4 బి) –, ÷, 2, 6

సి) –, +, 2, 6 డి) ×, +, 4, 6

సాధన: $4 \times 6 - 2 = 14$

–, +, 2, 6 లను పై సమీకరణంతో ప్రతిక్షేపిస్తే సమాధానం పొందొచ్చు.

$4 \times 2 + 6 = 14$

$8 + 6 = 14$

$14 = 14$

సమాధానం: సి

సూచన (ప్ర. 11 – 12): కింది ప్రశ్నల్లో @, ©, $, %, # లను సంకేతాల రూపంలో వివరించారు. వాటిని కింది అర్థాలతో ఉపయోగించారు.

A # B అంటే A అనేది B కంటే ఎక్కువ కాదు అని,

A @ B అంటే A అనేది B కంటే తక్కువ కాదు లేదా B కి సమానం కాదు అని,

A $ B అంటే A అనేది B కంటే తక్కువ కాదు అని,

A % B అంటే A అనేది B కంటే ఎక్కువ లేదా Bకి సమానం కాదు అని

A © B అంటే A అనేది B కంటే తక్కువ కాదు లేదా ఎక్కువ కాదు అని అర్థం.

11. ప్రవచనాలు: H%J, J©C, N@R

పర్యవసానాలు: I. R%J, II. H@J, III. N@H

ఎ) II సత్యం బి) III సత్యం

సి) I సత్యం డి) I, III సత్యం

12. ప్రవచనాలు: D©K, K#F, F@P

పర్యవసానాలు: I. P@D, II. K#P. III. F$D

ఎ) II సత్యం బి) I, II సత్యం

సి) III సత్యం డి) ఏదీకాదు

సాధన: $A\$B \Rightarrow A \not< B \Rightarrow A \geq B$

$A\#B \Rightarrow A \not> B \Rightarrow A \leq B$

$A@B \Rightarrow A \not< B, A \neq B \Rightarrow A > B$

$A©B \Rightarrow A \not< B, A \not> B \Rightarrow A = B$

$A\%B \Rightarrow A \not> B, A \neq B \Rightarrow A < B$

11. ఇచ్చిన ప్రవచనాలు H%J, J©N, N@R

H<J, J=N, N>R

I. R, J మధ్య సంబంధం

$R < N, N = J \Rightarrow R < N = J \Rightarrow R < J$

∴ R % J సత్యం

II. H, J మధ్య సంబంధం

$H < J \Rightarrow H \% J$ అసత్యం

III. N, H మధ్య సంబంధం

$N = J, J > H \Rightarrow N = J > H \Rightarrow N > H$

∴ N @ H సత్యం

సమాధానం: డి

12. D©K, K#F, F@P

$D = K, K \leq F, F > P$

I. P, D మధ్య సంబంధం

$P < F, F \geq R, K = D$

$P < F, F \geq D$

$P < F \geq D$ అసత్యం

II. K, P మధ్య సంబంధం

$K \leq F, F > P$

$K \leq F > P$ అసత్యం

III. F, D మధ్య సంబంధం

$F \geq K, K = D$

$F \geq K = D$

$F \geq D$

F $ D సత్యం

సమాధానం: సి



రచయిత
బూసర గణేష్, విషయ నిపుణులు

428 Word of the Day

Bellicosity

Telugu meaning: దూకుడు, జగడాలమారి

English meaning: The word 'bellicosity' is a noun that describes a tendency to be aggressive or ready to fight.

Synonyms: Aggressiveness, Hostility

Antonyms: Calmness, Amiability

Usage: 1. His bellicosity was evident during the heated debate, where he constantly challenged the opposition.

2. The general's bellicosity worried diplomats who were trying to negotiate a peaceful resolution.

Latest Updates

M.Sc. and Ph.D. Courses

Sri Konda Laxman Telangana State Horticultural University, Mulugu, Siddipet invites applications for admission into M.Sc. and Ph.D. Courses for the academic year 2024-25. The application fee is Rs.1500. The last date for submission of filled in application is 14 October 2024.

Faculty Posts


All India Institute of Speech and Hearing (AIISH), Mysore invites applications for filling up the faculty posts on direct basis. The total number of posts is 22. The application fee is Rs.600. The last date for offline application is 15 October 2024.

Did You Apply..?

Today (October 02) is the last date for the following Posts/ Scholarships

- Content Writing posts in Spring S Technologies. **Skills:** Creative Writing, Digital Marketing, English Speaking - Writing, Research and Analytics, Search Engine Optimization etc.
- Premier Acquisition Manager posts in Kotak Mahindra Bank. **Qualification:** Bachelor's Degree.

For more information and other notifications - scan QR code



ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతదేశంలో భాగంగా.. తూర్పు, ఆగ్నేయ దిశలో ఉష్ణమండలంలో ఉంది. 1953లో నాటి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. తర్వాతి కాలంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం-1956 ప్రకారం హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాలను కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారు. మళ్లీ 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలు ప్రత్యేక రాష్ట్రాలుగా విడిపోయాయి.

ఈ వీడియోలో ఏపీ జాగ్రఫీలో ఏయే చాప్టర్స్ ఉంటాయి?, మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన విధానం, ఆంధ్రా-తెలంగాణలను కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు, దానికోసం నియమించిన వివిధ కమిటీలు, 2014 తర్వాత అక్షాంశ-రేఖాంశాల పరంగా ఆంధ్రప్రదేశ్ ఉనికి ఎలా ఉంది? అనే విషయాలను వివరించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మరిన్ని వీడియోల కోసం ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

కరెంట్ అఫైర్స్



కేంద్ర ప్రభుత్వం 2024, సెప్టెంబరు 30న భారతీయ నటుడు మిథున్ చక్రవర్తికి ప్రతిష్ఠాత్మక 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారాన్ని ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆయన 370కుపైగా చిత్రాల్లో నటించారు. ఆయన 1976లో 'మృగయ'తో నటుడిగా పరిచయమయ్యారు. 2024 ఆరంభంలో మిథున్‌కు 'పద్మభూషణ్' పురస్కారం దక్కింది.



ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో ఉమేశ్ చౌదరి, ప్రమోద్, ముకేశ్‌తో కూడిన భారత త్రయం స్వర్ణం నెగ్గింది. 2024, సెప్టెంబరు 29న పెరూలో జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ 1726 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రొమేనియా (1716), ఇటలీ (1707) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

- మరోవైపు 10మీ. ఎయిర్ పిస్టల్‌లో జూనియర్ మహిళల జట్టు కూడా స్వర్ణం సొంతం చేసుకుంది. కనిష్క, లక్షిత, అంజలి జట్టులో ఉన్నారు. మొత్తం 1708 స్కోరుతో భారత్ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అజర్‌బైజాన్ (1707) రెండో, ఉక్రెయిన్ (1704) మూడో స్థానాల్లో నిలిచాయి.



అంతర్జాతీయ క్రికెట్లో 27 వేల పరుగుల మైలురాయిని చేరుకున్న నాలుగో ఆటగాడిగా విరాట్ కోహ్లి ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్లో అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ (34,357), సంగక్కర (28,016), పాంటింగ్ (27,483) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Bank Exams English

Sentence Rearrangement

Directions (Qs. 1 - 5): *Rearrange the given six sentences/ group of sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence so as to form a meaningful paragraph and then answer the given question:*

A. Regular exercise boosts mental health by releasing endorphins that help improve mood.

B. It also strengthens the immune system, making the body more resistant to common illnesses.

C. Additionally, it helps in maintaining a healthy weight and reduces the risk of chronic diseases like heart disease and diabetes.

D. Exercise plays a vital role in overall well-being and should be part of everyone's daily routine.

E. Engaging in physical activities like running, swimming, or cycling contributes to physical fitness.

F. In the long run, regular exercise helps improve sleep quality and increases energy levels throughout the day.

1. Which of the following should be the **FIRST** sentence after the rearrangement?

A) A B) D C) F D) E E) B

2. Which of the following should be the **FOURTH** sentence after the rearrangement?

A) F B) C C) E D) A E) B

3. Which of the following should be the **THIRD** sentence after the rearrangement?

A) A B) E C) C D) F E) D

4. Which of the following should be the **FIFTH** sentence after the rearrangement?

A) B B) C C) A D) E E) F

5. Which of the following should be the **SIXTH (Last)** sentence after the rearrangement?

A) A B) F C) C D) D E) B

Directions (Qs. 6 - 10): Rearrange the following sentences (A), (B), (C), (D), (E) and (F) to make a meaningful paragraph and then answer the questions which follow.

A. When individuals work together, they combine their skills and knowledge to achieve common goals, which allows for more diverse ideas and solutions to emerge, ultimately making the process more efficient and effective.

B. Teamwork helps foster creativity by encouraging brainstorming and collaboration, allowing each member to contribute unique perspectives, which can lead to innovative approaches to challenges.

C. Additionally, teamwork improves communication and problem-solving skills, as members must constantly exchange information, share feedback, and collaboratively resolve any obstacles they encounter.

D. It promotes a sense of unity and builds trust among team members, helping them rely on each other and develop a stronger bond, which in turn improves team morale and cooperation.

E. Achieving success in a team requires cooperation and active participation from all members, because every individual has a role to play, and the success of one often depends on the contributions of others.

F. In the long run, teamwork leads to better productivity and higher-quality outcomes, as pooling resources and working cohesively often results in faster completion of tasks and a more refined final product.

6. Which of the following should be the **SECOND** sentence after the rearrangement?

A) A B) B C) C D) D E) E

7. Which of the following should be the **FIRST** sentence after the rearrangement?

A) A B) B C) C D) F E) D

8. Which of the following should be the **SIXTH (Last)** sentence after the rearrangement?

A) A B) B C) E D) F E) D

9. Which of the following should be the **FOURTH** sentence after the rearrangement?

A) D B) E C) F D) C E) A

10. Which of the following should be the **FIFTH** sentence after the rearrangement?

A) B B) A C) C D) E E) F

Scan the QR code for the Key

Writer:
P. Manoj Kumar, Subject Expert

ప్రిపరేషన్ టెక్నిక్

పరీక్షల ప్రిపరేషన్ చక్కగా చేయాలంటే తగినంత ఏకాగ్రత కావాలి. అందుకు ఆరోగ్యం సహకరించాలి. ఆకలి కోసం ఆ సమయానికి ఏదో ఒకటి తినేయకుండా, కాస్త పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి. అవసరమైనంత శక్తి శరీరానికి ఉంటేనే చదువు మంచిగా సాగుతుంది.

డీఎస్సీ/టెట్ - 2024
బయాలజీ కంటెంట్

కరెంట్ అఫైర్స్

■ అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఏ రెండు రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈల అభివృద్ధికి సానుకూల వాతావరణాన్ని కల్పిస్తోంది? (కొరియా అంతర్జాతీయ సహకార ఏజెన్సీ (KOICA - కొయికా) ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. కొత్త వ్యవస్థాపకులను తీర్చిదిద్దడం, ఎంఎస్ఎంఈలను సరఫరా గొలుసు వ్యవస్థలో కీలకంగా నిలపడం ఈ కార్యక్రమ లక్ష్యాలు.)
జ: ఆంధ్రప్రదేశ్, ఒడిశా

మాదిరి ప్రశ్నలు


■ అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఏటా ఈ తేదీన అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవం జరపాలని 2017లో నిర్ణయించింది.)
జ: జూన్ 27

■ భారత్‌లో పూర్తిగా ఎగుమతుల కోసమే సాగవుతున్న పంటల జాబితాలో ఏ పంట మొదటిస్థానంలో నిలుస్తోంది?
జ: గెర్కిన్

■ ఇంగ్లిష్ ఛానెల్‌ను ఈది ఈ ఘనత సాధించిన తెలుగు మహిళగా ఎవరు నిలిచారు? (తెలంగాణకు చెందిన ఈమె మొత్తం 8 మంది సభ్యుల జట్టుతో ఇంగ్లిష్ ఛానెల్‌ను రిలే స్విమ్ ద్వారా పూర్తి చేశారు. ఈమె ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.)
జ: డాక్టర్ క్వీనీ విక్టోరియా గంధం

మరింత సమాచారం

తార్కిక సామర్థ్యాన్ని పరీక్షించే తేదీల పట్టిక!



ఎవరైనా ఏదైనా ప్రయాణం అనుకుంటే, ఎప్పుడు బయలుదేరాలి, ఎన్ని రోజులు ప్రయాణించాలి, ఏ ప్రాంతంలో ఎంత సమయం గడపాలి మొదలైన వాటిని ప్లాన్ చేసుకోవాలి. అందుకు 'క్యాలెండర్' కావాలి. స్నేహితుల పుట్టిన రోజు ఈ సంవత్సరం ఏ వారం వస్తుందో తెలుసుకోవడానికీ తేదీల పట్టికే ఉపయోగపడుతుంది. నిత్యజీవితాల్లో అడుగడుగునా అవసరమయ్యే ఆ క్యాలెండర్‌పై రీజనింగ్‌లో ప్రశ్నలు వస్తుంటాయి. వాటికి సరైన సమాధానాలను వేగంగా గుర్తించాలంటే తేదీలు, వారాలు, నెలలు, సాధారణ, లీపు సంవత్సరాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సంబంధిత సూత్రాల ఆధారంగా సంక్షిప్త పద్ధతులపై పట్టు పెంచుకొని వీలైనంత ఎక్కువగా ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ స్టడీస్
రీజనింగ్

క్యాలెండర్

క్యాలెండర్ అధ్యాయం నుంచి వచ్చే ప్రశ్నలకు సరైన సమాధానాలను గుర్తించడానికి దినాలు, నెలలు, సంవత్సరాలకు సంబంధించిన వివిధ కోడ్‌లు, విషమ దినాలు, లీపు సంవత్సరాలు, సాధారణ సంవత్సరాలు మొదలైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.

విషమ దినాలు:

★ వారానికి ఉన్న రోజులు 7

★ ఇచ్చిన రోజులను 7తో భాగించగా వచ్చే శేషాన్ని అదనపు రోజులు లేదా విషమ దినాలు అంటారు.

ఉదా: 108 రోజుల్లో ఉన్న విషమ దినాలు ఎన్ని?

7) 108 (15
7
38
35
3

∴ 3 విషమ దినాలు, 15 వారాలు ఉన్నాయి.

సంవత్సరాలు – రకాలు:

మనకు రెండు రకాలైన సంవత్సరాలు ఉంటాయి. అవి
1) సాధారణ సంవత్సరం
2) లీపు సంవత్సరం

సాధారణ సంవత్సరం:

★ సాధారణ సంవత్సరంలో 365 రోజులు ఉంటాయి. వీటిలో 52 వారాలు, ఒక అదనపు రోజు ఉంటుంది.

★ సాధారణ సంవత్సరం ఏ రోజుతో అయితే ప్రారంభమవుతుందో అదే రోజుతో ముగుస్తుంది.

ఉదా: 01-01-2025 నాడు బుధవారం కాబట్టి 31-12-2025 నాడు బుధవారం అవుతుంది.

★ సాధారణ సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి, నవంబరు నెలలు ఒకే రోజుతో ప్రారంభమవుతాయి.

★ సాధారణ సంవత్సరంలో జనవరి, అక్టోబరు నెలలు ఒకే క్యాలెండర్‌ను పోలి ఉంటాయి.

లీపు సంవత్సరం:

★ లీపు సంవత్సరంలో 366 రోజులు ఉంటాయి. వీటిలో 52 వారాలు, 2 అదనపు రోజులు ఉంటాయి.

★ లీపు సంవత్సరం ఏ రోజుతో అయితే ప్రారంభమవుతుందో ఆ తర్వాత రోజుతో ముగుస్తుంది.

ఉదా: 01-01-2024 నాడు సోమవారం కాబట్టి 31-12-2024 నాడు మంగళవారం అవుతుంది.


★ లీపు సంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి, జులై నెలలు ఒకే క్యాలెండర్‌ను పోలి ఉంటాయి.

నోట్: ఏ సంవత్సరంలో అయినా (ఏప్రిల్, జులై), (మార్చి, నవంబరు), (సెప్టెంబరు, డిసెంబరు)ల క్యాలెండర్లు ఒకే విధంగా ఉంటాయి.

రోజులు	కోడ్స్
శనివారం	0
ఆదివారం	1
సోమవారం	2
మంగళవారం	3
బుధవారం	4
గురువారం	5
శుక్రవారం	6

నెలలు	కోడ్స్
జనవరి	1
ఫిబ్రవరి	4
మార్చి	4
ఏప్రిల్	0
మే	2
జూన్	5
జులై	0
ఆగస్టు	3
సెప్టెంబరు	6
అక్టోబరు	1
నవంబరు	4
డిసెంబరు	6

శతాబ్దాలు	కోడ్స్
1500 - 1599	0
1600 - 1699	6
1700 - 1799	4
1800 - 1899	2
1900 - 1999	0
2000 - 2099	6
2100 - 2199	4
2200 - 2299	2



ఈ చాప్టర్‌లో వచ్చే ముఖ్యమైన సూత్రం

$$\frac{\text{తేదీ} + \text{సంవత్సరాలు} + \text{లీపు సంవత్సరాలు} + \text{నెల కోడ్} + \text{శతాబ్ది కోడ్}}{7}$$

పై సూత్రంలో విలువలను ప్రతిక్షేపించి '7'తో భాగించగా వచ్చే శేషాన్ని పరిగణించాలి.

మాదిరి ప్రశ్నలు

మోడల్ - 1

1. 06–04–2025 నాడు ఏ వారం?
   1) సోమవారం 2) బుధవారం
   3) మంగళవారం 4) ఆదివారం

వివరణ: $\frac{06+25+6+0+6}{7} = \frac{43}{7}$

శేషం = 1 ∴ శేషం 1 కాబట్టి ఆదివారం **జ: 4**

పై సూత్రంలో లీపు సంవత్సరాల సంఖ్యను కనుక్కోవడానికి సంవత్సరాలను 4తో భాగించి వచ్చిన భాగఫలాన్ని తీసుకోవాలి.

2. 09–02–2020 నాడు ఏ వారం?
   1) ఆదివారం 2) మంగళవారం
   3) గురువారం 4) శుక్రవారం

వివరణ: $\frac{09+20+5+4+6}{7} = \frac{44}{7}$

శేషం = 2 ⇒ 2 − 1 = 1 ⇒ ఆదివారం **జ: 1**

గమనిక: ఇచ్చిన సంవత్సరం లీపు సంవత్సరమై, తేదీ జనవరి లేదా ఫిబ్రవరి నెలలో ఉంటే, వచ్చిన శేషంలో నుంచి ఒకటి తగ్గించాలి.

మోడల్ - 2

3. 2008వ సంవత్సరం ఏప్రిల్ నెలలో ఏయే తేదీల్లో శుక్రవారాలు వస్తాయి?
   1) 3, 10, 17, 24 2) 5, 12, 19, 26
   3) 4, 11, 18, 25 4) ఏదీకాదు

వివరణ: ముందుగా 01-04-2008 నాడు ఏ వారమో కనుక్కోవాలి.

$\frac{01+8+2+0+6}{7} = \frac{17}{7}$

శేషం = 3 అంటే ఏప్రిల్ 1వ తేదీ మంగళవారం. మొదటి శుక్రవారం 4వ తేదీన ఉంది.

అంటే 4, 11, 18, 25 తేదీల్లో శుక్రవారాలు వస్తాయి. **జ: 3**

మోడల్ - 3

4. 06–03–2024వ తేదీ నాడు సోమవారం అయితే 13–05–2027 నాడు ఏ వారం?
   1) గురువారం 2) ఆదివారం
   3) శుక్రవారం 4) సోమవారం

వివరణ: $\frac{6+24+6+4+6}{7} = \frac{46}{7}$

శేషం = 6 శుక్రవారం

శుక్రవారం + 3 = సోమవారం కాబట్టి

$\frac{13+27+6+2+6}{7} = \frac{54}{7} = 5$ (గురువారం)

గురువారం + 3 = ఆదివారం **జ: 2**

మోడల్ - 4

5. ఈరోజు మంగళవారం అయితే 107 రోజుల తర్వాత ఏ వారం?
   1) శుక్రవారం 2) బుధవారం
   3) శనివారం 4) గురువారం

వివరణ: 7) 107 (15
7
37
35
2



మంగళవారం + 2 = గురువారం **జ: 4**

గమనిక: ★ పై ప్రశ్నలో 107 రోజుల తర్వాత అన్నప్పుడు శేషాన్ని కలపాలి. ★ 107 రోజుల కిందట అన్నప్పుడు శేషాన్ని తీసివేయాలి. ★ 107వ రోజు అన్నప్పుడు శేషానికి ఒకటి తగ్గించి కలపాలి.

మోడల్ - 5

6. 2025వ సంవత్సరాన్ని పోలిన సంవత్సరం వెంటనే మరలా ఎప్పుడు వస్తుంది?
   1) 2031 2) 2030 3) 2032 4) 2035

వివరణ: 2025 + 6 = 2031 **జ: 1**

గమనిక: ★ లీపు సంవత్సరం తర్వాత సంవత్సరాన్ని పోలిన సంవత్సరం కనుక్కోవడం కోసం '6' కలపాలి. ★ లీపు సంవత్సరం తర్వాత 2, 3వ సంవత్సరాలను పోలిన సంవత్సరాలను కనుక్కోడానికి 11 కలపాలి. ★ లీపు సంవత్సరాన్ని పోలిన సంవత్సరాన్ని కనుక్కోడానికి 28 కలపాలి.



రచయిత: గోలి ప్రశాంత్‌రెడ్డి

TENTH Social Studies Q&A


Improvement in living standards

Development

1 Mark

1) **What is development?**
A: It is a comprehensive term which includes increase in real per capita income, improvement in living standards of people, reduction in poverty etc.

2) **What is Literacy Rate?**
A: It measures the proportion of literate population in the seven and above age group.



3) **What is Life Expectancy at birth?**
A: Life expectancy at birth denotes average expected length of life of a person at the time of birth. In India life expectancy is 65.8 years.

2 Marks

4) **What is Human Development Index? Which indicators are taken into consideration for measuring Human Development Index (HDI)?**
A: It is an index prepared by the World Bank Under which all the nations of the world are indexed or ranked according to their performance in various parameters like per capita income, life expectancy, literacy rate etc.
1. Per capita income 2. Literacy rate for 15+ population 3. Life expectancy at birth. 4. Gross enrolment ratio for three levels.

5) **How does UN compare countries on the basis of Human Development Report?**
A: UNDP compares countries based on:
1. the educational levels of the people.
2. their health status and 3. per capita income.

Some More Important Questions

1) Define GDP. **1 M**
2) What is average income or per capita income?
3) Define the term National Income?
4) "Average income or per capita income is an important criterion for development." Explain. **2 M**

for answers

- KSV Krishna Reddy

Make sentences more impactful

One-word substitutions are significant in the English language as they enhance clarity, precision, and brevity in communication. By using a single word to replace a phrase or group of words, they make sentences more concise and impactful. For example, saying "autobiography" instead of "the story of a person's life written by that person" simplifies the expression. Mastering one-word substitutions also improves vocabulary, helps in avoiding repetition, and is essential for effective writing, especially in competitive exams, journalism, and formal communication.



One word substitutions

DSC/TET - 2024 English

1. **Find the meaning of the word 'Anthropologist'.**
   1) One who knows everything.
   2) One who speaks too much of himself.
   3) A person who studies the human race, especially fit origin.
   4) A person who studies the mind of a person.

2. **Pick the meaning of the word 'detour'.**
   1) A shorter route we take to avoid a danger
   2) A longer route we take to avoid a danger
   3) A longer router we take to avoid a pleasure
   4) A shorter route we take to avoid a pleasure

3. **A person or thing that cannot be corrected.**
   1) Unintelligible 2) Indelible
   3) Illegible 4) Incorrigible

4. **A person of good understanding, knowledge and reasoning power.**
   1) Expert 2) Intellectual
   3) Snob 4) Literate

5. **A person who knows many languages.**
   1) Linguist 2) Grammarian
   3) Polyglot 4) Bilingual

6. **One who possesses many talents.**
   1) Versatile 2) Prodigy
   3) exceptional 4) gifted

7. **Words inscribed on a Tomb.**
   1) epitome 2) epistle
   3) epilogue 4) epitaph

8. **Which is the study of past human cultures and societies through the examination of artefacts, structures, and other physical remains?**
   1) Archaeology 2) Paleontology
   3) Geology 4) History

9. **Match the following sciences with their corresponding objects of study.**

A	B
1) Archaeology	a) the study of the mind
2) Physiology	b) the study of animals
3) Psychology	c) the study of earth
4) Geology	d) the study of the culture of the past
5) Zoology	e) the study of the bodies of living things

   1) 1-d; 2-e; 3-a; 4-c; 5-b
   2) 1-a; 2-c; 3-b; 4-d; 5-e
   3) 1-e; 2-a; 3-b; 4-c; 5-d
   4) 1-a; 2-b; 3-c; 4-d; 5- e

10. **One who devotes his service or wealth for the love of mankind.**
    1) Pioneer 2) Spendthrift
    3) Omnipresent 4) Philanthropist

11. **The word omnipresent means ....**
    1) One who is present everywhere
    2) One who believes in fate
    3) One who spends too much
    4) One who lives here and there only

12. **Match the following.**

1) suicide	p) Killing one's father
2) Homicide	q) killing one's own brother
3) Patricide	r) killing an unborn child
4) Foeticide	s) killing human being
5) Fratricide	t) killing oneself

    1) 1-t, 2-s, 3-r, 4-q, 5-p
    2) 1-t, 2-s, 3-r, 4-p, 5-q
    3) 1-t, 2-s, 3-p, 4-r, 5-q
    4) 1-p, 2-q, 3-r, 4-s, 5-t



13. **He openly declared himself as an <u>atheist</u>.**
    The meaning of the underlined word.
    1) One who believes in the existence of God
    2) One who does not believe in the existence of God
    3) One who always looks at the darkside of the things
    4) One who knows many languages

14. **One who abstains from taking alcohol.**
    1) Teetotaler 2) Pioneer
    3) Fatalist 4) Alcoholist

15. **A person who dislikes, despises or is strongly prejudiced against women.**
    1) Mercenary 2) Misogynist
    3) Zoofilist 4) Feminist

16. **The <u>mercenaries</u> were so greedy that they exploited the needy. (the meaning of the underlined word)**
    1) The persons who can do anything for money
    2) The persons who motivated only by financial gain
    3) The persons who are greedy and do anything for money
    4) Above all

17. **Match the following.**

1) Democracy	p) government by the nobles
2) Plutocracy	q) government by the officers
3) Autocracy	r) government by the single person
4) Bureaucracy	s) government by the rich
5) Aristocracy	t) government by people

    1) 1-p, 2-q, 3-r, 4-s, 5-t
    2) 1-t, 2-s, 3-r, 4-p, 5-q
    3) 1-t, 2-s, 3-r, 4-q, 5-p
    4) 1-s, 2-t, 3-r, 4-q, 5-p

18. **One who looks always at the bright side of things.**
    1) Theist 2) Optimist
    3) Pessimist 4) Omnipresent

19. **A life history written by oneself is called**
    1) Biography 2) Autobiography
    3) Autography 4) Life story

20. **A person who is above hundred years is called**
    1) Centenarian 2) Century
    3) Centennium 4) Centuria

21. **His reply to my question was somewhat ambiguous.**
    1) A sentence whose meaning is clear
    2) A person who talks with low voice
    3) A sentence whose meaning is unclear
    4) A person who talks always with high pitch

22. **Robert is a <u>lexicographer</u>.**
    Choose the meaning of the underlined word
    1) One who reads a dictionary
    2) One who searches the meaning in a dictionary
    3) One who possess a dictionary
    4) One who compiles a dictionary

23. **A: animals of a certain region is called <u>Fauna</u>.**
    B: plants of a particular region is called <u>Flora</u>.
    Of the above sentences..........
    1) Only A is correct
    2) Only B is correct
    3) Both A and B are correct
    4) Both A and B are incorrect

24. **My classmate, Ramesh is an <u>Ambidextrous</u>.**
    The underlined word meaning is ....
    1) One who can use left hand, right hand equally well
    2) One who can read Telugu and English equally well
    3) One who can speak two languages equally well
    4) One who is good at spelling of words

25. **I like Kandukuri Veeresha lingam because he is a <u>feminist</u>.**
    1) One who works for the welfare of the women
    2) One who works for the welfare of the men
    3) One who works for the welfare of the human beings
    4) One who works for the welfare of the people

26. **Match the following.**

1) apiary	a) a place where dead bodies are kept
2) aviary	b) a place where medicines are prepared and stored
3) granary	c) a place where the grain is stored
4) dispensary	d) a place where birds are kept
5) mortuary	e) a place where bees are kept

    1) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
    2) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
    3) 1-e, 2-d, 3-c, 4-a, 5-b
    4) 1-d, 2-e, 3-c, 4-b, 5-a



27. **One who speaks many languages.**
    1) Linguist 2) Polyglot
    3) Glottis 4) Poly language

28. **One who abandons his religious faith.**
    1) Apostate 2) Prostate
    3) Profane 4) Agnostic

29. **A hater of knowledge and learning.**
    1) Bibliophile 2) Philologist
    3) Misogynist 4) Misologist

30. **A person who loves everybody.**
    1) Cosmopolitan 2) Fratricide
    3) Altruistic 4) Aristocrat

31. **Custom of having many wives.**
    1) Misogamy 2) Bigamy
    3) Polygamy
    4) Monogamy



Writer: Putnam Ravikumar

Answers

1-3; 2-2; 3-4; 4-2; 5-3; 6-1; 7-4; 8-1; 9-1; 10-4; 11-1; 12-3; 13-2; 14-1; 15-2; 16-4; 17-3; 18-2; 19-2; 20-1; 21-3; 22-4; 23-3; 24-1; 25-1; 26-2; 27-2; 28-1; 29-4; 30-3; 31-3.

బడి బంధువులొస్తున్నారు..



● తెలంగాణ డీఎస్సీలో ఎంపికైన భార్యాభర్తలు.. అన్నదమ్ములు

● ఇప్పటికే ప్రభుత్వోద్యోగాలు చేస్తున్న వారు సైతం..

మంచి వేతనాలతో కుటుంబానికి ఆసరాగా నిలవొచ్చు. క్రమానుగతంగా పదోన్నతులొస్తాయి. పదవీ విరమణ వయసు వరకు ఉద్యోగభద్రత గ్యారంటీ.. వీటికి తోడు సమాజంలో గౌరవమర్యాదలు సరేసరి. సర్కారీ కొలువులో ఉండే సౌలభ్యాలివి.

ఇక ఉపాధ్యాయ ఉద్యోగమైతే అధిక సెలవులవంటి వెసులుబాట్లూ ఉంటాయి. ఈ క్రమంలో నిరుద్యోగులు ప్రభుత్వోద్యోగంపైనే దృష్టి పెట్టి శ్రమించి సాధిస్తున్నారు. భార్యాభర్తలు, అన్నదమ్ములు.. ఇలా కొన్ని కుటుంబాల్లో ఒకరి కంటే ఎక్కువ మంది ఉద్యోగాలు సాధిస్తే.. వారి ఆనందానికి ఇక హద్దుండదు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాలను విశ్లేషిస్తే.. ఒకే కుటుంబంలోని పలువురు ఎలా కొలువులకు ఎంపికయ్యారో స్పష్టమవుతుంది. ఇప్పటికే ప్రభుత్వోద్యోగం చేస్తూ.. ఇప్పుడు డీఎస్సీలోనూ సత్తా చాటారు కొందరు. - ఈనాడు, హైదరాబాద్

భర్త ఎస్సై.. ఎస్జీటీగా భార్య



ఆమె పేరు ఎలగందుల శ్వేత. ఊరు వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని రాగంపేట. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన శ్వేత మొదటి నుంచీ చదువులో రాణించేవారు. బీఎస్సీ, బీఈడీ చదివిన ఆమె.. గతంలో పంచాయతీ కార్యదర్శి పోస్టుకు ఎంపికై కొన్నాళ్లు ఆ ఉద్యోగం చేశారు. ఉపాధ్యాయురాలు కావాలన్న లక్ష్యంతో రాజీనామా చేశారు. డీఎస్సీలో జిల్లా స్థాయి మొదటి ర్యాంకుతో ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యారు. ఆమె భర్త శ్రీకాంత్ ప్రస్తుతం వరంగల్‌లోని మిల్స్ కాలనీ ఎస్సైగా పనిచేస్తున్నారు.

దంపతులకు ధమాకా



● కొండ్లె వినయ్, నాగలక్ష్మి దంపతులు. ఊరు వరంగల్ జిల్లా నల్లబెల్లి. ఇద్దరికీ ఉపాధ్యాయులు కావాలనేది లక్ష్యం. డీఎస్సీ రాశారు. వారి కష్టం వృథా పోలేదు. జిల్లా స్థాయిలో వినయ్ ఏడో ర్యాంకు, నాగలక్ష్మి 54వ ర్యాంకు సాధించి ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.



● ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం అచ్యుతాపురానికి చెందిన రెడ్డి మాధురి ప్రస్తుతం బ్రాంచి పోస్ట్ మాస్టర్‌గా, ఆమె భర్త మూలగండ్ల శివకృష్ణ మల్కారం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. టీచర్లు కావాలన్న ధ్యేయంతో పరీక్ష రాసి సఫలీకృతులయ్యారు. నాగలక్ష్మి ఎస్జీటీ జిల్లాస్థాయి మొదటి ర్యాంకు, ఆమె భర్త 26వ ర్యాంకు సాధించారు. ఇద్దరూ కోచింగ్ లేకుండానే మంచి ర్యాంకులు పొందడం విశేషం. శివకృష్ణ తండ్రి సైతం టీచరే.




● ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని గార్లపాడు గ్రామానికి చెందిన గడికందుల కోటేశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ (సోషల్) విభాగంలో 14వ ర్యాంకు సాధించగా.. ఆయన భార్య కృష్ణవేణి ఎస్జీటీగా అర్హత సాధించారు. కోటేశ్వరరావు సర్వశిక్షా అభియాన్‌లో సీఆర్పీగా కొంతకాలం పనిచేసి ప్రస్తుతం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కృష్ణవేణి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డీఎస్సీ రాసి.. బీసీ (ఏ) కేటగిరీలో 12వ ర్యాంకు సాధించారు. - బోనకల్లు, న్యూస్‌టుడే

సత్తా చాటిన అన్నదమ్ములు..


శ్రీనివాస్


బాపురాజు

జనగామ జిల్లా నర్మెట్టకు చెందిన కొన్నె బాపురాజు, శ్రీనివాస్‌లు అన్నదమ్ములు. టీచర్ ఉద్యోగంపై ఆసక్తితో కష్టపడి చదివారు. డీఎస్సీ జిల్లా స్థాయిలో శ్రీనివాస్ ఆరో ర్యాంకు, బాపురాజు 16వ ర్యాంకుతో ఎస్జీటీకి ఎంపికయ్యారు.

రెండు నెలల్లో రెండు ఉద్యోగాలు..



● నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన కొమ్ము రమేశ్ రెండు నెలల వ్యవధిలోనే రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గత నెలలో గురుకుల పాఠశాల టీజీటీ (ఆంగ్లం) ఫలితాల్లో ర్యాంకు సాధించి తెలకపల్లిలోని జ్యోతిబా పులే బాలుర గురుకులానికి వైస్ ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. తాజాగా డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ (ఆంగ్లం)లో జిల్లాస్థాయి రెండో ర్యాంకు సాధించారు.



● హనుమకొండలోని రాంనగర్‌కు చెందిన ముమ్మిళ్ల అపూర్వ కూడా ఇంతకుముందు గురుకుల టీచర్ పోస్టుకు ఎంపికయ్యారు. జిల్లాలో రెండో ర్యాంకు, జోనల్ స్థాయిలో 4వ ర్యాంకు సాధించి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని జ్యోతిబా పులే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. ఇప్పుడు డీఎస్సీ ఫలితాల్లో స్కూలు అసిస్టెంట్ (ఆంగ్లం) కేటగిరీలో జిల్లా స్థాయి మొదటి ర్యాంకు సాధించారు.

తండ్రి పదవీ విరమణ రోజే.. కుమారుడికి తీపి కబురు



ఖమ్మం జిల్లా మధిర మండలం చిల్కూరుకు చెందిన రావిరాల భరత్‌కుమార్ (101వ ర్యాంకు), ఆయన భార్య కావ్య (243వ ర్యాంకు) డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులకు ఎంపికయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న వీరిద్దరూ ఉపాధ్యాయ ఉద్యోగాలపై గురిపెట్టారు. భరత్ తండ్రి లక్ష్మణ్‌రావు సైతం టీచరే. ఆయన 35 ఏళ్లపాటు పనిచేసి.. సోమవారమే పదవీ విరమణ పొందారు. ఆ సందర్భంగా ఆయనకు సత్కార కార్యక్రమం జరుగుతుండగానే.. భరత్‌కుమార్ దంపతులు టీచర్ పోస్టులకు ఎంపికైన విషయం తెలియడంతో వారి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

జిల్లా స్థాయి పోస్టు కూడా కాదని..



ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడకు చెందిన కొప్పుల అనిల్‌కుమార్ జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్నారు. డీఎస్సీలో జిల్లాస్థాయి రెండో ర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు పండిట్) పోస్టుకు ఎంపికయ్యారు. టీచర్ ఉద్యోగంపై ఆసక్తితోనే డీఎస్సీ రాసి ఎంపికయ్యానని అనిల్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ వరకు..



నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్ గ్రామానికి చెందిన పసుల స్వప్న ఎంబీఏ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో బీఈడీ ఉత్తీర్ణులయ్యారు. తర్వాత వివాహం కాగా.. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే డీఎస్సీ రాసి జిల్లా స్థాయిలో స్కూలు అసిస్టెంట్ (గణితం) కేటగిరీలో మొదటి ర్యాంకు సాధించారు.

బస్సు నుంచి బడికి..



నారాయణపేట జిల్లా మరికల్ మండలం జిన్నారానికి చెందిన గోపాల్ ప్రస్తుతం ఆర్టీసీ మహబూబ్‌నగర్ డిపోలో కండక్టర్. టీచర్ కావాలనే సంకల్పంతో తాజా డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో పరీక్ష రాసి జిల్లా స్థాయిలో రెండోర్యాంకు సాధించారు.

నా కుమారుడికి పట్టుదల ఎక్కువ

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తల్లి అంజనీదేవి

ఈనాడు డిజిటల్, అమరావతి: తన కుమారుడికి చిన్నప్పటి నుంచీ పట్టుదల ఎక్కువని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తల్లి అంజనీదేవి తెలిపారు. ఏదైనా చేయాలంటే కచ్చితంగా చేసేవాడని ఆయన గురించి వివరించారు. జనసేన పార్టీ యూట్యూబ్ ఛానల్ అంజనీదేవిని ఇంటర్వ్యూ చేసింది. ఈ మేరకు సంబంధిత ఇంటర్వ్యూ ప్రోమోను 'అమ్మ మనసు' పేరుతో జనసేన అధికారిక 'ఎక్స్' ఖాతాలో మంగళవారం పోస్టు చేసింది. మీ ఇంటి చిన్నోడు రాష్ట్ర ప్రజలందరికీ పెద్దన్నగా మారారని రిపోర్టర్ అనడంతో ఆమె సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు పవన్‌కల్యాణ్ పరామర్శించడానికి వెళుతుంటే పోలీసులు అడ్డుకోవడంతో ఆయన రోడ్డు మీద పడుకోవడం చూసి బాధ కలిగిందని ఆ వీడియోలో ఆమె తల్లి ప్రేమను వ్యక్తం చేశారు.

లడ్డూ వివాదంపై సీబీఐతో దర్యాప్తు జరిపించండి

సుప్రీంకోర్టులో పిల్ వేసిన కేఏ పాల్

ఈనాడు, దిల్లీ: తిరుపతి లడ్డూ తయారీలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో జంతుకొవ్వు కలిసిన నెయ్యిని ఉపయోగించినట్లు వచ్చిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ గ్లోబల్ పీస్ ఇనిషియేటివ్ ప్రెసిడెంట్ కేఏ పాల్ మంగళవారం సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలుచేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు, అవినీతిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కోరారు. 'తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ధార్మిక క్షేత్రం. ఆలయ పవిత్రతను కాపాడటంలో ఏమాత్రం రాజీపడినా కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా ఆ సంస్థ ప్రతిష్ఠ మసకబారే ప్రమాదం ఉంది. అందువల్ల దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి' అని ఆయన తన పిటిషన్‌లో కోరారు.

అప్సా గుర్తింపు విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి

సీఎస్‌కు ఉద్యోగుల వినతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం (అప్సా) గుర్తింపు రద్దు చేయాలనే నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. దశాబ్దాలుగా సేవలందిస్తున్న సంఘం గుర్తింపు విషయంలో సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. గత ఎన్నికల సమయంలో కొంతమంది అప్సా కార్యవర్గ సభ్యులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించడం, రాజకీయ పార్టీలకు అనుకూలంగా ప్రచారం చేయడంపై సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి గానీ అప్సా గుర్తింపు రద్దు చేయడం పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఉద్యోగులు ఇచ్చిన వినతిపత్రంపై తగిన చర్యల కోసం ఫైల్ పెట్టాలని సర్వీసెస్ కార్యదర్శిని సీఎస్ ఆదేశించారు. సీఎస్‌ను కలిసిన వారిలో నాపా ప్రసాద్, కోట్ల రాజేష్, జంపని రామారావు, చలమయ్య, ఆనంద్, రాజేంద్రప్రకాష్ ఉన్నారు.

మత్స్యకార సొసైటీ సభ్యులకు సత్కారం



వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ డిల్లీరావులతో మత్స్యకారులు

ఈనాడు, అమరావతి: భారీ వర్షాలు, వరదల సమయంలో విజయవాడ లోతట్టు ప్రాంతాల్లోని వారిని తమ పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించిన ఫిషర్‌మెన్ బోట్ సొసైటీ బృందాన్ని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ డిల్లీరావు అభినందించారు. సచివాలయంలోని ఛాంబర్‌కు మత్స్యకారులు రవికుమార్, కర్ర పోసయ్య, నాని, మల్లాది చరణ్, వినోద్ తదితరుల్ని పిలిపించి సత్కరించారు. విపత్తు సమయంలో ప్రత్యేకాధికారిగా వ్యవహరించిన రాజశేఖర్.. వరదల సమయంలో మత్స్యకారులు చూపిన ధైర్యసాహసాల్ని ఈ సందర్భంగా కొనియాడారు.

జీఎస్టీ వసూళ్లు ఏపీకి రూ.3,506 కోట్లు...

తెలంగాణకు రూ.5,267 కోట్లు

ఈనాడు, దిల్లీ: జీఎస్టీ కింద సెప్టెంబరులో తెలంగాణకు రూ. 5,267 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 3,506 కోట్లు వసూలయ్యాయి. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే తెలంగాణ వసూళ్లు 1% పెరగ్గా, ఏపీ వసూళ్లు 4% తగ్గాయి. కేంద్ర ఆర్థికశాఖ మంగళవారం విడుదల చేసిన లెక్కలు ఈ విషయాన్ని వెల్లడించాయి. దీంతో ఎస్‌జీఎస్టీ, ఐజీఎస్టీలో రాష్ట్రవాటా కింద సెప్టెంబరు వరకు తెలంగాణకు రూ. 21,504 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 16,393 కోట్లు వచ్చాయి. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఈ విషయంలో రెండు రాష్ట్రాలకు 7% ఆదాయం పెరిగింది.

ఎన్‌హెచ్‌లలో భూముల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: జాతీయ రహదారుల ప్రాజెక్టుల్లోని భూసేకరణ, అటవీ భూముల సమస్యల పరిష్కారానికి ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటుచేస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వు జారీచేశారు. సీసీఎల్‌ఏ ఛైర్మన్‌గా, ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా, అటవీశాఖకు చెందిన అదనపు పీసీసీఎఫ్ సభ్యునిగా కమిటీని నియమించారు. ఈ కమిటీ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ప్రాజెక్టులతో పాటు, రాష్ట్ర, జిల్లా రహదారుల్లో భూసేకరణ, అటవీ భూముల సమస్యలపై ఎప్పటికప్పుడు సంబంధిత శాఖలన్నింటితో సమీక్షించి, వాటిని పరిష్కరించాలి.

న్యాయ సమీక్ష కమిటీకి డీడీవో నియామకం

ఈనాడు, అమరావతి: న్యాయ సమీక్ష కమిటీకి డ్రాయింగ్, డిస్‌బర్స్‌మెంట్ అధికారి (డీడీవో)గా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల విభాగం సహాయ కార్యదర్శిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా ఘంటా నరహరి

ఈనాడు, అమరావతి: వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా ఘంటా నరహరిని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది.

ధన్యవాదాలు తెలిపిన మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: కానిస్టేబుల్ నియామక పరీక్షల ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తామని ప్రకటించిన హోం మంత్రి వంగలపూడి అనితకు మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష తర్వాత జరగాల్సిన దేహ దారుఢ్య పరీక్షలు వేర్వేరు కారణాలతో వాయిదా పడటంతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజాదర్బార్‌లో తనకు వినతులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించాలని హోంమంత్రికి పంపగా.. ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రజనీకాంత్ త్వరగా కోలుకోవాలి: సర్జరీ చేయించుకున్న ప్రముఖ కథానాయకుడు రజనీకాంత్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు లోకేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

మాతృశాఖకు సుర్జిత్ సింగ్

ఈనాడు, అమరావతి: ఐటీ శాఖలో డిప్యుటేషన్‌పై జాయింట్ డైరెక్టర్‌గా (ప్రమోషన్స్) పనిచేస్తున్న సుర్జిత్ సింగ్‌ను మాతృశాఖకు పంపేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్ హోదాలో పనిచేస్తున్న ఆయన డిప్యుటేషన్‌పై ఐటీ శాఖకు వచ్చారు. ఆయన స్థానంలో ఐటీ శాఖ డైరెక్టర్ (కమ్యూనికేషన్స్) వెంకటాచలానికి ఇన్‌ఛార్జ్ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

సెలవులో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, డైరెక్టర్

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజులకు సెలవులను మంజూరు చేస్తూ ప్రభుత్వం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసింది. విజయరామరాజు ఈ నెల 3 నుంచి 10 వరకు సెలవుపై వెళ్లనుండగా.. ఇంటర్మీడియట్ విద్య కార్యదర్శి కృతిక శుక్లాకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. కోన శశిధర్ సైతం సెలవులో వెళ్తుండడంతో ఇన్‌ఛార్జి కార్యదర్శిగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరామును నియమించింది.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రూ.8 వేల కోట్ల ఎఫ్‌పీపీసీఏ భారం

● ఇంధన శాఖ వెల్లడి

ఈనాడు, అమరావతి: ఇంధన సర్దుబాటు ఛార్జీల (ఎఫ్‌పీపీసీఏ) కింద రూ. 8,114 కోట్ల వసూలుకు చేసిన ప్రతిపాదనలను ఆమోదించకపోతే డిస్కంలు నష్టపోతాయని ఇంధన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ నష్టంలో 75 శాతాన్ని ప్రభుత్వం భరించక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎఫ్‌పీపీసీఏ ప్రతిపాదనలను ప్రతి మూడు నెలలకు డిస్కంలు ఏపీఈఆర్‌సీకి సమర్పించాయని పేర్కొంది. వాటిని పరిశీలించిన తర్వాత ఎంత మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయాలనేది ఈఆర్‌సీ నిర్ణయిస్తుందని తెలిపింది. 2022-23లో మొత్తం 8,394 మిలియన్ యూనిట్ల(ఎంయూ) విద్యుత్‌ను రూ. 6,522 కోట్లతో కొనుగోలు చేశామని.. యూనిట్‌కు సగటున రూ. 1.27 చొప్పున ఎఫ్‌పీపీసీఏ ఛార్జీల కింద వసూలు చేసే అవకాశం ఉందని చెప్పింది. 2019 ఆగస్టు నుంచి 2020 ఫిబ్రవరి వరకు బ్యాకింగ్ డౌన్ (తగ్గించిన విద్యుత్ ఉత్పత్తి) చేసిన విద్యుత్‌కు కోర్టు ఆదేశాల మేరకు ఉత్పత్తి సంస్థలకు పాత బకాయిలు చెల్లించేందుకు డిస్కంలు సుమారు రూ. 9 వేల కోట్ల క్యాపిటల్ రుణాలను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. గత ప్రభుత్వం విద్యుత్ పీపీఏలను సమీక్షించాలని తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై ఉత్పత్తి సంస్థలు కోర్టులో పిటిషన్ వేయడంతో అదనపు భారం డిస్కంలపై పడిందని వివరించింది.

'రాష్ట్రంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా కొత్త ఒప్పందాలను గత ప్రభుత్వం కుదుర్చుకోలేదు. సెకి నుంచి 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు పీపీఏ కుదుర్చుకోవడం మినహా.. సౌర, పవన, హైబ్రిడ్, విద్యుత్ స్టోరేజి ప్రాజెక్టులతో దీర్ఘకాలిక ఒప్పందాలను గత ప్రభుత్వం కుదుర్చుకోలేదు. దీంతో పాటు కృష్ణపట్నం, వీటీపీఎస్-5 ప్లాంట్లను ఉత్పత్తిలోకి తీసుకురావడంలో 44 నుంచి 55 నెలల ఆలస్యమైంది. దాంతో డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు స్వల్పకాలిక ఒప్పందాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక ధరకు మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చింది" అని పేర్కొంది.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు చర్యలు తీసుకోవాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు అక్టోబరు 2న క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ రాశారు. "కొన్నేళ్లుగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీల క్షమాభిక్షకు, ఖైదీల విడుదలకు వారి కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఏడేళ్ల వాస్తవ శిక్షా కాలం, మూడేళ్ల రెమిషన్ కలిపి 10 ఏళ్లు పూర్తి చేసుకున్న పురుష ఖైదీలు, ఐదేళ్ల వాస్తవ శిక్షా కాలం, రెండేళ్ల రెమిషన్ కలిపి ఏడేళ్ల శిక్షా కాలం పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటించి, విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలి" అని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు త్వరలో షెడ్యూల్: మంత్రి నిమ్మల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికల షెడ్యూలు విడుదల చేసి, 40 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కుంటుపడిన సాగునీటి సంఘాల వ్యవస్థను పట్టాలకు ఎక్కించాలన్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం. వెంకటేశ్వరరావు, కడా కమిషనర్ రామ సుందరరెడ్డిలతో విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు.

'మేల్' ఉద్యోగాలకు ఎంపికైన వారి ధ్రువపత్రాల పరిశీలన

ఈనాడు, అమరావతి: లోకాయుక్త ఆదేశాల మేరకు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (మేల్)గా చేరిన వారి అర్హత సర్టిఫికెట్ల విశ్వసనీయతను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జిల్లాల వారీగా పరిశీలిస్తోంది. ఈ నెల 25న లోకాయుక్తలో దీనిపై మరోమారు విచారణ జరగనుంది. ఒప్పంద పారా మెడికల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం పదో తరగతి విద్యార్హత ఉన్నవారు మేల్ పోస్టుకు అర్హులు. అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన శిక్షణ సంస్థలో మల్టీపర్పస్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. అయితే, శిక్షణ పొందకున్నా, అనుమతి లేని సంస్థల నుంచి సర్టిఫికెట్లు పొందిన వారికి కూడా ఉద్యోగాలు దక్కాయన్న ఆరోపణలున్నాయి. ఏకకాలంలో రెండు, మూడు కోర్సులు చేసినట్లు పలువురిపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై ఇప్పటికే లోకాయుక్తలో విచారణ జరిగింది. పోలీసు శాఖ ద్వారా అర్హత సర్టిఫికెట్లను పరిశీలన చేయించాలని కొందరు మళ్లీ లోకాయుక్తను ఆశ్రయించారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

ఈనాడు, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో అమలయ్యే పథకాలను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుపై వివిధ శాఖల అధికారులతో సీఎస్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. 'ఇప్పటికే పూర్తయిన పనులకు వెంటనే యూసీలు సమర్పిస్తే నిధుల విడుదలకు అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుంచి నిధులు అందేలా ప్రణాళికలు రూపొందించాలి' అని సీఎస్ ఆదేశించారు.

సైబర్ పోలీసుల సాహసం

● రాజస్థాన్‌లో కీలక ఆపరేషన్ ● 27 మంది నిందితుల పట్టివేత ● దేశవ్యాప్తంగా 2,223 నేరాల్లో వీరి ప్రమేయం



రాజస్థాన్‌కు వెళ్లి ఆపరేషన్ నిర్వహించిన బృందాలతో టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) పోలీసులు రాజస్థాన్‌లో చేపట్టిన సాహసోపేత ఆపరేషన్‌లో కీలక ముందడుగు వేశారు. అక్కడ 15 రోజులు మకాం వేసి, సైబర్ నేరాలతో సంబంధమున్న 27 మందిని తొలిసారిగా పట్టుకున్నారు. వీరిలో లక్ష్మన్‌అరోరాకు 194 కేసుల్లో, ఓం హరిశరణం అనే వ్యక్తికి 177 కేసులతో సంబంధముంది. దేశవ్యాప్తంగా నమోదైన 2,223 సైబర్ కేసుల్లో ఈ 27 మంది ప్రమేయం ఉన్నట్లు వెల్లడైంది. విదేశీ సైబర్ ముఠాలకు సహకరిస్తున్న వీరి నుంచి 31 సెల్‌ఫోన్లు, 37 సిమ్‌కార్డులు, 13 ఏటీఎం కార్డులు, ఏడు చెక్‌బుక్కులు, రెండు హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. టీజీసీఎస్‌బీ సంచాలకురాలు శిఖాగోయల్ మంగళవారం ఈ వివరాలను వెల్లడించారు.

బ్యాంకు ఖాతాల ఆధారంగా దర్యాప్తు

బాధితుల నుంచి కొట్టేసిన సొమ్మును సైబర్ నేరగాళ్లు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ఈ క్రమంలో డీఎస్పీలు సూర్యప్రకాశ్, ఫణీందర్, వేణుగోపాల్‌రెడ్డి నేతృత్వంలోని నాలుగు బృందాలు ఇటీవల రాజస్థాన్‌లోని జైపుర్, జోధ్‌పుర్, నాగౌర్ ప్రాంతాలకు వెళ్లి, గాలింపు చేపట్టాయి. బ్యూరో ఎస్పీ దేవేందర్‌సింగ్, డీఎస్పీలు కేవీఎం ప్రసాద్, హరికృష్ణల నేతృత్వంలోని బృందాలు... నిందితుల సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ల ఆధారంగా హైదరాబాద్ నుంచి సమాచారం అందించాయి. మొత్తం 60 మంది నిందితుల్లో 27 మందిని పట్టుకోగలిగారు. వారిని ట్రాన్సిట్ వారెంట్లపై హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.

"గుర్తు తెలియని వ్యక్తులెవరైనా ఫోన్లు చేసి, ఆన్‌లైన్ ప్రకటనలు పంపి పెట్టుబడులపై సలహాలిస్తామని చెబితే నమ్మొద్దు. ఏదైనా అనుమానంగా అనిపిస్తే 1930కి ఫోన్‌చేయండి. లేదా cybercrime.gov.in మెయిల్ చేయండి. ఒకవేళ డబ్బులు పోగొట్టుకున్నా గోల్డెన్ అవర్(24 గంటల్లోపు)లో ఫిర్యాదు చేస్తే వెనక్కి తెప్పించే అవకాశముంది" అని ఈ సందర్భంగా శిఖాగోయల్ వివరించారు.

రూ.11.01 కోట్ల లావాదేవీల గుర్తింపు

ఈ నిందితులు తమ పేరిట 29 కరెంట్ బ్యాంకు ఖాతాలను తెరిచి, కమీషన్‌పై ఆశతో నేరస్థులకు అప్పగించారు. వాటి ద్వారా రూ. 11.01 కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ఇందులో... తెలంగాణలో నమోదైన 189 కేసుల్లోని రూ. 9 కోట్లు ఉన్నట్లు తేలింది. నిందితుల్లో పలువురు మూల్స్ (తమ బ్యాంకు ఖాతాలను నేరస్థులకు అప్పగించే వారు), ఏజెంట్లు ఉన్నారు. వీరిలో విద్యార్థులు, చిరువ్యాపారులు, ప్రైవేటు కాంట్రాక్టర్లు, జిమ్ శిక్షకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉండటం గమనార్హం.

గోల్డెన్ ట్రయాంగిల్ కేంద్రంగా అడ్డాలు

ఈ మోసాల వెనక థాయ్‌లాండ్, లావోస్, మయన్మార్‌ల సరిహద్దుల్లో ఉన్న 'గోల్డెన్ ట్రయాంగిల్'లోని అడ్డాల పాత్ర ఉన్నట్లు భావిస్తున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారతీయ యువకుల్ని రప్పించుకుంటున్న విదేశీ ముఠాలు... అక్కడ వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్నాయి. అలా బాధితుల నుంచి కొల్లగొట్టిన సొమ్ము తొలుత మూల్స్ ఖాతాల్లోకి వచ్చేలా చేసి, వెంటనే ఇతర ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు. క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీల ద్వారా బిట్‌కాయిన్లలోకి మార్చి విదేశాలకు చేరవేస్తున్నారు. చైనా ముఠాలే ఎక్కువగా ఈ దందా సాగిస్తున్నట్లు వెల్లడైంది.

'ప్రైవేట్ కళాశాలలకు తరగతులు ఎందుకు'

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ నెల 3 నుంచి దసరా సెలవులు ఇచ్చిన ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రైవేట్ కళాశాలలు మాత్రం 3,4,5 తేదీల్లో తరగతులు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వడం ఏంటని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘం అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్ ప్రశ్నించారు. వరదల కారణంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలు సెలవులు ఇచ్చినందున ప్రత్యామ్నాయంగా తరగతులు నిర్వహించుకునేందుకు మూడు రోజులు అవకాశం కల్పిస్తూ మౌఖిక ఆదేశాలు ఇచ్చారని, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల మధ్య ఈ వ్యత్యాసం ఎందుకు? అని అడిగారు. వరదల కారణంగా అన్ని కళాశాలలకు సెలవులు ఇచ్చినప్పుడు ఒక్క ప్రైవేట్ యాజమాన్యాలకే ఈ మినహాయింపు సరికాదన్నారు. ప్రైవేట్ కళాశాలలకు సైతం మూడో తేదీ నుంచే దసరా సెలవులు ఇప్పించాలని కోరారు.